
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.10.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



శోభిత

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



వైభవ

మాసపత్రిక, నవంబర్, 2025 ₹ 50/-

ISSN 2454–4329



కదిలే వెలుగులు



వదలని చినుకులు

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 36 సంచిక 11

నవంబర్ - 2025

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

---

Published by

**BAPANNA ALAPATI**

**1-1-60/5, R.T.C. 'X' Roads,**
**Hyderabad - 500 020.**
**Ph. 040-27645536.**

---

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**

---

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

---

LCCN 91-903060

PEER REVIEWED

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

---


misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com

YouTube Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

## నవంబర్ నెల సూచికలు...


**మిసిమి** డైరి : అశ్వినికుమార్ ... 3
బ్రహ్మసూత్రాలు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 5
జీవన మకరందం : ఆస్కార్ వైల్డ్ ... 10
మనుస్మృతి-ఒక పరిశీలన : వేలూరి కృష్ణమూర్తి...11
గాంధీ ఆశ్రమంలో మీరాబెహెన్ : బి.వి. రామిరెడ్డి ...14
ప్రాచీన వచన రచనలు-భాష : డా. కొల్లేటి రవిబాబు ... 17
చౌ మహల్లా ప్యాలెస్ : పంతంగి శ్రీనివాస రావు ... 20
అసాధారణకవి-పాల్కురికి సోమన : ఆచార్య వెలుదండ నిత్యానందరావు...21
తెలుగు జర్నలిజం-కృత్రిమమేధ : డా. జీకేడీ ప్రసాద రావు ... 23
జాతర : ఆచార్య తంగెడ కిషన్ రావు ... 29
ఆయా సోఫియా : టి.వి. ప్రసాద్ ... 33
భర్తృహరి : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ... 39
లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 40
త్రివేణీ సంగమం : బి.వి. అప్పారావు ... 43
రమణీయం-నార్వే దేశం : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 47
దేవారం సంస్థానం : డా. సగిలి సుధారాణి ... 54
గుహుడి వృత్తాంతం : డా. ఎ.బి. సాయిప్రసాద్ ... 58
ఆనాటి బెజవాడ జ్ఞాపకాలు : రాయవరపు సత్యనారాయణ ... 62
జాస్తి సీతామహాలక్ష్మీ దేవి : డాక్టర్ షేఖ్ మహబూబ్ బాషా ... 67
నేను చూసిన నక్షత్రం : డా. వివేకానందమూర్తి ... 74
కథాకావ్య సమాలోచనం : సి.యస్.ఆర్. ... 75
హసితబాష్పాలు : సి.యస్.రాంబాబు... 78
చదవండి : **మిసిమి** ... 79





శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్

### అట్టమీది బొమ్మలు





వైభవ



కదిలే వెలుగులు



వదలని చినుకులు




శోభిత

# 104వ జయంతి

***ఆ**లపాటి రవీంద్రనాథ్ – ఈ పేరు తెలుగు పత్రికలకు ఓ దారిదీపం – 75 ఏళ్లకు ముందే తెలుగు మాసపత్రికలు జ్యోతి, రేరాణి పత్రికలు తెనాలి నుంచి ప్రచురిస్తూ ఎందరో రచయితలను ప్రోత్సహించిన దార్శినుకుడు. వీరు ప్రోత్సహించిన వారిలో రావూరి భరద్వాజ, తర్వాత కాలంలో జ్ఞానపీఠ పురస్కారం పొందారు. ఆలపాటి వారు అప్పటి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైద్రాబాద్ వచ్చి కళాజ్యోతి స్థాపించి ప్రఖ్యాతి చెందారు. అంతటితో ఆగకుండా తనకు ప్రియాతి ప్రియమైన పత్రిక **మిసిమి** ప్రచురణకు శ్రీకారం చుట్టారు – ఒక నిబద్ధతతో తెలుగు భాష, సారస్వతాన్ని తెలుగు వారి లోగిలిలో **మిసిమి**ని నెలనెలా పూయించారు! మానవ వాదానికి – ప్రత్యామ్నాయ విలువలకు నెలవైన **మిసిమి**, రవీంద్రనాథ్ మానసపుత్రిక!*


*ఇప్పుడు మీ చేతిలో వున్న సారస్వత మాసపత్రిక ముప్పై ఆరేళ్లుగా నిరాఘాటంగా గతి తప్పకుండా ఆలపాటి వారసులు ప్రచురిస్తూ రవీంద్రనాథ్ గారికి నిత్య నివాళిగా సమర్పిస్తున్నారు.*



వైట్ హౌస్ దగ్గర శ్రీ రవీంద్రనాథ్

*నవంబర్ 4 శ్రీ రవీంద్రనాథ్ గారి 104వ జయంతి.*

*ఓ* పగటి చీకటి తడిలో మునగా వచ్చారు. వచ్చారు అంటే మామూలుగా రారు. రాజు వెడలె రవితేజముల (చీకటిలోకూడా!) సరే ఆ విషయం తర్వాత చెప్తాను. మునగావారి నిర్వాకం చెప్పాలి. దయానిధి–తన తన్నిధి నుంచి అక్షరాలా మూడుకోట్లు వెచ్చించి వెస్ట్ మారేడుపల్లి గవర్నమెంటు గరల్స్ జూనియర్ కాలేజీ అధునాతన విద్యాలయం నిర్మించి కౌమార కుమారీలకు దేవాలయంచేశారు. ఉదయాన్నే అల్పాహారం తిని–రెండు గిన్నెలు, కట్టుకున్నావిడ–లక్ష్మి–కట్టిస్తే–మై హోమ్ నవద్వీప్ హైటెక్ నుంచి వచ్చి–ఒక ఇనుప కుర్చీలో సర్దుకుని కూర్చుని పొద్దుగూకే వరకు పని చేయించిన ఈ కూలీ ఇంటికి చేరేవారు–ఆవిధంగా ఒక సంవత్సరంలో మూడువందల రోజులతో బాటు–మూడుకోట్ల రూపాయలు హరించుకుపోయాయి–ఏలూరు వాసి అయినా ఇది తెలంగాణ అని అనుకోలేదు! అయితే ప్రభుత్వం దయతలిచి వారి పేరు మాత్రం పెట్టింది! అదీకథ–అక్కడితో అయిపోలేదు–కుర్చీలు కావాలి బల్లలు కావాలి–మంచినీళ్లు కావాలి–టాయిలెట్లు కావాలి–ఎవరినడగాలి? జోలిపట్టుకోలేదు–కాని తెలిసినవారికి–తెలియని వారికి తన కథ చెప్పి చేయి చాపకుండా సైగలు చేశారు–ఒకసారి హైద్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఒక ఆరడగుల స్ఫురద్రూపి–వీరి ప్రక్కనే కూర్చున్నారు పాపం–వీరు 78 ఆర్.పి.ఎమ్. రికార్డు వేశారు–ఆయనది మంచి మనసు–ఆ కుర్చీలు–బల్లలు నేను చేయిస్తాను అని చేయించారు!–అదిగో ఆయనే–మేము ఆ రోజు (తడుస్తున్న పగటి వెలుగులో) మినర్వాకి భోజనానికి వెళ్లి కూర్చున్నాము–నేను, సార్ కాంతారావు గారు ఎప్పుడూ నన్ను ఇక్కడికే తీసుకు వస్తారని చెప్తున్నాను–ఇంతలో ఆరడగుల అయర్–వారిపేరు సదా అయర్–పలకరించారు–వారే ఎయిర్‌పోర్ట్ పరిచయం అని మునగా అంటే–వీరు బల్లులు, కుర్చీలు చేయించారు కదా–అన్నాను బాగా గుర్తుపెట్టుకున్నారు అని అంటే– వారిని భోజనం కానివ్వండి నేను తర్వాత అభినందిస్తానన్నాను. ఇంతలో మాకు విందు భోజనం అరిటాకుల పళ్లెం నిండా 15 గిన్నెలతో వచ్చింది–వారు భోజనం ముగించి వెళ్తుంటే మునగా పిలిచి నన్ను తెలిపారు–నేను తిండిలో పడి సార్ కూర్చోండి అని ఎన్నో కుర్చీలు చేయించిన వారికి–నా పక్కన కుర్చీ చూపించాను–వారితో మాట కలిపాను –నన్ను చూస్తే అందరికీ కథలు చెప్పాలనిపిస్తుందేమో–వారు–స్కూలు బల్లలు ప్రక్కన పెట్టి మరో కథ చెప్పారు– వారు మెట్రోలో అమీర్‌పేట్‌లో మొదటిసారి ఎక్కారు. వీరి ప్రక్కనే మరో పెద్దమనిషి కూర్చున్నారు. వారిని కూకట్‌పల్లి ఇటేనా సార్ అని అడిగారు–అవును అని ఆయన మాటలు



సదా అయర్

*కలిపారు–అయర్ ముఖంలో ఆనందం వెలుగుతుంటుంది –బహుశా అది చూసి అయ్యా! మీరు దానాలు చేస్తుంటారా? అంటే–అర్హత ఉన్నవాళ్ళకే కాస్తో, కూస్తో అన్నారు–నా భార్య ఫీవర్ హాస్పటల్‌లో డాక్టరు–అక్కడ పరిస్థితి దయనీయంగా ఉందని చెప్పింది–రోగులకు కూర్చోవటానికి, వేచి ఉండటానికి ఎటువంటి సౌకర్యాలు, ఏర్పాట్లు లేవు–మేము చిన్న గ్రూప్ పెట్టి వారికోసం ఒక ప్రణాళిక రూపొందించాం–ఎలాంటి ఏర్పాట్లు అవసరమో– దయగల ఒక మెకానికల్ ఇంజనీర్ అవి డిజైన్ చేయించారు–అక్కడ అధికారులతో మమ అనిపించుకుని ఓ వర్క్‌షాపులో చేయిస్తున్నాము–వారి ఫోన్ నెంబర్ మీకు ఇస్తాను–మీదయ ఎంతవీలయితే అన్ని చేయించండి అన్నారు–వారి పేరు రేణుకాపతి–విశ్రాంతి అధికారి. వీరు–ఆ మెకానిక్‌తో మాట్లాడి మొత్తంగా ఎన్ని అవసరమవుతాయి–ఎంత అవుతుందో తెలుసుకుని అన్నీ వారే చేయించి ఫీవర్ హాస్పటల్‌కి దానం చేసారు మన సదా అయర్–అదండి కథ. వారికి వీడ్కోలు చెప్పాను. మునగా వారిని మై హెూమ్‌లో దింపి–ఎమ్మార్ గారు నేను ఆశ్రమంలో దిగి కారు పంపించేస్తాను–ఉంచుకోనులెండి అంటుంటే అయ్యా! ఉండండి! మినర్వా విందు బరువుగా ఉంది అని వారు ఏడో అంతస్థుకు పరుగుతీసారు.*



రేణుకాపతి

*అసలు విషయం చెప్పనేలేదు–వారు రాజువెడలె అన్నాను కదా! వారి వచన కవితాసంపుటికి ఎంపికలు, చింపికలు కోసం వచ్చి, అవి పక్కన పెట్టి, వాటిమీద వచ్చిన మెచ్చుకోళ్లు గురించి చెప్తున్నారు. అయ్యా! ఆస్కార్‌వైల్డ్ అంటాడు మన గురించి మన పనే తెలియజెప్పాలి. మనం కాదు! – అంటూ అంటించాను.*

తెలుగు విశ్వవిద్యాలయంలో వారు వార్షికంగా ప్రదానం చేసే కీర్తిపురస్కారాలు 2024 సంవత్సరానికి ప్రకటించినపుడు చాలా సంతోషకరమైన విషయం శ్రీమతి సుభాషిణి గారి పేరు వుండటం – శ్రీమతి సుభాషిణి – గుంటూరు అన్నమయ్య గ్రంథాలయానికి–గుండెలయలాంటిది. శ్రీ లంకా సూర్యనారాయణ గారి బ్రెయిన్ చైల్డ్ అయిన లక్షపైన పుస్తకాలున్న గ్రంథాలయాన్ని డిజిటలైజ్ చేయడంలో–ఏ పుస్తకం ఎక్కడ వుందో చెప్పగల–సాధికారిత గల సుభాషిణి గారి సేవలు అనేకం–వారికి ఈ కీర్తి పురస్కారం రావడం ఎంతో సంతోషం–ఆ గ్రంథాలయ సేవలు ఎప్పుడూ వాడుకునే మాలాంటి వారికి! ఆ సభ అంగరంగ వైభవంగా నిర్వహణలో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొ. వెలుదండ నిత్యానంద రావు గారికి అభినందనలు.




శ్రీమతి సుభాషిణి

ఎన్నో పుస్తకాలు విడుదల–ఆవిష్కరణ–జరుగుతుంటాయి హైదరాబాద్‌లో. అందులో ఆంగ్ల పుస్తకాలు అరుదుగా వుంటాయి. అలాంటి అరుదైన సందర్భానికి వెళ్లాం–రాంబాబు గారు నేను–స్టేట్ ఆర్ట్ గ్యాలరీ! గ్రంథకర్త–షర్మిష్ట– ఆవిష్కర్త–శిఖాగోయెల్ (డి.జి.) ప్రసంగాలన్ని విన్నాం–హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ కార్యదర్శి ప్రొ. విజయ్ కుమార్ –నిర్మొహమాటంగా మాట్లాడారు. శిఖాగోయెల్ నిజాయితీగా మాట్లాడారు. రచయిత్రి మాట్లాడారు–ఆ విషయం వదిలేద్దాం. పుస్తకంలో అయిదారు నిజజీవిత సంఘటనలు–వార్తగా వచ్చినవి–దురదృష్టకరమైన సంఘటనలను విపులీకరించారు–ఇవన్ని పోలీస్ కేస్ ఫైల్ నుంచి సేకరించినవి–తర్వాత కల్పించి పెంచినవి–ప్రొ. విజయ్‌కుమార్ అన్నట్లు అంత సంతోషకరమైన పఠనం కాదు–పుస్తకం కొన్నాను–ఇంకా చదవలేదు!

నిన్న స్టోర్‌కి వెళ్లాను. ఇండియాగేట్ బాసుమతి కోసం! ఎప్పుడు సూపర్‌బజార్‌కి వెళ్లినా అవసరం లేనివే ఎక్కువ కొంటాము. ఓ గ్రీకుతత్త్వవేత్త అంటాడు–ఈ బజారుకొచ్చిన తర్వాత–నాకు అవసరం లేని వస్తువులు ఇన్ని వున్నాయా అని తెలిసింది–అని, ఆవిధంగా, అవసరం లేని కిరాణా కొనటంలో నాకు డొపామైన్! సరే ఖాళీగా వున్న క్యాష్ కౌంటర్‌కి వచ్చి–ఏమయ్యా డల్‌గా వుంది–అంటే–అతనికి వేరేవిధంగా అర్థమయ్యింది! ఏమీలేదు సార్ రెండుమార్కుల్లో టీచర్ ఉద్యోగం రాలేదు–రెండు నెలలు చేద్దామని వచ్చాను–సరే వస్తుందిలే–మనది ఏవూరు? ఒంగోలు సార్, గోవింద్ నాపేరు అన్నాడు–డిగ్రీ ఏమిటి? సైన్స్ సార్–బి.యిడి.చేసాను–ఓకె–ఒంగోలు వెళ్లినపుడు చెప్పు–నాకు తెలిసినవాళ్లున్నారు–నీకు సాయం చేయగలరు! ఇక్కడే వుండిపోకు–గుడ్‌లక్ అని చెప్పి వచ్చాను. నా డొపెమైన్‌కి మా ఆడిటర్ గారు డీ టాక్స్ సిద్ధంగా ఉంచింది.

ఇదీ మరో క్యాబ్ కథే! ఇతని పేరు ప్రవీణ్. నేను క్యాబ్ ఎక్కగానే ఏం ప్రవీణ్ క్యాబ్ ఎందుకు తీసుకున్నావు? అంటే, సార్! మొన్నే సాఫ్ట్‌వేర్ జాబ్ నుంచి లే ఆఫ్ అయ్యాను. ఖాళీగా ఉండటం ఎందుకని రాపిడో తీసుకున్నాను. అతను ఎమ్.ఎస్‌సి. కంప్యూటర్స్ చేశాడు. అదండీ చాప్లిన్ అన్నట్లు క్రూయల్ వరల్డ్.

# బ్రహ్మసూత్రాలు

- ఆచార్య కోదాటి వియ్యన్నరావు

**హిం**దూ వాఙ్మయంలో వేదాలు, ఉపనిషత్తులు తరువాత బ్రహ్మసూత్రాలకు విశేషమైన స్థానం ఉన్నది. కొద్దిమంది భాష్యకారుల ఉద్దేశ్యంలో బ్రహ్మసూత్రాలు వేదవాఙ్మయంలో శిఖరాగ్రస్థానం కలిగినవిగా పరిగణించ బడుచున్నాయి. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలను **ప్రస్థానత్రయం** గా పిలవడం జరుగుచున్నది. ఆ విధంగా ఉపనిషత్తులను శ్రుతి ప్రస్థానాలుగా, భగవద్గీతను స్మృతి ప్రస్థానంగా, బ్రహ్మసూత్రాలు న్యాయప్రస్థానాలుగా చెప్పబడుతున్నాయి. బ్రహ్మసూత్రాలలో ఇమిడి ఉన్న తార్కిక భావనల ఆధారంగా వీటిని ఆ విధంగా పిలిచి ఉండవచ్చు. బ్రహ్మసూత్రాల చర్చ సాధారణ శకానికి ముందు నుండి ఉండినా, సాధారణ శకం 7వ శతాబ్దం తరువాత నింబార్కాచార్య, శ్రీనివాసాచార్య, ఆదిశంకరులు వీటిపై తమ దృష్టిని సారించిన తరువాతనే ఇవి ఎక్కువగా వెలుగులోనికి వచ్చాయి. బ్రహ్మసూత్రాలు, వేదాలు, ఉపనిషత్తులకు సంబంధించిన అంశాలను లేదా భావనలను చిన్ని చిన్ని వాక్యాల రూపంలో అర్థవంతంగా వ్యక్తీకరించే ప్రయత్నం చేస్తాయి. పేరులోనే ఉన్నట్లుగా ఇవి బ్రహ్మంను గురించిన జ్ఞానాన్ని మరింతంగా విపులీకరించే ప్రయత్నం చేస్తాయి. ఇంతకుముందు "ఉపనిషద్విచారణ శీర్షికలో భాగంగా" ప్రధాన ఉపనిషత్తులపై విశ్లేషణ చేయడం జరిగింది. వాటిలో కేనోపనిషత్తు, కఠోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు వంటి వానిలో బ్రహ్మం యొక్క స్వభావం, బ్రహ్మాన్ని చేరుకొనే మార్గాలు, బ్రహ్మం యొక్క దివ్యశక్తి, బ్రహ్మం యొక్క రూపాలు, జీవాత్మ-పరమాత్మ వంటి విషయాలపరంగా చర్చకొనసాగింది. బ్రహ్మసూత్రాలు ఈ చర్చకు కొనసాగింపు లేదా అదనం అని చెప్పుకోవచ్చు. ఈ సూత్రాలు మొత్తంగా నాలుగు అధ్యాయాలుగా అభిప్రాయాల సమన్వయం, వివిధ సిద్ధాంతాల తులనాత్మక పరిశీలన, అధ్యాత్మిక జ్ఞానసాధన, జ్ఞానం యొక్క అంతిమ ఫలితం వంటి శీర్షికలుగా చెప్పబడ్డాయి. ఈ నాలుగు అధ్యాయాలలో మొత్తంగా 555 సూత్రాలు వివరించబడ్డాయి. ఒక్కొక్క అధ్యాయం పరంగా ప్రధానమైన కొన్ని సూత్రాలను గమనించుకొనే ప్రయత్నం చేద్దాం.

నాలుగు అధ్యాయాలుగా ఉన్న బ్రహ్మసూత్రాలలో ప్రతి అధ్యాయం మరల నాలుగు భాగాలు (లేదా పాదాలుగా), ప్రతిభాగంలో అనేక విభాగాలు (లేదా అధికరణాలు) ప్రతి విభాగంలో మరల ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సూత్రాలు ఉన్నాయి. ఆ విధంగా విశ్లేషిస్తే, మొదటి అధ్యాయంలో 134 సూత్రాలు, రెండవ అధ్యాయంలో 157 సూత్రాలు, మూడవ అధ్యాయంలో 186 సూత్రాలు, నాల్గవ అధ్యాయంలో 78 సూత్రాలు, మొత్తంగా 555 సూత్రాలు పేర్కొనబడ్డాయి. కావున ప్రతి అధ్యాయం నుండి ఒక పది సూత్రాలను మధ్యస్త విశ్లేషణకు ఎంపిక చేసుకొంటూ వ్యాసాన్ని కొనసాగిస్తాను.

**అధ్యాయం-1లో పేర్కొనబడిన కొన్ని సూత్రాలు :** ఇంతకు ముందు పేర్కొన్నట్లు ఈ అధ్యాయంలో మొత్తంగా 134 సూత్రాలు నాలుగు పాదాలలో కలిపి చెప్పబడ్డాయి. వాటిలో ఒక్క పదింటిని మాత్రమే ఇక్కడ పొందుపరుస్తున్నాను. సూత్రం యొక్క బ్రాకెట్టులో సూచించబడిన సంఖ్య సూత్రం యొక్క పాదము మరియు దాని యొక్క సంఖ్యగా గుర్తించవలెను.

**1. అథాతో బ్రహ్మ జిజ్ఞాసా (1.1.1) :** బ్రహ్మజ్ఞానాన్ని పొందగోరువారు కొన్ని అర్హతలను సాధించాలి. అవి ఏవనగా వేదములు, వేదాంతమును గురించిన అవగాహన ఉండాలి. దీనితోపాటుగా శాశ్వతమైన, అశాశ్వతమైన పదార్థాలపై స్పష్టమైన అవగాహన ఉండాలి. ముఖ్యంగా 'ఆత్మ'యే శాశ్వతమైనది గాను, నశింపులేనిది గాను గుర్తించాలి. అదేవిధంగా సత్యంపై పూర్తి విశ్వాసం ఉండాలి. కర్మలు ఆచరించడం ద్వారా ఆత్మను ప్రక్షాళన చేసుకోవచ్చు. జ్ఞానము-కర్మ-సముచ్ఛయముల సమ్మేళనం ద్వారా మోక్షం లభిస్తుందని ఈ సూత్రం తెలియజేస్తుంది.

**2. జన్మాద్యస్యయతః (1.1.2) :** ఈ ప్రపంచమునకు ఆధారమైన సృష్టి, స్థితి, లయములు దేని నుండి జనించుచున్నవో అదియే బ్రహ్మము. అనగా సృష్టి, స్థితి, లయములకు కారణభూతము బ్రహ్మమే. వేరొక అర్థములో ఏదైతే సత్యమో, జ్ఞాన స్వరూపమో, అనంతమో అదియే బ్రహ్మంగా చెప్పబడుచున్నది. ఇటువంటి బ్రహ్మము ఏవైనా ప్రత్యేక లక్షణములు కలిగి ఉన్నదా అన్న విచారము కూడా ఈ సూత్రములో చేయబడినది. ఆ సందర్భంలో ఏదైతే జగత్ కారణమో, అదియే బ్రహ్మమని చెప్పబడింది. కల్పిత

కారణములు బ్రహ్మం యొక్క తటస్థ లక్షణములుగా చెప్పబడినవి.

**3. శాస్త్రయోని త్వాత్ (1.1.3) :** శాస్త్రముల పుట్టుకకు కారణభూతుడగుటచేత, బ్రహ్మం సర్వజ్ఞుడు. ఇందులో అన్ని రకముల శాస్త్రములు ఇమిడి ఉన్నాయి. వేదము, పవిత్ర గ్రంథములు ఇందులోని భాగములే. ప్రమాణము ద్వారా బ్రహ్మము వేటినైతే స్థిరపరచినాడో అవే శాస్త్రములు. అందువలన వేదముల కర్త బ్రహ్మమనియే చెప్పబడుతున్నది.

**4. తన్నిష్టస్య మోక్షోపదేశాత్(1.1.7):** బ్రహ్మంను గురించిన సంపూర్ణ జ్ఞానం వలన జీవునికి మోక్షము యొక్క ఉపదేశము లభించుచున్నది. ఆత్మ యొక్క స్థూల, సూక్ష్మరూపముల నెరిగిన వారికి మోక్షోపదేశము సులభముగా లభిస్తుంది.

**5. ప్రాణస్తథాను గమాత్ (1.1.28) :** ప్రాణ శబ్దమే బ్రహ్మమై ఉన్నది. అయితే ఇక్కడ కేవలం శ్వాసను, లేదా గాలిని మాత్రమే ప్రాణంగా భావించరాదు. ప్రాణాన్ని పూర్తి చైతన్యంగా భావించాలి.

**6. సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్ (1.2.1) :** జీవుని యొక్క మనస్సు ఏదైతే ఉన్నదో అది బ్రహ్మమే. ఎందుచేతననగా అది సర్వవ్యాపి అయి ఉన్నది. బ్రహ్మంతో సమానముగా చెప్పగల ఇతర అంశములు జీవునిలో ప్రత్యక్షం కావు గనుక మనస్సుతో పోల్చబడినది. ఆ విధంగా మానవులకు ఏర్పడే మనోవికారములన్నియు బ్రహ్మంగానే చెప్పబడ్డాయి.

**7. ముక్తోపసృప్యవ్యపదేశాత్ (1.3.2) :** బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తి అజ్ఞానము, దాని చర్యల నుండి విముక్తుడై పరాత్పరుడైన ఈశ్వరునిలో ఏకమగును. ఎవరైతే సంసార బంధం నుండి విముక్తుడౌతాడో అట్టి వ్యక్తి బ్రహ్మంను చేరుకొంటాడు; ఎందుచేతనంటే బాహ్య ప్రపంచంలోని అన్ని పదార్థములతోడను సంబంధాన్ని కోల్పోయి ఉంటాడు.

**8. ప్రాణభృచ్చ (1.3.4) :** ఈ సూత్రము ప్రకారము జీవుని యొక్క ఆత్మలో చైతన్యము ఉన్నను, అది సంపూర్ణ శక్తిమంతం కాదు. ఎందుచేతననగా అది ఇతర లోకములను నిలిపి ఉంచజాలదు.

**9. శబ్దాదేవ ప్రమితః (1.3.24) :** జీవునిలో అంగుష్ట మాత్రము (Thumb–బొటనవ్రేలు) ఉన్నది బ్రహ్మమే. అది పొగలేని అగ్నివంటిదని గ్రహించవలెను. అతనే భూత, భవిష్యత్తులకు యజమాని అయి ఉన్నాడు.

**10. సూక్ష్మంతు తదర్హత్వాత్ (1.4.2) :** మానవుడు స్థూల, సూక్ష్మ శరీరములతో పరివేష్టితుడై ఉన్నాడు. స్థూల శరీరము ఆధారముగానే సూక్ష్మ భాగములు కొలువై ఉండును. ఆ సూక్ష్మశరీరము అవ్యక్తమైనది. కనిపించే దేహము వ్యక్తమైనది. ఇది రథము వలె స్థూల, సూక్ష్మ శరీరములు తమ, తమ పాత్రలను పోషించుటకు ఉపయోగపడుతుంది.

**అధ్యాయం-2 ద్వారా వ్యక్తం చేయబడిన కొన్ని సూత్రాలు :** ఈ అధ్యాయంలో ముఖ్యమైన వాటిని గమనిద్దాం.

**1. దృష్య తేతు (2.1.6) :** చైతన్యము నుండియే చేతన మరియు అచేతన పదార్థముల ఉత్పత్తి జరుగవచ్చును. అందువలన అచేతనమైన జగత్తునకు కూడా చైతన్యమే కారణభూతమవ్వగలదు. దీనికి ఉదాహరణలుగా చైతన్యమైన దేహం నుండి జుట్టు, గోళ్ళు వంటి అచేతన పదార్థముల ఉత్పత్తి; అట్లే అచేతనమైన గోమయము నుండి చేతనమైన క్రిమికీటకాదులు జనించుట చెప్పబడినవి. కావున కారణ బ్రహ్మం నుండి కార్యజగత్తు సాదృశ్యమని చెప్పుట ఇచ్చటి అంశము.

**2. అసదితి, చేన్న, ప్రతిషేధమాత్రత్వాత్ (2.1.7) :** సృష్టికి ముందు జగత్తు అసద్రూపమనుట సరికాదు. ఎందుచేతననగా కారణము లేకుండగ, కార్యము లేదు. పదార్థము వాస్తవములోనికి వచ్చినప్పటికీ, అదికారణమును విడిచి ఉండదు. నిత్యశుద్ధుడైనటువంటి బ్రహ్మము అశుద్ధుడు, జడము అనుట అసత్యము.

**3. తదనన్యత్వ మారమ్భణ శబ్దాదిభ్యః (2.1.14) :** కారణ బ్రహ్మమునకంటే కార్యజగత్తు వేరు కాదు. అందుచేత జగత్తునంతట బ్రహ్మము నిండియున్నాడు. దీనికి ఉదాహరణగా మట్టిని, మట్టితో తయారైన కుండను చెప్పి ఉన్నారు. ఏ రూపంలో ఉన్నా అది మట్టి మాత్రమే. ఈ విధమైన అవగాహన బ్రహ్మాన్ని గూర్చిన జ్ఞానాన్ని వృద్ధి చేస్తుంది.

**4. యథాచ ప్రాణాదిః (2.1.20) :** పైన పేర్కొన్న సూత్రానికి ఇది కొనసాగింపని చెప్పవచ్చు. ఏ విధముగానైతే శ్వాస, ప్రాణము వేరు కాదో, అదే విధముగా బ్రహ్మము, జగత్తు వేరుగా లేవు. కార్యములలో భిన్నత్వము గోచరించినప్పటికీ, కారణములో భిన్నత్వము లేదు. జగత్తు కార్యము, బ్రహ్మకారణము అగుట చేత జగత్తు, బ్రహ్మ ఒక్కటియే. కావున బ్రహ్మ విజ్ఞానము వలననే సర్వవిజ్ఞానము కలుగును.

**5. ప్రవృత్తేశ్చ (2.2.2) :** కార్య-కారణ జగత్తుకు వాహకము అవసరమైనప్పటికీ, అది ప్రధానం కానేరదు. మట్టి కుండ

ఉదాహరణలో మట్టి నుండి కుండను తయారుచేయడానికి కుమ్మరి అవసరమున్నప్పటికీ, కుమ్మరిని కారణంగా చెప్పరాదు. అల్లే రథాన్ని నడపడానికి, సారధి అవసరమైనప్పటికీ, సారధిని కారణంగా చెప్పలేము. బ్రహ్మమొక్కటే తాను చలించకుండా, జగత్తును చలింపజేయగలదు.

**6. ఉభయ థా చ దోషాత్ (2.2.23) :** ఈ సూత్రము ద్వారా చేయబడిన చర్చ అవిద్యను గురించి ఉన్నది. అవిద్య యొక్క నాశము దాని యదార్థ జ్ఞానము ద్వారా కలుగుతుందా? లేక దాని యంతట అదే నశిస్తుందా? అన్న మీమాంసలో రెండు వాదములు వ్యర్థమని చెప్పబడినవి. సర్వము క్షణికమనే గమనింపు ఉన్న యెడల రెండు అభిప్రాయములు సరియైనవి కావని అర్థమవుతుంది.

**7. ఉత్పత్త్య సంభవాత్ (2.2.4.2) :** ఇది భాగవతమునకు చెందినది. ఈ సూత్రం ప్రకారం జీవోత్పత్తి, వాసుదేవుని నుండి జరిగినది. దీని ప్రకారం భగవంతుడు సమర్థుడు, పదార్థసృష్టికి కారణభూతుడైనవాడు. ఆయనే సృష్టిలో భాగంగా నాలుగు రూపాలు ధరించియున్నాడు. అవి : వాసుదేవ, సంకర్షన, ప్రద్యుమ్న, అనిరుద్ధ. వాసుదేవ రూపం మిగిలిన అన్ని రూపాలకు అంతిమమైనది.

**8. అసంభవస్తు సతోను ప్రపత్తేః (2.3.9) :** ఈ సూత్రము చెప్పునది బ్రహ్మం అన్నది వస్తువు కాదు, అది ఉత్పత్తి చేయబడలేదు. సృష్టిలో ఏదైతే కార్య-కారణ సంబంధానికి మూలమై ఉన్నదో అదియే బ్రహ్మము. ఏది అన్నిటికి మూలకారణమో, దేనికి కారణము లేదో అదియంతయు కూడా బ్రహ్మమే అయి ఉన్నది.

**9. తదభిధ్యానదేవతు తర్లింగాత్సః (2.3.13) :** ఈశ్వరుడే అన్ని కార్యరూపముల ద్వారా వ్యక్తీకరించబడి, సమస్త భూతములకు అధిష్టాన దేవతయై ఉన్నాడు. అన్ని కార్యములను అతనే ఉత్పత్తి చేయుచున్నాడు. ఆ విధంగా ఈశ్వరుని ద్వారా వివిధ ప్రాణుల సృష్టి జరుగుచున్నది.

**10. తథా ప్రాణాః (2.4.1) :** దీని ప్రకారము శ్వాసక్రియలు వస్తు ప్రపంచం కంటే ముందే ఉన్నవి. అవి బ్రహ్మం నుండే ఉద్భవించినవి. పరమాత్మయే ప్రాణము మరియు మనస్సు యొక్క సూత్రధారి మరియు సంబంధరహితుడు, శుద్ధుడు, అనగా వీనికి అతీతుడు.

**అధ్యాయము-3లో చెప్పబడిన సూత్రాలు :** ఈ అధ్యాయంలో మిగిలిన రెండు అధ్యాయాలకంటే ఎక్కువ సూత్రములు ప్రస్తావించబడ్డాయి. అయినప్పటికీ ప్రధానమైన పదింటిని గురించి తెలుసుకొందాము. వీనిలో ఎక్కువగా జీవుడు పరలోకప్రాప్తి పొందడానికి అవసరమైన సాధన సంపత్తిని గురించిన వివరణ ఉంది.

**1. తదన్తర ప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్తః ప్రశ్న నిరూపణాభ్యామ్ (3.1.1.) :** ఈ సూత్రము ప్రకారము జీవుడు దేహమును విడిచి పరలోకమును చేరునప్పుడు, జీవుడు అతని యొక్క ప్రాణేంద్రియాలతోపాటు, అతని జీవికకు ఆధారంగా నిలిచిన పంచభూతముల యొక్క సూక్ష్మాంశములను గూడ తనతోపాటు పరలోకమునకు తీసుకొనిపోవును. ఎందుకనగా జీవుడు నూతన శరీరధారణకు ఇవి అవసరము కావున ఈ విధంగా జరుగుతున్నదని చెప్పబడినది. సృష్టిలో నూతన శరీరధారణకు అవసరమైన ధాతువులు (material elements) ఉన్నప్పటికీ, అవి అతనికి అంత సులభముగా లభించని కారణంగా జీవుడు దీనిపై శ్రద్ధ వహిస్తాడు. ఇక్కడ మూలధాతువులనగా జలము, అగ్ని మరియు పృధివి చెప్పబడినవి. ఈ మూడింటిలో జలము అధిక ప్రాధాన్యం కలిగి ఉన్నదని, తరువాతి సూత్రంలో చెప్పబడినది.

**2. కృతాత్యయేను శాయువాన్ దృష్ట స్మృతిభ్యాం యథేతమనేవం చ (3.1.8) :** కర్మలు అనుభవించిన జీవుడు పరలోకమునకు ఏగిన పిదప, శేషముగా మిగిలిన కర్మలను అనుభవించుటకై మరల భూమిపై జన్మిస్తాడు. కావున చెప్పదగినది ఏమనగా జీవుని యొక్క ఆత్మ కర్మల యొక్క శేషమును అనుభవించడానికై మరల పుడుతుంది. ఈ విధముగా జరుగకుండ ఉండవలెనన్న, కర్మశేషము ఏమియును ఉండరాదు.

**3. నాతిచిరేణ విశేషాత్ (3.1.23) :** దీని ప్రకారము కర్మఫలము ననుసరించి స్వర్గమునకు ఏతెంచిన జీవుడు అచ్చట స్వల్పకాలము మాత్రమే ఆకాశాదుల రూపంలో ఉండి మరల వర్షము ద్వారా జలరూపమున భూమిపై ప్రవేశించును. ఆ విధంగా ప్రవేశించిన జీవుడు ఏ రూపమున, ఎచ్చట ప్రవేశిస్తాడు అన్న విషయంగా ఉన్న వాదనలలో కొద్దిమంది అన్న సంబంధమైన మొక్కల రూపంలో ప్రవేశిస్తాడని, కొద్దిమంది వివిధ జంతువుల రూపంలో ప్రత్యక్షమవుతాడని చెప్పబడుచున్నది. దీనికి తార్కాణంగా, అతని యొక్క కర్మఫలమును ఉదహరించడం జరిగినది.

**4. సంధ్యే సృష్టిరాహహి (3.2.1) :** ఈ సూత్రములో జీవుడు అనుభవించే మూడు అవస్థలైనటువంటి జాగ్రదావస్థ,

స్వప్నావస్థ, సుషుప్తావస్థల మధ్య, ఇంకేమైనా స్థితి ఉన్నదా? అన్న చర్చ చేయబడింది. ఒక వాదన ప్రకారము జాగ్రదావస్థ, స్వప్నావస్థలకు మధ్యన మరొక స్థితి ఉన్నది. అదియే మధ్యస్థ స్థితిగా చెప్పబడింది. దీనినే స్వప్న సృష్టి వ్యవహారికముగా భావించారు. ఇంకొక వాదము ప్రకారము మధ్యస్థస్థితి అయినటువంటి వ్యవహారిక స్థితిలేదు. స్వప్నావస్థయే జాగ్రదావస్థ వంటిది. దీనిననుసరించి స్వప్నావస్థలో జీవుడు పొందిన అనుభూతి, జాగ్రాదవస్థలో పొందిన అనుభూతితో సమానము. ఉదాహరణగా స్వప్నావస్థలో జీవుడు సంతృప్తికరమైన భోజనము చేసినాడనుకొందాము. ఇది జాగ్రదావస్థలో కలిగే అనుభూతికి సమానమా? కాదా? అన్నది ప్రశ్న. సమానమేనని ఇచ్చట ప్రతిపాదించబడింది. దీనికి కొంత శాస్త్రీయతను జోడించి ప్రమాణాన్ని స్థిరపరచవచ్చు.

**5. సూచకశ్చ హి శ్రుతేరాచక్షతే చ తద్విదః (3.2.4) :** ఈ సూత్రమును పై దానికి కొనసాగింపుగా చెప్పవచ్చును. స్వప్నములో సూచించబడిన మంచిచెడులను ఏ విధంగా స్వీకరించవచ్చును? వాటిని భవిష్యద్దర్శనములుగా భావించవచ్చునా? అన్నది విషయము. కలలు సత్యములా లేక అసత్యములా? అన్నది చర్చ. దీనిపై మూడు వాదములు ఉన్నాయి. అసత్యములని, సత్యములని, మధ్యస్తముగా కొన్ని వాస్తవములు అగుటకు అవకాశమున్నదని వివరించబడింది.

**6. సర్వవేదాన్త ప్రత్యయం చోదనాద్యవిశేషాత్ (3.3.1):** వేదాలలో చెప్పబడిన వివిధ ధ్యాన పద్ధతులు ఒక్కటే. వీటి ద్వారా జీవుడు బ్రహ్మాన్ని ఏ విధంగా చేరుకోగలడు అన్న విషయాన్ని ఈ సూత్రం వివరిస్తుంది. అంతేకాకుండా వివిధ ప్రక్రియలలో ఉన్న బేధాలను సమమం చేసే ప్రయత్నం చేస్తుంది. సగుణ బ్రహ్మానికి చెందిన ప్రాణవిద్య, ధార విద్య, వైశ్వానర ఉపాసన, శాండిల్య విద్య వంటివి భూమిపై జీవుడు సుఖసంతోషాలను పొందడానికి తోడ్పడగా, నిర్గుణ బ్రహ్మానికి చెందిన ఉపాసనలు జీవుని మోక్షమార్గం చేరుకోవడానికి సహాయపడతాయి.

**7. దర్శయతి చ (3.3.4) :** ఈ సూత్రము అన్ని రకములైన దర్శనములు లేదా విద్యల యొక్క ఏకత్వాన్ని సూచిస్తుంది. ఇంతకు ముందు సూత్రము (3.3.1)లో పేర్కొన్న విధముగా నిర్గుణ బ్రహ్మమొక్కటే అన్ని వేదాంత గ్రంథముల సారము.

**8. కార్యాఖ్యానాద పూర్వమ్ (3.3.18) :** ఈ సూత్రములో జలము, ప్రాణము యొక్క వస్త్రముగా చెప్పబడుతున్నది. ఈ విషయమును గ్రహించిన పెద్దలు భోజనము చేయుటకు ముందు ఆచమనము చేయుదురు. దీని ప్రకారముగా అన్ని అనుష్ఠాన కార్యములలో ఆచమనము చెప్పబడినది.

**9. ఏక ఆత్మనః శరీరేభావాత్ (3.5.53) :** ఈ సూత్రార్థములో శరీరము ఆత్మకన్నను భిన్నమైనది. ఏలయనగా, మరణ దశలో శరీరమున్నను జ్ఞానము ఉండదు. కొన్ని సందర్భములలో దేహము అచేతనముగా ఉన్నను, చైతన్యము కలిగి ఉండవచ్చును. అందుచేత ఆత్మ యొక్క అస్తిత్వము దేహనకు భిన్నమైనది.

**10. పురుషార్థోతః శబ్దాదితి బాదరాయణః (3.4.1) :** బాదరాయణుని అభిప్రాయం ప్రకారము ఆత్మజ్ఞానము ద్వారానే మోక్ష సిద్ధి కలుగును. దీనికి ధ్యానము సాధనమై ఉన్నది. మోక్షము మాత్రమే కాకుండా పురుషార్థమైనటువంటి రుజుప్రవర్తన, సంపద, ఆనందం కూడ దీని ద్వారా సిద్ధిస్తాయి. ఈ సందర్భంలో ఒక విచారము చేయబడినది. అదేమనగా ఆత్మజ్ఞానము పొందిన వ్యక్తి బలిదానములు (Sacrifices) కూడా చేయవలెనా? లేక మోక్షం దానంతట అదే సిద్ధిస్తుందా? దీనికి సమాధానంగా కర్మలు చేయవలసి ఉంటుందని చెప్పడం జరిగింది.

**అధ్యాయము-4లో పేర్కొనబడిన కొన్ని సూత్రాలు :** ఈ అధ్యాయములో మోక్షసాధనకు సంబంధించిన మరిన్ని వివరములు తెలుపబడెను. ముఖ్యముగా సంసారమందలి దుఃఖము, దాని నివారణ, జీవ-బ్రహ్మ స్వరూపము, బ్రహ్మ విద్యల యొక్క గుణ విశేషములు, సగుణ, నిర్గుణ ఉపాసనల యొక్క ఫలితములు వివరించబడ్డాయి. ఫలితము సిద్ధించువరకు సాధన చేయవలసినదని ఈ అధ్యాయములోని సూత్రములు వెల్లడిస్తాయి.

**1. ఆవృత్తి రసకృదుపదేశాత్ (4.1.1) :** దుర్గమమైన ఆత్మ సాక్షాత్కారము శ్రవణాదుల ద్వారా సాధ్యమవుతుంది. ఈ సందర్భంలో జీవుని యొక్క ఆరుతావులు ప్రముఖమైనవి. అవి : నాసికము, కంఠము, వక్షస్థలము, తాళువు, జివ్హ మరియు దంతము. దీనినే షడ్జము అని పిలుస్తారు. వీనినుపయోగించి 'ఆత్మ'ను శ్రవణం ద్వారాను, ధ్యానం ద్వారాను ప్రతిబింబం ద్వారాను తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. బ్రహ్మ సాక్షాత్కారం కలగాలంటే ఈ క్రియలను మరల, మరల ఆచరించాలి అని ఈ సూత్రం చెప్తుంది.

**2. ఆత్మేతి గూపగచ్ఛన్తి గ్రాహయన్తి చ (4.1.3) :** ఈ సూత్రము ద్వారా తెలియజేయునది, ఆత్మయే బ్రహ్మము. చాందోగ్య ఉపనిషత్తులో చెప్పబడిన మహావాక్యమైన "తత్వమసి (అదే నీవు అయి ఉన్నావు) "దీనికి మూలము. ఆత్మరూపముగనే బ్రహ్మంను తెలుసుకోగలమనేది దీని సందేశం. బ్రహ్మమే సర్వజీవులలోను నిక్షిప్తమై ఉన్నాడు. ఈ ఎఱుకయే మోక్షద్వారాలను తెరుస్తుంది.

**3. తదధిగమే ఉత్తరాపూర్వాఘయోర శ్లేష వినాశౌ తద్వ్యపదేశాత్ (4.1.13) :** బ్రహ్మజ్ఞానము కలిగిన వ్యక్తికి అతను అంతకుముందు, అటు తరువాత నిర్వహించిన పాపకార్యముల ఫలము అంటదు. బ్రహ్మజ్ఞానము పొందిన వానిని 'బంధహేతువగు' కర్మ అంటదు. ఆ యొక్క జ్ఞాన సిద్ధితో పాటుగనే అన్ని బంధనాలు తెంచబడతాయి.

**4. తానిపరేతథా హ్యహ (4.2.15) :** ప్రాణమునకు ఆధారముగా ఉన్న ఇంద్రియములన్నియు బ్రహ్మంలో లీనమగును. ఇచ్చట బ్రహ్మజ్ఞానం పొందిన వానికి, పొందనివానికి తేడా లేదు. ఏ విధముగా నదులు సముద్రజలము నుండి పుట్టి మరల సముద్ర జలములో కలిసిపోవునో, అట్లే జీవాత్మ, పరమాత్మలో లీనం చెందును.

**5. అర్చిరాదినా తత్ప్రథితే (4.3.1) :** ఈ సూత్రములో చెప్పబడినది ఏమనగా భగవంతుని చేరుటకు ఉన్న మార్గములు ఎన్ని? వివిధ మార్గములు ఉన్నవా? లేక ఉన్న ఏకైక మార్గమును తెలిపే వివిధ దృక్కోణములా? అన్నది. తేల్చి చెప్పినది ఏమనగా, ఉన్నది ఒక్కటియే మార్గము; మిగిలినవన్నీ దాని వ్యక్తీకరణలు మాత్రమే.

**6. సామీప్యాత్తు తద్వ్యపదేశః (4.3.9) :** కార్య బ్రహ్మము, కారణ బ్రహ్మమునకు సమీపమున కలదు. ఒక విధంగా పరికిస్తే కార్యబ్రహ్మము కారణ బ్రహ్మం యొక్క రూపాంతరము. ఇచ్చట తెలియదగినది ఏమనగా కార్యబ్రహ్మ లోకము నశించిన మీదట, ఆ లోకమునకు అధ్యక్షుడైనటువంటి హిరణ్యగర్భునితోపాటుగా పరబ్రహ్మను పొందుతారు. కార్యబ్రహ్మము, కారణ బ్రహ్మంను చేరుటకు ఒక వాహకమని గమనించాలి.

**7. దర్శనాచ్ఛ (4.3.13) :** ఎవరైతే బ్రహ్మ నాడీ మార్గము ద్వారా నిర్గమించునో అతడు పరబ్రహ్మమును చేరును. దీని ద్వారా చెప్పబడినది, ఎవరు బ్రహ్మోపాసన ఏ విధముగా చేయుదురో ఆ విధమైన ఐశ్వర్యప్రాప్తి కలుగుతంది. **'తం యథా యథోపాసతే తదేవ భవతి'** అన్నది తెలియదగిన వాక్యము.

**8. సమ్పద్యావిర్భావః స్వేన శబ్దాత్ (4.4.1) :** ఆత్మను ప్రత్యక్షముగా అనుభవించి, సాక్షాత్కరించుకొనిన యెడల అది ఆవిర్భావమవుతుంది. స్వస్వరూపమే నిత్యమని తెలిసియుండుట ముక్తికి మార్గము. ఎందుచేతననగా జీవుడు మోక్షము పొందు సందర్భములో స్వస్వరూపముతోనే ఉండును.

**9. ముక్తః ప్రతిజ్ఞాత్ (4.4.2) :** జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తావస్థ దాటిన జీవుడు సంపూర్ణ ఆనందమును పొందును. ఆ స్థితిలో అన్ని బంధముల నుండి విముక్తుడై శుద్ధ రూపుడై ఉండును. ఇదియే పరంజ్యోతిని పొందు స్థితిగా చెప్పబడినది.

**10. అవిభాగేన దృష్టత్వాత్ (4.4.4) :** మోక్షం లేదా ముక్తిని పొందిన జీవుడు ఆనందమయమైన బ్రహ్మ రూపంతోనే ఉండును. ముక్తుడైన జీవుడు బ్రహ్మం కన్న భిన్నము అన్న ప్రశ్న ఉదయించదు. బృహదారణ్యకోపనిషత్తు యొక్క మహావాక్యమైన **'అహం బ్రహ్మాస్మి'** యొక్క అర్థము ఇదే అయి ఉన్నది. ఇంతవరకు విశ్లేషించిన దానిని బట్టి తెలియునదేమనగా వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు మరియు పురాణాలలో చెప్పబడిన విషయాల క్రోడీకరణే ఈ బ్రహ్మసూత్రాలు. అదే సందర్భంలో వీటన్నింటిలో చేయబడిన వివిధ వాదాలు, వెల్లడైన వివిధ దృక్కోణాల తులనాత్మక పరిశీలన ఇక్కడ మనకు కనపడుతుంది. అట్లే వివిధ భారతీయ దర్శనాలలో వ్యక్తం చేయబడిన అభిప్రాయాల పరంగా కూడా చర్చచేయబడింది. ఆస్తిక, నాస్తిక వాదాల పరిశీలన కూడా వీటిలో ఉంది. అయితే బ్రహ్మం యొక్క ఉనికిని స్థిరపరచడమే వీటి ఉద్దేశ్యం. భాష్యకారులు వారి, వారి అవగాహనను బట్టి, దృక్కోణాన్ని అనుసరించి వాదప్రతివాదములు చేయడం జరిగింది. అంతిమంగా బ్రహ్మం యొక్క ఏకత్వాన్ని (Monism) రుజువు చేసే ప్రయత్నంగా చర్చలు సాగుతాయి. ఇంతకుముందు చెప్పినట్లు ఈ వ్యాసంలో ఎంపిక చేసిన కొన్ని సూత్రార్థములను మాత్రమే వివరించే ప్రయత్నం చేయబడింది. వాటి యొక్క ప్రాధాన్యాన్ని పాఠకులు గమనించి సూచనలు చేయవచ్చు. మిక్కిలిగా ఉన్న బ్రహ్మసూత్రములకు ఈ వ్యాసం అతిసంక్షిప్త రూపం మాత్రమే. పాఠకులు గమనించగలరు.

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
సంస్కృతాంధ్ర పండితులు,
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.
గుంటూరు, ఫోన్ : 7093260655.

# జీవన మకరందం

- బ్రతకటం అంటే ఆలోచన, ఆచరణ అన్నమాట!
- సత్యమనేది అరుదుగా పవిత్రంగా వుంటుంది - సత్యం సామాన్య విషయం కాదు!
- ప్రకృతి దేవాలయం కాదు - అది ఒక కర్మాగారం!
- మీరు ఒంటరిగా వున్నపుడే - మంచిగా వుంటారు.
- స్వార్థం అంటే మీ ఇష్టం వచ్చినట్లు బ్రతకటం కాదు.
  అందరినీ నీకు ఇష్టం వచ్చినట్లు బ్రతకాలని చెప్పటం.
- ప్రేమించటం పాపం కాదు - అది పాపం చేయటమూ కాదు.
- ఇప్పుడు పిల్లల్ని పెంచే విధానం మానవ జాతిని అధోగతిపాలు చేయడమే!
- నీవు సంతోషంగా వున్నపుడే మంచిగా వుంటావు!
- ప్రయాణాలు అన్ని - నీనుంచి నువ్వు దూరంగా పోవటానికే!
- శక్తికి వాదనలు ఎందుకు?
- ఏ వాదనా - జీవితమంత గొప్పదికాదు.
- ప్రభుత్వం - మనిషికి వుపయోగపడే పనులు జేయటానికి,
  మనిషి - అందమైన పనులు చేయటానికి.
- ఇప్పుడు యంత్రాలు మనిషితో పోటీ పడుతున్నాయి
  కాని మనిషి చేయవలసింది - మనిషితో పోటీపడటం!
- ప్రేమ మనిషిని ఎలా మారుస్తుందో చెప్పలేము.
- జీవితం-నిన్ను శాసిస్తుంది - అది నియంత!
- నీవు నేర్చే పాఠాలు - నీకు తర్వాత పనికిరావు!
- గాయపడిన - హృదయమే బ్రతికి వుంటుంది.



- ప్రేమభావాన్ని కవులు హత్య చేశారు. ఎంత ఎక్కువ రాశారంటే
  ఇప్పుడు ఎవ్వరూ విశ్వసించనంత!
- స్నేహం ఒక సిద్ధాంతం కాదు - అది పవిత్ర సాధన!
- ప్రకృతిలో ఎంతో అందమైన పూలు వున్నాయి.
  కాని చిన్నారులు - అన్నింటి కంటే అందమైన పూలు!
- ఇప్పటి సంస్కృతి అంతా - చదవకూడనిది చదవటం మూలంగా ఏర్పడింది! (ఇప్పుడైతే సినిమాలు)
- జీవితం గొప్ప కళ! అన్ని కళలకు అది కాణాచి!
- సమాజం నిన్ను భయపెడుతుంది-ఒంటరితనం కలవరపెడుతుంది! ఏకాంతం సేద తీరుస్తుంది.
- బాధకు ముసుగులుండవు! దుఃఖాశ్రువులు నిన్ను పునీతం చేస్తాయి.
- వ్యక్తిత్వం బాధలోనే రాటు తేలుతుంది - పుటం పెట్టిన బంగారంలాగా.

Oscar Wilde

- ఆస్కార్ వైల్డ్

# మనుస్మృతి

(ఒక పరిశీలన)

– వేలూరి కృష్ణమూర్తి

సనాతన భారతీయ పరంపరను అవహేళన చేయడం మనుస్మృతిని సమగ్రంగా అధ్యయనం చేయకనే. ఆ గ్రంథం ప్రతులను బహిరంగంగా కాల్చివేస్తే తానొక అభ్యుదయ భావాలున్ననాయకుడని, క్రింది వర్గంవారి ఓట్లు పొంది ఎన్నికలలో గెలువవచ్చునన్న ఒక తప్పుడు అభిప్రాయం వున్నది. ఈ అనిష్ఠకర పరంపరకు నాంది పలికినది ఉత్తర ప్రదేశ్ బహుజన సమాజపక్షం సంస్థాపకులైన కాన్షిరాం. అతని శిష్యురాలైన మాయావతి ఈ పరంపరను తన రాజకీయ లాభాలకోసం కొనసాగించింది. మనుస్మృతిని కాల్చివేసే ఆందోళన యిచ్చిన రాజకీయ బలంతో మాయావతి ఒకటి రెండుమార్లు అధికారం కూడ చేజిక్కించుకొంది. ఎన్నికలు దగ్గరయ్యే సందర్భంలో ఈ పరంపరను కొనసాగించడం, మనుస్మృతి గురించి అవహేళనగా మాట్లాడడం ఎన్నికల సమయంలో ఒక వ్యూహంలా తయారైంది.

వేద సంస్కృతి ఆధారంతో ప్రవర్తించే సనాతన హిందూ ధర్మం అన్ని వర్గాలనూ తనలో యిముడ్చుకొని శతాబ్దాలుగా ముందుకు సాగుతున్నది. హిందూ సమాజంకోసం సంగ్రహింపబడిన ముఖ్య గ్రంథాలంటె స్మృతులు. మన హిందూ సంస్కృతి పరంపరలో నూటికంటే ఎక్కువగా స్మృతులు ఈనాడు మనకు లభిస్తాయి. కాని, వీటిలో మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, పరాశర స్మృతి, విష్ణు స్మృతి, ఆంగీరస స్మృతి, కాత్యాయన స్మృతి, బృహస్పతి స్మృతి, వ్యాస స్మృతి మొదలైనవి ప్రముఖ స్థానం ఆక్రమిస్తాయి. అందులోనూ మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, పరాశర స్మృతులు చాలా ప్రఖ్యాతి గడించాయి. కాని, 'మనుస్మృతి' ప్రఖ్యాతితోపాటు, ఎంతో అపఖ్యాతిని కూడ మూటగట్టుకొని వున్నది.

ఈ 'మనుస్మృతి'లో ధర్మం, అర్థం, కామం మరియు మోక్షం, ఈ నాలుగు పురుషార్థాల వివేచన వున్నది. వీటిలో వర్ణం అలాగే అర్థ వ్యవస్థలు, వర్ణాశ్రమ ధర్మాలు, విశేష/ప్రత్యేక సందర్భాలలో జరపాల్సిన కర్మలు, ప్రాయశ్చిత్త విధులను ఆచరించాల్సిన రీతులు, దండన వ్యవస్థ, మరియు మోక్ష సాధన నిర్ణయాలు వున్నవి. పురాతనమైన మన ఈ స్మృతులు మానవుడి దినినిత్యం ఆచరించాల్సిన విధులకు మార్గదర్శనమిస్తాయి. ఆ కారణం వల్లనే ముఖ్యంగా మనుస్మృతిని 'మానవధర్మశాస్త్ర' మనే పిలవబడుతున్నది. ఒకవ్యక్తి సభ్య సమాజంలో జీవించడానికి, క్రమబద్ధమైన బ్రతుకుకు, ఆడ–మగ సంబంధాలు, శిక్షణ, నడవడి, పెద్దలు–పిల్లల బాధ్యతలు, మూలభూత కర్తవ్యాలు, వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన స్వచ్ఛతలాంటి అత్యవసరమైన అంశాలని ఆనాటి సామాజిక వ్యవస్థ తెలుసుకొన్నది. సమాజం ధర్మయుతంగా నడుచుకొని పోవాలన్నదే దీని ముఖ్యోద్దేశమై వుండేది.

**మను స్మృతిలో వున్న విషయాలు ఏమిటి?** 12 అధ్యాయాలున్న మనుస్మృతిలో 2600 కంటె ఎక్కువ శ్లోకాలు పొంది వున్నది. ఈ స్మృతి రచనా కాలం సుమారుగా 2వ శతాబ్దంలో జరిగివుండవచ్చునని పండితులు నమ్ముతున్నారు. కాలక్రమంలో అనేక విషయాలు ఈ స్మృతిలో చేర్చబడ్డాయని కూడ పండితుల అభిప్రాయం.

**మనుస్మృతిలోని 12 అధ్యాయాలలో వున్న విషయాలు:** బ్రహ్మాండం మరియు మానవుడి సృష్టి. వేదాలు, స్మృతి మరియు ఉత్తమ నడవడీ బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, మరియు శూద్రులు అన్న నాలుగు వర్ణాలు, వారి కర్తవ్యాలు; జీవితంలోని అవస్థలు (బ్రహ్మచర్యం,, గృహస్థ, వానప్రస్థ మరియు సన్యాసం); ఆహారానికి సంబంధించిన చట్టాలు, ఆచరణలు మరియు దైహిక శుచిత్వం, చట్టాలు మరియు న్యాయ వ్యవస్థ; సమాజంలో మహిళల పాత్ర; వివాహ నియమాలు మరియు వంశ పారంపర్యంగా వచ్చిన యితర కట్టడిలు /నియమాలు, వివిధ చట్టాలు; కర్మ మరియు పునర్ జన్మ, తత్త్వశాస్త్రం, ప్రాయశ్చిత్తం మరియు నైతికత, చివరగా ఆధ్యాత్మత లక్ష్యాలు, మోక్షానికి మార్గం, స్థూలంగా ఇవి మనుస్మృతిలో చర్చించిన విషయాలు.

ప్రాచీన భారతీయ సమాజంలో వున్న రాజులు, పరిపాలకులను గురించి మనుస్మృతి తెలుపుతుంది. రాజ

ధర్మం ఏమిటి? పరిపాలకుల కర్తవ్యాలేమిటి? మనుస్మృతి ఈ విషయంగా ఈ రాజులు, పరిపాలకులు నిర్వర్తించాల్సిన కర్తవ్యాలకు ఒక మాదరి తెలుపుతుంది. రాజులు లేక పాలకుల పాత్ర కేవలం రాజధర్మం నిర్వహించడం/పరిపాలన చేయడం గురించి మాత్రమే కాదు. వారు ప్రజల విషయంలో నైతిక, ఆధ్యాత్మిక విలువలను పటిష్ఠపరచి వాటిని కాపాడుకోవాల్సిన సంగతి వారికి తెలియజేయాల్సిన కర్తవ్యం కూడ వున్నది. ప్రజలను అవ్యవస్థనుండి రక్షించి సామాజిక సామరస్యం నెలకొల్పి, శాంతి మరియు మంచినికాపాడడానికి కావల్సిన అధికారం రాజుకు/పరిపాలకుడికి వుండేది. అందువల్ల, రాజు/పరిపాలకుడు పైన తెలిపిన నాలుగు వర్ణాల సామాజిక వ్యవస్థను రక్షించాల్సినవాడు, వారి జీవితాలు, ఆస్తులు మరియు రక్షతను కాపాడడం, చట్టాలను మరియు మంచి వ్యవస్థను కాపాడడం, అపరాధాలను ఆపడం, వ్యాపారస్థుల అలాగే సార్వజనికుల రక్షతను కాపాడడం రాజు ప్రాథమిక కర్తవ్యమని మనుస్మృతిలో చెప్పబడింది. న్యాయయుతమైన మరియు దక్షతతో కూడిన న్యాయాంగ వ్యవస్థ గొప్పతనాన్ని మనుస్మృతి ఎత్తిపడుతుంది. న్యాయం శీఘ్రంగా, నిష్పక్షపాతంగా అందరికీ లభించేలా రాజులు వ్యవస్థ ఏర్పాటుచేయాలని చెబుతుంది మనుస్మృతి. దండన లేదా శిక్ష, సామాజిక వ్యవస్థను కాపాడడానికి వుండే ప్రముఖ సాధనం. మానవ స్వభావం స్వాభావికంగా భ్రష్టాచారానికి గురి అవుతున్నది. శిక్షిస్తారన్న భయం జనులను క్రమశిక్షణతో వుండడం నేర్పుతుంది; వారికి నియోగించబడిన సామాజిక పాత్రలలో వారిని ప్రవృత్తులు కావడానికి సహాయం చేస్తుందని మహర్షి 'మను' నమ్మినట్టు తెలుస్తుంది. తమ ప్రజల రక్షణకోసం వారినుండి పన్నులు సంగ్రహించే అధికారం రాజులు పొంది వుంటారు. పన్నులు కట్టేవాడి సామర్థ్యం అలాగే ఉద్యోగం పరిగణించి పన్నులు విధించాలని మనుస్మృతి తెలుపుతుంది. అలా సంగ్రహించిన పన్నులను ప్రజల బాగుకోసం, కృషి, వ్యాపారం మరియు చేతి వృత్తులను ఉత్తేజపరచడానికి ఉపయోగించాలని కూడ అది తెలుపుతుంది.

రాజుల పరిపాలనలో నైతికత మరియు ధార్మిక తత్త్వాల గొప్పతనాన్ని ఒత్తి చెబుతుంది. రాజు నీతివంతుడై, ప్రామాణికుడై వుండాలని మరియు నిర్ధారింపబడిన నీతి సంహితలను అనుసరించాలని ప్రజలు నిరీక్షిస్తారు. ఆదర్శ రాజ్యాన్ని స్వయం నియంత్రితంగా, శుద్ధంగానూ, నిష్పక్షపాతంగానూ, గౌరవాన్వితమై వుండాలని మనుస్మృతిలో చెప్పబడింది. అలాంటివారు జ్ఞానధనులై వుడాలి, బుద్ధిమంతులై వుండాలి, దృఢంగా వుండాలని కూడ తెలుపుతుంది. ప్రాచీన భారతీయ సమాజాన్ని రూపించడంలో చారిత్రికంగా మహత్త్వపు మరియు ప్రభావశాలి పాత్రను మనుస్మృతి నిర్వహించివున్నా జాతి వ్యవస్థను ఉత్తేజపరిచి నందుకు అలాగే మహిళల మరియు క్రిందిజాతుల విరుద్ధంగా తారతమ్యం చూపే పితృప్రధాన దృష్టికోణం అనుమోదించినందుకు మనుస్మృతి ఎంతగానో విమర్శ ఎందురించాల్సి పడింది. జాతి వ్యవస్థను ఉత్తేజపరచడాన్ని, లింగ అసమానతను కొనసాగించడాన్ని, అలాగే కొన్ని గుంపులకు కఠిన శిక్షలు విధించాలని చెప్పినందుకు మనుస్మృతి వివాదాత్మకమైన గ్రంథంగా పరిగణించ బడింది. ఈ గ్రంథం జాతి వ్యవస్థలో క్రిందిజాతి వారికి కఠిన శిక్ష విధించడంతోపాటు పటిష్ఠమైన జాతి శ్రేణిని సమర్థిస్తుందని చెప్పేవారు ఎందరో వున్నారు. ఇది మాత్రమే కాక మనుస్మృతి మహిళల స్వతంత్రాన్ని దోచుకొన్నదన్నది ఒక వాదం. ఉదా: మహిళ ఎప్పటికీ తన తండ్రి, భర్త లేదా వారి అనంతరం తన కుమారుల అధీనంలో వుండాలని తెలుపుతుందని కొందరు మనుస్మృతిని కఠినంగా విమర్శిస్తారు.

కాని, వాస్తవ స్తితిని గమనిస్తే, జాతి-వ్యవస్థలు కేవలం హిందూ సమాజంలో మాత్రమే వున్న పద్ధతి కాదు. ఇస్లాం, క్రిస్టియన్ మరియు బౌద్ధ మతాలలోనూ వున్నది. మంచి-చెడ్డ, ఉత్తమం-అధమం తారతమ్యం అన్ని మతాలలోనూ వున్నది. అలా చూస్తే, హిందూ ధర్మంలో వున్నదానికంటె ఇతర మతాలలో ఎక్కువగానే వున్నదని చెప్పవచ్చు. కాని, దూషించడానికి హిందూ ధర్మాన్ని కొందరు ఎక్కువగా ఉపయోగించుకొంటారు. కొద్ది సంవత్సరాల క్రితం 'బి.బి.సి' రేడియో చానల్ మనుస్మృతిలో చెప్పబడినదని తెలిపి ఈ విషయంపై పెద్ద కార్యక్రమమే (Seminar) చేసిన సంగతి ఇక్కడ జ్ఞాపకం చేసుకోవచ్చు, అధికారం లేక చట్టాలు చేసి దండించే స్థానంలో వున్నది

మనకు గోచరం కాదు. బ్రాహ్మణులు ఆర్థికంగానూ, రాజకీయంగానూ ఎపుడుగాని శక్తివంతులుగా వుండలేదు. బ్రాహ్మణుడు ఎప్పటికీ బ్రాహ్మణుడుగానే వుండిపోయాడు. ఇంకా వెనుకకు వెళ్ళి గమనిస్తే ఈ స్మృతి గ్రంథం రచించాడని చెప్పే మనువు ఏ జాతికి చెందిన వాడన్న సంగతి గురించి తగిన ఆధారాలు లేవు. బ్రాహ్మణులకు 'గాయత్రీ మంత్రం' ప్రసాదించిన విశ్వామిత్ర మహర్షి ఒకప్పుడు క్షత్రియుడైవున్నందున సంగతి గమనించినపుడు సమాజానికి ఒక వ్యవస్థను రూపించి యిచ్చిన మనువు బ్రాహ్మణుడై వుండాల్సిన పనిలేదు. అలా చూస్తే మనుస్మృతి లోని 2600 శ్లోకాలలో ఎక్కువ భాగం శ్లోకాలు పైవర్గం వారై వుండవచ్చునని తలచే వారికి, అధికార స్థానంలో వున్నవారికి, నియమాలు ఉల్లంఘిస్తే వారికి కఠినమైన శిక్ష యివ్వాలని కూడ మనువు చెప్పి వున్నాడు.

ఇక 'మానవధర్మ శాస్త్రం' కేవలం మనువు ఒక్కడే రచించాడని చెప్పడానికి లేదు. అనేకమంది జ్ఞానులు కలిసి సమిష్టి దృష్టితో ఈ నీతిశాస్త్ర గ్రంథం రచించివుండవచ్చు. దాని నాయకత్వాన్ని 'మను' అన్న ఒక ఋషి నిర్వహించినందున దానికి 'మనుస్మృతి' అన్న పేరు వుండే సాధ్యత కూడ వున్నది. మన రాజ్యాంగం రచనకు ఒక సమితి రచింపబడి వుండేది. ఆ సమితికి డా. అంబేద్కర్ అధ్యక్షుడిగా వుండి రాజ్యాంగం రచన కార్య వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించినందున సామాన్యంగా అందరూ ఇది అంబేద్కర్ రచించిన రాజ్యాంగమని అంటారు కదా? అదే విధంగా ఈ స్మృతిని కూడ మనుస్మృతి అని పిలిచి వుండవచ్చు.

ఇక 'న స్త్రీ స్వాతంత్ర మర్హతి,' అన్న మాటలు మనుస్మృతిలో చేర్చి వున్నారనే వారికి 'యత్ర నార్యస్తు పూజ్యతే రమంతే తత్ర దేవతాః' అన్న శ్లోకం అదే మనుస్మృతిలో వున్నది అలాంటి వారికి అర్థం కాదు. లేదా ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, మరియు పాకిస్తాన్‌లాంటి యితర దేశాలలోని ధర్మాలలో/మతాలలో మూలభూతవాదులు మహిళలను యిప్పటికీ ఎలా చూసుకొంటున్నారన్నది వీరి గమనానికి రాదు. వారికి తాలిబాన్ వ్యవస్థ, ఐఎస్ఐ (ISI) మొదలైన సంఘటనలు మహిళలతో నడుచుకొంటున్నరీతి సరి అనిపిస్తుంది. భారత దేశంలో వున్న 'త్రివళి తలాక్,' వద్ధతి సరిగానే వున్నదనిపిస్తుంది. మనుస్మృతిని ప్రతిష్ఠాపించిన దేశంలో ఇపుడు ప్రతి ఒక క్షేత్రంలోనూ మహిళలు సాధిస్తున్నది వీరి గమనానికి వచ్చినట్టు లేదు. ఒక విషయం మాత్రం నిర్ణాయకంగా చెప్పవచ్చు మహిళలకు భారతీయ సనాతన సంస్కృతి యిచ్చిన మర్యాదను యింకే సంస్కృతి కూడ యివ్వలేదు.

సమకాలీన హిందూ ధర్మం సార్వత్రికంగా మనుస్మృతిని అనుసరించడం లేదు. అనేకమంది ఆధునిక హిందూ మేధావంతులు దానిలోని వివాదాస్మకమైన సంగతుల నుండి అంతరం కాపాడుకొని వస్తున్నారు. మనుస్మృతి పరంగా మాట్లాడితే మనం సమాజంలో విలన్లు అవుతామన్న భావన ఈ పండితులకు వున్నట్టు వున్నది. అదే ఇంకొకవైపు ఇప్పటి కాలానికి అప్రస్తుతమైనా 'మనుస్మృతిని' చిన్నబుచ్చితే లేదాదాని ప్రతిని బహిరంగంగా కాల్చివేస్తే ప్రగతిపరులనిపించుకొని రాజకీయంలో పెరగవచ్చునన్న వాతావరణం సృష్టింపబడింది. మనుస్మృతి అవశ్యకత దాని కాలానికి పరిమితమైనదని కొందరు వాదిస్తే, 'సమాజ పరమైన రచనలు మరియు అలవాట్లపై మనుస్మృతి ప్రభావం యిప్పటికీ వున్నదని మరికొందరి వాదం. మనుస్మృతిని అర్థం చేసుకోవడానికి ఒక చరిత్ర దృష్టికోణం వుండాలి. ప్రస్తుత సందర్భంలో మనుస్మృతిని విశ్లేషించేటపుడు దానిని రచించినప్పటి కాలానికి వెళ్ళి గమనించడం ముఖ్యమవుతుంది. సనాతన ధార్మికత, సార్వకాలీనమైన చట్టం లేదా న్యాయ వ్యవస్థ, వేద కాలపు ఇతిహాసం అలాగే జగత్తు మెచ్చుకొన్న మన భారతీయుల పురాతన తత్త్వ శాస్త్రాలను గురించి ఆసక్తి పొందివున్న వారికి మనుస్మృతి ఈనాటికీ ఆధార గ్రంథంగా సహాయపడుతుంది. విచిత్రమంటె జిహాది మనస్థితిని అనుసరించే అన్య సంస్కృతుల గ్రంథాలు మనలో కొందరికి స్వీకారార్హం, మరియు వాటిని స్తుతిస్తారు. కాని, సమాజంలో క్రమశిక్షణను రూపించే, అలాగే సమాజ మర్యాదంటే ఏమిటని ప్రపంచానికి నేర్పిన సార్వకాలికమైన లోకహితం దృష్టిలో ఉపదేశమిచ్చే మనదైన స్మృతి గ్రంథాలన్న జ్ఞాన సంపద యిలాంటివారికి రుచించదు. ఇలాంటి మనోస్థితి వున్నవారిని మనమేం చేయగలం!

**వేలూరి కృష్ణమూర్తి**
రచయిత - అనువాదకులు
మైసూర్, ఫోన్ : 9448977877

గాంధీ ఆశ్రమంలో

# మీరాబెహెన్



గాంధి - మీరాబెహెన్

– బి.వి. రామిరెడ్డి

మీరాబెహెన్ అసలు పేరు మాడెలిన్ స్లేడ్. ఆమె తండ్రి ఇంగ్లీష్ అడ్మిరల్. ఆయన హిందూమహాసముద్రంలో బ్రిటీషు నావికాదళానికి అధిపతి. ఆమె తన కుటుంబం నుంచి, తన సోషల్ సర్కిల్ నుంచి విడిపోయి కళకు అంకితమయింది. లండన్‌లో కళాకారుల కోసం సంగీత సభలను నిర్వహించింది. తరువాత 1923 అక్టోబరులో రోమన్ రోలండును కలుసుకుని తన పరిస్థితిని వివరించి, ఆయన సలహా సహకారాలతో ఇండియాకు వచ్చి సబర్మతి ఆశ్రమంలో గాంధీ శిష్యురాలిగా చేరింది. రోమన్ రోలండ్‌కి రాస్తూ ఆమె 'నేను ఊహించనంత దివ్యంగా వున్నారు బాపు. నేనొక ప్రవక్తను కలుసుకోబోతున్నాననుకొన్నాను, కాని ఒక దేవతని కలుసుకున్నాను' అని వ్రాసింది. ఆమె గాంధి ప్రియ శిష్యురాలిగా, అంతేవాసిగా జీవించింది. గాంధీ, రోమెన్ రోలండ్ మధ్య సంవత్సరాల తరబడి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో రోలండ్ ఉత్తరాలను గాంధీకి అనువదించి వివరించేది. ఆవిధంగా ఆ మహాత్ములిద్దరికి అనుసంధానకర్తగా పనిచేసింది. ఎంత గొప్ప నిధిని నాకోసం పంపించారు! మీరు నా మీద ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. ఆమె ప్రాచ్య పాశ్చాత్యాల మధ్య అనుసంధానకర్తగా అయ్యేందుకు నా శాయశక్తులా దోహదపడతాను. ఆమె నాకు శిష్యురాలిగాకంటే సహ శోధకురాలిగా భావిస్తాను. ఆమె ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అద్భుతంగా తనని మార్చుకుంది' అని గాంధీ రోలండ్‌కు రాసిన ఉత్తరంలో పేర్కొన్నారు.

రోమెన్ రోలండ్ గొప్ప రచయిత, ఫిలాసఫర్, కళాభిమాని. యూరోప్‌కు గాంధీని, గాంధీ సిద్ధాంతాలనీ, గాంధీ ఉద్యమాన్నీ పరిచయం చేసినవాడు. యూరోప్ పరిణామాలని, గాంధీ ఉద్యమాన్నీ దగ్గరగా సునిశిత పరిశీలన చేసినవాడు. యూరోపియన్ మానవతావాదులకు గాంధీ ప్రత్యేకతని పరిచయం చేసినవాడు అతనే. గాంధీని కలుసుకోవాలనీ, ఆయనతో చర్చలు జరపాలనీ రోలండ్ ఆకాంక్ష. కాని, ఇండియాలో క్షణం తీరికిలేకుండా బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీ సాగిస్తున్న స్వాతంత్ర్య పోరాటంవల్ల అది సాధ్యపడలేదు. పోనీ తనే గాంధీని కలవడానికి ఇండియా రావడానికి అక్కడి యూరోపియన్ పరిస్థితులూ, తన ఆరోగ్యమూ సహకరించలేదు. చివరికి ఎన్నో సంవత్సరాల నిరీక్షణ అనంతరం, 1931 సెప్టెంబరు నెలలో బ్రిటీషు ప్రభుత్వం ఆహ్వానం మేరకు, రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యేందుకు గాంధీ లండన్ వెళ్ళవలసి వచ్చింది. ఆ అవకాశాన్ని పురస్కరించుకుని రోలండ్‌ని కలిసి, వారితో ఒకవారం చర్చల్లో గడిపేందుకు గాంధీ నిర్ణయించుకున్నారు. రోలండ్‌తో ఆయన అతిథిగా విల్లిన్యూవ్‌లో ఉన్నప్పుడు గాంధీ ఇటలీ, రోమ్, వాటికన్ సిటీలను సందర్శించాలనుకున్నారు. అందుకు తగిన ఏర్పాట్లను రోలండ్, ఆయన సోదరి మేడలిన్ చూసుకున్నారు. డిసెంబరు 10న గాంధీ జెనీవాలోని విక్టోరియా హాల్‌లో ప్రసంగించేందుకు తన కార్యదర్శులు మహదేవ్ దేశాయ్, ప్యారేలాల్ మేడలిన్ రోలండ్‌తో కలిసి వెళ్లారు. గాంధీ అక్కడ ఉన్నన్నిరోజులూ ఆరోగ్య కారణాలవల్ల రోలండ్ బయటికి వెళ్లలేదు. గాంధీ జెనీవా ఉపన్యాసానికి వెళ్లినపుడు మీరాబెహన్‌ను రోలండ్ దగ్గర వదిలి వెళ్లారు. అప్పుడు మీరా (మేడలిన్ స్లేడ్) రోలండ్‌కు సబర్మతి ఆశ్రమం గురించి వివరించింది. అందరిలాగానే ఆశ్రమంలో తను గాంధీకి గొప్ప అభిమానురాలుగా మసలుకుంది. గాంధీ గారు ఎంత సున్నితంగా వుంటారో, కొన్ని సందర్భాల్లో అంత కఠినంగాను ఉంటారు. తనతో అత్యంత సన్నిహితంగా వున్న వారినించి గాంధీ ఎక్కువ ఆశిస్తారు. వారిమీద ఆయన సడలింపులు లేని క్రమశిక్షణలో ఉంచుతారు. వారి ఆలోచనలను, పనులను నిశితంగా పరిశీలిస్తారు. దురాలోచనలు చేసేవాళ్ల విషయంలో అత్యంత నిర్దాక్షిణ్యంగా ఉంటారు. ఆయన ఎవర్నీ విషయాన్ని

ఒప్పుకోమని అడగనక్కరలేదు. వారి మనసుల్ని, ఆలోచనల్ని ఆయన చదువగలరు. ఆయన వారి అంతరాత్మలను చీల్చి చూడగలరు. ఆశ్రమం నిండా ఎన్నో కుటుంబాలు, ఎందరో మనుషులు, అందుకని ఎన్నో సమస్యలు. అంతులేని సంఘర్షణలు, ఘర్షణలు, వాటన్నిటిని బాపు స్థిరత్వంతో, మౌనంతో పరిష్కరిస్తుంటారు. వారంతా నీతివంతంగా జీవించేవారే. అందుకని ఆశ్రమం అంతటా అత్యున్నతమైన పవిత్రత ఆవరించుకుని ఉంటుంది. గాంధీ కుటుంబం కూడ ఆయనకు సంపూర్ణమైన సంతృప్తినీయలేదు. ఆయన నలుగురు కుమారుల్లో ఒకరు ధైర్యంగా ఆయన్ని వొదిలేసి పతనమార్గంలోకి వెళ్ళిపోయాడు. 'దేవదాస్' మాత్రం ఆయన్ని నీడలా అనుసరిస్తుంటాడు. తన తండ్రి యొక్క ఉన్నతపథం తనకి సంపూర్ణంగా అవగతమైనట్లుకనపడదు. మూడో కుమారుడు చాలా చిన్నవాడు. నాలుగోవాడు తండ్రి అడుగుజాడల్లో, సౌతాఫ్రికాలోని ఫీనిక్స్ ఆశ్రమంలో పనిచేశాడు. అతనిలో ప్రత్యేకత ఏమీ లేదు. శ్రీమతి కస్తూర్బా గాంధి విశ్వాసపాత్రురాలైన భార్య. ఆమె తన భర్త యొక్క పవిత్ర ఉద్యమానికి తనని అంకితం చేసుకుంది. భర్త జైలులో ఉన్నప్పుడు, ఆయన ఆజ్ఞానుసారం కర్తవ్య నిర్వహణ చేస్తుంది. ఒకటి రెండు సభల్లో ప్రసంగించింది. ఆమె గొప్ప గృహిణి. గాంధీ రాత్రింబవళ్లు ప్రజా ఉద్యమాల్లో మునిగి తేలుతుంటాడు. ఆయన ఎలాంటి షో చేయకుండానే వొంటరిగా తన పని తాను చేసుకు పోతుంటాడు. మీరు ఆయన్ని ఎప్పుడైనా, ఈ గందరగోళ సందర్భాల్లో మీకు ధ్యానం చేసుకోవడం ఎలా సాధ్యపడుతుంది అని అడిగితే 'ధ్యానానికి అత్యున్నతమైన సమయం వేలాది ప్రజల మధ్య ఉన్నపుడే' అని సమాధానమిస్తారు. ఆ విషయంలో ఆయన సంపూర్ణమైన విజయాన్ని సాధించారనిపిస్తుంది. కస్తూర్బా ఎక్కువ సమయం వంటింట్లోనే గడుపుతుంది. ఆవిడ తిరుగులేని అధికారం అక్కడే. ఆశ్రమంలో చేరిన తొలిరోజుల్లో, తను వంట చేసుకునేందుకు వంట గదిలోకి వెడితే అక్కడ వంట కవసరమైనవేవీ కనిపించేవి కావు. ఆమె ఆశ్రమం వొదిలేసి పోయేట్టు చేయడానికి జరిగిన ప్రయత్నమన్నమాట. అప్పుడు గాంధీ కల్పించుకుని, 'ఇది భరించరాని విషయం – అందుకని నీవంట పనుల్ని నీ గదిలోనే చేసుకో' అని చెప్పారు. అందువల్ల మీరా ఎలాంటి కోపాన్ని, బాధని మనసులో పెట్టుకోలేదు. కస్తూర్బాను ద్వేషించలేదు. ఆమెది చిన్న పిల్లల స్వభావం. తరువాత ఆమె మనసు మార్చుకుంది. ఒక్కోసారి కస్తూర్బా ఆజ్ఞలు జారీ చేస్తుండేది. అయితే అందుకు ఎవరూ పట్టించుకునేవారు కాదు. అయినప్పటికీ ఆమె గొప్ప గౌరవనీయురాలైన స్త్రీ. మీరాలోని నిస్వార్థత, నిజాయితి స్వచ్ఛమైన వ్యక్తిత్వం వల్ల ఆమె మీరాకు మంచి మిత్రురాలిగా మారిపోయింది. ఆవిధంగా ఆశ్రమంలోని సమస్యలన్నిటినీ ఎదుర్కొని, ఎలాంటి అడ్డుతెరలు లేకుండా అన్నిటిని అధిగమించింది. గాంధీ తన ఆశ్రమంలో చేరిన వారినందరినీ పరీక్షించే వారు. అందులో మొదటి పరీక్ష లెటిరిన్‌లను శుభ్రం చేయడం. గాంధీ తనను ప్రేమతో కఠిన పరీక్షలు చేశారని చెప్పుకుంది. ఒక్కోసారి గ్రామాల్లో సామాన్య ప్రజలకు బోధిస్తూ చరఖాతో దారం తీయడాన్ని నేర్పిస్తూ, వొంటరిగా ఉండవలసి వచ్చేది. అయితే ఇన్ని పనుల్లోను ఎప్పుడూ ఆమె వొత్తిడినిగాని, ఎలాంటి బెంగల్ని గాని ఫీలవలేదు. ఆమె భారతదేశాన్ని తన కర్మభూమిగానే భావించింది. ఆమె జేజి రష్యన్. ఆమె బ్రిటీషు వ్యక్తిని వివాహ మాడింది. అందుకే ఆమె ఇండియాలోని పల్లెల్లో నివసించే వ్యవసాయదారులతో కలిసిపోయేది. వారు ఆమెతో ఎలాంటి భేదాలు లేకుండా కలిసిపోయేవారు. ఆమె వారిని దయతో పలకరించేది. వారు ఆమెను తమ కుటుంబ సభ్యురాలిగా చూసేవారు. ముస్లింలతో అలా కలిసిపోలేకపోయినా వారిలో కొందరు ఆమెకు మంచి స్నేహితులుగా ఉండేవారు.

గాంధీగారి ఆశ్రమంలో కేవలం మనుషులే కాదు, అడవి ప్రాణులకు స్థానం ఉండేది. ఆశ్రమంలో ఎలాంటి ప్రాణుల్ని కూడా చంపడానికి వీల్లేదు. అదొక కణ్వాశ్రమంలా వుండేది. అవి ఆశ్రమం బైట, లోపలా సంచరిస్తుండేవి. మీరా గదిలో రకరకాల సైజుల్లో వున్న చీమలు బారులుగా సంచరిస్తూ ఆమె భోజనంలో కొంతభాగాన్ని తామూ తినేస్తూ వుండేవి. ఆమె గదిగోడల మీద బల్లులు, పెద్ద సాలీళ్లు, విషపూరితమైనవి తిరుగుతూ ఉండేవి. విషపూరితమైన పాములు ఎప్పుడూ వస్తూపోతూ వుండేవి. వాటికీ, ఆశ్రమవాసులకీ మధ్య ఏదో రహస్య ఒప్పందం వున్నట్టనిపించేది. అవి ఎవ్వరికీ హాని కలిగించేవి కావు. చీకట్లో చూడక వాటిమీద కాలు పెడితే ఇబ్బంది అవుతుందని మీరా ఎప్పుడు చీకట్లో బైటికి వెళ్లవలసి వచ్చినా లాంతరు తీసుకెళ్లేది. ఆమె ఎప్పుడూ పెద్ద ప్రమాదకరమైన పాము తన గుమ్మంలోంచి వెళ్లడం చూస్తుండేది. ఎలాంటి ప్రమాదాలు ఆశ్రమంలో జరిగేవికావు. ఎప్పుడూ గాంధీ గారి ఆశ్రమంలోని మందుల బీరువాలో పాము విషాన్ని నివారించే మందులుండేవి కావు. అయితే ఎవరయినా అలాంటి

మందుల్ని ఉంచుకున్నా, వాడినా ఆయనేమీ అడ్డు చెప్పేవాడు కాదు. పొరపాటున ఎప్పుడైనా పాము కాటువేస్తే, వేసినచోట క్రాస్ గుర్తులాంటి చిన్న గాయం చేసి అక్కడొక రకమైన పదార్థాన్ని వేయమని చెప్పేవారు. అదేదో, ఎర్రరంగులో ఉండేది. దానిమీద బురదమట్టిని అతికించమనేవారు. ఆపైన కట్టు కడితే సరిపోతుంది. అయితే కొన్ని విషతుల్యమైన పాములు, ముఖ్యంగా త్రాచుపాములు కాటువేస్తే పదినిముషాల్లో ప్రాణాపాయం సంభవిస్తుంది. గాంధిగారి శిష్యులు దేవుడిమీద భారం వేసి ఆయన దయమీద ఆధారపడేవారు.

జంతువులతో, ప్రాణులతో, పక్షులతో మరొక రకమైన సంతోషకరమైన సంబంధం ఏమిటంటే, కొన్ని రకాల పక్షులుండేవి. అవి గాంధీగారి, మీరా తలలమీద, భుజాలమీద వాలుతుండేవి. ఆనందించేవి. ఆనందింప జేసేది. మీరా యూరోపుకు వెళ్లినపుడు, ఆ మహానగరాలలో ఇవేవీ కనుపించక శూన్యంగా అనిపించేది. ఏదైనా వ్యాధి యూరోపును ఆవరించి మిలియన్ల కొద్దీ వున్న ప్రాణులను లేకుండా చేస్తే ప్రపంచానికి సంతోషాన్ని కలిగించడానికి ఎవరుంటారు? ఇండియాకు తిరిగి వెళ్లిపోవడమే మీరాకు ఆనందం. ఆమె ఇంగ్లండుకు వచ్చినా ఆమెకిక్కడ ఏమీ తోచదు. ఈదేశంతో ఆమెకు ఎలాంటి అనుబంధమూ లేదు. రోలండ్ ద్వారా ఆమె గాంధీని తెలుసుకుంది. అందుకామె రోలండ్‌కు ఎంతో కృతజ్ఞతను చూపుతుంది.

**బి.వి. రామిరెడ్డి**
ఇంగ్లీష్ లెక్చరర్ (రిటైర్డ్) సిద్ధార్థ కాలేజ్,
విజయవాడ, ఫోన్ : 9908856530.

## కమ్మతెమ్మెర

***మిసిమి*** *సంపాదక బృందానికి సమస్కారం!*

*నిజానికి...* ***మిసిమి*** *సంచిక మొదటి పేజీ నిదానంగా చదివి పక్కన పెట్టాల్సినది కాదు, అవసరమైతే కత్తిరించి దాచుకోదగినది. సంపాదకీయాలకన్నా అమితంగా...మాములు వచనానికి మించి..ఒక విధమైన ప్రత్యేకమైన దృష్టితో, శ్రద్ధతో కాలస్పృహతో రాస్తున్నవవి. మ్యూజింగ్స్ మాదిరి...పక్కనే కూర్చుని కబుర్లు చెప్తున్నంత హాయిగా ఉంటున్నాయి. సహృదయుని ప్రేమలేఖల్లా... ఇందులో వచన శైలి చాలా ఆత్మీయంగా ఉంటుంది. 'ఒక్కడు పాల్కురికి సోమన'.. మరీ పరీక్షగా తడిమి చూశాను... ఔను! పాల్కురికి సోమనే! నాచన సోమన కాదు. వీరశైవం.. పాల్కురికి దృష్టికోణం.. గంగిశెట్టి పరిశీలనాత్మక విమర్శనం.. చదివి ఆనందించాను. పరిశోధనాత్మక వ్యాసం అంటే ఇదీ! అనే ధీమాతో మళ్లీ మళ్లీ చదివాను. ఎందుకో మరి ఈసారి విశిష్ట వ్యక్తుల ఆత్మీయ సంభాషణలు లేవు. ఐనా ఇబ్బందేమీలేదు.. సారభూతమైన లఘు వ్యాసాలతో నిండుగా ఉందీ సంచిక. ఔను చెప్పడం మరిచాను. గత రెండు సంచికల్లో ద్వారం దుర్గా ప్రసాదరావుతో పెట్టిన ముచ్చట ఐతే... ఆ సంభాషణ ప్రవాహానికీ, ఆ సంగీత ప్రపంచ ప్రచండ వేగానికి తట్టుకోలేకపోయాను. మనకు తెలిసీ తెలియని సంగీతం గురించి అంత గంభీరమైన ఉపన్యాసం చదువుకున్నాక... ఆయన అపారమైన పాండితీ వైభవానికి ఎంతో ముచ్చటేసింది. రెండు చేతులూ జోడించాను. అంతకుముందటి సంచికలో 'వేయి స్తంభాల వేదిక.. స్వాతి వార పత్రిక'లో ఒకానొక కాలపు వైభవాన్ని కళ్లముందు నిలబెట్టారు. వేమూరి వారు ఎప్పుడైనా దారిలో కనిపిస్తే కచ్చితంగా అడగాలి అనుకున్న ప్రశ్నలన్నింటికి వివరణాత్మక సమాధానాలందించారు. చదివాక చాలా కృతజ్ఞతతో నిండిపోయింది మనసు. మధురవాణి పలుకులు విభిన్నమైన, విలక్షణమైన అంశంతో పలకరించడం, గహనమైన విషయాలెన్నింటినో ఎరుకలోకి తెచ్చే 'ఉపనిషత్ ఉద్యానవనం'. పరువము కోల్పోని, వాసన సెడని తెలుగు లలిత సంగీత పరిమళవనం... పరిశోధక విద్యార్థుల సవివరణాత్మక, సరికొత్త ప్రతిపాదనలతో కూడిన సాహిత్య వ్యాసాల ఉత్పల సరోవరం... సగిలి సుధారాణి.. తెలుగు సంస్థానాల కథావళి... అన్నీ సాంద్రతరమైన విషయాలే! వేటినీ చదవకుండా విడిచిపెట్టలేం. ఒకప్పటి* ***మిసిమి****...కాదిది! చాలా మారింది. కాలానికి తగినట్టు.. ఎప్పటికప్పుడు సరికొత్త ఋతుశోభతో...సమకాలీన సాహిత్య చింతనాత్మక రసవాహిణితో.. కొత్త పాతల మేలుకలయికతో... కొత్త జీవశక్తిని నింపుకున్నట్టు..* ***మిసిమి*** *నడక కొత్తగా ఉంది.* ***మిసిమి*** *క్రమపరిణామ వికాసం కనిపిస్తోంది. మళ్లీ మళ్లీ చదువుకునేందుకు... కొంత వయసొచ్చాక తెరచి చదువుకునేందుకు, కొంత భావ పరిణతి పొందాక మళ్లీ తీసి చదివేందుకు... ఆలోచించేదుకు, అర్థం చేసుకునేందుకు...అప్పటి వరకూ ఈ సంచికలు దాచి ఉంచుతాను. ఒక్కమాటలో చెప్పాలంటే...నేను ఇంకా పెద్దవాణ్ణయ్యాక చదువుదామని దాచిపెట్టుకున్న పుస్తకాల పక్కన ఈ* ***మిసిమి*** *కూడా లేకపోతే నేను చాలా నష్టపోతాను.*




***- కన్నీడి మనోహర్ (సాహితీసుధ)***

# ప్రాచీన వచన రచనలు - భాష

- డా. కొల్లేటి రవిబాబు

**పరిచయం :** మానవ భాషోత్పత్తి వికాస క్రమంలో మొదటి దశ నోటి మాట; రెండవది చేతి రాత. " భాష్యతే ఇతి భాషా" అన్నది ప్రసిద్ధ నానుడి. అంటే, భాషించేదే/ మాట్లాడేదే భాష. మాట పుట్టిన 50 వేల సంవత్సరాల తర్వాత లిపి పుట్టిందన్నది లిపి పరిశోధకుల వాదం. ప్రపంచ సాహిత్యంలో పద్యము, గద్యము అనే రెండు శాఖలున్నాయి. సంస్కృత కావ్య పురాణేతిహాసాలు పద్యంలోనే ఉన్నాయి. రూపక భేదమైన దృశ్యకావ్యం గద్యపద్యాత్మకంగా ఉంటుంది. ఆ తరువాత, సంస్కృతంలో భోజుడు చంపూ కావ్యంగా రామాయణం రచించాడు. ఇది చాలా అరుదైన సంఘటన. ఇక తెలుగులో ఆదికావ్యమైన ఆంధ్ర మహాభారతం గద్య పద్యాత్మకమైన చంపూ రచనగా వెలసింది. తిక్కన నిర్వచనోత్తర రామాయణం, ఆ తరువాత వచ్చిన శతక రచనలు, లక్షణ గ్రంథాలు పద్యాత్మకంగా ఉన్నాయి. ప్రాచీన తెలుగు శాసనాల్లోని చంపూ రచన, తెలుగు సాహిత్యంలో ఈ రకమైన ఒరవడికి దారి చూపింది. ఛందో రహితమైన కావ్య రచనకు సంస్కృతంలో గద్య మని పేరు. దండి మహా కవి దశకుమార చరిత్ర, బాణభట్టు కాదంబరి, మొదలైనవి దీనికి ఉదాహరణలు. కాని, తెలుగులో ఛందో రహితమైన వాక్య రచనకు గద్యము, వచనము అని రెండు పేర్లున్నాయి. కావ్య గతమైన రచనను వచనమని, ఆశ్వాసాంతాల్లో గద్యమని వ్యవహరించడం తెలుగులో పరిపాటి. కన్నడ సాహిత్యంలో బసవేశ్వరుడు, అక్కమహాదేవి, దేవర దాసమయ్య మొదలైనవారు పేరొన్న 'వచనమనే మాటను, తొలి తెలుగు కవులు స్వీకరించి ఉండవచ్చు. చందోదర్పణ కర్త అనంతా మాత్యుడు మొదలైన వారు 'వచనం' అనే మాటను తెలుగులో స్థిర పరచారు. దీనిని బట్టి తెలుగులో వచనము, గద్యము అనే మాటలు సమానర్థకాలని తెలుస్తుంది.

వచనం భాషా వ్యవహర్తలందరికీ సుబోధకంగా ఉంటుంది. వచనం రాయడానికి కూడా సులువుగా ఉంటుంది. దీని ప్రయోజనం అపరిమితం. అన్నిరకాల సాహిత్య రచనలకు అనువుగా ఉంటుంది. నోటి మాటకు లిఖిత రూపమే వచనం.

**వచన రచనల్లో భాష:** తెలుగు వచనాన్ని పరిణామ క్రమంగా తెలుసుకోవాలంటే అందుకు మూడు రకాలయిన ఆకరాలను పరిశీలించాలి.

1. ప్రాచీన తెలుగు శాసనాలు 2. తెలుగులోని చంపూ రచనలు 3. కేవల వచన రచనలు. ఈ మూడు రకాల వచన రచనను సోదాహరణంగా పరిశీలాద్దాం.

**1. ప్రాచీన తెలుగు శాసనాలు - వచన రచన :** క్రీ.శ. 6,7 శతాబ్దుల నాటి శాసనాలలో రేనాటి చోళుల శాసనాలు ప్రధానమైనవి. వీరి శాసనాలలో తెలుగు వచనం కన్పిస్తుంది. మనకు దొరికిన శాసనాల్లో గద్య శాసనాలే మొదటివి. వీటిలోని భాష చాలా ప్రాథమిక దశలో ఉంది. ఈ శాసనాల్లోని భాష తమిళ, కన్నడ భాషా రూపాలకు సన్నిహితంగా ఉంది. పదాల మధ్య సంబంధాన్ని తెలిపే కారక, ప్రత్య యాది రూపాలు నాటి భాషలో రెండు, మూడు మాత్రమే కన్పిస్తున్నాయి. క్రియా రూపాలకు బదులుగా క్రియా జన్య విశేషణాలను వాడడం నాటి వచనంలోని ప్రత్యేక లక్షణం. క్రీ . శ. 7వ శతాబ్దికి చెందిన చోళమహారాజు ఉరుటూరు శాసనంలో (..) దీనికి వక్రంబు వచ్చిన వారు పంచ మహాపాతక అగు ఇది కేవలం వచన రచనలో ఉత్పత్తి దశ అని చెప్పవచ్చు. రేనాటి చోళుల తర్వాత చాళుక్య రాజుల శాసనాల్లో తెలుగు వచనం ఉత్తమ స్థాయికి చేరుకొంది. క్రీ.శ. 9వ శతాబ్దికి చెందిన చాళుక్య భీముని కొరవి శాసనాన్ని ప్రముఖంగా పేర్కొనాలి.

**"శ్రీ విక్రమాదిత్య నృపాగ్ర తన యుం డయిన .. .. నీవు నా ప్రాణ సమా నుండ వయిన చెలివి"**

ఈ శాసనంలోని వాక్య విన్యాసం సర్వ లక్షణ సమన్వితంగా ఉంది. నన్నయ భారత రచనకు పూర్వమే తెలుగు భాష కావ్య నిర్మాణ యోగ్యంగా ఉన్నదని చెప్పడానికి 9 వ శతాబ్దిలోని తెలుగు శాసనాలే సాక్ష్యం. ఈ శాసనాల్లో ప్రాకృత పదాలను వాడలేదు. కొన్నిచోట్ల సమాపక క్రియలను ప్రయోగించనందున, వాక్య నిర్మాణం సంపూర్ణంగా కన్పించదు. శకట రేఫం (ఱ), 'ణ' ను 'న' కు బదులుగా వాడడం కన్పిస్తుంది. అరుదుగా మూల ద్రావిడ ధ్వని రూపమైన (య) .. కన్పిస్తుంది.

ఆ తరువాత కాకతీయుల శాసనాలు, రేచర్ల పాలకుల శాసనాలు, రెడ్డి రాజులు వేయించిన శాసనాలు, విజయనగర ప్రభువుల శాసనాలు, తెలుగు వచనంలో సంపూర్ణతను, సమగ్రతను కలిగి ఉన్నాయి. విజయనగర రాజుల కాలం నాటి శాసనాలలో అన్య దేశ్యాలు/ ఇతర

భాషా పదాలు ముఖ్యంగా పర్షియన్, ఉర్దూ భాషా పదాలు అనేకం కన్పిస్తున్నాయి. వీటిలోని భాష వ్యావహారిక శైలిలో ఉంది. తెలుగు వ్యావహారిక రూపాలకు విజయనగర రాజుల శాసనాలే మొదటివి.

**అన్య భాషా పదాలు :** ఉదా : మామూలు, దివాణము, రొఖ్ఖము, మక్తా, ఖరీదు, కుంపునీ, వోలంద, పరంగి మొదలైన రూపాలు.

**2. చంపూ రచనలు – వచన రచన :** క్రీ.శ. 10వ శతాబ్దిలో సంస్కృతంలోనే కాక ఇతర దేశ భాషల్లో కూడా పద్య గద్యాత్మకమైన చంపూ రచన హృద్య రచనగా ప్రసిద్ధి కెక్కింది. **"గద్య పద్యమయం కావ్యం చంపూ రిత్యాభి ధీయతే"** అన్నది చంపూ నిర్వచనం. ఈ కారణాలవల్ల నన్నయ భారత రచన చంపూ శైలినే అనుసరించింది. నన్నయ భారతంలో రెండు పాళ్లు పద్యమైతే, ఒక పాలు వచనం కన్పిస్తుంది. నన్నయ భారతంలో 1431 వచనాలున్నాయని పరిశోధకులు లెక్క కట్టారు. నన్నయ వచనాన్ని కొన్ని ప్రత్యేక సందర్భాలలో రచించాడు. అని, రాజ వంశాను క్రమణికలను చెప్ప వలసినప్పుడు, ప్రధాన కథలో ప్రసంగవశాన మరొక కథను / వృత్తాంతాన్ని చెప్పేటప్పుడు, కొన్ని వర్ణనలలో వచనాన్ని ప్రయోగించాడు. వచనంలో శ్లేషాలంకారాన్ని కూడా ప్రతిపాదించాడు. ఆదిపర్వంలోని 2 వ ఆశ్వాసంలో సముద్ర వర్ణన చేసిన సందర్భంలో శ్లేషాలంకారాన్ని నిక్షేపించాడు. కొన్నిచోట్ల సూక్తులను వచనంలో వ్యక్తం చేశాడు. ఉదా: **రాజులకు కార్య వంశంబునం జేసి మిత్రా మిత్ర సంబంధంబులు సంభవించు; బుద్ధి గల వారికి క్రోధంబు కొనియాడం దగదు** మొదలైనవి.. చూర్ణిక, ఉత్కళిక, వృత్త గంధి మొ..రీతి వైవిధ్యం నన్నయ రచనలో కన్పిస్తాయి. "తిక్కన తన పద్యరచనలోలాగానే, వచన రచనలో కూడా తత్సమ పద ప్రయోగాన్ని తగ్గించి దేశ్య పద ప్రయోగానికి ప్రాధాన్యమిచ్చాడు. ముఖ్యంగా యుద్ధ వర్ణనలో యుద్ధ వ్యూహ రచనలో, వచనాన్ని ప్రయోగించాడు. శ్రీనాథ పోతనల రచనలలో 20 శాతం వచనమే కన్పిస్తుంది. వీరు ముఖ్యంగా వంశానుక్రమ వర్ణనలలో, తత్త్వబోధనను, భక్తి భావాన్ని వర్ణించే సందర్భంలో వచనాన్ని రచించారు. క్రీ.శ. 16వ శతాబ్దిలోని ప్రబంధ కవిత్వంలో వచనం 15 శాతమే కన్పిస్తుంది. ప్రబంధ కవులు వచనాన్ని పరిమితంగా రచించారు. వీరి వచనం ఓజో గుణ ప్రధానమైంది. శబ్దాడంబరం, జటిలమైన శైలి, అలంకార నిక్షేపం – ఈ కాలపు వచనంలో కన్పిస్తుంది. నాటి ప్రబంధ సాహిత్యంలో మనుచరిత్ర వసుచరిత్రాది కావ్యాల్లో వచన ప్రయోజనాన్నీ, ప్రాధాన్యాన్నీ పరిమితం చేశారు.

దక్షిణాంధ్రయుగ సాహిత్యంలో చేమకూరి వారి విజయవిలాసాది ప్రబంధాలలో కూడా వచనం తత్సమ పదబాహుళంగా, శైలీ విన్యాస వైఖరితో దురవగాహంగా ఉంటాయి. ఒక విధంగా ప్రబంధ కవిత్వ సంప్రదాయను గుణంగా చేసిన రచనలని చెప్పవచ్చు. వీటిలో పద్యమే, వచనం కంటె సలభంగా అర్థమవుతుంది.

**3. కేవల వచన రచనలు :** కన్నడ కవులు ఛందో రహితమైన స్తుతి వచనాలను క్రీ. శ. 13 వ శతాబ్దిలోనే రచించారు. ఈ ప్రభావంతో తెలుగులో క్రీ.శ. 14వ శతాబ్దిలో కాకతీయ ప్రభువైన రెండవ ప్రతాపరుద్రుని కాలంలో జీవించిన కృష్ణమాచార్యులు *సింహ గిరి* వచనములు అనే పేరుతో భక్తి భావమయమైన స్తుతి వచనాలను రచించాడు. అలాగే తాళ్లపాక పెద తిరుమలాచార్యులు *వేంకటేశ్వర* వచనములు రచించాడు. ఈ కోవలోనివే *శఠకోప విన్నపములు', 'భవానీమనోహర వచనములు; 'గంగాధరయ్య* వచనములు; *'కాశి కాధీశ్వర* వచనములు; మొదలైనవి. వీటిలో వచనం, చంపూ కావ్యాలలోని వచన శైలినే అనుసరించింది. మనకు దొరికిన మిక్కిలి ప్రాచీనమైన వచన రచన క్రీ.శ. 15వ శతాబ్ది మొదటి భాగంలోని ఏకామ్రనాథుని ప్రతాపచరిత్ర. తెలుగు వచనంలో చరిత్రకు సంబంధించిన మొదటి గ్రంథం ప్రతాప చారిత్రమే. కాకతీయ ప్రభువులలో ముఖ్యుడైన రెండవ ప్రతాప రుద్రుని చరిత్రను తెలిపే గ్రంథమిది. కాకతీయ రాజ్య పతనానంతరం దాదాపు 150 సంవత్సరాల కాలంనాటి రచన ఇది. ఇందులో కాకతీయ వంశోత్పత్తి, మాధవ శర్మ మొదలైన వారి కథలు, అనుమకొండ దుర్గ వృత్తాంతము వర్ణితమైనాయి.

నాటి కాలంలో పద్య రచనలు విరివిగా వస్తుంటే, దానికి భిన్నంగా వచనంలో రాయడానికి పూనుకోవడం ఏకామ్రనాథుని నూతన దృష్టిని తెలుపుతుంది. నాటి పురాణ యుగ రచనా సంప్రదాయమైన ఇష్ట దేవతా స్తుతి, కథోపక్రమణ మొదలైన అంశాలు దీనిలోనూ ఉన్నాయి. చంపూ రచనల్లో నన్నాయాదులు కథా కథనానికి అనుసరించిన వచన శైలిలోనే ఈ వచన రచన కూడా సాగింది. శైలి, నిరలంకారంగా, సముచితంగా, పాఠకునికి యథార్థాన్ని బోధ పరచేదిగా కన్పిస్తుంది.

చారిత్రక కావ్య రచనలో రెండవదిగా చెప్ప తగింది రాయవాచకం. విజయ నగర పాలకుడైన శ్రీకృష్ణదేవరాయలకు రతువాత మధుర పాలకుడైన విశ్వనాథ నాయకుని రాజోద్యోగి, స్థానపతి అయిన వ్యక్తి రాయవాచక కర్త, ఇతని పేరు చరిత్రకారులకు కూడా తెలియలేదు. ఈ రచనలోని ప్రధాన విషయం శ్రీకృష్ణదేవరాయుల చరిత్ర కాని, దానికి పూర్వ పీఠికగా విద్యారణ్యస్వామి వృత్తాంతము, వ్యాస సాక్షాత్కారము, విద్యానగర నిర్మాణము మొదలైన విషయాలు వర్ణితమైనాయి. ఈ గ్రంథ కర్త రాయలకు సమకాలికుడు కాడు. అనంతర కాలంలో జీవించినవాడు. ఇతరుల ద్వారా తాను విన్న విజయనగర వృత్తాంతమూ, కృష్ణ దేవరాయుల జీవిత వృత్తాంతము అందరికీ తెలిసే విధంగా తానీ గ్రంథాన్ని రచించినట్లు, గ్రంథాదిలో ఒక పద్యం ద్వారా పేర్కొన్నాడు. ప్రతాప చరిత్రకూ, రాయ వాచకానికీ నడుమ కొన్ని పోలికలున్నాయి. 1. రెండూ వచన గ్రంథాలే. 2. రెంటిలోనూ తెలుగు దేశాన్ని పాలించి ప్రసిద్ధి పొందిన చక్రవర్తులే నాయకులు 3. ప్రతాప చరిత్రలో మాధవ శర్మ వృత్తాంతం ఉన్నట్లే, రాయవాచకంలోనూ విద్యారణ్యుని వృత్తాంతం ఉంది. 4. శైలిలో స్వల్ప భేదమున్నా, రెంటిలోని వస్తువు మాత్రం దేశ చారిత్రలే. 5. ఇద్దరు కూడా ఆయా రాజుల చరిత్రను విని రచించిన వారే కాని, స్వయంగా చూసిన వారు కాదు.

రాయవాచక శైలి వ్యావహారిక భాషలో సాగింది. ఉదాహరణకు "అవి యే వంటేని; వేట పోవుట; అకారణం దండించుట; అనుచితం వెచ్చ బెట్టుట; మొదలైనవి. దీనిలో నీతి, రాజనీతి కూడా ఉన్నాయి. రాయవాచకంలో మాండలిక పదాలను, అన్య దేశ్యాలను విరివిగా ప్రయోగించాడు. ఉదా: పట్టెలు (ఆభరణాలు); ప్రహరి బడుగరలు (ప్రహరిని రక్షించే యోధులు); చేర్వ గార్లు (రౌతులు); ఉడగరలు (కానుకలు); మొ.. మాండలిక పదాలు. బయదలు (పదాతి యోధులు); ఆముస్తీదు (సిద్ధం కావడం); భారవసము (విశ్వాసం); హేజీబు (దౌత్య వ్యవహర్త) మొ.. అన్య భాషా పదాలు. దక్షిణాంధ్ర యుగంలో మధుర పాలకుడు విజయ రంగ చొక్కనాథుడు (1706-32) శ్రీరంగ మాహాత్మ్యంఅనే వచన రచన చేశాడు. ఆ కాలంలో వచన రచనలు, క్షేత్ర మహిమలను, పురాణ గాథలను, వేదాంత విషయాలను ప్రధాన వస్తువులుగా చేసుకొని వెలువడ్డాయి.

**4. తెలుగు కైఫియత్తులలో వచనం :** కైఫియత్తులు 18/19వ శతాబ్దికి చెందిన సృజనాత్మక సాహిత్యేతర వాఙ్మయం కిందకు వస్తాయి. సాహిత్య ప్రక్రియలకు, భాషకు ఉన్న లక్షణ నిర్దుష్టత సాహిత్యేతర ప్రక్రియలకు గాని, భాషకు గాని లేకపోవడం గుర్తింపదగింది. సమాజంలో జీవించే వారందరకు ఆ సమాజపు భాష సహజంగా అలవడుతుంది కాని లేఖనం, రచన చేయడం అనేవి పనిగట్టుకొని నేర్చుకొంటేనే వస్తాయి. నేర్చుకోడానికి తగిన వ్యవస్థ ఆనాడు సాహిత్య రచనలకు ఉంది; సాహిత్యేతర రచనలకు లేదు. అందుచేత కైఫియత్తుల రచనలో వైవిధ్యం ఉంటుంది. అక్కడక్కడ వాడుక భాష గ్రాంథిక భాష రెండిటి మిశ్ర లక్షణాలు కనిపిస్తాయి. ఇప్పటి ఆధునిక రచనా భాషకు అలవాటుపడిన మనకు కైఫియత్తులలోని భాష, చదివిన వెంటనే అవగాహన కాదు. కైఫియత్తుల భాషలోను, లేఖనంలోను ఉన్న కొన్ని ప్రత్యేకతలు ఇవి:

ముస్లింల పరిపాలన కాలం నుంచి రెవెన్యూ, పోలీసు మొదలైన శాఖలలో అరబ్బీ, పారశీక, ఉర్దూ భాషా పదాలు ప్రవేశించాయి. (తహసీల్దార్, తాలూకా, జమాబందీ, ఇనాం, ఫర్మానా, మౌజె మొదలైనవి) ఇవే పదాలు ఇంగ్లీషు వారి పరిపాలనలోను, తర్వాత కూడా విరివిగా వాడుకలో ఉన్నాయి. కైఫియత్తులలో గ్రామ సమాచారమే ఉంటుంది కాబట్టి వాటిలో ఎక్కువగా గ్రామ పరిపాలనకు, సమాజంలోని వ్యవహారాలకు సంబంధించిన భాషే ఉంటుంది. అందుచేత కైఫియత్తుల భాషలో అరబ్బీ, పారశీక, ఉర్దూ భాషాపదాలు విరివిగా ఉన్నాయి.

**ముగింపు :** తెలుగు శాసనాల్లో వచనం ప్రాథమిక దశ నుండి ఉత్తమ రచనా శైలిని సంతరించుకొన్నది. చంపూ రచనల్లోని వచనం ప్రౌఢ శైలిలో ఉండి కథనానికి, వర్ణనకి ఉపయోగపడింది. ఇక, కేవలం వచన రచనలు ప్రాచీన శైలిలో ప్రారంభమై, వ్యావహారిక శైలిని సాధించింది. 19వ శ.లో గ్రాంథిక వ్యావహారిక శైలుల నడుమ ఘర్షణ కలిగింది. అది చాలకాలం కొనసాగి 20వ శ.ఉత్తరార్థంలో వ్యావహారిక భాషా వాదం తిరుగులేని స్థాయిలో నిలచింది.

వచనంలో వ్యావహారిక శైలిని ఆదరించినందువల్ల తెలుగులో పాశ్చాత్య సాహిత్య ప్రక్రియలైన నవల, కథ, కథానిక, వ్యాసం, ఆత్మకథ, జీవిత చరిత్ర, సాహిత్య చరిత్ర, శాస్త్ర రచన, సాహిత్య విమర్శ, మొదలైనవి ప్రాచుర్యం పొంది వచనం శాఖోపశాఖలుగా విస్తరించింది.

**డా. కొల్లేటి రవిబాబు**
సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం,
నెల్లూరు, ఫోన్ : 949 439 8884

# చౌ మహల్లా ప్యాలెస్

– పంతంగి శ్రీనివాస రావు



చౌ మహల్లా ప్యాలెస్, హైదరాబాద్

హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో చార్మినార్‌కు అతి సమీపంలో గల చౌ మహల్లా ప్యాలెస్ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. చౌ మహల్లా అంటే నాలుగు సౌధాలు అని అర్థం. ఇది నిజాం ప్రభువుల అధికారిక నివాసంగా ఉండేది. ఆసఫ్ జాహి వంశ పరిపాలనా రాజధానిగా ప్రభుత్వ, రాజకీయ కార్యకలాపాలు ఈ ప్యాలెస్ నుండే జరిగేవి. ఈ రాజసౌధాన్ని 1750లో నిర్మాణం ప్రారంభించి 1880లో పూర్తి చేసారు.

ఈ ప్యాలెస్ మొదటిలో 45 ఎకరాల్లో విస్తరించి ఉండేది. ప్రస్తుతం 14 ఎకరాల్లో మాత్రం ఉంది. ఈ ప్యాలెస్‌లో గల ఖిల్వత్ (మహా దర్బార్)లో గల నీటి ఫౌంటెన్, ఉద్యాన వనాలు పర్యాటకులకు కొద్దిసేపు విశ్రాంతిని ఇస్తాయి. ఖిల్వత్ ముబారక్ అనేది ప్యాలెస్‌కు గుండెకాయ వంటిది. ఇది అసఫ్ జాహి వంశపు అధికారిక ప్రదేశం. దీనిలో గల సింహాసనం చూసి ఆశ్చర్య పోవాలిసిందే! ఈ ప్రదేశంలో సభా నిర్వహణ జరిపేవారు. దీనిలో మత పరమైన ఉత్సవాలు జరిపే వారు. ఈ మహల్‌లో 19 శాండ్లియర్లు ఉన్నాయి. ఆ నాటి కళా కౌసల్యానికి ఇది దర్పణంగా నిలుస్తుంది.

ఉత్తర భాగాన గల మహల్‌లో మొఘలుల శైలిలో అనేక గుమ్మటాలు, ఆ భవనంలో గల వెలలేని అభరణాల కళారీతి, అనేక షాండిలియర్లు పర్యాటకులను మరో లోకంలోకి తీసుకు వెళతాయి.

ఈ ప్యాలెస్ ప్రధాన ద్వారంపై గల గడియారపు స్థంభం నేటికీ టిక్ టిక్ మని అంటూనే ఉంది. ఈ ప్యాలెస్‌లో గల కౌన్సిల్ హాల్‌లో గల ఎగ్జిబిషన్‌లో అనేక గ్రంధాలు, అనేక విలువైన వస్తువులు భద్రపరిచారు. చౌ మహల్లాలో గల నాలుగు ప్యాలెస్‌లు ఇవి : అఫ్తాబ్ మహల్, అఫ్జల్ మహల్, మనతాబ్ మహల్, తహనీయత్ మహల్.

నిజాంలో అతి పెద్ద వారసత్వం గల ఈ రాజసౌధంలో నిజాంలకు సంబంధించిన వస్త్రాలు చూపరులను ఆకర్షిస్తాయి. వాటిల్లో అతి ముఖ్యంగా కుర్తాలు, చోలీలు, పైజామాలు, దుపట్టాలు, పే ప్యాబ్‌లు .. ఇంకా అనేక రకాలకు చెందినవి వందలాదిగా ఉన్నాయి.

రాజసౌధం గ్యారేజ్‌లో నిజాంలు వాడిన ఆనాటి పదుల సంఖ్యలో గల కార్లు, టాంగాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు 1912కు చెందిన రోల్స్ రాయల్ సిల్వర్ ఘోస్ట్ కారుతో పాటు అనేక కార్లు ఉన్నాయి.

సందర్శకులకు సాధారణ ప్రవేశ రుసుంతో ప్రవేశం కల్పించే ఈ చౌ మహల్లా ప్యాలెస్ నేషనల్ టూరిజం అవార్డు పొందినది. 15 మార్చ్ 2010న ఈ సౌధానికి యునెస్కో వారిచే సాంస్కృతిక వారసత్వ కట్టడంగా గుర్తింపు లభించింది.

హైదరాబాద్ నగరానికి విచ్చేసే వారిలో అత్యధిక సందర్శకులు ఈ చౌ మహల్లా ప్యాలెస్ ను తమ పర్యటనలో భాగంగా చేసుకుంటారు. అంతటి అద్భుత ప్యాలెస్ ఇది.

**పంతంగి శ్రీనివాస రావు**
పరిశోధకులు,
హైదరాబాద్, సెల్: 9182203351.

అసాధారణ కవి

# పాల్కురికి సోమన

**– ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

భవ్యమతావేశం, అపార పాండిత్యాభినివేశం, అసాధారణ భావుకతా పూర్ణ కవితా నిర్మాణ కౌశలం కలబోస్తే పాల్కురికి సోమనాథుడు. పాల్కురికి సోమన పరమశివ జటాజూట వినిర్గతమై భువి జేరిన ఒక మహోత్తుంగ ప్రతిభామందాకిని. అత్యంత అర్వాచీన వీరశైవమానికి అతిప్రాచీన వేదోక్త నిరూఢిని, విశుద్ధ భక్తి మార్గాన్ని, పురాణ రహస్యనియుక్తిని కల్పించి ప్రాశస్త్యాన్ని, పావనత్వాన్ని, ప్రామాణ్యాన్ని సంతరింప జేయడానికి నిరంతరం ఆరాటపడిన వీరమాహేశ్వరాచార వ్రతశీలి.

అల్పాక్షరముల నవల్పార్థరచన – కల్పించుటయ కాదె కవి వివేకంబు అని తెలిసి కూడా నిందాపూర్వక నిరర్థకమతావేశం, కవితావేశ పారవశ్యాలలో కొట్టుకొనిపోయి కావ్యరసానుభవ సంస్కారానికి కాకుండా తన రచనలు వీరశైవ మతదీప్తికి ఉపయోగపడితే చాలు అని వర్తమాన దృష్టికోణంతో జీవించినవాడు సోమన. ఇతనిలోని ఉద్యమ చైతన్య లక్షణం సాత్వికరూపాన్ని దాల్చి పోతనలో మూర్తీభవించింది "మందార మకరంద మాధుర్యాలు" జాలువారే పోతన పద్యాలకు దారిదీపమయ్యాడు. అంత్యానుప్రాస, ముక్తపదగ్రస్త రచనలకు ఆద్యుడై పోతనాది కవుల్లో వాటి విశ్వరూప ప్రదర్శనకు హేతువయ్యాడు. ఉదాహరణలు, రగడలు, సీసాలు, శతకం, గద్యలు, అష్టకాలు మొదలయిన వాటితో వినూత్నంగా దేశికవితా సరస్వతిని అలంకరించాడు. తాళ్ళపాకాది వైష్ణవ కవులు సైతం ఈ వీరశైవ మహాకవీంద్రుని రచనా మార్గాన్నయినా అనుసరించక తప్పలేదు. తమిళ కన్నడ మరాఠీ సంస్కృత ప్రాకృత ఆంధ్రాది భాషల్లో, మణిప్రవాళంలో, సమ్మిశ్రణభాషల్లో (ఆయాభాషలను కలగలుపుకొని) తడుముకొనకుండా కవిత్వం చెప్పగలిగిన ధీశాలియై తర్వాతి వారికి భిన్నభాషా పాండిత్య సముపార్జనావశ్యకతను చాటి చెప్పాడు.

వస్తు భావ రచనల్లో అపూర్వ పథావిష్కరణం గావించి ప్రప్రథమ స్వతంత్ర మహాకావ్య నిర్మాతగా స్థిరయశస్సు నార్జించాడు. దివ్యనాయికా నాయకులు, కల్పిత పాత్రలు కాకుండా తొలిసారిగా సమకాలంలో జీవించిన బసవేశ్వరుడు, పండితారాధ్యుడు మొదలుకొని మడివేలు మాచయ్య, మాదిగ కక్కయ్య, సూరసానమ్మ, మేదర చెన్నయ్య, ముగ్ధసంగయ్య లాంటా వారందరి చారిత్రక వివరాలను, వారి అనుభూతులను, అనుభవాలను, రాగద్వేషాలను కావ్యస్థం చేసి ప్రాచీన కవులకు సామాజిక స్పృహ లేదనే వాదాన్ని పూర్వపక్షం చేశాడు. కులాలకు, వర్ణాలకు అతీతంగా శివభక్తితో ప్రజలను సమైక్యపరిచాడు.

సాంగ, రాగాంగ, లలిత, బంగళాది 108పైగా రాగాలు; బ్రహ్మవీణ, కైలాసవీణ, గౌరివీణాది 42కి పైగా వీణలు; బంధాలు, వాద్యప్రబంధాలు, వాద్య చూడాదులు, 22 గతులు, 22 శ్రుతులు, 22 గమకాలు, 32 విశుద్ధరాయములు, 27 సాళగ తాళగతులు లాంటి ఎన్నెన్నో సంగీతశాస్త్ర రంగానికి చెందిన పారిభాషిక అంశాలన్నీ ఒకచోట నిబంధించిన సంగీతవేత్త సోమన. నాట్య భంగిమలు, నాటక ప్రదర్శనలు, రసవాదం, వైద్యం, జ్యోతిషం, భౌగోళిక పరిజ్ఞానం, శ్రుతి స్మృతి పురాణేతిహాసాల్లో అపారపాండిత్యం, మతసంబంధ జ్ఞానం ఇలా ఎన్నో ఎన్నెన్నో అంశాలతో పండితారాధ్య చరిత్ర రాసి తొలి విజ్ఞాన సర్వస్వ నిర్మాత అనిపించుకున్నాడు.

లిఖిత మౌఖిక సంప్రదాయాల మధ్య, సాహిత్య తత్త్వానికి మతావేశానికి మధ్య, వాస్తవ చరిత్రకు విశ్వాసమూలమైన భక్తికి మధ్య పాల్కురికి సోమన సేతువై ప్రకాశించాడు. ఇంకా ఎన్నో ఎన్నెన్నో పాల్కురికి సోమనాథుడు చేశాడు. కాని జీవితంలో అవధులు లేని మతోద్రేకాల పాలవడి శైవేతరుల ఊచకోతకు, మారణకాండలకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో కొంతమేరకు కారకుడయ్యాడు. సంఘ గమనానికి అవసరమైన శాంతి సామరస్యాలకు విఘాతం కలిగించాడు. శైవేతరులను భవిజనులు అని ముద్రవేసి వారిని చూడనన్నాడు. తాకనన్నాడు. మాట్లాడనన్నాడు. ఇచ్చి పుచ్చుకునే వ్యవహారాలను చేయనన్నాడు.

**సంభావితుడ భవిజన సమాదరణ**
**సంభాషణాది సంసర్గ దూరగుడ... నని (బసవపురాణం)**
**భవిజన దర్శన స్పర్శ నాలాప**
**వివిధ దానాదాన విషయదూరగుడ... నని**

(పండితారాధ్య చరిత్ర)

గర్వంగా చెప్పుకోవడంలో ఉచితానుచితాలు, ప్రశాంత మనస్కత కోల్పోయాడు. జైన మస్తక విన్యస్తశాత శూలుడయ్యాడు. (జైనుల తలలను పదునైన శూలంతో ఖండించిన వాడని భావం) ఇక బౌద్ధచార్వాక బ్రాహ్మణ నిందకు అంతే లేదు.

**జినసమయస్థుల శిరములు దునిమి**
**మును విష్ణుసమయుల ముక్కులు గోసి**
**యద్వైతులను హతాహతముగా దోలి**
**విద్వేషవాదుల విటతాట మార్చి**
**చార్వా వాదుల గర్వం బడంచి**
**సర్వేశు భక్తియే యుర్వి నిష్ఠించి.**

(బసవపురాణం 6-1199-1204)

శివనిందకుల పట్ల ఉపేక్ష వహించడం కాకుండా చంపడంలో పాపం లేదనీ, పైగా అది భక్తిలో భాగమేననీ ప్రకటించాడు. ఫలితంగా పాల్కురికి సోమన ప్రచారం చేసిన వీరశైవం చప్పున చల్లారి నేడు కళాకాంతులు లేకుండా పోయింది. పాల్కురికి మహా ప్రతిభాశాలియైనా కవిత్రయం, శ్రీనాథ పోతనాదుల వలె సర్వజనామోదం పొందలేకపోయాడు. ఇక్కడే మనం గమనించలసిన అంశం ఒకటి ఉంది సృష్టి సర్వ కాలాల్లోను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొంటుంది. అది జీవితంలో పాఠాలను నేర్పుతుంది.

విష్ణువు మొహమైనా చూడడానికి, పేరైనా తలవడానికి వీల్లేని ఈ సోమనాథుని తల్లిదండ్రుల పేర్లు గమనించండి. విష్ణురామి దేవుడు, శ్రియాదేవి – ఇవి యాదృచ్ఛికం కాదు. అత్యంతద్వేషాన్ని పెంచుకొన్న హిరణ్యకశిపుని ఇంట్లో మహాభక్తుడైన ప్రహ్లాదుడు పుట్టాడు. చాలమంది వీర అభ్యుదయ వాదులుగా, వీర విప్లవ వాదులుగా మారడానికి వారి తల్లిదండ్రుల సంకుచితత్వం, అతి సంప్రదాయ ధోరణి, వేధింపులు కూడా కొంతమేరకు కారణమని వారి వైయక్తిక జీవితాలను పరిశీలిస్తే తెలుస్తుంది. అతి ద్వేషం ప్రాతిపదికగా సాగే ఏ సిద్ధాంతానికయినా అది ప్రాంతీయమైనా, ఇంకోటయినా దానికి వ్యతిరేకమైన స్పందనలు అక్కడే పుట్టి గుణపాఠం నేర్పడం సృష్టి సహజధర్మం. దోపిడీని ఎదిరించాలి. ధర్మాగ్రహం ప్రకటించాలి. కానీ అతి రాగద్వేషాలు పనికిరావు. జీవితంలో ఎవరికీ మనవల్ల హాని జరగకూడదు. వీలైనంత మేరకు ఉపకారం జరగాలి. లేకపోతే మౌనంగా ఉండాలి. పట్టు విడుపులతో మనం శాంతి సామరస్యాలతో జీవించాలి. మనచుట్టు అలాంటి వాతావరణమే కల్పించడానికి దోహదం చేయాలి. పాల్కురికి సోమనను తెలంగాణా కవి అనే పేరుతోనైనా నెత్తికెత్తుకోవడం ప్రశంసావహమే. పాల్కురికి సోమన మీద వేటూరి ప్రభాకరశాస్త్రి, భండారు తమ్మయ్య, నిడుదవోలు వెంకటరావు అపారమైన కృషిచేశారు. ఇటీవల కీర్తిశేషులైన ధూపం బసవనాగయ్యగారు పాల్కురికి సోమన పుస్తకాలను ప్రచురించడం ద్వారా ఎంత సేవ చేశారో! అక్కిరాజు రమాపతిరావు గారు బసవపురాణం, పండితారాధ్య చరిత్రలను వచనీకరించారు. వేల్చేరు నారాయణరావుగారు బసవపురాణాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. జీరెడ్డి చెన్నారెడ్డి, పండితారాధ్యుల వీరేశలింగం, తిమ్మా వజ్ఝల కోదండరామయ్య లాంటివారు పాల్కురికి సోమన మీద సిద్ధాంత గ్రంథాలు రాశారు.

1974లో ఉస్మానియాలో కీ.శే. వేణుముద్దల నరసింహారెడ్డి గారు పాల్కురికి సోముని కృతులమీద డాక్టరేటు చేశారు. పాల్కురికి సోమన నిఘంటువు, పదకోశం రావలసిన అవసరముంది. పాల్కురికి మీద వచ్చిన రచనలన్నింటిని సేకరించి,, పునర్ముద్రించి సంపుటాలుగా అందించగలగాలి. దీనికి అంగబలం, ఆర్థికబలం ఎంత కావాలి? ఇవి సమకూరాయనుకోండి. ప్రచురణవేళ తప్పొప్పులు సరిదిద్దేవారెంత మంది అందుబాటులో ఉన్నారు? అసలు నిష్ఠగా చదివే వారెంత మంది ఉన్నారు? ఈ ప్రశ్నలు కూడా వేసుకోవాల్సి వుంది. అట్లాగని పనులు ఆపాలని కాదు. పాల్కురికి మీద నేటిదాక జరిగిన కృషి తక్కువేమీ కాదు. అయినా చేయడానికి మరెంతోవుంది.

**ఆచార్య వెలుదండ నిత్యానందరావు**
వైస్ ఛాన్సలర్,
సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

---

**తెలంగాణ సంస్కృతి తొలి ఆవిష్కర్త -పాల్కురికి సోమనాథుడు**
సంపాదకులు : **ఆచార్య అనుమాండ్ల భూమయ్య**

# తెలుగు జర్నలిజం-కృత్రిమమేధ

*- డా. జీ కే డి ప్రసాద రావు*

భారతదేశంలో కృత్రిమ మేధ వినియోగం ఆర్థిక, సాంకేతిక, రాజకీయ రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. 'నీతి ఆయోగ్ కృత్రిమమేధ జాతీయ వ్యూహం" (National Strategy for Artificial Intelligence), ఇండియా కృతిమ మేధ పోర్టల్ (INDIA ai Portal) మొదలైన జాతీయ విధానాలు ఈ చర్చలకు పునాది వేశాయి. తెలుగు ప్రచారమాధ్యమాలు ఈ స్థాయి జాతీయ దృశ్యాన్ని ప్రాంతీయ పాఠకులకు అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలోకి అనువదిస్తోంది. ఇందుకు చాలా తెలుగు పత్రికలు ప్రచురించిన వార్తాకథనాలను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. కృత్రిమమేధ ఒక ప్రత్యేక రంగంగా అభివృద్ధి చెందడంతో దీని ముఖ్యఫలితాల మీద చర్చ జరుగుతుంది. ఉద్యోగావకాశాలు, ఆర్థికాభివృద్ధి, టెక్నాలజీ పురోగతి కోణంలో పరిశీలించడం ప్రధానోద్దేశ్యం. కొంతమేర ఆశావాద దృక్పథంతో పరిశీలన జరిగినప్పటికీ దీనిలో ఆందోళనకర హెచ్చరికలకు కూడా చోటు లేకపోలేదు. నకిలీ సమాచారంతో దుష్ప్రచారం, సమాచార చౌర్యం మొదలయిన వాటిని ప్రమాదాలుగా పేర్కోవచ్చు. కృత్రిమమేధతో భాషాల మధ్య అసమానత్వం చోటు చేసుకుంది. తెలుగు వంటి భాషలకు సాంకేతిక మోడళ్ల లేకపోవడం అసౌకర్యంగా కనిపిస్తుంది. జర్నలిజం భవిష్యత్తు విషయంలో న్యూస్‌రూమ్ ఆటోమేషన్ పరిమితంగా వున్నప్పటికీ, భవిష్యత్తులో ఇది పెరిగే అవకాశం వుంది. ఈ అధ్యయనం కృత్రిమమేధ ప్రయోజనాల్ని- ప్రమాదాల్ని వివరిస్తుంది. భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న అన్ని రంగాల్లో కృత్రిమమేధ (AI for All) లక్ష్యం తెలుగు ప్రచార మాధ్యమాల్లో తరచూ వెల్లడిస్తుంది. పత్రికలు కృత్రిమమేధను ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ప్రజాపాలనలో ఉపయోగపడే సాధనంగా చూపుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న భారతదేశం వంటి ఆర్థిక వ్యవస్థలకు ఇది అత్యవసరమని మేధావులు పేర్కొంటున్నారు.

**పరిచయం :** తెలుగు పత్రికల్లో కృత్రిమ మేధ (Artificial Intelligence - AI) వినియోగంతో చోటు చేసుకున్న పరిణామాలు, ప్రచురితమవుతున్న వార్తాకథనాల విశ్లేషణకు సంబంధించిన వ్యాసం ఇది. కృత్రిమమేధతో ఎలాంటి సామాజిక ప్రయోజనాలు కలుగుతాయో, దుష్ఫలితాలు సంభవిస్తున్నాయో ఈవ్యాసంలో చర్చించడం జరిగింది. ముఖ్యంగా 2024-25 మధ్య కాలంలో తెలుగు పత్రికలు ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, సమయం, టీవీ9 (న్యూస్ యాప్)) ప్రచురించిన వార్తలను ఆధారంగా తీసుకుని ఉద్యోగావకాశాలు, విధానాలు, నకిలీ వీడియో, ఫోటోలు (Deepfake technology), భాషా సాంకేతికతలు (Language technology) అనే ప్రధానాంశాల మీద ఈ వ్యాసంలో విశ్లేషణ జరిగింది. అందుకు తగిన కొన్ని వార్తానాల శీర్షికలను ఆధారాలుగా పేర్కొనడం జరిగింది. ఈ వ్యాసంలో ముఖ్యపదాలుగా కృత్రిమ మేధస్సు, తెలుగు పత్రికలు, నకిలీ వీడియోలు, ఫోటోలు, లాంగ్వేజ్ ఈక్వాలిటీ, ప్రింట్ మీడియా, వార్తా విశ్లేషణ వంటివి వున్నాయి. ఇవన్నీ అందరికీ తెలిసినవే ఐనా ఇక్కడ వీటికి చాలా ప్రాధాన్యత వుంటుంది.

**పరిశోధన విధానం-పూర్వ అధ్యయనాలు :** ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, సమయం, టీవీ9 న్యూస్‌యాప్‌లో ప్రచురితమైన 2023-25 మధ్య కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ పదజాలంతో కూడిన కథనాలను సేకరించాం. నమూనాగా ప్రతి పత్రిక నుంచి కనీసం 20 వార్తలు ఎంపిక జరిగింది. ఆర్థికం, పాలసీ, ముప్పులు, భాషా అంశాలు, న్యూస్ రూమ్ వాడకం మొదలయిన ప్రధాన అంశాలతో వార్తా

కథనాలను అధ్యయనం చేశారు. వీటి నుంచి గణాంకాలు వెల్లడయ్యాయి. తెలుగు పత్రికల ప్రచురించిన వార్త శీర్షికలను సైతం అవసరమైన చోట వ్యాసంలో పేర్కోవలసి వచ్చింది. ఈ అధ్యయనంలో ప్రముఖ తెలుగు పత్రికల ఉదాహరణలుగా తీసుకొని వాటి సామాజిక ప్రభావాలు, పత్రికా ప్రమాణాలు, మీడియా పాటిస్తున్న నీతిసూత్రాలను వివరంగా పరిశీలించాం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా సమాచార కేంద్రాలను గణనీయంగా మార్చేస్తోంది. ఇది డేటా ఆధారిత రిపోర్టింగ్‌ను ఆటోమేటింగ్ చేయడంలో ఉపకరిస్తోంది. సంపాదకీయంలో, వాణిజ్య విధానాలను పునఃరూపకల్పన చేయడంలో ముఖ్య పాత్ర వహిస్తోంది. అంతేకాదు, ఇది నైతికత, పాలనా సంబంధమైన విషయాల్లో వేగంగా సహాయాన్ని అందిస్తోంది. Artificial Intelligence in the News: How AI Retools, Rationalizes, and Reshapes Journalism and the Public Arena, 2024. ఈ గ్రంథంపైన పేర్కొన్న విషయాల మీద అధ్యయనం చేసింది. ప్రాంతీయ భాషాభివృద్ధికి సంబంధించి తెలుగు భాషా నమూనాలపై, స్థానిక కమ్యూనిటీ ప్రాజెక్టులపై జరుగుతున్న పరిశోధనలు, స్థానిక ఉపభాషలు, మౌఖిక సంప్రదాయాలు, మాటల ప్రయోగాల్లో AIకి అర్థం వచ్చేలా సృష్టించడంలో పెరుగుతున్న సామర్థ్యాన్ని తెలియజేస్తున్నాయి. దీని ద్వారా మెషీన్ అనువాదం, ఆటోమేటిక్ కాపీ ఉత్పత్తి, వాయిస్ టూల్స్‌ను తెలుగు ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేయగలుగుతున్నారు. దీంతో దేశీయ భాషా పత్రికలు, డిజిటల్ కంటెంట్ మరింత నాణ్యతతో ఉత్పత్తి అవుతున్నాయి. One dialect, one fable at a time : A Telugu model opens a window for India AI dream.

**కృత్రిమమేధలో తెలుగు భాషామోడళ్ళ కోసం జరుగుతున్న కృషి :** తొలినాళ్ళలో తెలుగు ASR (Automatic Speech Recognition) మోడల్ నిర్మాణం కోసం కృషి జరిగింది. భారతదేశంలోని 40 భాషలతో 36,000 గంటల డేటా మీద ప్రీ-ట్రెయిన్ చేసిన మోడల్‌ను, తెలుగు భాషకు కేవలం మూడు రోజుల్లో ఫైన్‌ట్యూన్ చేశారు. పోటీల్లో NVIDIA మోడల్ రెండో స్థానానికి 2 శాతం తక్కువ వర్డ్ ఎరర్ రేట్ సాధించింది. ఈ బేస్‌లైన్ మోడళ్లు భాషలకు మద్దతు ఇస్తూ, ట్రాన్స్‌క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్ వంటి అనేక స్పీచ్ AI అనువర్తనాలకు దారులు చూపుతాయని నిపుణులు గుర్తించారు. *(IIIT-Hyderabad. December 2, 2022 by Angie Lee).* పరిమిత సాంకేతిక వనరులు కలిగిన తెలుగు భాషల్లో భావవిశ్లేషణపై (Sentimental Analysis) పరిశోధనలు పరిమితంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనంలో Indic BERT, RoBERTa, DeBERTa, XLM-RoBERTa మోడళ్ల పనితీరును తెలుగు వాక్యస్థాయి భావ విశ్లేషణకు ఉపయోగించి పరిశీలించారు. అందులో XLM-RoBERTa మోడల్ అత్యుత్తమంగా 79.42% సాధించింది. ఈ ఫలితాలు తెలుగుభాషలో భావవిశ్లేషణకు ఉపయోగపడే ప్రమాణంగా పరిగణించవచ్చని పరిశోధకులు భావించారు. *(https://pmc.ncbi.nlm.nih.gov/articles/).* సర్వమ్ AI హైదరాబాదు, బెంగుళూరులో ఉన్న స్టార్ట్-అప్ ఇది భారతీయ భాషల్లో ప్రాథమిక భాషా మోడల్స్ నిర్మిస్తోంది. దీనిలో తెలుగు ప్రధానంగా వుంది. సర్వమ్ సంస్థ 10 భారతీయ భాషల్లో ఓపెన్ సోర్స్ ఫౌండేషనల్ మోడల్‌ను విడుదల చేసింది. 'సర్వమ్ 2దీ'అనే పెద్దభాషా మోడల్‌ను విడుదల చేసింది. భారత ప్రభుత్వం దీన్ని భారత ప్రభుత్వ సార్వత్రిక మోడల్‌గా ఎంపిక చేసింది. *(India AI, 7 MAR 2024 y PIB Delhi)*

డిజిటల్ ఇండియా (AIRAWAT) భారత ప్రభుత్వ ప్రాజెక్ట్, AI పరిశోధన, విశ్లేషణ, పరిజ్ఞాన పరస్పర మార్పిడి కోసం కంప్యూటింగ్ ప్లాట్‌ఫారమ్. తెలంగాణ ప్రభుత్వం సహకారంతో AI ఫర్ ఎవరీవన్" తెలుగు వెర్షన్ ప్రచురించి AI అందుబాటును పెంచుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న IIIT, IITలు AI పరిశోధనలో పాలుపంచుకుంటున్నాయి. ఉదాహరణకు IIIT హైదరాబాదులో డేటా I-హబ్ ఫౌండేషన్ పేరుతో డేటా బ్యాంకులు, విశ్లేషణల కోసం పనిచేస్తుంది. వధ్వాని AI సంస్థ భారతదేశంలో ఉన్న ఒక లాభాహీన సంస్థ, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో AI అమలు చేస్తుంది. తెలుగు ప్రత్యేక పరిశోధన లేకపోయినా, తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో AI పరిష్కారాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ సంస్థలు, NGOలతో భాగస్వామ్యం చేస్తుంది.

ఈ సంస్థలు భారతదేశంలో ప్రాంతీయ భాషల AI మీద వేగంగా ఎదుగుతున్న పరిశోధనకు దోహద పడుతున్నట్లు, ముఖ్యంగా తెలుగు సహా పలు భారతీయ భాషలకు ప్రాథమిక మోడల్స్, డేటాసెట్లు తయారు చేస్తున్నారు. భారతదేశం తన స్థానిక భాషా నమూనా (Loacal Language Model - LLM)ను సృష్టించడానికి హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న స్వచ్ఛదసంస్థ ప్రయత్నించింది. తెలుగు భాషను డాక్యుమెంట్ చేయడంలో అనుభవం సాధించింది. ఒక భారతీయ AI మోడల్ కోసం సుమారు ఏడాది పాటు తెలుగు మాట్లాడే వారు, రాసేవారి నుంచి స్వచ్ఛందంగా కుటుంబ కథలు, రోజువారీ సంభాషణలు, సంబంధిత మానసికస్థితి, వాతావరణం, పూర్వీకుల కథలు, పత్రికలు, పుస్తకాలు మొదలైన వాటిని సేకరిస్తున్నారు. ఈ సేకరణ ఒక తెలుగు LLM సృష్టించడానికి అత్యంత ముఖ్యమైన డేటాగా భావిస్తున్నారు. భారత దేశంలో భాషలు ప్రాంతీయ స్వరూపంలో విభిన్నంగా ఉన్నాయి. కొన్ని సమీప ప్రాంతాల్లో కూడా భిన్న మాండలికాలు (Dialects) ఉంటాయి. ఇవి మతం, కులం, సముదాయ పరిచయంతో మిళితమైన సాంకేతికపరంగా వ్యత్యాసాలు కలిగిఉంటాయి. సామాజిక మాండలికాలు, ప్రాంత మాండలికాలు వున్నాయి. ఉదాహరణకు తెలంగాణ మాండలికం, కోస్తా మాండలికం, ఉత్తరాంధ్ర మాండలికం, రాయలసీమ మాండలికాలు వున్నాయి. ప్రస్తుతం ప్రపంచ స్థానిక భాషానమోలు (Global LLM)లు, ఉదాహరణకు ChatGPT, PerplexityAI వంటి యాప్‌లు, స్థానిక భిన్నతలను ఆటుకట్టుకునే మోడల్ సృష్టించడం స్వచ్ఛ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. *( Telugu Language AI & Data Solutions) Perple.*

2024 నుంచి తెలంగాణలో స్వచ్ఛ సంస్థ ప్రథమంగా తెలుగు ఆపరేటింగ్ సిస్టమ్, తెలుగు ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్ సిస్టమ్‌ని అభివృద్ధి చేసింది. ఆ తర్వాత 'చందమామ కథలు' పేరుతో 40,000 తెలుగు పిల్లల కథలను డిజిటలైజ్ చేసి AI కథా ప్రాజెక్టుతో విడుదల చేసింది. స్వచ్ఛ సంస్థ IIIT హైదరాబాదుతో అవగాహభ కుదుర్చుకుని సహకరించి 2025 లో "విశ్వం AI' అనే గ్లోబల్ సౌత్ సంస్థ దక్షిణ ప్రాంతాల కోసం సమర్థవంతమైన AI పరిష్కారాలు అభివృద్ధి చేస్తోంది. స్వేచ్ఛ సంస్థ, పెద్ద టెక్ కంపెనీల స్థాయి నిర్బంధం, షరతులు లేకుండా సామాజిక సానుభూతితో కూడిన సాంస్కృతిక దృష్టిని ముందుగా ఉంచిన ప్రమాణాలతో–ూ× అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది. *(విధాత్రి రావు, హైదరాబాద్ ఏప్రిల్ 14, 2025)* స్వేచ్ఛ సంస్థ గురించి న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆంగ్లపత్రికలో సుదీర్ఘవ్యాసం రాశారు. దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమమేధ రంగంలో తెలుగుభాషను సమర్థవంతమైన మోడళ్ళతో సముచిత స్థానంలో నిలపాలనే కృషి జరుగుతుంది. ఇది తెలుగు మీడయా రంగాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ***(https://*** *avishkaran.org/incubates_swacch.php)*

**ఆర్థికాంశాలకు సంబంధించిన వార్తా కథనాలు :** ఐటీ రంగం కృత్రిమమేధ వైపు మలుపు తీసుకుంటోందని 'సమయం' పత్రిక 'భారత ఐటీ కంపెనీలు – ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు దృష్టి" *(సమయం, 8 జూలై 2025),* ప్రచురించింది. 2024లో టాప్ 25 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలను ప్రకటించడానికి సాఫ్ట్‌వేర్ రిపోర్ట్ ఆనందకరంగా వుంది. ఇందులో స్పీచ్ రికగ్నిషన్, కంప్యూటర్ విజన్, మెషిన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ జనరేషన్, ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లు ఉన్నాయి. కానీ వీటికే పరిమితం కాలేదు. ప్రపంచ ఏఐ మార్కెట్ 2030 నాటికి వి 1.35 ట్రిలియన్ల విలువను చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వి15.3 ట్రిలియన్ల విలువ అందించనుంది. టాప్ 25 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీల ఎంపిక ప్రక్రియలో తీవ్ర పోటీ నెలకొని వుంది. వీటిలో సాఫ్ట్‌వేర్ ప్రభావం, సాంకేతిక ఆవిష్కరణ, సంస్థాగత సామర్థ్యాలు, నిర్వహక బృందాల సామర్థ్యం, కార్యాలయ సంస్కృతి వంటి ఇతర అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. భారతీయ ఐటీ కంపెనీలు, కృత్రిమమేధ సంస్థల వైపు ఆసక్తి చూపుతున్నాయి. అధిక నష్ట భయంతో పాటు మూలధనం ఎక్కువగా అవసరమయ్యే పరిశోధనల కంటే అధిక–మార్జిన్లుండే అప్లికేషన్లు, ఏకీకరణలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. పరిశ్రమ దిగ్గజాలైన టీసీఎస్,

ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి సంస్థల 2024-25 వార్షిక నివేదికలను లోతుగా పరిశీలిస్తే, మన టెక్ దిగ్గజాలు ఫౌండేషనల్ ఏఐ ఆవిష్కరణల్లో పోటీపడడం లేదని అర్థమవుతోంది. ప్రీమియం ఇంటిగ్రేటర్లుగా నిలబడటానికి ప్రయత్నం చేస్తున్నాయి. *(ఈనాడు, 30 జూన్ 2025).* 'ఏఐ-ఫస్ట్ అప్రోచ్'తో శాశ్వత అనుకూలత కలిగిన వ్యూహాన్ని టీసీఎస్ రూపొందిస్తోంది. ఇందుకు తగిన ప్రకటనలు కూడా జారీ చేసింది.

ఇన్ఫోసిస్ 'ఏఐ యువర్ ఎంటర్ప్రైజ్ అనే థీమ్‌తో మరింత ప్రత్యక్ష మార్గాన్ని ఎంచుకుంది. విప్రో ఏఐ ఆధారిత వ్యాపారాలను సృష్టించడంలో, వినియోగదారులకు సాయపడటంలో కీలక పాత్ర పోషించడంపై దృష్టి పెడుతోంది. 'ఏఐ డెలివర్డ్ రైట్‌తో టెక్ మహీంద్రా కొనసాగుతోంది. ఆయా ఐటీ సంస్థలు మానవ వనరులను పెంచుకోవడం, వారి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం మీద ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. సమాచారం, వాస్తవం, కల్పన, అసత్యం, మానవ ప్రవర్తన ఇలా ప్రతిదాన్నీ గ్రహిస్తుంది. ముఖ్యంగా టెక్ మహీంద్రా వంటి సంస్థల వ్యాపారాలకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంద'ని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రానే స్వయంగా మీడియా ముందు పేర్కొన్నారు. డేటా, డాక్యుమెంట్ల భద్రత రీత్యా చాట్‌జీపీటీ, డీప్సీక్లాంటి టూల్స్‌ని ఆఫీస్ కంప్యూటర్లు, డివైస్‌ల్లో డౌన్లోడ్ చేయవద్దని ఫిబ్రవరిలో కేంద్ర ఆర్థికశాఖ తన అధికారులకు ఆదేశించింది. అయితే ఈ కొత్త టెక్నాలజీతో వాటి వినియోగంపై ప్రభుత్వ విభాగాల్లో నిషేధం లేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభలో ప్రకటించారు. కానీ భద్రత, గోప్యతను దృష్టిలో ఉంచుకుని ఉపయోగించాల్సిన అవసరం ఉందని వివరించారు. *(సాక్షి, 3 సెప్టెంబర్ 2025)* అంతర్జాతీయ ద్రవ్యనిధి విశ్లేషణ ప్రకారం 40 శాతం ఉద్యోగాలు ఏఐతో ప్రభావితమవుతున్నాయి. సామాజిక ఉద్రిక్తతలు లేకుండా AIని వినియోగించేలా ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. *(18 జనవరి, 2024, టీవీ 9 న్యూస్).*

భారతీయ మీడియా రంగంలో AI ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయి. జర్నలిజం సంబంధిత కంటెంట్ తయారీ, ప్రసారరంగం, మీడియా మార్కెటింగ్‌లో AI సాంకేతికతలను ఉపయోగించేందుకు కొత్త ఉద్యోగాలు ఏర్పడుతున్నాయి. AI ఆధారిత కంటెంట్ క్రియేటర్లు, ఆటోమేటెడ్ వార్తా అంశ రచయితలు, AI యాంకర్లు, ప్రూఫ్ చెకర్స్, మరియు వ్యక్తిగతీకరణ, ప్రకటన విశ్లేషణకు సహాయపడే AI నిపుణులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యమైన AI నైపుణ్యాలు - సహజ భాష ప్రాసెసింగ్ (NLP), ఆటోమేషన్, డేటా విశ్లేషణ, జనరేటివ్ AI, మరియు AI నీతి. ఇవి ప్రస్తుతం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మహానగరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ రంగంలో సాంకేతిక, సృజనాత్మక నైపుణ్యాలు కలిగిన వారికి భవిష్యత్తు వుంటుంది *(PTI, 2023).* ప్రపంచవ్యాప్తంగా మీడియా రంగం వేగంగా డిజిటల్ మార్పులు చెందుతున్న తరుణంలో తెలుగు పత్రికారంగం కూడా కృత్రిమ మేధ సాంకేతికత వినియోగంపై నెమ్మదిగా దృష్టి సారిస్తోంది. ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి వంటి ప్రముఖ పత్రికలు తమ ఆన్‌లైన్ వేదికల్లో AI సంబంధిత వ్యాసాలను ప్రచురిస్తున్నాయి.

**తెలుగు మీడియా కృత్రిమమేధ వినియోగం :** టెలివిజన్ రంగంలో మాత్రం కృత్రిమ మేధ వినియోగం స్పష్టంగా కనిపిస్తోంది. 2023లో BIG TV 'మాయ' అనే తెలుగు AI న్యూస్ యాంకర్‌ను పరిచయం చేసింది. ఇది తెలుగు మీడియా రంగంలో మొట్ట మొదటి పెద్ద AI వినియోగానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. *(రెడ్డి.వి, 2023).* ప్రపంచ వ్యాప్తంగా పత్రికలు తమ న్యూస్‌రూమ్‌ల్లో కృత్రిమ మేధను ప్రవేశపెడుతూ కొన్ని విభాగాల్లో నిపుణులను నియమించు కుంటున్నాయి. తెలుగు పత్రికల్లోనూ ఇదే ధోరణి రూపుదిద్దుకునే అవకాశం కనబడుతుంది. డిజిటల్ ప్రొడక్ట్ AI ఇంజనీరింగ్ విభాగం, వెబ్‌సైట్, మొబైల్ యాప్, సిఫార్సు వ్యవస్థలు, డేటా అనలిటిక్స్ విభాగం, పాఠకుల ప్రవర్తన విశ్లేషణ, కంటెంట్ వ్యూహాలు, సోషల్ మీడియా, డిస్ట్రిబ్యూషన్, ఆటోమేటిక్ షేరింగ్, వీడియో క్లిప్పింగ్, షార్ట్ కంటెంట్, డేటా జర్నలిజం, భారీ డేటా విశ్లేషణ, ఇన్వెస్టిగేటివ్ స్టోరీస్, మల్టీమీడియా, గ్రాఫిక్స్, AI యాంకర్లు, వాయిస్ ఓవర్లు, సబ్‌టైటిల్స్, ఆర్కైవ్

డిజిటైజేషన్, పాత పత్రికల డిజిటల్ భద్రత, OCR సాంకేతికత, ఎడిటోరియల్ సపోర్ట్, కథనాల సారాంశం, ఫ్యాక్ట్ చెకింగ్ సాఫ్ట్‌వేర్ వినియోగం మొదలయిన అవసరాలు వుంటాయి. వీటికి తగిన విధంగా నైపుణ్యం కలిగినవారిని నియమించుకునే అవకాశాలు పుష్కలంగా వుంటాయి. తెలుగు పత్రికా రంగం ప్రస్తుతం AIపై చర్చలు జరుపుతూ, వ్యాసాలు ప్రచురిస్తోంది. ఇంకా న్యూస్‌రూమ్‌లో ప్రత్యక్ష వినియోగం గురించి స్పష్టమైన వివరాలు లేవు. త్వరలోనే ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి మొదలైన ప్రధాన పత్రికలు కూడా డిజిటల్ విభాగాల్లో AI ఇంజనీర్లను విస్తృతంగా వినియోగించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. *(Lokhande, M.,&Sharma,R. 2025).*

**కృత్రిమ మేధ విధానాలు :** "కృత్రిమ మేధస్సు విధానాలు" అనేవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికత అభివృద్ధి చేయడం కోసం రూపొందించినది. దీని ప్రయోజనం, నియంత్రణ కోసం కొన్ని నియమాలు, మార్గదర్శకాలు, చట్టాల్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ విధానాలు న్యాయ పరమైన నియంత్రణ, పారదర్శకత, బాధ్యత, డేటా గోప్యత కాపాడటం, భాష సమానత్వం వంటి కీలక అంశాలను గుర్తించి AI సాంకేతికతలను సమాజానికి మంచిగా ఉపయోగించడానికి మార్గదర్శకత్వం అందిస్తాయి. ఈ విధానాలు వివిధ రంగాల్లో కంపెనీల అంతర్గత నియమాలలో అమలు చేస్తారు, తద్వారా AI సాంకేతికత సామాజిక ప్రయోజనకారిగా అభివృద్ధి చెందుతుంది. కృత్రిమమేధ విధానాల్లో భాషా సమానత్వం అంటే, AI వ్యవస్థలు, నమూనాలు భారతీయ భాషల వైవిధ్యాన్ని గౌరవించాలి. అన్ని భాషల్ని సమానమైన దృష్టితో అభివృద్ధి చేయబడటం. *(AI for good: India and beyond - 2024 Manisha Dhir and Sonal Verma)* అందరికీ నాణ్యమైన, సమర్థవంతమైన సమాచారాన్ని అందించ గలుగుతాయని నిర్ధారించటం. ఇది భాషా వైవిధ్యాన్ని కాపాడటం. భాషా సమాన అవకాశాలను కల్పించడం ముఖ్య లక్ష్యం కావాలి. 'భారత్‌జెన్' వంటి ప్రాజెక్టులు భాషా సమానత్వం కలిగిన AI నమూనాలు ఏర్పరిచేందుకు పనిచేస్తున్నాయి. ఇవి వివిధ భారతీయ భాషల సాంస్కృతిక నేపథ్యాలను పరిగణలోకి తీసుకుని, అంతర్జాతీయ నమూనాలపై ఆధారపడకుండా స్వదేశీ డేటాబేస్ ఆధారంగా పనిచేస్తాయి. కృత్రిమ మేధస్సు నియంత్రణలో భారత దిశానిర్దేశం అంతర్జాతీయ పరిధులకు విస్తరించిన పరిశోధనల మీద ఇప్పటికే చాలా గ్రంథాలు ప్రచురణ జరిగాయి. భారత్‌లో కృత్రిమమేధ నియంత్రణలో కొన్ని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. న్యాయ నిర్ణయాలు, విధానాలు, అలాగే అంతర్జాతీయ ప్రమాణాలతో వాటి అనుసరణను ఈ చట్టాలు సమగ్రంగా ప్రతిబింబిస్తున్నాయి. *(India AI Portal, 2025.)* మానవ హక్కులకు కేంద్రంగా న్యాయం, పారదర్శకత, బాధ్యతాయుతమైన వైఖరితో నైతిక వ్యవస్థల అభివృద్ధి జరగాలని నిపుణులు తమ రచనల్లో పేర్కొంటున్నారు. ఇది కేవలం భారతదేశానికే పరిమితం కాకుండా, యూరోపియన్ యూనియన్ AI చట్టం – 2024 నుంచి బ్రెజిల్, చైనా, జపాన్, అమెరికా వంటి దేశాల చట్టాలతో సరిపోలుస్తూ ప్రపంచ దృక్కోణాలను భారతీయ నిపుణులు విశ్లేషణలను, సలహాలను అందిస్తున్నారు. ఇప్పటికే భద్రత, సమానత్వం, గోప్యత, పారదర్శకత, బాధ్యత, మానవ విలువల పరిరక్షణ వంటి నైతిక ప్రమాణాలపై విస్తృత చర్చ జరిగింది. గ్లోబల్ మార్కెట్‌లో భారత ప్రత్యేక స్థితిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన సూచనలు, విధాన సిఫార్సులు నిర్ధారణ జరిగాయి.

AIతో సృష్టించిన కంటెంట్, దాని యాజమాన్యానికి మేధో సంపత్తి హక్కులు (Intellectual Property Rights - IPR) సవాళ్లపై ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారు. AI వాడకం వల్ల తలెత్తే సివిల్, క్రిమినల్ న్యాయపరమైన సమస్యలకు పరిష్కారాలు అమల్లోకి వచ్చాయి. కృత్రిమమేధకు న్యాయపరమైన వ్యక్తిత్వాన్ని ఇవ్వాలా అనే అంశంపై లోతైన చర్చ ఇంకా జరుగుతుంది. దీనిమీద ఇప్పటికే కొన్ని చట్టాలు తెరమీదకు వచ్చాయి. ఇంకా తీవ్రంగా వాదోపవాదాలు జరుగుతున్నాయి. భారత ప్రభుత్వ జాతీయ డేటా గవర్నెన్స్ విధాన ఖరారు రూపకల్పన చేసింది. వీటి అమలు చిత్తశుద్ధితో జరగాలి. లేకుంటే కృత్రిమమేధ ప్రజావిశ్వాసాన్ని కోల్పోతుంది. దీనితో నడిచే అన్ని వ్యవస్థలను ప్రజలు తిరస్కరిస్తారు. తెలుగు పత్రికలు డీప్ ఫేక్ ముప్పులపై నివేదికలు రాశాయి. రాజకీయ డీప్‌ఫేక్ వీడియోలు గురించి ప్రధానంగా తెలుగు పత్రికల్లో చర్చ జరిగింది. కృత్రిమమేధతో సృష్టించిన డీప్‌ఫేక్

వీడియో" ఎన్నికల సమయంలో వివాదాస్పదమయ్యాయి. *(Samayam Telugu, 2024).*

**భాషా సాంకేతికత అభివృద్ధి – ప్రభుత్వ మద్దతు :** తెలుగు పాఠకుల కోసం AI4 Bharat వంటి ప్రాజెక్టుల మీద ప్రజల్లో అవగాహన పెంచేందుకు పత్రికలు వార్తా కథనాలు రాశాయి. ఇవి భాషా అసమానత్వం తగ్గించడంలో కీలకంగా పనిచేస్తున్నాయి. AI వినియోగం అన్ని భాషల వారికి సమానంగా వుండేందుకు దేశీయంగా పరిశోధనలు వేగంగా జరుగుతున్నాయి. ఈ AI4 Bharat అనేది IIT మద్రాస్‌వారి ఆధ్వర్యంలో భారత్‌లోని 22 రాష్ట్ర భాషల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఒక సమగ్ర ప్రయోగశాల.

ఇక్కడి ముఖ్యలక్ష్యం భారతీయ భాషల కోసం ఆధునిక కళాసాంకేతికతను నీతివంతంగా, ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారు. భారతదేశంలోని 22 రాష్ట్ర భాషల కోసం ప్రత్యేకంగా రూపుదిద్దబడిన AI పరికరాలు, డేటా సెట్‌లు, మోడళ్లు తయారుచేస్తున్నారు. భాషా అనువాదం, సహజ భాషా అవగాహన, స్పీచ్ రికగ్నైజేషన్, టెక్స్ట్ – టు–స్పీచ్ వంటి ప్రధాన AI టెక్నాలజీల అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారు. ఈ AI రీసోర్సులను ఓపెన్ సోర్స్‌గా అందించి భాషల వైవిధ్యాన్ని కాపాడుతున్నారు. నూతన పరిశోధకులు, స్టార్టప్లు, ప్రభుత్వ రంగసంస్థలతో కలిసి భారతీయ భాషల AI పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. AI4 Bharat ద్వారా భారతీయ భాషల్లో విస్తృత డేటా సేకరణ, మోడల్ అభివృద్ధి, వినియోగ పరికరాల నిర్మాణం జరుగుతుంది. దీని వలన భారతీయభాష సాంకేతిక సమానత్వం సాధ్యమవుతుంది. ఈ సంస్థ భారతీయ భాషల AI రంగంలో కనుగొన్నారు, పారదర్శకత, సామాజిక ప్రతిఫలాలకోసం కృషి చేస్తోంది. ఈ విధంగా AI4 Bharat భారతదేశ భాషల విజ్ఞానంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. భాషల వారసత్వాన్ని ఆన్‌లైన్ ప్రపంచానికి చేర్చే ప్రయత్నం చేస్తోంది.

**ముగింపు :** తెలుగు పత్రికలు భాషా మోడళ్లు అవసరమని స్పష్టంగా రాశాయి. AI4 Bharat ప్రయత్నాలు అనుకూలంగా వున్నాయి. న్యూస్ రూమ్ ఆటోమేషన్ పరిమిత స్థాయిలో తెలుగు పత్రికల్లో AI రైటింగ్ టూల్స్ వినియోగం ఇంకా తక్కువగా ఉంది. కాని భవిష్యత్తులో ఇది పెరగవచ్చని అభిప్రాయం. AI ఆధారిత రిపోర్టింగ్, భాషా అనువాదాలు, టెక్ లిటరసీ ప్రయోజనాలు వున్నాయి. డీప్‌ఫేక్ అసత్య ప్రచారం, ప్రైవసీ ఉల్లంఘన. తెలుగుభాషలో AI మోడళ్లు లేకుంటే ప్రజలు వెనుకబడే ప్రమాదం వుంది. కాని దీనిని అధిగమించడానికి కసరత్తు జరుగుతుంది. AI కంటెంట్ వాడకంలో నిబంధనలు పారదర్శకంగా వుండటం అవసరం. దీనితో కృత్రిమ మేధతో పత్రికావిలువలు కాపాడటం సాధ్యమవుతుంది.

పత్రికలు AI ఎడిటోరియల్ పాలసీలను రూపొందించాలి. జర్నలిస్టులకు డీప్‌ఫేక్‌ను గుర్తించి నిరోధించడంలో శిక్షణ ఇవ్వాలి. తెలుగు డేటాసెంటర్ల అభివృద్ధికి విధాన రూపకల్పన జరగాలి. అందుకు తగినవిధంగా ప్రభుత్వ మద్దతు లభించాలి. ప్రజలకు AI అవగాహన, ప్రచారాలు చేయాలి. తెలుగు పత్రికలు కృత్రిమమేధను రెండు కోణాల్లో చూపుతున్నాయి. ఒకవైపు ఉద్యోగ అవకాశాలు, అభివృద్ధి. మరోవైపు డీప్ ఫేక్, ప్రైవసీ ఉల్లంఘన మొదలయిన ఆందోళనకర పరిస్థితులు. తెలుగు భాషా సాంకేతికతల అభివృద్ధి, కృత్రిమమేధ అమలు, పత్రికల పారదర్శకత వంటి అంశాలు భవిష్యత్ ప్రయోజనాలకు కీలకం అని AI సంస్థలు గుర్తించాలి. అందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

**డా. జీకేడీ ప్రసాద రావు**
ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం,
మొబైల్ : 9393111740.

**ఋగ్వీథి**

| | |
|---|---|
| *జ్ఞానమూర్తిని మన్నింతు, శక్తిమంతు* | *సడలు మేనికి వీవని, బడలు నెదకుఁ* |
| *నానఁ దల నుంతు, పావను నామతింతు,* | *దీయ నగునుడి, వడలు పూఁదీవ కమృత* |
| *ప్రణయనాధునికడఁ జనవున వసింతు,* | *జీవ మిడు వానజడి, దీనపావనుఁ డతఁ* |
| *హాయి జీవింతు ననుచు బ్రహ్మర్షిమాట.* | *డమరు ననునాస యనుచు బ్రహ్మర్షిమాట.* |

కృష్ణశాస్త్రి

# జాతర

– ఆచార్య తంగెడ కిషన్ రావు

*(రెండవ భాగం)*

**3.3 పర్వత సంబంధాలు :** దేవతలకూ, తీర్థాలకే కాదు –పర్వతాలకు, సముద్రాలకు కూడా మన జానపదులు పూజలతో పవిత్ర గుణాన్ని ఆపాదింప చేశారు. జాతరల రూపాల్లో ఉత్సవాలను పాటించారు. పర్వతాలు– గుహలు, జలపాతాలను కలిగి ఉండడం వల్ల నివాస సౌకర్యాన్ని పొంది ఉంటాయి. మూలికల వల్ల ఓషధీ గుణాలను చేకూరుస్తాయి. ఫలాల వల్ల ఆహారాన్ని ప్రకృతి సహజంగా అందజేస్తాయి. అంతేకాదు– పురాణాల్లోనూ, కావ్యాల్లోనూ అభివర్ణింపబడి మహనీయులకు వాసస్థానాలుగా ఒప్పారుతాయి. ఇన్ని విశేషాలు ఉన్నందువల్లనే – **"…….తత్పురీ జనులు కాంస్య మృదంగ ముకుంద వేణుకా/హళ పటహధ్వనుల్ చెలగనాటలు పాటలు నొప్ప నెల్ల వా/రలు జనిచేసి రర్చనలు రైవతకాద్రికి నుత్సవంబుతోన్"** అని, జనులు రైవతక పర్వతమునకు జరిపిన ఉత్సవ విశేషాలను– నన్నయకవి (క్రీ.శ.1023–63) మహాభారత కావ్యం ఆదిపర్వంలో (8–174) వర్ణించి ప్రస్తుంతించాడు.

**3.4 సముద్ర సంబంధం :** ద్వారకా నగరానికి విపత్తు సంభవిస్తుంది, తద్వారా యాదవ కుల నాశనానికి కాలం ఆసన్నమవుతుంది అని, శ్రీకృష్ణుడు నిశ్చయించుకుంటాడు– **"జాతర సేయగా వలయు సర్వ జనంబులు నంబురాశికిన్"** అని , బంధువులకు తెలియజేస్తాడు. నగరంలోని జనానికి తెలిసేలా చాటింపులు వేయిస్తాడు – ఈ విషయాన్ని తిక్కనకవి (క్రీ.శ. 1210–90) తన మహాభారత కావ్యం మౌసల పర్వం(1–24)లో పేర్కొన్నాడు.

సంతోషంతో పాటు వినాశం కూడా పుణ్యస్థలంలో ఆటపాటలతో కూడిన సామూహిక ఉత్సవంలో ఒక భాగంగా జరిగి పోవాలనేది శ్రీకృష్ణుని మనోభావన. గీత వాద్యాలకు అనుగుణంగా నృత్యాలు సాగుతుండగా "ఉదధికి నంచితాక్షిత మహత్తర గంధ విశిష్ట పుష్ప సం/ పదలు బహు ప్రకారముల బ్రస్తుతికెక్కగ బూజ సేసి.." ఆ తర్వాత తాము వెంట తెచ్చిన పలు పదార్థాలను సముద్ర గర్భానికి నైవేద్యంగా యాదవులు సమర్పిస్తారు.

**4. ఆత్మహింస :** తమ శరీరాన్ని తామే హింసించుకుంటూ, భక్తిని వెల్లడించుకునే భావన పురాణ కాలం మొదలుకొని నేటి వరకూ వివిధ సందర్భాల్లో విభిన్నమైన మార్గాల్లో వెల్లడవుతోంది– హనుమంతుడు తన వక్షస్థలాన్ని చీల్చుకొని అందులో శ్రీరాముని సందర్శింపజేసిన దృశ్యాన్ని, అతని పవిత్రమైన భక్తికి మచ్చుతునకగానే పౌరాణిక కథలు వివరిస్తున్నాయి. రావణుని చెర నుండి బయటికి వచ్చిన సీతాదేవి – అగ్ని ప్రవేశాన్ని ఆచరించి, నిల్వగలగడం ఆమెలోని పవిత్రతతో పాటు, ఆమెకున్న పతిభక్తిని కూడా చాటుతూ ఆత్మ హింసకు తార్కాణంగానే నిలుస్తుంది. ఈ విధమైన– శారీరక హింసలు, అగ్నిపరీక్షలు ప్రాచీన కావ్యాలలో కూడా ఇటు భక్తి పరంగా, అటు మొక్కుబడుల స్వరూపంగా కూడా జాతరల సందర్భాల్లో పేర్కొనబడినాయి–

శైవులైన మైలార వీరభటులు సాహసంతో, భక్తి పరవశంతో చేసే చర్యలు, స్వామిని కొలిచే పద్ధతులుగా, మొక్కుబడులు తీర్చుకునే విధంగా ఉండి చూపరులకు గగ్గురుపాటు కలిగిస్తాయి, అనే అంశాన్ని శ్రీనాథ కవి క్రీడాభిరామకావ్యం ఈ విధంగా వర్ణించింది– **"అవఅవమండు నెత్తిని చంద్ర మల్లెల/ చోద్యంపు గుండాలు చొచ్చు వారు/ కరవాడి యులుగుల గనపపాతర్లలో–నుట్టిచేరులు గోసి యుఱుకువారు/ గాలంపుకొంకి కంకాల చర్మము గుచ్చి–యుడు వీధి నుయ్యెల లూగు వారు /కటికి హెన్నాళంబు గండ కత్తెర వట్టి– మిసి మింతులును గాక మ్రింగువారు /సందులను నారసంబులు సలుపు వారు– యెడమ కుడిచేత నారతులిచ్చు వారు"**– మైలార వీరభటులు చేసే ఈ సాహస కృత్యాలన్నీ వీరశైవ మత విజృంభణ కాలాన్ని సూచించేవి. తమ శరీరంలోని అవయవాలు, తమ ప్రాణమే కాకుండా తమలోని మనస్సు కూడా శివుని ఆధీనంలో ఉంటుంది. తాము కేవలం నిమిత్తమాత్రులం అని నమ్మి తమను తామే శివునికి అంకితం చేసుకున్న భక్తుల భయంకర ఆచారాలను ఇవి వివరిస్తాయి. ఇదే పద్ధతిని తెనాలి రామకృష్ణుని (క్రీ.శ.16వ శతాబ్దం) పాండురంగ మాహాత్మ్య కావ్యం (3–77) కూడా– **"అంభోదరము క్రింద నసియాడు నైరావ / తియు బోలె సిడిద్రేలె తెలవ యోర్తు/ చెందమ్మి కొలన రంజిల్లు నంచయు బోలె – నిప్పుటేట చరించె నెలత యోర్తు/ తొలు సంజ యెండ వర్తిలు జక్కవము బోలె/**

**నీగె పందిరి గుండ నింతి యోర్తు/ జల నీలిపై నెక్కు కలువ మొగ్గము బోలె - ననటాకు నర్తించె నతివ యోర్తు/ కాంత యొక్కర్తు మూపున గండలిచ్చె/ మారుగా నిచ్చెనొక సుధా మధురవాణి/ లలన యొక్కర్తు నోరి తాళంబులిచ్చె/ శక్తి జాతర సద్భక్తి శక్తు లెసగ"** అని శక్తి జాతర సందర్భంగా భక్తితో కూడిన శక్తులు తోడు కాగా భక్తులు పాటించిన కఠినమైన పరీక్షలుగా వర్ణించింది.

ఈ విధమైన భయంకర ఆచారాలన్నిటిలోనూ ప్రధానమైన, నేటికీ శైవ జాతరల సందర్భంగా అమితంగా ప్రచారంలో ఉన్నది- 'అగ్గిగుండాలు తొక్కడం'. దీనినే శ్రీనాథుడు-**"అవఅవమందు ఎర్రని చంద్రమల్లెల చోద్యపు గుండాలు"** గా వర్ణిస్తే, తెనాలి రామకృష్ణుడు- "నిప్పు టేరు"గా పేర్కొన్నాడు. ఈ నిప్పుగుండాలు తొక్కడమనే ఆచారానికి సంబంధించి జానపదుల్లో ఒక కథ వ్యాప్తిలో ఉంది. ఆ కథను పరిశీలిద్దాం-దక్షయజ్ఞం సందర్భంగా తనకు కలిగిన అవ మాన బాధను తట్టుకోలేక, సతి దేవి యజ్ఞకుండంలోనే పడి అసువులు బాస్తుంది. విషయం తెలిసిన శివుడు భయంకర రుద్రుడు అవుతాడు. భార్య మరణ వేదన వల్ల అతని కళ్ళు చెమర్చి, కన్నీటిని కురిపిస్తాయి. ఆ కన్నీరు ముల్లోకాలను కాల్చే నిప్పుల వాగై పారుతుంది. మూడో కంటి నుండి నిప్పు కణికలు రాలుతుంటాయి. వాటి నుండి భీకరంగా అరుస్తూ వీరభద్రుడు జన్మిస్తాడు. వీరభద్రుడు ఈ విధంగా నిప్పులో నుండి పుట్టడం వల్లనే అతని భక్తులు నిప్పుల్లో నుండి నడిచే ఆచారాన్ని పాటిస్తూ, అతనిపై తమకు గల భక్తిని ప్రదర్శించుకుంటారని జానపదులు భావిస్తారు.

కానీ, తొలుత మాతృదేవత ఆరాధనలో ఒక అంశంగా స్థిరపడిన ఈ ఆచారం తర్వాత కాలంలో వీరశైవంలోనికి కాలూనినట్లుగా తెలుస్తోంది. శక్తి జాతరల సందర్భాల్లో ముఖ్యంగా ద్రౌపదీదేవి గుడి వద్ద ఇది పాటింపబడటాన్ని మనం గమనించవచ్చు- 'థర్స్టన్ 1901లో మద్రాసులోని సెంట్ థామస్ మౌంట్ వద్ద ఉన్న ద్రౌపదీదేవి గుడి దగ్గర ఈ గుండము తొక్కిన సంరంభాన్ని చూసినట్లుగా వ్రాశాడు. పాండవులైదుగురును అజ్ఞాతవాసానంతరం తమ భార్య అయిన ద్రౌపది శీలాన్ని పరీక్షింపగోరి ఆమెచే గుండము త్రొక్కించిరట' అని, ఉదాహరించడంతోపాటు, 'నెల్లూరు దగ్గర పాండవుల పరస జరుగునపుడు ఈ గుండములు త్రొక్కుట జరుగుతుంది. అప్పుడు అక్కడ చేరిన మాలవారును, పాండవుల వారు అను తెగవారును మహాభారత కథలు పాడుట ఆచారము' అని, నాయని కృష్ణకుమారి గారు తమ సిద్ధాంత గ్రంథమైన 'తెలుగు జానపద గేయ గాథలు'లో పేర్కొన్నారు-

భూమిని కొద్ది లోతు తవ్వి మట్టి తీసి, ఆ భాగంలో పెద్ద కట్టెలను వేసి, అవి నిప్పు కణికలుగా మారిన తర్వాత, నిప్పు గుండాలను తొక్కడం అనే ప్రక్రియను పాటిస్తారు. దీనిని ఒక అద్భుతమైన చర్యగా భావించిన జానపదులు, దీని వెనకాల దైవిక శక్తుల ప్రాబల్యం ఉన్నట్లుగా ప్రగాఢంగా విశ్వసిస్తారు. కానీ, ఆధునికులు మాత్రం- ప్రజలలో విజ్ఞాన లోపం వల్లనే ఆ నమ్మకాలకు వ్యాప్తి కలుగుతుందని, ఈ నిప్పు గుండాలను అందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చునని, దీనిని ఆచరించడం కూడా అతి సులభమని భావించడంతో పాటు శాస్త్రీయంగా ప్రదర్శిస్తూ నిరూపిస్తున్నారు.

**5. జంతు బలి :** జాతరల్లో జంతుబలి సర్వసామాన్యమైన విషయం. సందర్భం ఏదైనా జంతుబలి అన్ని ఉత్సవాల్లోనూ ఒక భాగంగానే పరిగణించబడింది. రాజులు తమ వీరత్వాన్ని పరిరక్షించుకొని రాజ్యాలు గెలుచుకునే పూర్వకాలంలో అయితే జంతుబలి మితిమీరి ఉండేది- **"అఖిల భూతంబుల కాచారముగాను/ ఘనమైన పోతుల గావు చెల్లించి"** అని, పల్నాటి వీర చరిత్రకావ్యంలో శ్రీనాథుడు పేర్కొన్న జంతుబలి అటువంటిదే. జంతుబలి ద్వారా నైవేద్యాలను పెట్టి భూతాలను సంతృప్తిపరిస్తే, దానివల్ల భూతాల పీడ విరగడైపోతుంది అనేది, ఒక విశ్వాసం, ఈ జంతుబలిని 'గావు' పట్టడం అనే ఆచారం ద్వారా కూడా నిర్వహిస్తారనే విషయాన్ని శ్రీనాథుడు ఇందులో పేర్కొన్నాడు. ఇందులోని 'పోతు' శబ్దం-గొఱ్ఱెకు, మేకకు, దున్నకు కూడా వర్తిస్తుంది. నేటికీ వీటి బలిని శక్తి జాతర సందర్భంగా గమనించవచ్చు-

జంతువుకు స్నానం చేయించి, శక్తిదేవర ముందు పూజించి, బొట్టు పెట్టి, కల్లు తాగించి, ధూపాన్ని వేసి, వాద్యాల ధ్వనులు మిన్నుముట్టగా-దాదాపు అదే స్థితిలో ఉన్న వ్యక్తి తన పల్లె ద్వారా దాని మెడను గట్టిపట్టుతో కొరికి చంపడాన్ని' గావు పట్టడం' అంటారు. ధూర్జటికవి (క్రీ.శ. 16వ శతాబ్దం) శ్రీకాళహస్తి మాహాత్మ్యం కావ్యం కూడా- కాత్రేని జాతరలో గావు పట్టడం లాంటి ఆచారాన్ని పాటిస్తారనే విషయాన్ని **"మెకము గొనివచ్చి మిడిగ్రుడ్లు / పొడిచి, నీట శిరము దడిపి తోక/ గోసి, ధూప మిచ్చి మీసంబు పెకిలించి/ కానుకిచ్చి.."** (3-49) అంటూ

వివరించింది. కాటికి అధిపతి అయిన శివుడే కాట్రేడు. కాటిలో సహజంగా నివసించే భూత ప్రేత పిశాచాలు విజృంభించకుండా వాటిని తన ఆధీనంలో ఉంచుకునే దేవుడీతడు. ముఖ్యంగా ఆటవికులకు అత్యంత ప్రియుడు. అందుకే అతని జాతరలో జంతుబలిని గూర్చి కవి ప్రత్యేకంగా పేర్కొన్నాడు. ఈ విధంగా జానపదులు జాతర సందర్భాల్లో జంతుబలిని విధిగా పాటిస్తారు. వీటిలో గొఱ్ఱె, మేక, కోడి ఎక్కువగా ఉన్నా, ప్రాంతాన్ని బట్టి దున్నపోతుల బలి కూడా అక్కడక్కడా ఉంటుంది.

జానపదులు బలిని 'హారం' అని కూడా పిలుస్తారు. 'హారం' 'ఆహారం' అనే పదానికి ప్రత్యామ్నాయం. 'ఆహారం' అనే పదంలోని తొలి అక్షరమైన 'ఆ' లోపించి, వ్యవహారంలో అది 'హారం'గా మిగిలిపోయింది. అట్లాగే 'భోజనం' 'బోనం'గా మారడం దీనికి సంబంధించిందే. జంతుబలిని-దేవతకు నైవేద్యంగా సమర్పించే ఆహారం గానే భావించాలి. దేవతకు బలి పేరుతో నైవేద్యాన్ని సమర్పించిన తర్వాత భుజించడాన్ని, దేవుడు తమకు మిగిల్చిన ఆహారంగానే జానపదులు తలుస్తారు. కేవలం మొక్కుబడులే కాక జాతరలో మద్యం, మాంసాల జోరు కూడా అధికంగా ఉండడం, జంతుబలి ఎక్కువగా జరిగేందుకు కారణంగా నిలిచింది -

**"అఖ్ఖులు ద్రెంచి దానవుల నాహవ భూమి విభుండు గూల్చినన్ / గొఱ్ఱెల దెచ్చి జాతరకు గోసిన పోలికనుండె...."** (3 -129) అని, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు (క్రీ.శ. 15 శతాబ్దం ఉత్తరార్థం) జాతరల్లో ఉద్ధృతంగా జరిగే జంతుబలిని గూర్చి తన 'శృంగార శాకుంతలం' కావ్యంలో స్పష్టంగా పేర్కొన్నాడు-నేటి నల్లగొండ జిల్లాలోని' పిల్లలమఱ్ఱి' అనే గ్రామాన్ని ఈ కవి నివాసంగా చెప్తారు. ఈ గ్రామానికి కొద్ది మైళ్ళ దూరంలోనే అత్యంత ప్రాచీన కాలం నుండి యాదవులచే ప్రత్యేకంగా 'లింగమంతుల' జాతర జరుపబడుతోంది. తమకు గొర్రెలను సంపదగా ఇచ్చి వాటిని అభివృద్ధి చేసి తమకు మనుగడను ప్రసాదించే లింగమంతునికి, ఆ గొర్రెలను సమర్పించి మొక్కు తీర్చుకునేందుకే తాము జాతర జరుపుకుంటామని ఇక్కడి యాదవులు పేర్కొంటారు. ఈ జాతరలో బలి అయ్యే గొర్రెలు గుట్టలుగా పడి ఉండడం వల్ల, ఈ హింసకు వ్యతిరేకంగా ప్రభుత్వం గతంలో చట్టాన్ని కూడా తెచ్చింది. ఈ విధంగా తన ప్రాంతంలో జరుగుతున్న లింగమంతుల జాతర వల్ల కలిగిన స్ఫూర్తితోనే **"దానవుల నాహవ భూమి విభుండు గూల్చిన గొఱ్ఱెల"** రూపాలను కవి అయిన పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు తన కావ్యంలో దర్శింపజేశాడని భావించే వీలుంది. ఈ విధంగా-జాతరలో జంతుబలి ప్రాధాన్యం అధికంగా కనిపిస్తుంది. దానికి కారణం-మొక్కుబడుల పేరుతో దేవతలను సంతృప్తి పరచడమే అనేది జానపదులు తెలిపే ప్రత్యక్ష కారణం. కానీ, జానపదుల ఉత్సాహమే ఊపిరిగా రూపుదిద్దుకునే ఉత్సవాలైన ఈ జాతరలలో- మాంసాహార ప్రీతి కూడా పరోక్ష కారణంగా నిలుస్తుందని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు.

**6. జాతరలు - ఆహారం :** సామూహిక ఉత్సవాలైన జాతరలలో సమూహంగా కలిసి భుజించడమే ఒక మధురస్మృతిగా నిలిచిపోయే ఘట్టం. అందువల్ల జాతర ప్రయాణం అనగానే ఎవరికి వారు పలు రకాల వంటకాలను సిద్ధం చేసి, తీసుకుపోయే ప్రయత్నంలో తలమునకలవుతారు. ఇదే విషయం- **"అధిక సంభ్రములై యా/దవులు మనోజ్ఞములగు సీ /ధువులను మాంసములు వేడుకతో.."** ప్రతి ఇంటా, సమకూర్చుకున్న విషయాన్ని తిక్కన కవి తన మహాభారత కావ్యంలోని మౌసల పర్వం (1-28)లో పేర్కొన్నాడు. ఈ విధంగా-జాతరలో జంతుబలి మరియు మాంసాహారం అధికంగానే వర్ణింపబడినా, శాకాహారుల ఆహారాన్ని తెలియజేసిన సందర్భాలు కూడా కావ్యాల్లో ఉన్నాయనేందుకు, శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్య కావ్యాన్ని ఉదహరించవచ్చు- కమ్మని పిండి వంటలతో, నేతితో, నిర్మల అన్నముతో, రసాల మామిడిపళ్ళతో "జాతర చేసే బ్రాహ్మణుడు చండికి" (4-8) అని, శాకాహార మధుర పదార్థాలను చండికకు నైవేద్యంగా పెట్టిన బ్రాహ్మణుని వైనాన్ని ఈ కావ్యం ప్రస్తుతించింది. కొన్ని జాతరల్లో బోనాలది ప్రత్యేకమైన ఘట్టం- అందువల్ల వాటిని బోనాల పండుగ అనే పేరుతో పిలుచుకోవడం ఉంది. అందుకు ఉదాహరణగా-212 సంవత్సరాలకు (క్రీ.శ. 1813) పైగా జరుపబడుతూ, దేశవ్యాప్తంగా పేరు పొందిన సికింద్రాబాద్ మహంకాళి జాతరను ఉదహరించవచ్చు. మహానగరంలోని రహదారి కూడళ్ళలో-కనీసం ఒక్కరోజైనా గ్రామీణ వాతావరణాన్ని కనిపింప చేయడం ఈ బోనాల పండుగలోని విశిష్టత. నేటి నగరం నిన్నటి గ్రామం నుండే ఉద్భవించింది అనేందుకు ఇదొక ప్రత్యక్ష సాక్ష్యం. కోరికలు తీరి మొక్కుబడులు తీర్చుకునే వాళ్ళు, ప్రత్యేకమైన కోరికలతో

దేవతకు మొక్కుకునేవారు, చర్విత చర్వణంగా బోనాలను సమర్పించుకోవడం ఈ జాతరలోని ప్రధాన అంశం. బోనం అంటే భోజనమే. తమ మొక్కులను తీర్చుకోవడమే కాదు, తమకు అన్నాన్నిస్తున్న తల్లికి కృతజ్ఞతా సూచకంగా, పవిత్రమైన బోనం కుండలో భోజనాన్ని వండి సమర్పించు కోవడమే, ఇందులో కనిపించే మౌలికమైన విషయం. ఈ బోనాల ఆచారం ప్రాచీన కాలంగా అమల్లో ఉన్నదనేందుకు– **“నానావిధపాకములుగ /నానాలుగా జేసి నాలుగై దట్టి కలన్/బోనాము దొంతి బేర్చిరి”** అని పేర్కొన్న శ్రీనాథుని హరవిలాస కావ్యం (2–123) అందుకు ఉదాహరణగా నిలుస్తుంది.

ధూర్జటి, శ్రీకాళహస్తీశ్వరమహాత్మ్యం కూడా గ్రామీణ జాతర వాతావరణాన్ని సృష్టించి, జానపద జీవితానికి దర్పణం పడుతుంది–పువ్వుల వలె వండి వార్చిన ఉపాహార భాండాలు, పాయసాల కుండలు, కుడుముల బానీలు, పిండి కూరల చట్లు, నానావిధాలైన మాంసాల అటికలు మొదలైన ఎన్నో తినుబండారాలను గంపల్లో, కావిళ్ళలో పెట్టి తీసుకురావడంతోపాటు, బలినిచ్చేందుకు ప్రముఖమైన ఆటవిక మృగాలను కూడా పట్టుకుని, **“బండి కట్టుకొని.... తప్పెట చప్పుళ్లను.... మ్లేచ్ఛుల పాటల..”** (3–36)తో కాట్రేని గుడికి ఆటవికులు నడిచి వెళ్లిన యాత్రాదృశ్యాన్ని కవి కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు.

**ముగింపు :** ఈ విధమైన ఎన్నెన్నో దృశ్యాలు ఎక్కడెక్కడి నుండో జాతర స్థలంలోకి వచ్చి గుమిగూడుతాయి. అప్పుడు వెల్లువలా పొంగిపొర్లే సంతోషం నిండిన మనస్సులు, సంభ్రమంతో నిండిన కళ్ళు జన సందోహం రూపంలో కనిపిస్తాయి– **“నలువుగ కాకుళేశు తిరుణాళుల లోపల గుండ మంత్రి ని/ర్మల మతి బిట్టు వేగముగ మాడలు రత్నచయంబు జల్లగా”** అనేది, మంచన కవి (క్రీ.శ.1182–1206) కేయూర బాహు చరిత్ర (1–45)లో గుండన మంత్రి దానగుణాన్ని కీర్తించే సందర్భం. అయినప్పటికీ ఆ వర్ణన శ్రీకాకుళేశ్వరుని తిరుణాలకు (విజయవాడ సమీపంలోనిది) వచ్చే సామాన్య జన సమూహ సంరంభాన్ని తెలియజేస్తుంది. ఈ విధంగా ప్రజాసమూహం ఒకచోట గుమిగూడటం వల్ల– నిత్యావసర వస్తువులు, గృహ సౌకర్యాలకు సంబంధించిన ఇతర వస్తువులు, అలంకార వస్తువులు, వృత్తి సంబంధమైన వస్తువులు, దుస్తులు, తినుబండారాలు – దుకాణాల ద్వారా వెలసి వ్యాపారం అభివృద్ధి అవుతుంది. ప్రజలు కూడా తమకు కావలసిన ఎన్నో వస్తువులను ఒకేచోట కొనే అవకాశాన్ని వినియోగించుకుంటారు. అందువల్ల జాతరలు– జానపదులకు, గిరిజనులకు విజ్ఞాన వస్తు ప్రదర్శనశాలల (ఎగ్జిబిషన్) వలె ఉపయోగపడతాయి. ఇవి, వారు ఉత్పత్తి చేసిన లేదా సృజనాత్మకంగా తీర్చిదిద్దిన వస్తువుల విక్రయానికి కేంద్రాలుగా కూడా తోడ్పడతాయి. అవి– వారు పండించిన ధాన్యం కావచ్చు, ఫలాలు, చింతపండు, కట్టెలు మొదలైన అటవీ సంపద కావచ్చు. దువ్వెనలు, మట్టి పాత్రలు, చెక్క బొమ్మలు, అల్లికలు ,దంతపు బొమ్మల వంటి హస్తకళలు కావచ్చు. ఈ విధంగా ఇది అంతర్ సమూహ వ్యాపారం (ఇంటర్ గ్రూప్ ట్రేడ్)గా కూడా పరిగణించబడుతుంది. ఈ విధంగా తమ సంపదను విక్రయించే డబ్బును తీసుకునేందుకు బదులుగా, వస్తు మార్పిడి పద్ధతిలో వస్తువుల కొనుగోలు కూడా వీరు పాటిస్తారు. ఈ పద్ధతి నేటికి కొనసాగుతున్నదనేందుకు వరంగల్ కు 60 కి.మీ. దూరంలోని కుర్వి (కొఱవి) అనే ప్రాంతంలో ప్రతి సోమవారం నిర్వహింపబడే జాతరను ప్రత్యక్ష సాక్షంగా పేర్కొనవచ్చు–ఇక్కడి దైవం 'కురివి' వీరన్న (వీరభద్రస్వామి). క్రీ.శ. 800 నాటి తూర్పు చాళుక్యుల కాలపు ఈ విగ్రహం, కాకతీయుల కాలంలో పునరుద్ధరింపబడింది, అని చరిత్రకారుల కథనం. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ జరిగే జాతర – జానపదులతో పాటు గిరిజనులైన లంబాడీలకు కూడా అత్యంత ప్రీతిని కలిగిస్తుంది.

ఈ విధంగా – జాతర అంటే? సందడి– సంతోషం– పిల్లాపాపలతో కూడి జరిపే యాత్ర. వస్తువుల కొనుగోలు– వినోద, విజ్ఞాన ప్రదర్శనశాల–భక్తి– మొక్కుబడులు– దైవప్రసాదం– తీపి వస్తువులు– వ్యాపారం, ఇలా ఎన్నెన్నో అనుభవాలను స్మృతి పథంలో నిలిపి ఉంచే ఒక దివ్యమైన అనుభూతి. అందుకే, జాతరకు పోతే పుణ్యం , పురుషార్థం రెండూ దక్కుతాయి. అంతేకాకుండా, జాతరలు – జనసామాన్యం మధ్య ఉత్సాహాన్ని, సత్సంబంధాన్ని, సామూహిక తత్త్వాన్ని, మతసామరస్యాన్ని కూడా పెంపొందింప చేస్తున్నాయి. జాతరలకు మూలం మతమే అయినా, అవి మంచినే తమ అభిమతంగా కలిగి, జాతి సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

**ఆచార్య తంగెడ కిషన్ రావు**
పూర్వ వైస్ ఛాన్సలర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైద్రాబాద్, ఫోన్ : 7702414100

# ఆయా సోఫియా

## (మ్యూజియం)

*– టి.వి. ప్రసాద్*



ఆయా సోఫియా

ఇస్తాన్‌బుల్‌లోని ముఖ్యమైన బైజాంటైన్ కట్టడం ఆయాసోఫియా. క్రైస్తవ సాధారణ యుగంలో మొట్టమొదటి (CE) చర్చిగా 6వ శతాబ్దంలో నిర్మించబడిన ఇది ప్రపంచ గొప్ప కట్టడాల్లు ఒకటిగా గుర్తింపు పొందింది. బైజాంటైన్ చక్రవర్తి జస్టీనియన్ I చేత నిర్మించబడిన చర్చి తర్వాతి శతాబ్దాల్లో మజీద్‌గా, మ్యూజియంగా, మళ్ళీ మజీద్‌గా మార్పుచెందింది. ఇది అనేక శతాబ్దాల్లో జరిగిన రాజకీయ, మత మార్పులను ప్రతిబింబిస్తుంది. ఆకర్షణీయమైన విలాసవంతమైన క్రిస్టియన్ మొజాయిక్‌ల, ఇస్లామిక్ శాసనాల, అందమైన కాలిగ్రఫీల, పొడమైన మినారెట్ల నిలయం.

**చరిత్ర:** ఆయా సోఫియా చరిత్రను తెలుసుకోవడం అంటే వివిధ కాలాల్లోని బైజాంటైన్ చక్రవర్తుల చరిత్రను తెలుసుకోవడమే. 352 CEలో కాన్‌స్టాంటైన్ I పాత పేగన్ దేవాలయ పునాదుల మీద దీన్ని నిర్మింపజేశాడు. అతని కుమారుడు కాన్‌స్టాంటియస్ 360 CEలో బాసిలికా (చర్చి)గా ప్రారంభించాడు. ఇది మొట్టమొదటి ఆయాసోఫియా నిర్మాణం. ఇది అగ్నిప్రమాదంలో బుగ్గి కాగా తర్వాతి చక్రవర్తి థియోడోసియన్స్ II రెండవ ఆయాసోఫియాను నిర్మింపజేసి 415CEలో మళ్ళీ ప్రారంభించాడు. ప్రస్తుతం మనం చెప్పుకుంటున్న నిర్మాణం మూడవది. ఇది జస్టియన్ చక్రవర్తి 532–537CEల మధ్య నిర్మింపజేసింది. తర్వాత ఈ నిర్మాణంలో అనేక మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. నాలుగవ క్రూసేడ్ సమయంలో తప్ప మిగతా కాలం అంతా బైజాంటైన్ చర్చిగా ఉండిపోయింది. మధ్యలో కొంత కాలం కాథలిక్ చర్చిగా మార్చబడింది. 1435CEలో ఓటోమన్‌ల ఆక్రమణ తర్వాత అంతవరకు చర్చిగా కొనసాగిన ఈ కట్టడం మజీద్‌గా మార్చబడింది. టర్కీ రిపబ్లిక్ (1923) అవతరణ తర్వాత రిపబ్లికన్ ప్రభుత్వం దీన్ని మత ప్రమేయం లేని మ్యూజియంగా మార్చివేసింది. 2020 లో జరిగిన రాజకీయ మార్పుల కారణంగా ఆయా సోఫియా మళ్ళీ మజీద్‌గా మార్చబడి అలాగే కొన సాగుతోంది.

404 CE నాటి ఆయా సోఫియా 532 CEలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోగా రోమన్ చక్రవర్తి కాన్‌స్టాన్స్I దీన్ని పునర్నింపజేశాడు. నికా తిరుగుబాటు కారణంగా 532 CE లో మరొకసారి జరిగిన అగ్ని ప్రమాదం జస్టీనియన్Iకి ఒక గొప్ప వైభవోపేతమైన, అతి పెద్ద చర్చిని నిర్మించాలన్న సంకల్పానికి బీజం వేసింది. ఫలితంగా అతి తక్కువ కాలం ఆరు సంవత్సరాలలోనే ఆయా సోఫియా నిర్మాణం 537 నాటికి పూర్తి అయింది. నాటి వాస్తు శాస్త్రవేత్తలు ఏన్‌థిమియస్, ఇసిడోర్ లు యంత్ర పరిజ్ఞానంలో, గణిత శాస్త్రంలో, వాస్తు సాంకేతికతలో ఉద్దండులు. వారి నిర్మాణ నేతృత్వంలో ప్రపంచంలోని ఈ గొప్ప నిర్మాణం సాధ్యమైంది. మధ్యలో వచ్చిన భూకంపాల్ని తట్టుకుని నిలబడగలిగింది. 558CEలో జరిగిన భూకంపంలో నిర్మాణం పైన అమర్చిన అతిపెద్ద గోళం (Dome) పాక్షికంగా దెబ్బతినగా అది మరమ్మత్తులు చేయబడింది. చర్చి గోడలకు వెలుపలి వైపున రక్షణ కవచంలాంటి (Support) గోడలు నిర్మించబడ్డాయి. 1204లో వెనిస్ క్రూసేడ్ల దోపిడీకి గురైంది. అన్ని రకాల విపత్తులను తట్టుకుని ఒక సహస్రాబ్దికి పైగా ఆయా సోఫియా కాన్‌స్టాంట్ నోపుల్ గొప్ప చర్చిగా చరిత్ర సృష్టించింది. 14వ శతాబ్దంలో పునరుద్ధరణ పనులు జరిగాయి.



ఆయా సోఫియా మజీద్, ఇస్తాంబుల్

టర్కిష్ ఆక్రమణ తర్వాత కాన్‌స్టాంట్ నోపుల్ ఇస్తాంబుల్‌గా మారిపోయింది. మహ్మద్ II ఆయాసోఫియా చర్చిని మజీద్‌గా మార్చాడు. ప్రార్థనలకు పిలుపు నివ్వడం కోసం బయటివైపు చెక్క స్తంభాన్ని, పెద్ద షాండలీర్‌ను, మక్కాదిశను సూచించే మిహ్రాబ్ (గూడును), ప్రార్థనావేదిక (మిన్బార్)ను నిర్మింపజేశాడు. ఇలాంటివే మరికొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. 1934లో టర్కీ అధ్యక్షుడు కెమల్ అటాటర్క్ భవనాన్ని మతాలకతీతంగా మ్యూజియంగా మార్చాడు. 1985లో యునెస్కో ఆయా సోఫియాను, అక్కడికి చారిత్రక నిర్మాణాలను కలిపి ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించింది. టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్ మ్యూజియంను తిరిగి మజీద్‌గా మార్చాలని 2020లో తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. క్రైస్తవ చిహ్నాలు కనబడకుండా తెరలు వేసి, మార్చబడిన మజీద్‌లో ప్రార్థనలు జరిగాయి. అప్పటినుండి ఇది మజీద్‌గా సంస్కృతీ, చరిత్రల నిలయంగా ఇస్తాన్‌బుల్‌లో బహుళ ప్రాచుర్యం పొందిన టూరిస్టు ఆకర్షణగా, సందర్శనాస్థలంగా కొనసాగడం ఆయా సోఫియా నిర్మాణ విశేషం.

**కట్టడం పేరు – ఉచ్చారణ Hagia Sophia .** మొదటి చర్చిగా నిర్మించ బడినప్పుడు బైజాంటియన్లు పెట్టిన పేరు. దీన్ని ప్రాచీన గ్రీకుభాషలో ఆయాసోఫియా అని ఉచ్చరిస్తారు. లాటిన్‌లో దీన్ని 'శాంక్టా శాపియంటా (Sancta Sapienta) అంటారు... అంటే 'పవిత్ర విజ్ఞానం' అని అర్థం. ఇది టర్కీల వశమై మజీద్‌గా మార్పుచెందినా, పేరులో మార్పు రాలేదు. వాడుకలో దీన్ని 'ఆయా సోఫియా గ్రాండ్ మాస్క్' అని అంటారు. ఆంగ్లంలో హాజియా సోఫియా అని రాసి, అలాగే పలుకుతారు. అధికారికంగా ఒకనాటి చర్చి, నేటి ప్రముఖ చారిత్రక, సాంస్కృతిక కేంద్రంగా సేవలందిస్తున్న గొప్ప మజీద్‌గా కొనసాగుతోంది.

**నిర్మాణ విశేషాలు :** మధ్యలో కేంద్ర భవనం వుండి, నిలువుగా దీర్ఘచతురస్రాకారంలో వుండే అసలైన (Original) కట్టడం. ఇది 82 మీటర్ల (269 ') పొడవు, 73 మీటర్ల (240 ') వెడల్పు, 55 మీటర్ల (180 ') ఎత్తు ఉన్న బృహన్నిర్మాణం. కట్టడ నిర్మాణంలో ఏష్లర్ అనే రోమన్ ఇటుక వాడబడింది. నిర్మాణ గొప్పతనం అంతా దానిపైన అమర్చిన గుమ్మటం (Dome)లో ఉంది. అత్యంత భారీగా 32 మీటర్ల (105 ') వ్యాసం, పొడవుగల డోమ్. నాలుగు వైపులా ఉన్న ఆధార స్తంభాలపైన (pendentives) నిలబెట్టబడింది. అదీ భూమికి $182^{1/2}$ అడుగుల ఎత్తు మీద నిలబెట్ట బడడం నాటికీ నేటికీ ఒక సాంకేతిక అద్భుతంగా పరిగణించబడుతోంది. జస్టీనియన్ నిర్మింపజేసిన డోమ్‌లున్న బాసిలికాలు, మరికొన్ని బైజాంటైన్ వాస్తుకళను అనుకరించినా, అభివృద్ధి చెందినా ఆయాసోఫియా మాత్రం తన ప్రత్యేకతను నిలుపుకుంది. దానిక్కారణం అది దేనికీ అనుకరణ కాకపోవడం. ప్లాన్‌లో ఇది దాదాపు చదరంగా కన్పిస్తుంది. కానీ లోపలినుండి చూస్తే దీర్ఘచతురస్రాకారంలో ఉంటుంది. తూర్పు పడమరల్లో వున్న సెమీడోమ్‌లవల్ల దీని పైకప్పు చాలా పొడవుగా ఉన్నట్లనిపిస్తుంది.

చర్చి మధ్యలో వున్న స్తంభాల వరసలు అంతర్భాగంలోని మూడు నడవలు, నడవల కిరువైపులా పైన ప్రేక్షకులు చర్చి కార్యక్రమాలని కూర్చుని చూడడానికి వీలుగా రెండస్తుల గాలరీలు, నిలువుగా వున్న ఉత్తమశ్రేణి పాలరాతి స్తంభాల వరసలు, వివిధ వర్ణాల్లో వైవిధ్య భరితంగా ఉంటాయి. గాలరీల పైన పాలరాతి తెరలు డోమ్ దిగువ వరకు ఉండి, డోమ్ చుట్టూ నిర్మించిన కిటికీల నుండి వచ్చే పగటి వెలుతురులో ఆధార స్తంభాలపైనున్న చర్చి పైభాగం అంతా (మంటపం) డోమ్‌తో సహా గాలిలో తేలియాడుతున్న భ్రమ కలుగుతుంది. స్తంభాల పైభాగంలోని పీఠాలు (కార్నీస్‌లు), స్తంభాలకూ, పైకప్పుకూ మధ్యన ఆధారంగా ఉండే పీఠాలు (కాపిటల్స్) నగిషీలతో నిండి వుంటాయి. అవి మాత్రం దాదాపు చెక్కు చెదరని స్థితిలో ఉంటే, మొదట్లో చేసిన అలంకరణలు, బంగారుపూతలు, చాలావరకు మొజాయిక్‌లు, గోడల పైభాగాలు, పైకప్పులోని బైజాంటైన్ కళ అంతా శిధిలమై పోయింది. వాటినన్నింటినీ తొలినాళ్ళ చరిత్రకారులు గొప్పగా వర్ణించారు. ఐనా మిగిలిపోయిన కళాకృతుల ఆధారంగా ఆయాసోఫియా వాస్తుకళకూ, అలంకరణ కళకూ, డోమ్ నిర్మాణ

సాంకేతికతకూ సాటిలేని ప్రపంచ ప్రఖ్యాత కట్టడాల్లో ఒకటిగా నిలిచి పోయింది.

**మొజాయిక్‌లు (Mosaics)** : మొజాయిక్ అంటే రంగురాళ్ల, పింగాణీ పలకల, ఇతర వస్తువుల (గవ్వలు మొ.) రాతిముక్కల అందమైన డిజైన్ల అమరిక. మొజాయిక్ అలంకరణలు సాధారణంగా నేలమీద, గోడలపైన కన్పిస్తాయి. ఆయాసోఫియాలోని మొజాయిక్‌లు నాటి కళాకౌశలాన్ని తెలుసుకోవడానికి ముఖ్యమైన ఆధారం అని చరిత్ర కారులు భావిస్తారు. విగ్రహారాధన వ్యతిరేకత (Iconoclasm) (8-9శ) ముగిసిన తర్వాత చర్చిలో చోటుచేసుకున్న పునరలంకరణ వివరాలను, విశేషాలను ఇటీవలి కాలంలోని చరిత్రకారులు తవ్వితీశారు. రంగుల ఉపయోగంలో, సాంకేతికతలో తొలి బైజాంటైన్ ప్రభావాన్ని గుర్తించారు. స్వచ్ఛమైన, శక్తివంతమైన రంగులు, వాటి ఛాయలు (tints) రాళ్ళను, బంగారు రేకులు, పూతల మధ్య పొదిగే నాటి సాంకేతిక పరిజ్ఞానాన్ని గుర్తించారు. ఈ దశలో వెలుతురును గురించిన పరిజ్ఞానం ఎక్కువ. చర్చి పై భాగంలోని గాలరీల్లో బంగారు పూతల నేపథ్యంలో అమర్చిన విధానం వల్ల వెండి ముక్కలు వెలుతురులో మెరిసిపోతుంటాయి. మఖాల్లో పొదిగిన అలంకరణ రాళ్ళ వల్ల గీతలు అలలు అలలుగా కదులుతున్న భ్రమను కలిగిస్తాయి. ఆనాటికి అది నూతన శైలి. వర్ణానికి, వర్ణ ఛాయలకన్న రూపానికి ప్రాధాన్యత నివ్వడం కనబడుతుంది. దీన్ని అలంకరణ కళలో గొప్ప ప్రగతిగా చరిత్రకారులు గుర్తించారు. చిత్రాలను అమర్చిన విధానంలోనూ కొత్త లక్షణాలు కన్పిస్తాయి. చర్చి ముఖ్య భాగంలో (Apse) గుమ్మటం కింద బిడ్డతో కూర్చుని వున్న కన్య (Virgin) చుట్టూ బంగారు తాపడం ఉంటుంది. చలనం లేని రూపాన్ని ప్రత్యేకంగా చూపించే మొజాయిక్ చిత్రాలకు కూడా బంగారు తాపడం చేయడం కూడా 8వ శతాబ్దం ముందువరకు ఉన్న లక్షణంగా గుర్తించబడింది. ఇది 9వ శతాబ్దం నాటికి అలంకరణ కళలో ముఖ్య సూత్రంగా మారిపోయింది.

**బైజాంటైన్ నిర్మాణ శైలి :** ఇప్పుడు మనం ఇస్తాంబుల్‌గా చెప్పుకుంటున్న నాటి కాన్‌స్టాంట్ నోపుల్ ప్రాచీన బైజాంటైన్ (330శ తర్వాత) వాస్తుశిల్పులు, క్రైస్తవమత ప్రభావానికి లోనైనవారు, రోమన్ దేవాలయ వాస్తు లక్షణాల మీద ఆధారపడినట్లు తెలుస్తుంది. బాసిలికా ప్లాన్‌లో మధ్యలో వున్న కేంద్రకం గ్రీకు క్రాస్ ఆకారంలోనూ (చదరపు ప్రార్థనా మందిరం) నాలుగు గోడల వైపులా ఒకే పొడవు బాహువులతోను వుంటుంది. మరొక ప్రత్యేక లక్షణం పైకప్పు డోమ్ ఆకారంలో వుండటం, నాలుగువైపులా నిర్మించిన ఆధారపు గోడల మీద డోమ్‌ను నిలబెట్టడానికి వారు రెండు రకాల సాంకేతికతను ఉపయోగించుకున్నారు. చర్చి ప్రతి మూలను కలుపుతూ ఆర్చిని నిర్మించి ఆపైన గ్లోబ్‌ను నిలబెట్టడం ఒక పద్ధతి. డోమ్ బరువు అంతా ఆర్చీల ద్వారా గోడలకు బదలాయించడం జరుగుతుంది. లేదా పెండెంటివ్‌లు, అర్ధచంద్రాకారపు ఆర్చీలమీద డోమ్‌ను నిలబెట్టడం. ఆకాశాన్నంటే ఎత్తైన గోడల మధ్య విశాల స్థలం, పుష్కలంగా ఉండే అలంకరణలతో నిండిన నిర్మాణాలు బైజాంటైన్ వాస్తు మరో లక్షణం - పాలరాతి స్తంభాలు, వాటిపైన పూలతీగల డిజైన్లు, గుప్తస్థానాలు, ఖజానాగదులు, గోరీలు మొదలైన (Vaultes) వాటి మీద మొజాయిక్ అలంకరణలు, పరచిన రాతినడవలు, బంగారు తాపడపుపై కప్పులతో కాన్‌స్టాంట్ నోపుల్ వాస్తు కళాశైలి తూర్పు దేశాలకు, రష్యాకు వ్యాపించింది.

19వ శతాబ్దపు డ్రాయింగుల వల్ల ఆయాసోఫియా లోపల మత ప్రవక్తల సమగ్ర చిత్రాలున్నట్లు తెలుస్తుంది. చర్చి మధ్య భాగంలోని (నాభి) గోడలపై వీరి చిత్రాల్లో కొన్ని బతికి బట్ట కట్టాయి. అందులోని డ్రాయింగుల ప్రకారం ప్రసిద్ధి చెందిన ప్రవక్తల రూపాలు, వాటికింద బిషప్‌ల రూప చిత్రాలు ఉన్నట్లు ఆపైన గోడల మీద దేవతల రక్షక శ్రేణి, మధ్యభాగంలో క్రీస్తు మొజాయిక్ రూప చిత్రం ఉన్నట్లు తెలుస్తుంది. ఇవన్నీ తర్వాత నిర్మించబడిన చర్చిలలో ఆమోదయోగ్యమైన మధ్యయుగ వాస్తు శాస్త్ర లక్షణాలుగా చర్చి అలంకరణకు నమూనాలుగా మారిపోయాయి. ఆయాసోఫియా బైజాంటైన్ కట్టడాలలో అత్యంత ప్రసిద్ధికెక్కిన నిర్మాణం. దీని అంతర్భాగంలోని ప్రతి అంశమూ - మొజాయిక్‌లు, పాలరాతిస్తంభాలు, వాటి పైని చెక్కడాలు అన్నీ గొప్ప కళాత్మక విలువ కలిగినవి. జస్టిన్ చక్రవర్తి స్వీయపర్యవేక్షణలో నిర్మితమైన ఈ కట్టడం ఒక వెయ్యి సంవత్సరాలవరకు (స్పెయిన్ సెవిల్ కెథీడ్రల్ వెలిసే వరకు) సాటిలేని గొప్ప కెథీడ్రల్‌గా ప్రఖ్యాతిగాంచింది. ఈ చర్చి నిర్మాణంలో ఇటుక, గచ్చు, ఇనుము ఉపయోగించబడినాయి. అత్యుత్తమ అత్యున్నత స్థాయి నిర్మాణంగా, అటు ప్రాచీనత్వానికి తుది ప్రతీకగా,

ఇటు తొలి బైజాంటైన్ కళాఖండంగా నిలబడటమే కాకుండా తూర్పు పడమరల క్రైస్తవ పూజా విధానానికి, ఇస్లామిక్ పూజా పద్ధతికి నమూనాగా నిలిచింది.

**మజీద్‌గా ఆయాసోఫియా :** సుల్తాన్ మహమ్మద్ దాడిలో (1453) కాన్‌స్టాంట్ నోపుల్ ఒటోమన్‌ల వశమైన తర్వాత శుక్రవారం ప్రార్థన (ఖుత్‌బా) చేయడంతో అది అధికారికంగా చక్రవర్తుల మజీద్‌గా మారిపోయింది. అప్పటికే ఆయాసోఫియా వైభవం చర్చిగా మరుగున పడి భవనం శిథిలావస్థకు చేరుకుంది. మజీద్‌గా మారిన, మరమ్మతులు చేపట్టబడిన భవనాన్ని, పక్కనే రాబోతున్న తోక్పాకీ కోట వున్న ప్రాంతం ఆ ప్రాంతంలోని కట్టడాలు అన్నింటినీ వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకుంది. కాలక్రమంలో చోటుచేసుకున్న మార్పులు, చేర్పుల తర్వాత చర్చి ఆనవాళ్ళన్నీ చెదిరిపోగా పూర్తి మజీద్‌గా మార్పు చెందిది. మినారెట్ల నిర్మాణం. చర్చిలోపల నేల భాగంలో వున్న అలంకరణలు కనబడకుండా కార్పెట్ పరచడం, మిహిరాబ్‌కు ఇరువైపులా భారీ కొవ్వొత్తుల స్టాండ్లను అమర్చడం లాంటి మార్పులు జరిగాయి. చర్చి ప్రవేశ భాగంలో ఉన్న మొజాయిక్‌లు, చక్రవర్తుల గేట్ల పైనున్న క్రీస్తు, మేరీ, బైజాంటైన్ చక్రవర్తుల చిత్రాలు గచ్చుతో కప్పివేయబడ్డాయి (1930లో టర్కీ రిపబ్లిక్ వాటిని తొలగించింది. సుల్తాన్ అహ్మద్ (1703-1730) కాలంలో చర్చి అంతర్భాగంలో ఊడిపోతున్న ప్లాస్టర్‌ను తొలగించడం వల్ల చాలా మొజాయిక్‌లు బయటపడ్డాయి. సుల్తాన్ మహ్మద్ I 1739లో నిర్మాణ పునరుద్ధరణను చేపట్టి ఖురాన్ పాఠశాల మదర్సాను, మ్యూజియం లైబ్రరీని ఏర్పాటు చేయించాడు. 19వ శతాబ్దంలో నాటి సుల్తాన్ అబ్దుల్ మజీద్ కట్టడంపై డోమ్‌కు పటిష్టమైన మరమ్మత్తులు చేయించాడు. చర్చి బాహ్య, అంతస్సౌందర్యాన్ని కొత్త అలంకరణలతో నింపించాడు. పై అంతస్తుల్లోని గాలరీల్లో ఉన్న మొజాయిక్‌లను శుభ్రం చేయించి, దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించాడు. ఎనిమిది భారీ ఫ్రేముల్లో అమర్చిన పతకాలను స్తంభాల చూరుల్నుండి వేలాడ దీయించాడు. ప్రముఖ కాలిగ్రాఫర్ (చేతిరాత నిపుణుడు) చేత పతకాల మీద డిజైన్లు వేయించి అల్లా, మహమ్మద్, రషీదన్, మొదటి నలుగురు కాలీఫాలు - అబూబకర్, ఉమర్, ఉథ్మన్, అలీల పేర్లు రాయించాడు. వాస్తు శిల్పుల చేత మఖ్బారాను నిర్మింపజేసి, ఖలీఫాల జీవితాన్ని



ఆయా సోఫియా మ్యూజియం

చిత్రింపజేశాడు. సుల్తాన్‌ల ప్రవేశ, నిర్గమనానికి ప్రత్యేక ద్వారం నిర్మింపజేశాడు. గడియారపు స్తంభ భవనాన్నీ, కొత్త మదర్సాలను నిర్మింపజేశారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తి అయ్యాక 1849లో మజీద్ మళ్ళీ తెరవబడింది.

మొదటి ప్రపంచ యుద్ధంలో ఓటోమన్‌లు బ్రిటిష్, ఫ్రెంచ్, ఇటలీ, గ్రీకు, దేశ సైన్యాల చేతిలో ఓటమి చెందినందువల్ల 1919లో ఆయాసోఫియాలో గ్రీకు సైన్యంలోని సాంప్రదాయ క్రైస్తవ ప్రీస్టు ప్రార్థనలు చేశాడు. 1453లో కాన్‌స్టాంట్‌నోపుల్ పతనం తర్వాత జరిగిన ప్రార్థనా సమావేశం ఇది ఒక్కటే. ఆ తర్వాత సూల్తానామత్‌కు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చోటుచేసుకున్నాయి. 1923లో గ్రీకు దేశం 500 డ్రేక్మా నోటు పైన ఆయాసోఫియా చిత్రాన్ని ముద్రించింది.

1935-2020 మధ్య మజీద్ కొంతకాలం మ్యూజియంగా మార్పు చెందింది. టర్కీ రిపబ్లిక్ స్థాపకుడు, తొలి ప్రధాని ముస్తాఫా కమాల్ అటాటర్కీ, ఆయాసోఫియాను మ్యూజియంగా మార్చాడు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో మినారెట్లలో మెషిన్ గన్లలు దాచారు. నేల మీద వరచిన కార్పెట్లను తొలగించడంతో అంతవరకు ఎవ్వరూ చూడని, ప్రాధాన్యత కలిగిన నట్టనడి ప్రదేశం (omphalian), నడిబొడ్డు (Navel) లోని మొజాయిక్‌లు బయట పడ్డాయి. 2014లో ఆయాసోఫియా టర్కీలో ఎక్కువ మంది 3.3 మిలియన్ సందర్శకుల్ని ఆకర్షించిన మ్యూజయంగా చరిత్ర కెక్కింది. 2010 నుండి ఆయాసోఫియాను మళ్ళీ మజీద్‌గా మార్చాలన్న ఒత్తిడి ఎక్కువైంది. నాటి ఉపముఖ్యమంత్రి మరికొందరు ప్రభుత్వోద్యోగుల వత్తాసుతో మజీద్ మార్పిడి ఆలోచనను బయటపెట్టాడు. జులై1, 2016లో 85 సంవత్సరాల అనంతరం మ్యూజియంలో ముస్లిం

ప్రార్థనలు జరిగాయి. టర్కీ చారిత్రక కట్టడాల సంరక్షణా సమితి మ్యూజియాన్ని మజీద్‌గా మార్చాలని వేసిన దావాను కోర్టు తిరస్కరించింది. అది స్మృతి మ్యూజియంగానే కొనసాగాలని నిర్ణయించింది. టర్కీ దేశస్తులు, టర్కీ టీవీ దాన్ని మజీద్‌గా మార్చాలని ఉద్యమించాయి.

**మళ్ళీ మ్యూజియంగా మారిన ఆయాసోఫియా :** టర్కీ దేశాధ్యక్షుడు రిపెస్ తయ్యిప్ ఎర్డగాన్ ప్రజాకర్షక చర్యగా మ్యూజియాన్ని మజీద్‌గా మార్చాలనుకుని, 2018 మేలో ఆయా సోఫియాలో ఖురాన్ మొదటి పంక్తుల్ని చదివి, ఇస్తాంబుల్ విజయంలో అసువులు బాసిన అమర వీరులకు అంకితం చేసి తన నిర్ణయాన్ని బలోపేతం చేసుకున్నాడు. తొలి అధ్యక్షుని నిర్ణయాన్ని రద్దు చేసి మ్యూజియాన్ని మజీద్‌గా మార్చాలంటే అప్పటికే ఆది యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపద కాబట్టి, యునెస్కో అనుమతి పొందాల్సి ఉంటుంది. 2019లో పక్కన వున్న తోక్పాకీ రాజ భవన మ్యూజియం నిర్వహణను 'కల్చర్, టూరిజం మంత్రిత్వశాఖ' నుండి విడదీసి అధ్యక్షుని అధికార పరిధిలోకి మార్చాడు ఆ అధికారంతో మ్యూజియాన్ని మజీద్‌గా మార్చడం సులువవుతుంది.

టర్కీ ప్రభుత్వం 2020లో కాన్‌స్టాంట్ నోపుల్ 567వ విజయోత్సవాన్ని ఆయాసోఫియాలో ఇస్లామిక్ ప్రార్థనలతో జరుపుకుంది. ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా మజీద్‌లో ప్రార్థనలు జరుగుతాయని ముందుగానే అధ్యక్షుడు టర్కీ టీవీలో చేసిన ప్రకటనను గ్రీస్ తీవ్రంగా ఖండించింది. ఐనా టర్కీ ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు. అంతర్జాతీయ బైజాంటైన్ అధ్యయన సంస్థ అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు ఆయాసోఫియాను మ్యూజియంగానే కొనసాగించవలసిందిగా బహిరంగ లేఖ రాశాడు. దానికి అధ్యక్షుడు ఆయాసోఫియా మీద టర్కీకి సర్వాధికారాలున్నాయని చెప్పి 1000-1500 మంది భక్తులతో ఇస్లాం ప్రార్థనలు చేయించాడు. ప్రార్థన సమయంలో క్రైస్తవ చిహ్నాలు కనబడకుండా తెరలతో కప్పివేస్తారు. ఈ గొప్ప నిర్మాణాన్ని సుల్తాన్ మహ్మద్ పేరిట మజీద్ మారున్నుట్లు ప్రకటించాడు. ప్రపంచ దేశాల నాయకుల్ని, పోప్‌ఫ్రాన్సిస్‌ను కూడా ప్రార్థనలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. 1922 ఏప్రిల్‌లో ఆయాసోఫియా 88 సంవత్సరాల తర్వాత మళ్ళీ రంజాన్ ప్రార్థనను నిర్వహించింది. మొదట్లో ఆయాసోఫియాలోకి ఉచితప్రవేశం ఉండేది. జనవరి 15, 2024 నుండి ప్రవేశరుసుము ప్రవేశపెట్టారు.

**అంతర్జాతీయంగా ప్రతిస్పందనలు, నిరసనలు, చర్చలు :** ఆయాసోఫియాను మజీద్‌గా మార్చడం ప్రపంచంలోని కోట్లాది క్రైస్తవులను నిరాశకు గురిచేసింది అని కాన్‌స్టాంట్ నోపుల్ క్రైస్తవ పితృస్వామ్యుడు (Ecumenical Patriarch) బార్థాలో మ్యూ ప్రకటించాడు. తూర్పు పడమరలను కలపాల్సిన కీలకస్థానంలోని టర్కీ ప్రపంచాన్ని రెండు ముక్కలు చేసింది అని వ్యాఖ్యానించాడు. రష్యన్ ఆర్థోడాక్స్ చర్చి పెద్ద క్రైస్తవ నాగరికతా ఉనికికే పెనుముప్పు అని హెచ్చరించాడు. మజీద్‌గా మార్చే నిర్ణయాన్ని యునెస్కో తీవ్రమైన చర్యగా పశ్చాత్తాపపడవలసిన చర్యగా పరిగణించింది. ప్రపంచంలోని 500 చర్చీలకు, 350 క్రైస్తవ శాఖలకు ప్రాతినిథ్యం వహించే ప్రపంచ చర్చీల సమాఖ్య దాన్ని తీవ్రంగా గర్హిస్తే, ప్రపంచంలోని చాలా ముస్లిం దేశాలు సమర్థించాయి. గ్రీస్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిట్లో టాకిస్ దీనికి ప్రతిచర్యగా ప్రభుత్వం అన్ని మార్గాలను అన్వేషిస్తుంది, టర్కీ, అనవసరంగా, ప్రాధాన్యతలేని నిర్ణయాన్ని తిరోగమన చర్యగా పరిగణిస్తూ పాశ్చాత్య దేశాలతో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నట్లేనని, ఈశాన్య దేశాల్లో సమస్యల సృష్టికి దారితీస్తుందని వ్యాఖ్యానించాడు. 2024 జులైలో యునెస్కో దీన్ని తీవ్రమైన చర్యగా పేర్కొనగా టర్కీ దానివల్ల వ్యతిరేక ప్రభావం ఏమీ ఉండదని కొట్టిపారేసింది.

**ఆయాసోఫియాలోని అలంకరణ విశేషాలు** : పాలరాతి స్తంభాలు, గోడలు, నేల మీద అమూర్త (అబ్‌స్ట్రాక్ట్) మొజాయిక్ డిజైన్లు, మూలల్లో గేబ్రియల్, మైఖేల్ మొదలైన ముఖ్య దేవ దూతల (archangels) చిత్రాలు, గేలరీల్లోని పల్చని శ్లాబ్‌ల మీద వివిధ ఆకారాల్లో (patterns) లతలు, పూవులు, పక్షులు అన్ని నిర్దిష్టంగా పాలరాతి, మొజాయిక్‌లతో చెక్కినవి, అమర్చినవి, క్రీస్తు, క్రైస్తవ సన్యాసుల ప్రవక్తల రూపచిత్రాలు, గుమ్మటం కేంద్రంలో, గాలరీల్లో బైబిల్ కథాచిత్రాలు, నాలుగు ఆధార గోడలపైన ఆరు రెక్కల దేవదూతల (Seraphs) బంగారు తాపడంతో రూపొందించిన ముఖాలు మొదలైన వాటితో నిండిన కళా వైభవం కనువిందు చేస్తుంది.

**ఆయా సోఫియా ప్రభావం :** దీన్ని నమూనాగా చేసుకొని అనేక బైజాంటైన్ చర్చిలు వెలిసాయి. కేంద్రంకంలో గుమ్మటం, విశాలమైన ఎత్తైన పెద్ద భవనం వీటి లక్షణం. జర్మనీలోని నావల్ కెడీడ్రల్, సిబియు (sebiu)లోని హోలీ

ట్రినిటి కెథీడ్రల్ ఆయా సోఫియా నిర్మాణానికి చాలా దగ్గర పోలికలతో వుంటాయి. ఓటోమన్ మజీద్‌లు కూడా ఆయాసోఫియా నిర్మాణాన్ని అనుకరించాయి. శతాబ్దాలుగా ప్రపంచ ప్రఖ్యాత కట్టడంగా, క్రైస్తవ ప్రార్ధనా మందిరంగా (చర్చిగా) కీర్తి గడించిన ఆయా సోఫియా మహా వైభవ హర్మ్యం మజీద్‌గా, మ్యూజియంగా, మళ్ళీ మజీద్‌గా అవతారాలు ఎత్తడం చారిత్రక, రాజకీయ పరిణామాలకు గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. ఇస్తాంబుల్ ప్రసిద్ధ చిహ్నాలు, ఓటోమన్లు నిర్మించిన గొప్ప తోక్పాకీ రాజభవనం (కోట) నీలిరంగు మజీద్ పక్కపక్కనే వుంటాయి. విమాన ప్రయాణీకులు వీటి సౌందర్యాన్ని పైనుండి చూచి ఆనందించగలుగుతారు. ఆయాసోఫియా వాస్తునిర్మాణ కౌశలాన్ని, అలంకారకళను, చారిత్రక, సాంస్కృతిక సంపదకు నిలయమైన భవనాన్ని మరింతగా అవగాహన చేసుకోవడానికి యూట్యూబ్‌లో ఆయాసోఫియా కార్యక్రమాలు దోహదం చేస్తాయి.

**వివరణలు :**

**బైజాంటైన్ సామ్రాజ్యం :** ఐరోపా వాయవ్య, దక్షిణ భాగాల్లో, పశ్చిమ ఆసియాలో వ్యాపించిన సామ్రాజ్యం ఇది. పాచీన గ్రీకు కాలనీగా మొదలైన బైజాంటైన్‌కు ఐరోపా వైపు వున్న ప్రాంతాన్ని కాన్‌స్టాంటైన్ 330 CE లో స్వాధీన పరుచుకుని కాన్‌స్టాంట్ నోపుల్‌గా పునః స్థాపించాడు. అప్పట్లో దాన్ని తూర్పు రోమన్ సామ్రాజ్యం అనేవారు. 395CEలో కాన్‌స్టాంటైన్ మరణించిన తర్వాత థియోడస్ తన రాజ్యాన్ని రెండు భాగాలుగా చేసి ఇద్దరు కొడుకులకు పంచాడు. 476CEలో పశ్చిమ భాగం రోమన్ రాజ్య పతనం వల్ల అంతమైపోగా తూర్పు వైపు వున్న సగం కాన్‌స్టాంట్ నోపుల్ ముఖ్య పట్టణంగా బైజాంటైన్ సామ్రాజ్యంగా కొనసాగింది. తూర్పు రాజ్యం పశ్చిమ విభాగంకన్నా పూర్తిగా భిన్నమైనది. హెలినిస్టిక్ (ప్రాచీన గ్రీక్) నాగరికతలో వాణిజ్యం, పట్టణీకరణంలో ముందంజలో వుండేది. జస్టీనియన్ చక్రవర్తి పశ్చిమ యూరప్‌లోని కొంత భాగాన్ని జయించి ఆయాసోఫియా చర్చిని నిర్మించాడు. రోమన్ మౌలిక చట్టాలను అమలు చేశాడు. రోమన్ సామ్రాజ్యంగా చెప్పుకున్న జస్టీనియన్ మరణం తర్వాత మధ్యయుగాల నాటి సామ్రాజ్యం బైజాంటైన్ సామ్రాజ్యంగా పిలవబడింది. చాలా కాలంగా కొనసాగిన విగ్రహారాధన వివాదాస్పదం కారణంగా తూర్పు దేశాల చర్చి రోమన్ చర్చి నుండి విడిపోయింది. ఈ దశలో అరబ్బులు, టర్కీవారు పుంజుకుని 14వ శతాబ్దంలో ఓటోమన్ కాలిఫ్‌ల దాడిలో కాన్‌స్టాంట్ నోపుల్ (1453)ను వశపరుచుకుని దాన్ని ఇస్తాంబుల్‌గా మార్చారు.

**ఓటోమన్ సామ్రాజ్యం :** అనటోలియా కేంద్రంగా విస్తరించిన ప్రాచీన సామ్రాజ్యం ఇది. టర్కీ పాలకుడు ఉస్మాన్ I. (1259-1326) ఇరుగు పొరుగు దేశాలను జయించి, అంతవరకు సెల్జెక్ రాజవంశ అధీనంలో వున్న రాజ్యాన్ని జయించి (1300) తన పరిపాలనను ప్రారంభించాడు. ఓటోమన్ సైన్యాలు తొలిసారిగా 1345లు యూరప్‌పై దాడిచేసి బాల్కన్ రాజ్యాన్ని తుడిచి పెట్టి, బైంజాటైన్ రాజ్యాన్ని స్వాధీనం చేసుకుని, కాన్‌స్టాంట్ నోపుల్‌ను రాజధానిగా చేసుకుని, ఓటోమన్ రాజ్యాన్ని స్థాపించాయి. ఆనాటికది ప్రపంచంలోనే అతి పెద్ద సామ్రాజ్యంగా అవతరించింది. సులేమాన్ పర్యా అధీనంలోని కొన్ని ప్రాంతాలను, ఆరేబియా, హంగరీ, బాల్కన్‌లో చాలా భాగాన్ని స్వాధీనం చేసుకున్నాడు. 16వ.శ. నాటికి సిరియా, ఈజిప్ట్‌లను కూడా జయించాడు. సులేమాన్‌తో మొదలైన ఓటోమన్ పాలకులు కాలిఫ్‌లుగా పేరుపొందారు. 16వశ. నుండి ఓటోమన్ల శక్తి క్షీణించసాగింది. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత ఓటోమన్ సామ్రాజ్యం రద్దయి, టర్కీ రిపబ్లిక్ ఏర్పడింది.

**క్రూసేడ్లు (Crusades)** : పదకొండవ శతాబ్దంలో మొదలైన మతయుద్ధాల వరంపర క్రూసేడ్లుగా పేరుగాంచింది. పోప్ అర్బాన్ II ఈ యుద్ధాలను మొదలు పెట్టాడు. సిరియా నుండి వెళ్ళగొట్టబడిన క్రైస్తవులు తిరిగి సిరియా చేరుకోవడానికై వందల సంవత్సరాలు యుద్ధాలు చేశారు. క్రమంగా వ్యాపిస్తున్న ముస్లిమ్ శక్తిని ఆపడానికి చేసిన ప్రయత్నంలో క్రైస్తవ సైన్యాలు మొదట్లో పైచేయి సాధించినా ముస్లింల ధాటిని ఎదుర్కొన లేకపోతాయి. 14వ శతాబ్దం నాటికి ఓటోమన్ టర్కీలు బాగా బలం పుంజుకుని ఐరోపా దేశాలను ఆక్రమించుకుంటారు. నాలుగవ క్రూసేడ్ (1202-04) బైజాంటైన్‌పై దాడి చేసి దాన్ని వశపరుచుకుని టర్కీ రాజ్యాన్ని స్థాపించింది.

**తంగెడ విశ్వేశ్వర ప్రసాద్**
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 7981398250

## దారి దీపాలు

**– ఆచార్య పి. ఆర్. హరినాథ్**

దడ పుట్టించే అడవిలో తోడై నిలుస్తాయి; దిక్కు తెలియని దీన స్థితిలో దారి దీపాలై వెలుగుతాయి; చుక్క నీరు దొరకక సొమ్మసిల్లేటప్పుడు అమృతవర్షమై బతుకు నిలుపుతాయి–మహాకవుల మాటలు. భర్తృహరి అంటున్నాడు. మనిషి చుట్టూ కొన్ని మంచి లక్షణాలున్నాయి. వాటిని గుర్తిస్తే అనుసరణీయమౌతాయి. అంగీకరిస్తే అనుకరణీయమవుతాయి. కవి చాతుర్యం ఏమిటంటే, సూటిగా చెప్పడు, సూచన చేస్తాడు. ఇలా చేయండి అని చెప్పడు. ఇలా చేస్తే గౌరవం అని అంటాడు

**దాక్షిణ్యం స్వజనే దయా పరిజనే శాఠ్యం సదా దుర్జనే**
**ప్రీతి స్సాధుజనే నయో నృపజనే విద్వజ్జనే చార్జవం**
**శౌర్యం శత్రుజనే క్షమా గురుజనే కాంతా జనే ధృష్టతా**
**యే చైవం పురుషాః కలాసు కుశలా స్తేష్వేవ లోకస్థితిః**

'తన వారి పట్ల దాక్షిణ్యం ఉండాలి. కాస్త స్వేచ్ఛ నివ్వాలి. వారి అభిప్రాయాలనూ గౌరవించాలి. వారి ఆలోచననూ ఆహ్వానించాలి. వారి మనసులో ఉన్నదేమైనా చెప్పడానికి అవకాశమివ్వాలి. వారికి కూడా తర్కం ఉందని అంగీకరించాలి. అలాగే తనను సేవించే వారి పట్ల, తనను ఆశ్రయించి బతుకుతున్న వారి పట్ల కనికరం ఉండాలి. కఠినంగా ప్రవర్తిస్తే ఏ సేవకుడూ ఉండడు. ఎంత పెద్ద అధికారి అయినా తన వద్ద పనిచేసే వారిపట్ల దయతో ఉండాలి. ఇలాగే దుర్మార్గుల పట్ల కాఠిన్యం ఉండాలి. వాళ్ళను దారికి తెచ్చుకోడానికి దండన ఉండాలి. సాధుత్వం ఉన్న వారిపట్ల ప్రేమ ఉండాలి. మెత్తగా ఉన్న మనుషులతో సుకుమారంగా వర్తించాలి. స్నేహ పూర్వకంగా ఉండాలి. రాజుల పట్ల, అధికారుల పట్ల నీతిగా ఉండాలి. అంటే, వారి పట్ల ఎలాంటి ప్రవర్తనతో ఉండాలో ఆ పద్ధతిని తెలిసి ప్రవర్తించాలి. పండితులపట్ల, విద్యావంతుల పట్ల వినయం ఉండాలి. వంకరతనం, వక్రభాషణ ఉండరాదు. ఎగతాళి మాటలు, వెక్కసపు మాటలు పనికి రావు. శత్రుల పట్ల శూరత ఉండాలి. ఒక వీరత్వంతో ఎదిరించి నిలవగలగాలి. అది లేకుంటే పతనం తప్పదు. పెద్దవారిపట్ల సహనం ఉండాలి. వారి వయసును, జ్ఞానాన్ని గౌరవించాలి. మన ఇంట్లో ఒక తాతగారు ఉంటారు. వారేదో ఒక మాట అన్నారనుకుందాం. సహనంగా దాని ఆంతర్యాన్ని గ్రహించాలి. నా అంతటి వాణ్ని ఇలా అంటావా అనే అవినయం మంచిది కాదు. స్త్రీల పట్ల దిటవుగా ఉండాలి. తనపై తనకు నియంత్రణ ఉండి మెలగాలి. వశం తప్పి వారి ముందు ప్రవర్తిస్తే లోకువైపోతారు. ఈ చెప్పిన అన్ని విషయాలను ఎవరు తెలివిగా పాటిస్తారో అలాంటి వాళ్ళు లోకస్థితిని నిలుపుతారు. అంటే అలాంటి దక్షుల వల్ల ప్రపంచం నడుస్తూంది అని భావం. దీనిని తెలుగు చేస్తూ లక్ష్మణ కవి అన్నాడు

**వరకృప భృత్యులందు నిజవర్గమునందనుకూల వృత్తి కా**
**పురుషుల యందు శాఠ్యము సుబుద్ధుల యందనురక్తి తాల్మి స**
**ద్గురువులయందు గౌరవము కోవిదులందు నయంబు రాజులన్**
**దరిజనులందు శౌర్యము మృగాక్షులయందు బ్రగల్భ భావమీ**
**వరుస గళాప్రవీణులగు వారలయందు వసించు లోకముల్**

సంస్కృతంలో కలాసు కుశలా అని అన్నాడు. కుశలం అనే మాట నుంచే కౌశల్యం అనే మాట వచ్చింది. అంటే నిపుణత అని అర్థం. తెలుగులో కవి ఆ మర్మాన్ని ప్రకటిస్తూ 'కళాప్రవీణులు' అని స్పష్టం చేసాడు. లోకంలో ఏ సందర్భంలో ఎలా ప్రవర్తిసే గౌరవం కలుగుతుందో చెప్పి అలా ఉండడం మంచిదని సూచిస్తున్నాడు కవి. ఈ స్వభావం ఉన్నవారిలో వినయగుణం విప్పారుతుంది. పరోపకారమే పరమ మంత్రమవుతుంది. లోక స్థితిని కాపాడడానికి ప్రపంచగతిని నిలపడానికి వీరి జీవితమొక ఆలంబనమవుతుంది.

**భవంతి నమ్రాస్తరవః ఫలోద్గమైర్నవాంబుభి ర్భూరి విలంబినో ఘనాః**
**అనుద్ధతా స్సత్పురుషా స్సమృద్ధిభిఃస్వభావ ఏ వైష పరోపకారిణాం**

పళ్లనిచ్చే చెట్లు వంగి పోయి ఉంటాయి. ఫల భారంతో నేలను తాకుతుంటాయి. లోకోపకారం చేసే సుజనులు కూడా తాము ఎంత విద్వత్తుతో, ఎంత సంపదతో ఉన్నప్పటికీ గర్వంతో మిడిసిపడరు. వినమ్రంగా ఉంటారు.

**తరువులతిరస ఫల భార గురుత గాంచునింగి వ్రేలుచు నమృత మొసంగు మేఘు**
**దుద్ధతులు గారు బుధులు సమృద్ధి చేత జగతి నుపకర్తలకు నిది సహజ గుణము**

ఇది వారి 'స్వభావం' అని భర్తృహరి అంటే ఇది వారి 'సహజ గుణం' అని లక్ష్మణకవి అంటాడు.

ఆచార్య పి. ఆర్. హరినాథ్,
ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,
మైసూర్, ఫోన్ : 9480443108

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

**– డా. ఎమ్. పురుషోత్తమాచార్య**

### 21. మామిడికొమ్మ మల్లియరెమ్మ

రచన : దాశరథి
సంగీతం : మంచాల జగన్నాథరావు
గానం : వి.వసంత

బృందావని-ఏక



**మామిడి కొమ్మా మల్లియ రెమ్మా**
**మంతనమాడెనదే**
**కోయిలకొమ్మ రాచిలుకమ్మ**
**పాటలు పాడెనదే** ॥మామి॥

1. కాననలక్ష్మి కంఠములోన
కాంచనమాలలవే
గుట్టలు,గట్టులు,చేమలు,చెట్లు
పూవులు పొంగెనవే ॥మామి॥

2. మన్మథరాజు మాధవు కూడి
మహికే వచ్చెనహో
సకలచరాచర జాలము వారికి
స్వాగతమిచ్చెనహో ॥మామి॥

వసంత ఋతుకాల వర్ణన ఈ పాటలో కనిపిస్తున్నది. ఆ ఋతువులో మామిళ్ళు పూశాయి, మల్లెలు వికసించాయి. ఈ రెండూ కూడబలుక్కుని పుష్పించాయని కవి చమత్కారం. ఈ దృశ్యాన్ని చూచి ఆనందం పట్టలేక కోయిలలు, చిలుకలు మనోహరంగా పాటలు కూడా పాడాయట. వికసించిన పూలన్నీ మాలికలుగా అల్లుకుని వనదేవత కంఠంలో అలంకరించినట్లుగా అమరాయి. గుట్టలు, చెట్లు, పూలతో నిండిపోయాయి. మన్మథుడు వసంతునితో కలిసి భూమిమీదికి అడుగుపెట్టగానే చరాచరజాలమంతా వారికి స్వాగతం చెబుతున్నది.

ఈ పాటను రచించిన దాశరథి కృష్ణమాచార్యులు గారు (1925–1987) లబ్ధప్రతిష్ఠులైన కవివర్యులు. అటు సాహిత్యరంగంలోనూ, ఇటు సినిమా రంగంలోనూ తనదైన ముద్రను బలంగా ప్రతిష్ఠించిన మహాకవి. తన కవిత్వాయుధంతో నిజామును ఎదిరించి జైలుపాలయినా కవితారచనను మానలేదు. వీరు "మహాంధ్రోదయం, రుద్రవీణ, అగ్నిధార, పునర్నవం, అమృతాభిషేకం, కవితా పుష్పకం, పూలపాటలు, తేనెపాటలు, నవమంజరి" మొదలైన అనేకరచనలు చేశారు. ఈ పాట 'నవమంజరి' గ్రంథం నుండి తీసుకోబడింది. ఈ పాటకు ఆయన 'మామిడి, మల్లె' అనే శీర్షికను పెట్టారు.

'మామిడికొమ్మ, కోయిలకొమ్మ' ఈ రెంటిలో ఉన్న ఒకే 'కొమ్మ'కున్న రెండు అర్థాలను చక్కగా ఉపయోగించు కున్నారు. కొమ్మ అంటే స్త్రీ అని, చెట్టు యొక్క కొమ్మ అని రెండర్థాలు ఉన్నాయి. కోయిలను స్త్రీగా పోల్చి తీయగా పాడిందని 'కొమ్మ'ను చమత్కరించారు. అలాగే 'మాధవ' శబ్దానికి ఇక్కడ విష్ణువు అనే అర్థం కాక 'వసంతుడు' అనే అర్థంలో ఉపయోగించారు. అయితే, విష్ణువు అనే అర్థం తీసుకున్నా ఆయన, కొడుకు మన్మథునితో కలసి వచ్చాడని, సృష్టి అంతా వారికి స్వాగతమిచ్చిందని విశేషధోరణిలో కూడా అన్వయించుకోవచ్చు. ఈ పాటలో మూలం నుంచి కొన్ని మార్పులు కనిపిస్తాయి. వీటిని స్వరకర్త కాని, గాయని కాని చేసియుండవచ్చు.

1. 'మన చిలుకమ్మా' ను 'రాచిలుకమ్మా' అన్నారు.
2. 'కాననదేవి' ని 'కాననలక్ష్మి' చేశారు.
3. 'గట్లూ, గుట్టలు, చెట్లూ, చేమలు' అని ఉండగా 'గుట్టలు, గట్టులు,చేమలు, చెట్లు' అని పలికారు.
4. 'మాధవు వెంట' అని ఉంటే 'మాధవు కూడి' అని పాడారు.
5. 'యువతీయువజన' అనే మూడవ చరణాన్ని పూర్తిగా వదిలేశారు.

ఇంత ప్రసిద్ధులైన రచయితగారి అనుమతి లేకుండా పాటలో మార్పు చేశారా? లేక రచయితే మార్చి ఇచ్చారా? అన్నది పరిశీలించాలి. ఏదైనా మూలపాఠం దెబ్బతినే పరిస్థితిని రానీయకూడదు. 'చెట్లూచేమలు' లాంటి పదబంధాల సొబగు, ఇటువంటి మార్పులతో కనబడకుండా పోతుందిగదా! దీన్ని స్వరకర్త బృందావనిసారంగ రాగంలో బాణీ చేశారు. ఈ రాగాన్ని హిందూస్తానీ సంగీత సంప్రదాయంలో 'బృందావని' అని పిలుస్తారు.

పాట ప్రారంభంలో వాద్యబృందంవారు ఏకతాళంలో ఏడు ఆవర్తాలుగా బిట్టునిచ్చి పంచమం దగ్గర వదిలేయగా

పల్లవిని సాభిప్రాయంగా మధ్యమంనుండే సమంలో ఎత్తుకున్నారు. పల్లవిని రెండుసార్లు పాడుతూ 'పనిపా' అంటూ కైశికనిషాదాన్ని అందంగా తాకి వదిలారు. అనుపల్లవిలోని రెండవ పాదాన్ని రెండుసార్లు పాడి మొత్తం అనుపల్లవిని కూడా రెండుసార్లు ఆలపించారు. ఇక మళ్ళీ పల్లవిని అందుకోలేదు.

రెండు చరణాలకు ఒకే విధమైన బిట్‌వర్కును ఆరు ఆవర్తాలలో ఇచ్చి పంచమం దగ్గర వదిలేశారు. చరణాల బాణీ కూడా రెండూ ఒకేతీరుగా ఉన్నాయి. మొదటి చరణాన్ని నిషాదం నుండి సమంలో 'కాననలక్ష్మి' ని అందుకుని పాడుతూ 'కంఠములోన' దగ్గర 'రిమగరిసాసా' అంటూ అంతరగాంధారాన్ని తాకుతూ అందంగా పాడారు. మొదటి రెండు పాదాలను కలిపి రెండుసార్లు పాడారు. చివరి పాదాన్ని రెండుసార్లు పాడి 3,4 పాదాలు కలిపి రిపీట్ చేసి వదిలారు. పల్లవిని పాడలేదు. రెండో చరణాన్ని కూడా మొదటి చరణంలాగానే బాణీలో ఏమీ మార్పు లేకుండా పాడారు. వెంటనే పల్లవి ముందరి బిట్‌వర్కును మళ్ళీ వినిపించిన తరువాత పల్లవిని, అనుపల్లవిని పాడి 'పాటలు పాడెనదే' దగ్గర పాటను ముగించారు. ఈ పాటను ఆధునిక కాలంలో డి.వి.మోహనకృష్ణ గారు శుద్ధసావేరి రాగంలో బాణీ చేసుకుని, మూడు చరణాలనూ పాడి యూట్యూబ్‌లో విడుదల చేశారు. కాని వసంతగారి గానంలోని సొబగు, జీవం దీనిలో అంతగా కనిపించలేదనిపిస్తున్నది.

**22. ఈ విశాల ప్రశాంత**

**రచన, సంగీతం & గానం : ఎం.ఎస్.రామారావు**

**బిట్ వర్క్ : పెండ్యాల**

**<u>మిశ్ర మధ్యమావతి-దాద్రా</u>**

**ఈ విశాలప్రశాంత**
**ఏకాంత సౌధంలో**
**నిదురించు జహాఁపనా** ॥ఈ॥

1. పండువెన్నెల్లో వెండికొండల్లే
తాజ్‌మహల్ ధవళకాంతుల్లో॥నిదు॥ ॥ఈ॥
2. నీ జీవనజ్యోతి
నీ మధురమూర్తి
ముంతాజ సతి సమాధి
సమీపాన నిదురించు జహాఁపనా ॥నిదు॥ ॥ఈ॥



సమాధిగా భావించిన తాజ్‌మహల్ నిర్మాణాన్ని చాలామంది కళాదృష్టితో చూచి ఆనందిస్తూ ఉంటారు. మరికొందరు భార్య పట్ల సుల్తానుకున్న అనుపమానమైన చిహ్నం అంటూ అపురూపంగా దర్శిస్తూ ఉంటారు. శతాబ్దాలుగా నిలిచియున్న ఈ కట్టడాన్ని ఇప్పటికీ వేలాదిమంది వెన్నెలలో చూస్తూ ఎంతో ఆనందించడం మనం గమనిస్తున్నాం. దీన్ని కవి చూసినప్పుడు కవి హృదయం ఎలా స్పందిస్తుందో ఈ పాట చెబుతున్నది. అయితే మిగతా అందరికంటే ఎమ్మెస్ రామారావుగారి దృష్టి ఎంతో వైవిధ్యంగా, విశిష్టంగా కనిపిస్తున్నది. ఈ నిర్మాణాన్ని ఆయన విశాల ప్రశాంత ఏకాంతసౌధంగా అభివర్ణించిన తీరు మహనీయంగా, వినూతనంగా ఉన్నది.

తాజ్‌మహల్ పండువెన్నెల్లో, వెండికొండలాగా కనిపిస్తున్నదట. ప్రాణానికంటె మిన్నగా ప్రేమించిన సతి ముంతాజ్ ప్రక్కననే తనను కూడా సమాధి చేయమన్న షాజహాన్ కోరికను అనుచరులు నెరవేర్చి ఆ ఇద్దరికి తాజ్‌మహల్‌ను ఒక పవిత్ర ఆలయంగా మార్చేశారు.

ఏ సుముహూర్తంలో ఎమ్మెస్ రామారావుగారు ఈ తాజ్‌మహల్‌ను దర్శించారో కాని, అప్పుడు పుట్టిన మధురానుభూతి గేయంగా జాలువారి, లలిత సంగీత చరిత్రలోనే ఒక మణిపూసగా నిలిచింది.

ఎమ్మెస్ రామారావుగారి(1921-1992) పూర్తి పేరు మోపర్తి సీతా రామారావు. 'సుందరకాండ' గాయకునిగా ప్రసిద్ధిపొంది 'సుందరదాసు' అనే బిరుదును పొందారు. వీరు తెనాలి తాలూకాలోని మోపర్రులో జన్మించారు. 'ఈ వసంతము' అనే పాటను 'దేవత' (1941) సినిమాలో పాడి చిత్రసీమలోకి అడుగుపెట్టారు. తరువాత "ద్రోహి, మనదేశం, జీవితం, షావుకారు, దీక్ష, నిరపరాధి, నిర్దోషి,

మానవతి" మొదలైన సినిమాలలో ఎన్నో పాటలు పాడారు. సినిమాల నుండి బైటపడ్డాక హనుమాన్ చాలీసా; బాల, అయోధ్య, సుందరకాండలను తెలుగులో గేయరూపాన అనువదించి, మధురంగా గానం చేసి రికార్డులిచ్చారు కూడా. 1952లో ఆకాశవాణి కోసం 'జహాఁపనా' అనే సంగీతరూపకం రచించిన ఎమ్మెస్ రామారావుగారు దానిలో షాజహాన్ పాత్రను ధరించారు. అంతేకాక, దీనిలోని పాటలను తానే స్వరపరచుకున్నారు. పెండ్యాలగారు నేపథ్యసంగీతం సమకూర్చారు. దీన్ని హెచ్.ఎం.వి కంపెనీ వారు రికార్డుగా విడుదల చేశారు. ఈ రూపకంలో చివరలో ఉన్న పాటే 'ఈ విశాలప్రశాంత' అనేది. దీన్ని ఆయనే పాడారు. ఈ పాటను విడిగా తీసి హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంవారు ప్రత్యేకంగా ప్రసారం చేశారు. అది విన్న అశేష సంగీతాభిమానులు దీనికి బ్రహ్మరథం పట్టారు.

ఈ కీర్తి అలా వ్యాపించి సినిమావారి దాకా వెళ్ళింది. దాంతో 1988లో తీసిన 'నీరాజనం' సినిమా కోసం ఈ పాటను ఉపయోగించుకోగా, ప్రసిద్ధ హిందీ సినిమా స్వరకర్త ఓపి.నయ్యర్ దీనికి నేపథ్యసంగీతాన్ని అందించారు. ఈ పాటను మనం ఎప్పుడు విన్నా అది మనల్ని మరో లోకంలోకి తీసుకువెళుతుంది. అలనాటి షాజహాన్ శయనమందిరంలో ఒక గాయకుడు కూర్చుని పాడుతూ సుల్తానును నిదుర బుచ్చుతున్నట్లుగా ఉంటుంది. మరోరకంగా చూస్తే తాజ్‌మహల్‌లోని ఆ దంపతుల సమాధి వద్ద కూర్చుని వింజామర వీస్తూ ఈ పాటను పాడుతున్న ఒక భావుకుడు కనిపిస్తాడు. ఈ పాట విన్నంతసేపు ఒక్కసారి ఆనాటి సుల్తాను దర్బారు, రాజమందిరం, విలాసవైభవం, చీనిచీనాంబరాల రెపరెపలు, హంసతూలికాతల్ప సౌందర్యం అంతా మన కళ్ళముందే కదలాడుతున్నట్లుగా ఉంటుంది.

ఏ నియమాల జోలికి పోక నిరాడంబరంగా, స్వేచ్ఛావిహారంతో ఈ పాటను ఆయన ఎంతో ఉదాత్త గంభీరంగా వ్రాశారు. నవాబులను, సుల్తానులను గౌరవంగా సంబోధించే 'జహాఁపనా' పదాన్ని ప్రధానంగా చేసుకుని పాట రచన సాగించారు.

ఈ పాటకు స్వరరచన, రాగాన్ని దృష్టిలో పెట్టుకుని చేసినట్లనిపించదు. సాహిత్యమూ, బాణీ ఆయనకు ఏకకాలంలో దూసుకుని వచ్చి ఉంటాయి. అందుకే ఒక రాగం మీద, లక్షణం మీద నిలకడ కనిపించదు. పల్లవి అంతా అందమైన మధ్యమావతి రాగంలో ఒదిగిపోయింది. రెండు చరణాలు కూడా అన్యస్వరాలను కలుపుకునేసరికి అది హరికాంభోజి రాగంగా మారిపోయింది.

ప్రారంభంలో వేణువుతో ఆలాపన పంచమం నుండి మొదలై, షడ్జమం దగ్గర ముగిసింది. తరువాత తబలా డగ్గా (ఎడమ) దాద్రా నడకను ప్రారంభించగా వయొలిన్, వేణువులతో ఒక ఆవర్తం బిట్టును సాధారణగాంధారం నుండి ప్రారంభించి, షడ్జమం దగ్గర వదిలేయగా అక్కడినుండే సమంలో పల్లవిని అందుకున్నారు. పల్లవిని నింపాదిగా, ఊయల ఊపుతున్నంత సుకుమారంగా, జోకొడుతున్నట్లుగా పాడారు.

మొదటి చరణం ముందు ఆరు ఆవర్తాలలో సాగిన బిట్టు పంచమం దగ్గర ప్రారంభమైంది. 'పండువెన్నెల్లో' ను అంతరగాంధారం నుండి అందుకుని 'వెన్నెల్లో' దగ్గర కొంత సాగదీసి పాడి చరణాన్ని ఒకేసారి పాడారు. 'జహాఁపనా' ను మంద్రపంచమం దగ్గర ఆపారు. కాని మళ్ళీ పల్లవిని ఎత్తుకోలేదు. వెంటనే రెండో చరణం బిట్టు అంతరగాంధారం నుండి ప్రారంభమై,7 ఆవర్తాలుగా సాగి షడ్జమం దగ్గర ముగియగా 'నీ జీవితజ్యోతి' ని మొదటి చరణం కంటె విభిన్నంగా 'సారిమపదదా' ధోరణిలో ప్రారంభించారు. మొదటి రెండు పాదాలను రెండు సార్లు పాడారు. బాణీకి ప్రాధాన్యం ఇవ్వడం వలన "జీవితా, మధురా" అని పాడక తప్పలేదు. తరువాతి పంక్తిలోని 'సమాధి' పదాన్ని 'దాదప మదపమమా' అనే స్వరసంపుటితో శ్రావ్యంగా పాడారు. చివరి రెండు పంక్తులను రెండు సార్లు పాడారు. వెంటనే ఆరు ఆవర్తాల బిట్టును వినిపించారు. అప్పుడు పల్లవిని అందుకుని ఒకసారి పాడారు 'నిదురించు జహాఁపనా' బాణీని వాద్యాలు రిపీట్ చేశాక పాట ముగిసిపోయింది.

**డా. ఎమ్. పురుషోత్తమాచార్య**
*(జాతీయ పురస్కార గ్రహీత)*
పూర్వ ప్రిన్సిపాల్, సంగీత కళాసాల,
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

# త్రివేణీ సంగమం
# భళ్ళమూడి రామమూర్తి

**– బి.వి. అప్పారావు**

ఔత్సాహిక నాటకరంగంలో తన స్వయంకృషి అంకితభావం, నిబద్ధతతో అయిదు దశాబ్దాలు నటప్రస్థానం చేసినవారు భళ్ళమూడి రామమూర్తి. నాటకరంగంలో అరంగ్రేటం చేసినది మొదలు.... అటు నాటకసేవ, ఆధ్యాత్మిక రంగం, సామాజిక సేవ వంటి మూడు రంగాలలోనూ అంతే నిబద్ధతతో, విరామంలేని త్రివేణి సంగమం లాంటి జీవనయానం గడిపారు.

తన పంతొమ్మిదవ ఏట 'శ్రీ వెంకటేశ్వర కళాసమితి' ప్రదర్శించిన ''సీతారామకళ్యాణం'' నాటకంలో, "నందీశ్వరుడు" పాత్రతో తొలిసారి రంగస్థలంపై అడుగు పెట్టారు. కాకతాళీయంగా జరిగిన విశేషమేమిటంటే, ఆర్థిక ఇబ్బందుల వలన, అలనాటి విశాఖ ఓల్డ్ టౌన్‌లోని లక్ష్మీటాకీస్లో, ఎన్టీరామారావు నటించి, దర్శకత్వం వహించిన సీతారామ కళ్యాణం సినిమాను, తలుపు చాటునుండే ఏభై సార్లు చూసి, ఆ చిత్రం ఆసాంతం బట్టీపట్టేశారు. పాఠశాల విద్యార్థి దశలో, ఉపాధ్యాయుడు, రామమూర్తి నటప్రతిభను గుర్తించి, అన్ని క్లాసులలోనూ, అతనిచేత రావణబ్రహ్మ పాత్రను నటింపజేసి ప్రోత్సహించారు. కోటవీధికి చెందిన ఆనాటి నట, దర్శకులు స్వర్గీయ వై.యస్. రాజు ఆదరణ, ప్రోత్సాహంతో, 'నాలుగిళ్ళ చావిడి' నాటకంలో, 'మాష్టరు' పాత్ర ద్వారా సాంఘిక నాటకరంగ నటనలోకి అడుగుపెట్టారు. విశాఖ నటకకళా మండలి స్థాపకులలో ఒకరైన కె.ఎస్. మాష్టారు దర్శకత్వంలో, మోదుకూరి జాన్సన్ ప్రసిద్ధ నాటకం, 'నటనాలయం'లో గిజిగాడు పాత్ర లభించింది. ఆ నాటకంలో కె.ఎస్. మాష్టారు, భళ్ళమూడి రామమూర్తి, స్టార్ మేకర్ ఎల్. సత్యానంద్ ప్రధాన పాత్ర ధారులు. అనేక పరిషత్తులలో ఆ నాటకానికి బహుమతులు లభించాయి. పార్వతీపురంలో ఆంధ్ర నాటక కళాపరిషత్ నిర్వహించిన నాటక పోటీలలో ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి గెలుచుకుంది.



భళ్ళమూడి రామమూర్తి

గణేష్పాత్రో, రచన 'పావలా' నాటిక ఎస్.కె. మిశ్రో దర్శకత్వంలో, భువనేశ్వర్‌లో ఆ ఏడాది ఆంధ్రనాటక కళాపరిషత్ నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రదర్శనతో పాటు, అన్ని ఉత్తమ బహుమతులు గెల్చుకుంది. అందులో భళ్ళమూడిది 'షావుకారు' పాత్ర, పావలా శ్యామల, స్వర్గీయ పక్కి (పావలా) నారాయణరావు, ఎస్.కె. మిశ్రో కృష్ణచైతన్య పాత్రధారులు. ఆ స్ఫూర్తితో, 'పావలా' నాటిక, పలు నాటక కళాపరిషత్తులో ప్రదర్శించి అనేక ఉత్తమ ప్రదర్శన బహుమతులు గెల్చుకుంది. తొలినాళ్ళలో, ఆయన స్వయంగా రాసుకుని, ప్రదర్శించిన "పిచ్చివాడు" ఏక పాత్రాభినయంతో, అనేక పోటీలలో ఉత్తమ నటుడు బహుమతులందుకున్నారు. ఒకసారి అఖిల భారతస్థాయిలో ప్రదర్శించి, బంగారు పతకం స్వంతం చేసుకున్నారు.

కృష్ణచైతన్య, ఎల్. సత్యానంద్ దర్శకత్వంలో, 'అతిథి దేవుళ్ళు వస్తున్నారు', ఎస్.కె. మిశ్రో దర్శకత్వంలో, 'వంశవృక్షం' 'రామరాజ్యం', 'సమ్మె', 'ఏభై ఏళ్ళ స్వాతంత్ర్య సంబరాలు (సౌండ్ అండ్ లైటింగ్ డ్రామా) సత్యానంద్ దర్శకత్వంలోనే, 'ఆన్ ది హైవే' (మ్యూజికల్ మైమ్) 'గారడీ', 'ఊరేగింపు', 'అడవిదివిటీలు', ఆర్.వి.కె. గాంధీ దర్శకత్వంలో, 'ఆత్మఘోష' సుందరరావు దర్శకత్వంలో 'దేవీ సాక్షాత్కారం' నాటక, నాటకాలలో ప్రధాన పాత్రలు నటించారు. తొలి నుండీ, నటన, దర్శకత్వంలలో మంచి అవగాహన వున్నా, మంచి దర్శకులుగా గుర్తింపు ప్రతి కలిగిన వారి దర్శకత్వంలో నటించడం, నన్ను ఆ రంగంలో మంచి గుర్తింపు పొందేలా చేసిందని, తన దర్శకులందరి పట్ల ఎంతో కృతజ్ఞత ప్రకటిస్తుంటారు.

తాను ఒక పాత్ర నటిస్తూ, దర్శకత్వం వహించడం విధిగా పాటించే, భళ్ళమూడి రామమూర్తి తన దర్శకత్వంలో,

"గుండెలు మార్చబడును', 'సంగీత జనకులం' విద్యార్థులతో 'సతీసక్కుబాయి', 'ఓ నిర్మాతకథ', 'పెద్ద బాలశిక్ష', 'సమతా రాజ్యానికి దారి' వంటి నాటక, నాటికలు ప్రదర్శించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఢిల్లీ) ఆధ్వర్యంలో, ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విద్యార్థినీ, విద్యార్థులకు, ప్రఖ్యాత నట, దర్శకులు ఎం.కె. రైనా, డెబ్భైరోజుల పాటు శిక్షణనిచ్చారు. ఆ శిక్షణ ద్వారా 'కింగ్ ఈడిపస్', (గ్రీకు నాటకం) ముద్రా రాక్షసం (చారిత్రక నాటకం) ఊరేగింపు (వీధి నాటకం ప్రదర్శనలలో, అగ్రశ్రేణి నటీనటులతో కలిసి నటించడం అతని నట జీవితంలో మేలిమలుపు.

తెలుగునాట వీధి నాటకానికి శ్రీకారం చుట్టినది తిరునగరి రామాంజనేయులు. తర్వాతి కాలంలో, వీధి నాటకానికి చిరునామాగా వెలుగిందిన బాదల్ సర్కార్, సఫ్దర్‌హష్మీ, గురుచరణ్ సింగ్, అత్తిలి కృష్ణారావు వంటి వారి స్ఫూర్తితో, దాదాపు దశాబ్దకాలం పాటు వీధినాటక ప్రక్రియ యజ్ఞాన్ని కొనసాగించారు. ఆ ప్రక్రియతో 'ఊరేగింపు', 'పెద్దబాలశిక్ష', 'మేలుకో', 'సీకటి బాగోతం', 'నగరా, కథనరంగం', 'పంచతంత్రం', 'భేతాళ ప్రశ్న', 'బ్రహ్మ నీ తలరాత మార్చుకో', 'సాధనయాత్ర', 'షోలే', రెండు రెళ్ళు ఆరు', 'చింతామణి చిందులాట' వంటి వీధి నాటకాలు ప్రదర్శించారు. అలాగే, కార్మిక, ప్రజా జాగృతి ధ్యేయంగా రూపొందించిన నాణ్యతా విధానం (ఐ.ఎస్.ఓ. 9001) పర్యావరణ విధానం (ఐ.ఎస్.ఒ. 14001) వృత్తి సంబంధిత ఆరోగ్యం, భద్రతా విధానం, 'అంతర్జాతీయ నౌకాశ్రయ రక్షణ విధానం', 'పారాహుషార్', 'జాగృతి', 'అమ్మోబూచి' వంటివి వేలాది ప్రదర్శనలిచ్చారు.

1989లో ఆయన దర్శకత్వంలో విశాఖపట్నం పోర్టు అంతర్ విభాగ నాటక ప్రదర్శనల్లో భాగంగా 'మణికంఠ విలాసం' భక్తిరస ప్రధానమైన నాటకం ప్రదర్శించారు. అన్నివర్గాల ప్రేక్షకుల విశేష ఆదరణ పొందిన 'మణికంఠ విలాసం' నాటకాన్ని, ఆనాటి గురజాడ కళామందిరం (కలెక్టరేట్ ప్రాంగణం)లో 41 రోజులపాటు ప్రదర్శించడం ఆయన నాటకభక్తికి నిదర్శనం. భక్తిరస ప్రధానమైన ఆ నాటక యజ్ఞం, తన నటజీవితంలో ఎన్నో పాఠాలు నేర్పిందని అంటారు. విశాఖపోర్టు నుండి, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు కొన్నాళ్ళు ఆయన డెప్యూటేషన్‌పై వెళ్ళారు. ఆసమయంలో, సౌదీ అరేబియాలో ఒక కాంట్రాక్టు వర్కు చేపట్టిన, డి.సి.ఐ. కొందరు పోర్టు ఉద్యోగులను సౌదీ అరేబియా తీసుకువెళ్ళింది. అక్కడ కూడా భళ్ళమూడి, తన నాటక, భక్తి కార్యక్రమాలకు విరామ మివ్వకపోవడం విశేషం. భగవాన్ సత్యసాయిబాబా వారితో, చిన్నప్పటినుండీ అనుబంధం ఉన్న ఆయన, సౌదీలో కూడా నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు కొనసాగించారు.

ఇక డి.సి.ఐ.కి డిప్యూటేషన్ వచ్చిన వివిధ రాష్ట్రాల భాషా ఉద్యోగులతో, మంచి హాస్యనాటకాన్ని 'మైమ్' ప్రక్రియతో ప్రదర్శించారు. 'డెవిల్స్ హెయిర్ కటింగ్ సెలూన్' పేరుతో ప్రదర్శించిన ఆ మూకాభినయ నాటకం సౌదీ అరేబియాలో, 'క్యాట్-టి.వి.' ఛానెల్లో ప్రసారమయింది. 'అమెరికన్ ఆర్ట్ గిల్డ్'లో, భాగస్వామ్యమైన, 'ఈస్ట్రన్ ఆర్ట్ గిల్డ్‌లో కేవలం శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్లకు మాత్రమే స్థానం వుండేది. తిరిగి విశాఖపట్నం చేరుకుని 'రేవు'లో తన ఉద్యోగ విధుల్లో చేరారు. తన వీధినాటక ప్రదర్శనా వ్యాసంగానికి స్ఫూర్తి, మార్గదర్శి ఆనాటి పోర్టుట్రస్టు ఛైర్మన్ స్వర్గీయ పి.వి.ఆర్.కె. ప్రసాద్. పారిశ్రామిక భద్రతపై, భళ్ళమూడి ప్రదర్శించిన 'జాగృతి', పి.వి.ఆర్.కె. ప్రోద్బలంతో, పోర్టు అన్ని విభాగాలలోనూ ప్రదర్శించారు.

డెబ్భై అయిదేళ్ళ వయసులో భళ్ళమూడి జీవితంలో ఆధ్యాత్మిక సంబంధాలు, గురుభక్తి, గొప్ప అధ్యాయం. భగవాన్ సత్యసాయిబాబా, అంతర్జాతీయ జగద్గురు పీఠం స్థాపకులు సి.వి., ఎక్కిరాల కృష్ణమాచార్య, భీమిలి ఆనందవనం స్థాపకులు సద్గురు కందుకూరి శివానంద మూర్తి వంటి ఆధ్యాత్మిక మార్గదర్శకులతో మమేకమైన ఆధ్యాత్మికవేత్త. పద్మభూషణ్ నాటక తపస్వి డా. ఎ.ఆర్. కృష్ణగారు, ఒకసారి తనకు జరిగిన సత్కారానికి బదులిస్తూ, "తాను సన్మానాలు, బిరుదులకోసం నటించలేదు... నటించకుండా వుండలేను కాబట్టి అన్నేళ్ళు నటించాను" అన్నారు. ఆయన భావనే భళ్ళమూడికి వర్తిస్తుంది. 'ఏవో కొన్ని సత్కారాలు జరిగినా అవి, భళ్ళమూడి అంకిత భావానికి, తగిన స్థాయిలోనివి కావు" అని, ఆయన అభిమానుల అభిప్రాయం. "అయితే తాను పొందిన సత్కారాలు ఆ నటరాజుకే అంకితం. అందులో నా

గొప్పదనం ఏమీలేదని మనసా నమ్ముతాను" అంటారు. అలాగే సామాజిక అసమానతల పట్ల, ముఖ్యంగా గిరిజనులు, బలహీనవర్గాలు ఆనాటికీ గురవుతున్న ఆ దోపిడీ, వివక్ష, పీడనల పట్ల భళ్ళమూడిలో ఒక వామపక్ష విప్లవవాది కనిపిస్తారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్, భూషణం మాష్టారు, కా.రా. మాష్టారు, అట్టాడ అప్పలనాయుడు, వంగపండు ప్రసాదరావు వంటి ప్రజాసాహితీ వేత్తలతో ఆయన అనుబంధం, సాన్నిహిత్యం అనితరసాధ్యం.

"మీలోని ఆధ్యాత్మిక చింతనకు, ఈ వామపక్ష తీవ్రవాద భావజాలానికి ఎలా లంకె కుదరిందని" ప్రశ్నించినప్పుడు "అది దైవభక్తి, ఇది దేశభక్తి" అంటారు. నేను సమాజంలో జరిగే దుర్మార్గాలు, అవినీతి రూపుమాసి పోవాలని కోరుకుంటాను. అదే సందర్భంలో, ఆ ఆశయ సిద్ధికోసం హింసామార్గాన్ని నేను వ్యతిరేకిస్తాను. ఆ కారణంగా పైన పేర్కొన్న వారెవరూ నా పట్ల వివక్ష చూపకపోవడం అదృష్టంగా భావిస్తాను. నేను 'భూమి భాగోతం' ప్రదర్శించాను. 'జాగృతి' భద్రతా నాటికలో వంగపండు పాటలు వాడుకున్నాను. గిరిజన బిడ్డలను విద్యావంతుల్ని చేయాలన్న ధ్యేయంతో నేను నిర్మించిన 'నానూ సదుంకుంతాను" టెలిఫిల్మ్‌కు, అట్టాడ అప్పల నాయుడు చేత సంభాషణలు రాయించాను.

2009వ సంవత్సరంలో భళ్ళమూడి రామమూర్తి షష్టిపూర్తి ఉత్సవాలు వైభోవపేతంగా జరిగాయి. ఆ తర్వాత కూడా ఆయన విశ్రమించలేదు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఢిల్లీ) రిసోర్స్ పర్సన్, మాస్టర్ ట్రైనీగా నియమించింది. భళ్ళమూడి రామమూర్తి ఒక యజ్ఞంలా భావించి, అనేక సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా వీధినాటకాన్ని ఉపయోగించారు. ఆయన చేసిన వీధి నాటక ప్రయోగాలన్ని ఒక ఎత్తు. తరతరాలు మానవ నాగరికత పరిణామాన్ని మానవతను వెక్కిరిస్తూ, ఈనాటికీ భారతీయ సమాజానికొక మచ్చలా మిగిలిపోయిన సెక్స్ వర్కర్ల జీవితాలు, అలాగే హిజ్రాల జీవిత సంఘటనల నేపథ్యంతో, ఆయన చేసిన కృషి ఒక ఎత్తు. స్వయంగా ఎలమంచిలి ప్రాంతంలోని సెక్స్ వర్కర్లనే పాత్రధారులుగా చేసి, వారిచేత ఈ వీధి నాటికలు ప్రదర్శించడం సాహసోపేతం. తనలాంటి సాంప్రదాయక నేపథ్యం కలిగిన వ్యక్తిని, వారితో ఆ ప్రక్రియను చేపట్టడం తలచుకుంటే ఒళ్ళు జలదరిస్తుందని చెప్పారు. తన నాటికలో పాత్రధారుల్ని, పోలీసులు తమ శైలిలో పోలీస్ స్టేషన్లలో పెట్టినప్పుడు, తాను ఆయా స్టేషన్లకు వెళ్ళి సంబంధిత పోలీసు అధికారులను ఒప్పించి, వారిని విడిపించి తీసుకురావడం నాకొక విషమ పరీక్ష. అలాగే ఎయిడ్స్ వ్యాధి విజృంభణకు ఒక కారణమైన హిజ్రాలను కూడా చైతన్యవంతులను చేసి, అనేక వీధినాటిక ప్రదర్శనలివ్వడం నా నాటక ప్రస్థానంలో మరచిపోలేని జ్ఞాపకం. ఈ ఎయిడ్స్ వ్యాధి నేపథ్యం, నివారణ, సామాజిక, ప్రభుత్వాల కర్తవ్యం వంటి అంశాల గురించి, పద్మశ్రీ ఆచార్య డా. కూటికుప్పల సూర్యారావు గారు అందించిన సహకారం మరువలేనంటారు. తుమ్మపాలకు చెందిన శ్రీ జోగినాయుడు గారు తన ఎన్.వి.డి.ఎన్. స్వచ్ఛంద సంస్థ ద్వారా మంచి సహకారమందించారు.

అలాగే డా. వై.యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, బాపట్లలో ఒక పెద్ద కార్యక్రమాన్ని ప్రకటించారు. దాని అమలులో తనను భాగస్వామిని చేశారు. శక్తివంచన లేకుండా, ఆ కర్తవ్య నిర్వహణలో సఫలీకృతులైనారు. అన్నింటికన్నా, తాను ఒకనాటి లక్ష్మీటాకీసు సమీపంలోని, చిలకపేట వద్ద సెక్స్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి తగిన కార్యక్రమాలు చేసేవారు. ఆ సందర్భంలో, అక్కడికి సమీపంలో నివాసముండే ఒక యువతి తనకెంతో సహకరించడం చాలా ఆశ్చర్యం కలిగించేది. "ఒకసారి, తాను ఆ యువతి తల్లిదండ్రులతో చెప్పి, ఆ యువతిని ఆ పరిసరాలకు రాకుండా చూడాలని కోరాను. అందుకు ఆ యువతి తండ్రి చెప్పిన మాటలు విని నేను ఆశ్చర్యానికి, ఆనందానికి లోనయ్యాను. చిన్నప్పటినుండీ ఈ సమాజానికి మనమేమైనా సేవ చేయాలని ఆ యువతి చెబుతూ, తన ఆశయానికి అడ్డురావద్దని తల్లిదండ్రులను కోరేదట.

అత్యంత బలహీన వర్గాలకు చెందిన యువతి మల్లువలస సరస్వతి, తన సామాజిక, మహిళా సహకార కార్యక్రమాలకు గాను, ఇటీవలే జాతీయస్థాయిలో పూర్వకేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ గారి చేతుల మీదుగా కొత్తఢిల్లీలో ఉత్తమ సేవాపురస్కారం స్వీకరించడం 'కర్తవ్యో ధర్మసంగ్రహ' అన్న ఆర్యోక్తిగా తార్కాణంగా తన

జీవితంలో గొప్ప అనుభవంగా మిగిలిపోతుంది. అతి చిన్న వయస్సులో, ఆ యువతి చేసిన సాహసోపేత సేవలు గుర్తిచ్చి ఆనందభాష్పాలు రాలుతున్నాయి" అంటూ ఆనందం వ్యక్తం చేశారు. బహుముఖాలుగా, తన నాటక పరిజ్ఞానాన్ని సామాజిక సేవా దృక్పథంతో, దశాబ్దాలుగా కొనిసాగించిన శ్రీ భళ్ళమూడి రామమూర్తిగారిని జాతీయపురస్కారంతో గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! పేద, మధ్యతరగతి వారికి కనీస అవసరమైన గృహనిర్మాణం – ప్రభుత్వాల ఆలోచనలు అంశంగా 'నా ఇల్లు' టెలిఫిల్మ్ నిర్మించారు. తాను స్వయంగా స్థాపించిన 'పూర్ణోదయా స్టార్ ఆర్టిస్ట్' నాటక సంస్థ సుదీర్ఘమైన తెలుగు నాటక రంగ చరిత్రలో తన అధ్యాయాన్ని నిక్షిప్తం చేసుకుంది.

తన అనుభవాలు, జ్ఞాపకాలను తన డైరీలలో అక్షరబద్ధం చేసుకున్నారు. జన్మతః వచ్చిన ధారణతో, తన అనుభవాలను దృశ్యమానంగా చెప్పగలగడం భళ్ళమూడికే చెల్లు. ఇటీవలే ఆ అపురూప జ్ఞాపకాలన్నీ ఆధారంగా వివిధ రంగాలకు చెందిన మహనీయుల చరిత్రను ఒక వ్యాస సంకలనంగా రూపొందించే పనిలో నిమగ్నమైనారు. అందులో, అలనాటి ఆధ్యాత్మిక భజన గీతాలు రచయితల బార్కన్దాస్, అనుపోజు లక్ష్మణరావు మొదలు అంగర సూర్యారావు, గణపతిరాజు అచ్యుతరామరాజు, నటరాజ్ కె. వెంకటేశ్వరరావు, ఆర్.వి.చలం, రఘురామయ్య, అత్తిలి కృష్ణారావు, ఎస్.కె. మిశ్రో వంటి ఎందరో నటశ్రేష్ఠుల చరిత్ర ఈ తరానికి తెలియజెప్పాలన్న ఆయన తపన ఆదర్శప్రాయం. ప్రత్యేకించి, భారతదేశంలో వీధినాటక ప్రక్రియకు ఆద్యులు, ఆదర్శనీయులు అయిన తిరుసగరి రామాంజనేయులు, బాదల సర్కార్, గురుచరణ్ సింగ్, సఫ్దర్ హాష్మీ వంటివారి అపురూప కృషి నేటి నటీనటులకు అందజేయడంలో ఆయన పాత్ర చిరస్మరణీయం. 'సంగీత జనకులం' స్థాపించి, వందలాదిమందిని సంగీతకారులుగా తీర్చిదిద్దిన ఐ.వి.ఎల్.శాస్త్రి గారి సంగీతాభివృద్ధి పట్ల భళ్ళమూడి భక్తిప్రపత్తులు నిరుపమానం.

"పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఎల్.వి. సుబ్రహ్మణ్యం, వాడ్రేవు చినవీరభద్రుడు వంటి ఎందరో సివిల్ సర్వీస్ అధికారులు నా ప్రస్థానానికి సహకరించారు. నేను అనుసరించిన మార్గాన్ని గురించి వారు అభ్యంతరం తెలపలేదు. ఆచార్య ఎల్.వి.ఎస్.ఆర్. కృష్ణశాస్త్రి, నేరెళ్ళ వేణుమాధవ్వంటి పెద్దల వాత్సల్యం మరువలేనంటారు.

'అలాగే నా నాటకరంగ సహచరులుకానీ, నా ఆధ్యాత్మిక రంగ మార్గదర్శకులుకానీ, నా అభిప్రాయాలను వ్యతిరేకించలేదు. ప్రేమతో, సామరస్యంతో, అవగాహనతో వారి మన్ననలందుకున్నాను. సుదీర్ఘమైన నా ప్రవృత్తి జీవితం అత్యుత్తమ ఫలితాలనిచ్చింది. అదే నా సంపద." అంటూ సంతృప్తిని ప్రకటించే సేవాతపస్వి భళ్ళమూడి రామమూర్తి.

బి.వి. అప్పారావు
జర్నలిస్ట్, (నాటకబంధం)
విశాఖపట్నం, ఫోన్ : 9347039294

## కమ్మతెమ్మెర

మాన్యులు అశ్వినీ కుమార్ గారికి వందనం.

**మిసిమి** ఆగస్టు సంచికను ఇమెయిల్ రూపంలో పంపినందుకు ధన్యవాదాలు. ఈ సారి ముఖ చిత్రాలు ఆధ్యాత్మికతకు, దేశభక్తికి ప్రతీకలుగా ఉన్నాయి. విశ్వ సుందరీమణులు బుంగ మూతి పెట్టుకొని చిన్నబుచ్చుకొని ఉండాలి. తరువాతి సంచికలో వారి ముఖ చిత్ర స్థానాన్ని తిరిగి మీరే ఇస్తారన్నది ఒక ఊహ. రచనల విహంగ వీక్షణం నాకు లోతు అధ్యయనానికి ప్రేరణ. నెలకు సరిపడే మేధకు మేత. మొదలు పెడతాను....




**మిసిమి** కుటుంబానికి శ్రావణ మాస శుభాకాంక్షలు.

- రాయవరపు సత్యనారాయణ

# రమణీయం-నార్వే దేశం

(ద్వితీయ భాగం)

ఆంగ్లం - డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు - శ్రీమతి అట్లూరి జయశ్రీ



బర్గెన్ సిటీ

స్టావంగాలో బయలుదేరిన నా బస్, అయిదు గంటల ప్రయాణం తరువాత బర్గెన్ చేరుకుంది. దోవ అంతా రెప్ప వాల్చకుండా చూడవలసిన ప్రదేశం. పగటి పూట ప్రయాణం. పైగా ఆ రోజు, పుచ్చపువ్వులాంటి చలిదేశపు సూరీడు, కనుచూపుమేర బంగారపు రజను వెదజల్లుతూ, మెరిపిస్తూ, ఆహ్లాదంగా మురిపిస్తూ వెంటే వచ్చాడు. భారతదేశానికి చిరపుంజి ఎట్లాగో, ఐరోపాకు బర్గెన్ అట్లా. సంవత్సరంలో 200 రోజులు ఎడతెరపి లేని వర్షాలు పడుతూనే ఉంటాయి.

స్టావంగాలో దిగిన వెంటనే హోటల్ స్కాండిక్ చేరిపోయి, సమయం వృథా చేయకుండా ఊరు చూడటానికి వెళ్లిపోయాను. ఆ దోవలో ఒక వీధి కోలాహలంగా ఉంది. కణ కణ లాడే నిప్పుల మీద కాల్చి తయారు చేస్తున్న తాజా పదార్థాల తాలూకు సువాసనలను గాలి మోసుకొచ్చింది. బహుశా అప్పటికి ఏమన్నా తిని చాలా సేపు అయి ఉండటంతో కాబోలు, నా మనసంతా నోరూరించే ఆ గాలి వైపు మళ్ళాయి. ఒక మాంఛి సాసేజ్‌తో ఆత్మా రాముడిని శాంత పరచుకుని పట్టణ కూడలి వైపుకు సాగి పోయాను. అక్కడ చూస్తే ఆ చక్కని సాయంకాలాన్ని నిండారా ఆస్వాదించటానికి ఆ పట్టణవాసులంతా అక్కడ చేరారా! అన్నంత హడావుడిగా ఉంది. ఆ ప్రక్కనే ఉన్న కొలనులో ఉన్న జలయంత్రం నిరవధికంగా జలధారలను ఎగచిమ్ముతూ అలరిస్తూ ఉంది. చెర్రీ చెట్లు పూలతో తూగుతున్నాయి. ఇక పోతే రంగు రంగుల ట్యులిప్పులు, పసుపు పచ్చని డాఫోడిల్ పూలు వసంత సంకేతాలుగా కనువిందు చేస్తున్నాయి. అక్కడి వాతావరణం హుషారుగా ఉంది.

ఆ దగ్గరలో ఉన్న టూరిస్ట్ ఆఫీసులో 'బర్గెన్ కార్డు' కొన్నాను. దీనితో 48 గంటల పాటు అక్కడున్న చాలా మ్యూజియమ్లను వేరే ప్రవేశ రుసుము కట్టకుండా చూడవచ్చు. కొన్ని ప్రత్యేక ఆకర్షణల ప్రవేశ రుసుములో కూడా కొంత రాయితీ లభిస్తుంది. ఒక విధంగా ఈ కార్డు, దాని వలన ప్రవేశం లభించే, ఎన్నో మ్యూజియంలను చూడమని నాకు సూచించింది. నేను సాధారణంగా ఆ ప్రాంతపు చరిత్ర, అక్కడి ప్రజల వ్యక్తిత్వ వైవిధ్యాన్ని తెలిపే వాటికి వెళతాను.

పల్పిట్ రాక్ మీద నాకు పరిచయమైన భారతీయ మిత్రులు నాకు ఎడ్వర్డ్ మంచ్ అనే ప్రసిద్ధ నార్వేజియన్ చిత్రకారుడి గురించి, అతను చిత్రించిన 'స్క్రీమ్' అనే చిత్రాన్ని గురించి చెప్పారు. వారు దాని గురించి చెపుతున్నప్పుడు, ఎర్రటి ఆకాశం నేపథ్యంలో, నోరంతా తెరచి కోపంతో అరుస్తున్నట్లు కనపడే ఒక మనిషి ముఖాన్ని చూపించే చిత్రం నా కళ్ళకు కట్టింది. అయితే అది ఎడ్వర్డ్ మంచ్ సృష్టి అని నాకు అంత వరకు తెలియదు. ఎర్రెర్రటి ఆకాశం.. భూగోళం బద్దలై అగ్ని పర్వతపు లావా ఎగసిపడిందా అన్నంత కోపానికి సూచన. ఆ సమయంలో మంచ్ సోదరిని మానసిక రోగిగా, అవాస కేంద్రంలో చేర్పినందుకు అతనికి కలిగిన కోపమే దీనికి ప్రేరణ అని ఒక వినికిడి.

ఈ చిత్రం గురించి మాట్లాడుకుంటున్నప్పుడు వాళ్ళు, ఓస్లో నగరానికి వెళ్ళినప్పుడు మంచ్ కళాసృష్టిని ప్రదర్శించే మ్యూజియంను తప్పక చూడమని చెప్పారు. కాని బర్గెన్ లోనే అటువంటి మ్యూజియం నాకు కనిపించింది. దానిని చూడటానికి సహేతుకంగా చాలా సమయం వెచ్చించాను. మంచ్ కళా దృష్టి క్రమేణా పరివర్తనం చెందిన విధానం

న్ను ఆకట్టుకుంది. మొదట్లో అతను తనకు కళను నేర్పిన గురువు దృక్పథాన్ని అనుసరించినా, తరువాత తనదైన శైలిని ఏర్పరచుకున్నాడు. తన చిత్రాలలో కనిపించే మనుషుల ముఖ కవళికలు, అంద చందాల కంటే, వారి భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇచ్చి, వాటికి రూప కల్పన చేయగలగటం ప్రధాన లక్ష్యంగా మంచ్ కళా తపస్సు చేశాడు. తరువాత కాలంలో మానసిక రుగ్మత కారణంగా, మంచ్, కోపెన్హాగెన్ లో ఉన్న ఒక ఆసుపత్రిలో చేర్చబడ్డాడు. ఆ తరువాత అతను బాహ్యంగా కనిపించే వ్యక్తుల రూపు రేఖలను చిత్రించటం మీద ఎక్కువ దృష్టి పెట్టటం కనపడుతుంది. చిత్రకారుల కళాసృష్టి మీద వ్యాఖ్యానం చేయటానికి కావలసినంత పరిజ్ఞానం నాకు లేదు. కాని, చాలా మంది ప్రసిద్ధి పొందిన కళాకారులు వారి జీవితాలలో ఏదో ఒక దశలో మానసిక రుగ్మత పాలవటం మాత్రం నేను గమనించాను. మనిషిని ఛిద్రం చేసే మానసిక అనారోగ్యపు లోతుల్లో, ఏ భావోద్వేగాలు దాగి ఉంటాయో ఎవరికి తెలుసు?

సప్తగిరులను చీల్చుకుంటూ వాటి మధ్యగా సాగిపోయే ఫియోర్డ్ల ఒడిలో బర్గెన్ ఉంది. ఫ్లోయెన్ అనే ఒక కొండ మీదకు, బలమైన ఇనుప తీగెల మీద వ్యతిరేక దిశలలో నడిచే రెండు పెట్టెలలో ఎక్కి దిగే సౌకర్యం ఉంది. దీనిని ఫనిక్యులర్ రైల్వే అంటారు. క్రిందకు దిగే పెట్టెలో నీరు నింపటంతో అది క్రిందకు దిగుతుంది. తద్వారా దానికి వ్యతిరేక దిశలో తగిలించ బడిన పెట్టె పైకి వెళుతుంది. వేరే ఇంధనమేమీ అవసరం లేకుండా, కేవలం భూమ్యాకర్షణ శక్తిని వాడుకుంటూ పర్వతాలను తేలికగా ఎక్కటానికి, భూమి ఉపరితలం మీద సహజంగా ఉండే హెచ్చు తగ్గులను లెక్క చేయకుండా సాగిపోవటానికి ఇదొక చక్కని పరిష్కారం. ఐరోపాలో చాలా చోట్ల ఈ ఉపాయాన్ని ఉపయోగించుకుంటారు. ఫనిక్యులర్ రైల్వే మీద ఫ్లోయెన్ మీదకు వెళ్ళిన నేను, చుట్టూ ఎన్నో కిలో మీటర్ల మేర చూడగలిగాను. ముఖ్యంగా బర్గెన్ నగరం, చుట్టూ ఉన్న కొండలు, వాటి మధ్య ఫియోర్డ్లు, ఏక మొత్తంగా చూడగలగటం ఒక మంచి అనుభవం. అక్కడ, ఆ కొండ మీద నాకు కొన్ని గొర్రెలు కనపడ్డాయి. నాకవి అదృష్టవంతులుగా కనపడ్డాయి. కడుపునిండా కావలసినంత.. మేతకు మేత, కనువిందైన దృశ్యాలు.. నిజంగా పెట్టి పుట్టాయి అనుకున్నాను.

వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన బర్గెన్ ఒకప్పుడు (ఓస్లోకు ముందు) నార్వే రాజధాని. వైకింగుల కాలం నాటి నుండి సముద్ర యానంలో ఆరితేరిన నార్వే దేశానికి, బర్గెన్ ఒక ప్రముఖమైన రేవు పట్టణం. మధ్య యుగపు కాలంలో, దాదాపు 500 సంవత్సరాల పాటు బర్గెన్ ప్రభ నిరాఘాటంగా వెలిగింది. ఉత్తర ఐరోపాలో ప్రఖ్యాతి గాంచిన, హన్సియాటిక్ లీగ్ అని పేరు గల జర్మన్ వర్తక సంఘం ఉపయోగించిన నాలుగు వాణిజ్య కేంద్రాలలో బర్గెన్ ఒకటి. నేను పోలండ్, లిథుయేనియా, లత్వియా, ఎస్టోనియా దేశాలలో పర్యటించినప్పుడు, ఈ హన్సియాటిక్ లీగ్ గురించి విని ఉన్నాను.

ఈ ప్రాంతపు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామాన్ని ప్రభావితం చేయటంలో హన్సియాటిక్ లీగ్, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి ఏమాత్రం తీసిపోదు. ఒక విధంగా ఇది ఇంకా శక్తివంతమైనదేమో. సైన్యాన్ని పోషించటం, ఆర్థిక దన్ను ఇచ్చి, ప్రభుత్వ విధానాలను అనుకూలంగా మార్చుకోవటం, రాకుమారులకు, చక్రవర్తులకు ఋణాలు ఇవ్వటంలాంటి పనుల వలన, ఇదొక బలమైన శక్తిగా నిలిచింది. అయితే, ఇది ఈస్ట్ ఇండియా కంపెనీ చేసినట్లు సుదూర విదేశాలతో వర్తకం మీద దృష్టి సారించ లేదు. దీని వాణిజ్య పరిధి కేవలం బాల్టిక్ సముద్రం, ఉత్తర ఐరోపా మాత్రమే. ఇట్లా కానట్లైతే, సుదూర దేశాలలో బ్రిటిష్, ఫ్రెంచ్, డచ్, స్పానిష్ వారు ఏర్పరచుకున్న కాలనీల వలన ఏర్పడిన అమెరికా, ఆసియాల స్థితి గతుల రూపురేఖలు వేరుగా ఉండేవి. 17 నుండి 19వ శతాబ్దం వరకు ఆ నాలుగు రాజ్యాల మధ్య జరిగిన వర్తక/ఆర్థిక పరుగు పందెంలో జర్మనీ లేకపోవటానికి కారణం కూడా ఇదేనేమో. బర్గెన్లోని, బ్రీజ్జెన్ ప్రాంతం ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించ బడింది. ఇది హన్సియాటిక్ లీగ్లోని జర్మన్ వర్తకుల సమావేశ స్థావరం. వారిది ఒక అంతర్ముఖమైన సంఘం. స్థానిక నార్వే జనానీకంతో సహజీవనం చేయటం కానీ, వివాహ సంబంధాలు కానీ వారికి ఉండేవి కావు. వివిధ వర్ణాలతో కనిపించే వారి చెక్క ఇళ్ళు, బ్రీజ్జెన్ ప్రాంతానికి ప్రత్యేకత కలిగించాయి. చూడగానే మామూలుగా కనిపించే ఈ ఇళ్ళు, లోపలికి వెళ్ళిన కొద్దీ, వెనుక భాగంలో విశాలంగా విస్తరించి ఉంటాయి. ఇళ్ళ మధ్య పెద్ద పెద్ద దుంగలు పరచి ఏర్పరచిన వీధులలో నడవటం ఒక ప్రత్యేకమైన అనుభవం.

18వ శతాబ్దంలో హన్సియాటిక్ లీగ్ బలహీన పడిన తరువాత, నెమ్మదిగా దాని జర్మన్ సభ్యులు స్థానికులతో కలసిపోయారు. ఇప్పుడు నేను చూస్తున్న బ్రీజ్జెన్.. సందర్శకులకు, స్థానికులకు.. వివిధ రకాలైన రెస్టారెంట్లు, బార్లు, డిజైనర్ షాపులు, జ్ఞాపికలు అమ్మే దుకాణాలు వగైరాలతో కూడిన ఒక ఆకర్షణ.

నా హోటల్ నుండి బ్రీజ్జెన్, హార్బర్‌కు సరిగ్గా అవతలి వైపు. కాలి నడకన అక్కడకు చేరుకుని, కాసేపు ఆ ఇరుకు కర్ర దుంగల వీధులలో, ఇప్పుడున్న షాపుల మధ్య తిరిగి, అలనాటి హన్సియాటిక్ లీగ్ వైభవాన్ని ఊహించుకునే ప్రయత్నం చేశాను. ఇదంతా పూర్తయ్యే సరికి, నా అభిమాన కార్యక్రమ సమయం ఆసన్నమయింది. హార్బర్ వైపు నడుస్తూ వెళ్ళి, సూర్యాస్తమయానికి అభిముఖంగా ఒక బెంచీ చూసుకుని కూర్చున్నాను. మరో దేశం, మరో ప్రాంతం, అదే సూర్యుడు.. అదే అస్తమయం. కానీ ఇది ఇంకొక అతిలోక అనుభవం. భవంతులు, నావలు, ఓడలు, సముద్రం.. ప్రకృతి మొత్తం నిముష నిముషానికి ఒక సరికొత్త, బంగారు నారింజ వర్ణ ఛాయను సంతరించుకుంటూ, క్రమేణా ఎరుపెక్కి, కెంపు వర్ణం.. దృశ్యం మీదుగా.. నా మనసులోకి ఇంకిపోయింది. మాటలు మౌనమైన సమయం అది. రమణీయం. సదా చిరస్మరణీయం.

ఇది నార్వేలో నా మూడవ సాయంత్రం. కారణమేమైనా, ఇంత వరకు నేను సరైన డిన్నర్ గురించి ఆలోచన కూడా చేయలేదు. బ్రీజ్జెన్‌లో ఒక రెస్టారెంటు చూశాను. అక్కడ సాంప్రదాయక నార్వేజియన్ భోజనం దొరుకుతుందట. దాని పేరు, 'బ్రీజ్జెన్ ట్రాక్ఫ్యూర్ స్టెడ్'. అక్కడ భోజనం ఎట్లా ఉన్నా, ఇంత కష్టమైన పేరున్నందుకైనా ఆ రెస్టారెంటు నా యాత్రా విశేషాలలో తప్పక చోటు చేసుకోవాలి. గచ్చు నేలలు, చెక్కలతో చేసిన బల్లలు, కుర్చీలతో పాతకాలపు వాతావరణంలో నాకు డిన్నర్ వడ్డించారు. అక్కడ వడ్డిస్తున్న వెయిటర్ కొంచెం విషయ జ్ఞానం ఉన్నట్లు కనిపించాడు. భోజనం చేస్తూ అతనితో చిన్నపాటి భేటీ వేశాను. అతను చెప్పిన దాని ప్రకారం, ఈ రెస్టారెంట్ అక్కడున్న వాటిలో అతి పురాతనమైనది. ఒకప్పుడు ఇది అక్కడి సంపన్న వర్తకులకు భోజనశాల. వాళ్లెంత గొప్పవాళ్ళైనా, భోజన విషయంలో మాత్రం రాజీ పడరు. సాంప్రదాయిక భోజనం కావాలని అడిగినందుకు, నా భోజనం పొగసెగలో వండిన సాల్మన్ చేపతో మొదలై, ప్రధానంగా 'ప్రిన్స్ ఫిష్' వంటకం వడ్డించటంతో ముగిసింది. ప్రిన్స్ ఫిష్ మొదటగా 1856లో, నార్వే స్వీడెన్‌ల రాకుమారుడు, డచ్ రాకుమారుడితో కలసి ఇక్కడకు వచ్చినప్పుడు తయారు చేశారట. అప్పటి నగర మెజిస్ట్రేట్, ఈ ఇరువురు రాకుమారుల గౌరవార్థం ఇచ్చిన విందు కోసం, దీనిని రూపొందించారట. అప్పటినుండి బర్గెన్ ఫిష్ రెస్టారెంట్లలో ఇదొక గౌరవ విశేషంగా గణుతికెక్కిందట. ఒక పళ్ళెంలో లేత ఆస్పారగస్ కాడలు పరచి, వాటి మీద ఒక పెద్ద ఉడికించిన కాడ్ చేప ముక్క, ఒక చిన్న లోబ్స్టర్ ముక్క అమర్చి, వాటి మీద తెల్ల వైన్ సాస్ పోసి అందిస్తారు దీనిని. దీని రుచి గురించి నాకేమీ పెద్ద ఆక్షేపణ లేకపోయినా, రాకుమారుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వంటకం అంటే, నేను ఊహించుకున్నంత లేదు. మరీ ఎక్కువ ఊహించుకున్నప్పుడు ఆశాభంగం తప్పదుగా మరి!!

నార్వే దేశం జలపుష్పాలను ఆరాధిస్తుంది. వారి ఆహారంలో ప్రధానమైనది చేప. అక్కడ ఎక్కువగా దొరికేదీ, వారి ముఖ్యమైన ఎగుమతి కూడా చేపలే. శతాబ్దాల తరబడి, ఎండు కాడ్, సాల్మన్ ఇక్కడినుండి ఇతర దేశాలకు ఎగుమతి అవుతూ వచ్చాయి. నాకు సాల్మన్ చాలా ఇష్టం. ఎక్కడకు వెళ్ళినా ఇది కనపడితే తప్పక తీసుకుంటాను. అట్లా నేను చూసినంతలో రుచిలో గాని, ఎంతో పోషక విలువలు కలిగిన చేప నూనెను అందించటంలో కానీ, స్కాటిష్ సాల్మన్, అలాస్కా సాల్మన్‌ల కంటే, నార్వే సాల్మన్ చాలా మేలైనది.

ఉత్తర ధృవానికి దగ్గరలో ఉండటంతో, ఈ మే నెలలో రాత్రి పది గంటలకుగాని, సూర్యుడు చీకటి దుప్పటి ముసుగు వేసుకోలేదు. ఆ కనుచీకటిలో మెల్లగా నడుస్తూ నా హోటల్ చేరుకున్నాను. ఈ నార్వే హోటల్‌లో సింగిల్ రూమ్ అంటే, గిరి గీసినట్లు ఒకే బెడ్ పట్టే రూమ్ మాత్రమే. ఆ రూమ్‌లో మరో సన్నపాటి మనిషి దూరటానికి కూడా చోటు లేదు. అయినా పరిశుభ్రంగా, వసతిగా ఉంది. ముందు రోజు పల్పిట్ రాక్ ఎక్కిన శారీరక శ్రమ ఇంకా ఉపశమించ లేదు సరికదా, ఇవ్వాల్టికి ఇంకొంచెం ఎక్కువైనట్లు ఉంది. ఈ కండరాల నొప్పి మీద నుండి దృష్టి మళ్లించుకోవటానికి, 'లోన్లీ ప్లానెట్' గైడ్ బుక్‌లో బర్గెన్ గురించి చదువుదామనుకున్నాను. కానీ అందులో

నార్వేలో పర్వతారోహణాలను, తేలిక, కష్టతరం, అతి కష్టం (ఛాలెంజింగ్) అని మూడు రకాలుగా విభజించి చూపటం నా దృష్టిని ఆకర్షించింది. అందులో పల్పిట్ రాక్ ఎక్కడం మూడోరకమని చూపాడు. నేను కూడా నా అనుభవాన్ని బట్టి, శారీరకంగా తయారుగా లేని వారిని పల్పిట్ రాక్ ఎక్కవద్దని సలహా ఇస్తాను. పల్పిట్ రాక్‌లో పరిచయమైన నా మిత్రులు, నన్ను ట్రోల్టుంగా అనే మరొక పేరొందిన రాక్ ఎక్కమని ప్రోత్సహించారు. ఇది ఒక సరస్సు ప్రక్కన ఉన్న పర్వతం మీద 700 మీటర్ల ఎత్తున ఉంటుందట. అక్కడికి వెళ్ళి రావటం పర్వతాలమీద 50కి.మీ. నడక. మూడు రోజులు పడుతుంది. అక్కడకు వెళ్ళటానికి మళ్ళీ వస్తానని, వాళ్ళు కూడా నాతో రావాలని వాళ్ళతో చెప్పాను. కానీ ప్రస్తుతం నేను అనుభవిస్తున్న భరించలేని బాధ వలన దాని గురించి ఆలోచన కూడా చెయ్యను. కనీసం అవి తగ్గే వరకైనా!! ఆ రాత్రి నా శరీరం ఆదమరచి పోయింది. నిద్ర ఔషధం అయింది. లేచేసరికి మళ్ళీ నేను నేనయ్యాను. చేపలు ముఖ్యంగా సాల్మన్‌తో కూడిన, మంచి ఉపాహారం కానిచ్చి, మళ్ళీ బయలుదేరి పోయాను. నిన్న తిరిగిన హార్బర్, బ్రిజ్జెన్ ప్రాంతం మళ్ళీ ఒక సారి తిరిగి చూసిన తరువాత, ముందు రోజు చదివి తెలుసుకున్న స్టేవ్ చర్చికి వెళ్ళాలనుకున్నాను.

స్టేవ్ చర్చ్‌లు ఈ ఐరోపా ప్రాంతంలో కనిపించే విలక్షణమైన క్రిస్టియన్ చర్చ్‌లు. వందలాది సంవత్సరాల క్రిందట, మొత్తమంతా మంచి, నాణ్యమైన పైన్ చెట్ల కలపతో ఇవి నిర్మించబడ్డాయి. ఒకప్పుడు ఇవి వందల కొద్దీ ఉండేవట. రాజకీయ అలజడులు రేగినప్పుడు కొన్ని, సహజంగా కొన్ని కాలగర్భంలో కలిసిపోగా.. ఇప్పుడు కొన్ని మాత్రమే మిగిలాయి. ఈ మిగిలిన వాటిలో ఎక్కువ భాగం నార్వేలోనే ఉన్నాయి. విలక్షణమైన భవన నిర్మాణ రీతిలో కట్టబడిన స్టేవ్ చర్చ్‌లు, నార్వే వారి జాతీయ సంపదగా గణుతికెక్కాయి. నేను వెళ్ళిన స్టేవ్ చర్చ్ పేరు, ఫాంటోఫ్ట్ స్టేవ్ చర్చ్. ఇది, బర్గెన్ నుండి ముప్పావు గంట ప్రయాణ దూరంలో, నగర శివార్లలో ఉన్న పారడిస్ అనే ఒక చిన్న ప్రాంతంలో ఉంది. ఇరవై అయిదు నిముషాల రైలు ప్రయాణం తరువాత, చుట్టూ చెట్లతో ఉన్న ఒక కొండ దారిన కాలి నడకన ఎక్కుతూ, కొండ పైభాగంలో ఉన్న ఫాంటోఫ్ట్ స్టేవ్ చర్చ్ చేరటానికి మరొక ఇరవై నిముషాలు పట్టింది. ప్రశాంతత నిండి ఉన్న ఆ ప్రాంతంలో మరొక జంట తప్ప ఇంకెవరూ నాకు కనపడలేదు.



ఫాంటోఫ్ట్ స్టేవ్ చర్చి

ఫాంటోఫ్ట్ స్టేవ్ చర్చి విలక్షణమైన వాస్తురీతితో, అనూహ్యంగా అద్భుతంగా కనిపించింది. దానిని చూడగానే నాకు జపాన్‌లో కనిపించే పగోడాలు గుర్తొచ్చాయి. 'వైకింగ్ పగోడాలు' అని మనుసులో అనుకున్నాను. అక్కడ చెక్క మీద చెక్కిన కళా రూపాలు నా కళ్ళను ఆకట్టుకున్నాయి. వాటిలో ఎక్కువ భాగం, నార్వే చరిత్రను ప్రతిఫలించే వైకింగ్ వీరుల గాధాచిత్రాలు. నార్వే జాతీయ, చారిత్రక, సాంస్కృతిక సంపదలో ప్రముఖంగా నిలిచే ఈ స్టేవ్ చర్చ్ చూడగలగటం నా అదృష్టమనుకున్నాను.

ఫాంటోఫ్ట్ స్టేవ్ చర్చ్ నుండి తిరిగి వస్తున్నప్పుడు, ట్రామ్‌లో, నా ఎదురుగా కూర్చున్న వ్యక్తి రమేష్. మన తెలుగువాడవటం మరీ సంతోషం. విజయవాడ నుండి వచ్చాడట. అతను ఐ.టి. రంగంలో, అంతర్జాతీయంగా, 100 బిలియన్ డాలర్ల వ్యాపారం చేసిన మొట్టమొదటి భారతీయ సంస్థ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టి. సి. ఎస్)లో పనిగా చేస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా అంటే 2015 నుండి బర్గెన్‌లో ఉంటున్నాడట. మాటలలో అతను తాను, ట్రోల్టుంగా పర్వతం ఎక్కానని, చెపుతూ.. నన్ను కూడా ఆ పని చేయమని ప్రోత్సహించాడు. అదుగో.. మళ్ళీ నార్వే రావటానికి ప్రోత్సాహకం ఏర్పడిపోయింది.. ఈసారి అదెటూ కుదరదు కాబట్టి. రమేష్ నార్వే ఆర్థిక స్థితిగతులు బాగా తెలిసినవాడవటంతో మా సంభాషణలు అటు మళ్ళాయి. నార్వే చమురు పరిశ్రమలో చాలా మంది భారతీయ ఇంజనీర్లు పని చేస్తున్నారట. నార్వేలో చమురు నిల్వలు కనిపెట్టక ముందే, నార్వే ఆర్థికంగా బలంగా ఉందట. చమురు, సహజ వాయువుల నిక్షేపాల రూపంలో దానికి మరింత అదృష్టం పట్టింది. ఇట్లా ఆర్జించిన సంపదను నార్వే ప్రభుత్వం, ఆ దేశ పౌరుల కోసం 'సోవరీన్ ఫండ్'లో మదుపు చేస్తుందట. చాలా దేశాలలో ప్రభుత్వాలు.. పెరుగుతూ పోతున్న 'తలసరి అప్పు' అనే మూట బరువు

మోయలేక విల విలలాడుతుంటే, నార్వే ప్రభుత్వం మాత్రం తాను సాధించిన జాతీయ ఆర్థిక మిగులును, మదుపు చేస్తూ, నార్వే భావితర పౌరుల ఆర్థిక భద్రతను పరిరక్షించుకుంటూ పోతోంది. 2025 నాటికి నార్వే సోవరీన్ ఫండ్ విలువ రెండు ట్రిలియన్ అమెరికన్ డాలర్లు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో నార్వే ప్రభుత్వం సాధికార మదుపరి. ఈ ఫండ్ వలన లభ్యం పొందేది అయిదున్నర మిలియన్ల నార్వే పౌరులు. అంటే ఏ రోజైనా ఈ ఫండ్‌ను అక్కడి పౌరులకు పంచటం జరిగితే, ఒక్కొక్కరికి $ 363,000 వస్తాయన్నమాట. నాకు విచిత్రంగా తోచిన విషయం ఇక్కడ ఇంకోటి ఉంది. నార్వే అత్యధిక చమురు నిల్వలున్న దేశం అయినా, ఇక్కడ పెట్రోలు ధర ప్రపంచంలో ఉన్న అత్యధిక పెట్రోలు ధరలతో పాటు ఉంది. ఇక్కడి ప్రభుత్వం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా, ప్రజలను పౌరరవాణా సౌకర్యాన్ని ఉపయోగించమని ప్రోత్సాహిస్తుందట.

పాశ్చాత్య ఐరోపా దేశాలలో, నోర్డిక్ దేశాలు.. అంటే నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఫిన్లాండ్ దేశాలు.. మానవ వనరుల అభివృద్ధిలో ముందున్నాయి. భారీ పన్నుల భారం, అధిక జీవన వ్యయం ఉన్నప్పటికీ.. సుఖ సంతోషాల సూచికలో కూడా ఈ దేశాలు పైనే ఉన్నాయి. ఎందుకంటే, వారి దగ్గర నుండి వసూలు చేసిన పన్నులను, ప్రభుత్వాలు సామాజిక ఉన్నతి కోసమే ఖర్చుపెడతాయన్న ప్రజల నమ్మకాన్ని ఆ ప్రభుత్వాలు గెలుచుకోగలిగాయి కాబట్టి. ఈ దేశాలు పెట్టుబడిదారీ విధానాన్ని ప్రజాసంక్షేమంతో విజయవంతంగా అనుసంధానం చేశాయి. తద్వారా పౌరులందరికీ అత్యుత్తమ స్థాయి విద్యా, ఆరోగ్య సేవలను అందించగలుగుతున్నాయి. బిడ్డల సంరక్షణ కోసం తల్లిదండ్రులు పెట్టే ఖర్చులో కొంత ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుంది. మాతృత్వ, పితృత్వబాధ్యతల నిర్వహణకు కూడా ఉదారమైన సెలవు ఉంటుంది. వృద్ధాప్య ఫించను ఉదారంగా ఉంటుంది. ఒక విధంగా జీవితపు ఆది నుండి అంతం వరకు తమ సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వాలకు కట్టే పన్ను, వారి భవిష్యత్తు కోసం, భావి తరాల సంక్షేమం కోసం చేసుకునే పొదుపు అని ఇక్కడి పౌరులకు తెలుసు.

నార్వేలో అదనపు విలువ పన్ను (వాల్యూ అడెడ్ టాక్స్) కూడా చాలా ఎక్కువ. (25%). ఇది అన్ని ఉత్పత్తుల మీద, సేవల మీద కూడా ఉంటుంది. ఇక్కడ ఒక పైంట్ బీరు ఖరీదు, మిగతా ఐరోపా కూటమి దేశాలలో కంటే రెండున్నర రెట్లు ఎక్కువ. నాలాంటి విదేశీ యాత్రికులకు కాఫీ త్రాగాలన్నా, ఒక చిన్న క్రోశ్శాంట్ తినాలన్నా కూడా, 'ఇంత ఖరీదా?' అనిపిస్తుంది. హొటళ్ళ సంగతి ఇక చెప్పనక్కర లేదు. ఇక్కడితో పోల్చితే ఇంగ్లాండ్‌లో ధరలు చాలా తక్కువ. ఎంతో కాలంగా, నార్వే తలసరి ఆదాయపు సూచీల ప్రకారం, ప్రపంచంలో మొట్టమొదటి పది స్థానాలలో నిలుస్తూ వచ్చింది. 2024లో 'ఫార్చ్యూన్' మాగజైన్ ప్రకటించిన గణాంకాల ప్రకారం, తలసరి జాతీయ ఆదాయం దృష్ట్యా, నార్వే, అత్యంత సంపద్వంతమైన దేశాల జాబితాలో, స్విట్జర్లాండ్, కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలను త్రోసి రాజంటూ, 6వ స్థానంలో... ఉంది.

ఈ విషయాలన్నీ మాట్లాడుకుంటూనే, గమ్యం చేరిపోయాము. ఇద్దరికీ ఇంకొంచెం సేపు కలసి.. మాట్లాడుకోవాలనే ఉంది. కానీ రమేష్‌కు వీలు కాక పోవటం వలన, పరస్పర వివరాల మార్పిడితో అప్పటికి సంతృప్తిపడి, విడిపోయాము.

ఆ సాయంకాలం, డిన్నర్‌కు మంచి భోజనం కోసం చాలా మంది సూచించిన 'పిగివియన్'కు వెళ్ళాను. అక్కడ స్థానికంగా తయారు చేసిన బీర్ లాంటి పానీయాలతో పాటు, సాంప్రదాయిక నార్వేజియన్ వంటకాలను అందిస్తారట. నేను 'ప్లక్ఫిష్' అడిగాను. ఇది పండుగలలో తినే ప్రత్యేకమైన వంటకమని తెలిసింది. చేప పొట్టును బంగాళాదుంపలు, ఉల్లిపాయలతో కలిపిచేసే ఈ వంటకం మొట్టమొదటగా బర్గెన్‌లోనే తయారు చేశారట. ముఖ్యంగా నాకు నచ్చిన విశేషమేమిటంటే, పిల్లలు సెలవులకు వాళ్ళ అమ్మమ్మలు, నానమ్మల ఇళ్ళకు వెళ్ళినప్పుడు, ప్రత్యేకంగా వాళ్ళు తయారు చేసే మొట్టమొదటి ప్రేమ పూర్వకమైన వంటకం ఇదట. దీనిని నాకు, ఒక వెన్న రాసిన రొట్టెతో పాటు ఇచ్చారు. దీనితో పాటు 'హన్సా' అనే బీర్ కూడా తీసుకున్నాను. స్వీట్ వద్దనుకుంటున్న నన్ను అక్కడి వెయిటర్, ఆపిల్స్, రుబార్బలతో పాటు ఇచ్చే వెనిల్లా పుడ్డింగ్ రుచి చూడవలసిందేనని స్నేహ పూర్వకంగా వత్తిడి చేశాడు. మరీ అంత తియ్యగా లేకుండా అది బాగానే ఉంది.

రెండు రోజుల పాటు బర్గెన్‌లో గడిపిన తరువాత, దానిని వదిలి వెళ్ళ వలసిన సమయం ఆసన్నమయింది.

ఉదయాన్నే, 'వోస్' పట్టణానికి రైలులో బయలుదేరి పోయాను. బర్గెన్ నగరం వదిలి వెళ్ళిన కొంచెం సేపటికే, చాలా దూరం రైలు 'ఓస్టర్ ఫియొర్డ్'పక్కనే పరుగెడుతోంది. దృశ్యం నయనానందకరంగా ఉంది. అదంతా, నాకు చేరువయ్యే అనుభవాన్ని రుచి చూపుతున్నట్లుంది. ఇది కూడా, నేను ఏర్పాటు చేసుకున్న, 'నార్వే ఇన్ ఎ నట్ షెల్'లో భాగమే. ఇది ఒక రోజు టూర్. బర్గెన్ నుండి మొదలైన ఈ రైలు ప్రయాణం, తరువాత, బస్, ఫెర్రీ, ఫనిక్యులర్లలో 14 గంటల ప్రయాణం తరువాత, ఓస్లో చేరుకోవటంతో ఈ టూర్ పూర్తవుతుంది.

రైలు ఈశాన్యంగా సాగిపోతోంది. వెళ్ళిన కొద్దీ ఫియొర్డ్‌లు, పర్వతాలు, నదులూ, జలపాతాలు, దిగంతాల వరకు.. నునుపైన మైదానాలు, గరుకు కొండలు, మంచు కప్పిన శిఖరాలుగా ఆవిష్కారమవుతూ.. సాగిపోతున్న నేల తల్లి అందాలు... రకరకాల ప్రకృతి దృశ్యాల కలబోతగా.. చలన చిత్రాలై పరుగెడుతున్నాయి. అట్లా వోస్ చేరేటప్పటికి ఒక స్వప్నం ముగిసింది. రైలు దిగి గుడ్వాన్గెన్‌కు వెళ్ళే బస్ ఎక్కాను. ఇది వోస్‌కు ఇంకా ఈశాన్యంగా ఉంటుంది. మంచు కొండల మధ్య ప్రయాణం. నల్లటి కొండల మీద తెల్లని మంచు జల్లినట్లున్న దృశ్యం. బస్ క్రిందకు, జాలువారే లోయలోకి ప్రయాణం చేస్తోంది. నా భద్రత, డ్రైవరు చేతుల్లో పెట్టి, మళ్ళీ చూడబోనేమో అన్నట్లున్న దృశ్యాలను మనసులో పదిలం చేసుకుంటూ కూర్చున్నాను. రెండు అధ్భుత జలపాతాలను చూపించిన బస్ నెమ్మదిగా సముద్ర మట్టానికి దిగసాగింది.

బస్‌లో నా ప్రక్కన ఒక తైవాన్ మహిళ కూర్చుని ఉంది. ఆమె ఒక తైవాన్ మాగజీన్‌కు సంపాదకురాలట. ఆమెకు ప్రయాణం ప్రాణమట. ఈ ప్రయాణంలో ఆమె తో పాటు ఆమె తల్లిదండ్రులు కూడా ఉన్నారు. మేమిద్దరం మాట్లాడుకోవటానికి, మా ప్రయాణాల కంటే మంచి అంశం ఏముంటుంది? ఆమె త్వరలో ఇథియోపియా వెళ్ళబోతోందట. నేను అప్పటికే అక్కడికి వెళ్ళి ఉండటంతో, ఆమె అడిగిన ప్రశ్నలకు స్థూలంగా సమాధానం/సమాచారం ఇవ్వగలిగాను. ఈ మాటల్లో పడి, ఆమె పేరు గాని, ఆమె సంపాదకీయంలో హాంగ్ కాంగ్ నుండి ప్రచురితమయ్యే మాగజీన్ పేరు గాని అడగటం మరచిపోయాను. తరువాత మళ్ళీ ఆమె కలుస్తుందేమోనని చూశాను కానీ, గుడ్వన్గన్ నుండి మా దార్లు వేరైపోయాయి. అక్కడి నుండి,



నారోయ్ ఫియొర్డ్,

నా ప్రయాణం ఆగ్నేయంగా, ఫ్లోమ్ వైపుకు సాగింది. ఇది నావ (ఫెర్రీ)లో ప్రయాణం. దోవంతా కొదవలేనన్ని 'నారోయ్' ఫియొర్డ్ దృశ్యాలు. నీలాతి నీలపు సముద్రానికి పచ్చల అంచులా, సముద్రంలో నుండి మొలుచుకు వచ్చినట్లున్న నిట్ట నిలువు పర్వతాలు. కొన్నిచోట్ల ఒక కిలోమీటర్ కంటే మించిన ఎత్తు. ఇక్కడ అన్నిటికంటే ఎత్తైన పర్వతం ఎత్తు 1660 మీటర్లట. అత్యంత సుందరమైనదిగా చెప్పబడే నారోయ్ ఫియొర్డ్, సోగ్నే ఫియొర్డ్ నుండి చీలిన అతి సన్నని ఫియొర్డ్. ఇది, ప్రపంచ వారసత్వ సంపదలో భాగంగా యునెస్కో వారి గుర్తింపు పొందింది. ఈ గుర్తింపు పొందిన మరో ఫియొర్డ్, గేరాంజర్ ఫియొర్డ్. మా ప్రయాణం ఆర్లాండ్ అనే పల్లెటూరు ప్రక్కగా సాగిపోయింది.

మే నెల కావటంతో, రాబోయే వేసవికాలానికి సూచనగా వాతావరణం వెచ్చబడుతోంది. శిఖరాలను కప్పే వంకతో పైకెక్కి కూర్చున్న కరడు మంచు, కరిగి జాలువారుతోంది. తెల్లని నురగతో.. క్షీర ధారలు కారుతున్నట్లు, ఎక్కడ చూసినా చిన్నా, పెద్దా జలపాతాలు. వాటి మధ్యలోనే చిన్న చిన్న పల్లెలు, పంట పొలాలు. ఫెర్రీ కెప్టెన్, మా నావను సాగ్ఫోసెన్ అనే ఒక పెద్దపాటి జలపాతానికి దగ్గరగా పోనిచ్చాడు. ఆ దృశ్యం రమణీయం, చిర స్మరణీయం. నారోయ్ ఫియొర్డ్‌లో 20 కి.మీ. దూరం సాగిన తరువాత, ఆర్లాండ్స్ ఫియొర్డ్‌లోకి మళ్ళింది మా ఫెర్రీ. మరో 20 కి.మీ. ప్రయాణం తరువాత సుందర ఫ్లోమ్ గ్రామం చేరుకుంది. ఆర్లాండ్స్ ఫియొర్డ్‌తో పాటు ఇక్కడున్న ఫియొర్డ్‌లలో చాలా వరకు సోగ్నేఫియొర్డ్ నుండి సాగిన చీలికలే. గరిష్టంగా 204 కి.మీ. పాటు సాగే సోగ్నే ఫియొర్డ్ ప్రపంచంలోనే అతి పొడవైన, లోతైన ఫియొర్డ్‌గా చెప్పబడుతుంది. ఇది ఫియొర్డ్‌లలో రారాజు.

ఫ్లోమ్ నుండి నిటారుగా క్రిందకు మిర్డాల్ వరకు సాగే పర్వత రైలు మార్గం ప్రత్యేకమైనదని విన్నాను. మిర్డాల్,



సాగ్నోసెన్ జలపాతం

బర్గెన్‌ను నార్వే ప్రధాన భూభాగంతో కలిపే రైలుమార్గంలో ఉండే ఒక పట్టణం. ఈ రైలు మార్గం సాగే ప్రాంతంలో, చుట్టూ ఉన్న కొండల మీద కరగి క్రిందికి ప్రవహించే స్వచ్ఛమైన నీటితో ఏర్పడినదే ఫ్లోమ్ సెల్వా నది. దీని పరీవాహక ప్రాంతమే ఫ్లోమ్ లోయ. ఈ నది సాల్మన్, ఇంకా ట్రౌట్ చేపలకు ప్రసిద్ధి. 19వ శతాబ్దపు చివరి కాలంలో, సంపన్న ఇంగ్లీషు యాత్రికులు, చేపలు పట్టటమనే వ్యాపకంతో ఇక్కడకు వచ్చేవారట. వాళ్లకు 'సాల్మన్ లార్డ్ లు' అని ముద్దు పేరు పెట్టారట.

ఫ్లోమ్, దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే నౌకలకు రేవు కూడా. మేము అక్కడకు వెళ్ళినప్పుడు, అక్కడ ఒక క్రూజ్ నౌక ఆగి ఉంది. అందులో ప్రయాణీకులు, ఈ ప్రాంతం చూడటానికి దిగివచ్చారు కూడా. ఫ్లోమ్‌లో తిరగటానికి నాకు రెండున్నర గంటల సమయం ఉంది. అక్కడున్న మ్యూజియం, ఫ్లోమ్ రైల్వే నిర్మాణ విశేషాలను, దాని నిర్మాణంలో పాలు పంచుకున్న వారి జీవిత విశేషాలను, ఈ పనికి వాడిన ఉపకరణాలు, పరికరాల గురించిన సమాచారాన్ని భద్రపరచింది. నాకు అక్కడ నడక దారులను చూపించే మాప్ ఒకటి దొరికింది. దానిని అనుసరిస్తూ, అక్కడున్న చారిత్రాత్మక 'ఫ్రేథీమ్' హోటలు వెనుకగా, ఒక గంట నడిచి అక్కడున్న ఒక కొండ మీదికి వెళ్ళాను. అక్కడి నుండి ఫ్లోమ్ గ్రామం, రేవు, అర్లాండ్స్ ఫియొర్డ్ మొత్తమంతా ఒకే సారి కనువిందుగా కనిపించింది.

సాయంత్రం నాలుగు గంటలకు, మిర్డాల్ చేరుకునే రైలు ఎక్కాను. ఫ్లోమ్ లోయ ఒక కొనలో, అర్లాండ్స్ ఫియొర్డ్ తీరంలో ఉన్న ఫ్లోమ్ గ్రామంలో మొదలై, 22 కి. మీ. పాటు సాగి ఒక పర్వతం మీద ఉన్న మిర్డాల్ చేరుకునే ఈ రైలు మార్గం అతి సుందరమైనది. రైలు నెమ్మదిగా పైకి ఎక్కడం మొదలు పెట్టింది. దీని వాలు 80%.(100% అంటే 90 డిగ్రీల నిలువు). 20 కి. మీ. దూరంతో 1283 అడుగుల ఎత్తు ఎక్కాలి. ప్రపంచంలోనే ఇది అత్యంత నిటారయిన రైలు మార్గం. దీనికి స్విస్ రైలు మార్గాలలో ఉన్నట్లు, మధ్యలో వేగాన్ని నియంత్రించే కోగ్ వీల్ లేదు. కొండ మీదికి వెళ్ళటానికి ఒక గంట పట్టింది. దోవంతా ఎటు చూడాలో తెలియనంత, ఆకర్షణీయంగా ఉంది. లోయలు, జలపాతాలు, పైర్లు నిండిన పొలాలు, మంచు నిండిన హిమానీ నదాలు, కరిగిన మంచు నిండిన హిమనదాలు, కొలనులు, సరస్సులు, మంచు టోపీ పెట్టుకున్న పర్వతాలు... నిండారా ప్రకృతి సౌందర్యం. అనిర్వచనీయం. రమణీయం. చిరస్మరణీయం.

అన్నిటికన్నా నాకు అద్భుతంగా కనిపించిన జలపాతం, ఛ్యూస్ఫోస్సేన్. అది కనిపించిన విధానం కూడా నాటకీయంగా ఉంది. రైలు ఒక సొరంగ మార్గం నుండి బయటకు రాగానే, నా కళ్ళు పగటి వెలుగుకు సర్దుకునేలోపే, గంట గరాటు (అవర్ గ్లాస్) ఆకారాన్ని తలపిస్తూ, నడిమిలో నడుములా కలసుకున్న జంట జలపాతాలు అవతరించాయి. ఊపిరి పీల్చడం కూడా ఒక్క క్షణం మరచిపోయాను. అంతటి అనిర్వచనీయ అద్భుతం. ఆ జలపాతపు పాదాల వద్ద, రైలు కొన్ని నిముషాలు ఆగింది. రైలు దిగి చూడటానికి వెళ్ళిన వారందరినీ, కమండలం నుండి పవిత్ర జలాన్ని జల్లుతున్న ఋషిలా, ఆ జలపాతం చిరుజల్లుతో ఆశీర్వదించి నట్లనిపించింది. ప్రకృతే పరమ దైవం అంటే అర్థం తెలుస్తున్నట్లనిపించింది. అంతకు ముందే, రైలులో వినిపించిన సమాచారం కూడా, ఆ జలపాతం దేవతలకు ఇష్టమైనదని, ఆ ప్రాంతం.. వారి నృత్య గానాలకు వేదిక అని తెలిపింది. మతం ఏదైనా, ఇటువంటి ప్రదేశాలలో దైవిక భావాలు కలగటం సహజమనుకుంటాను. మేమంతా ఆ దృశ్య సౌందర్య ఝరిలో తల మునకలౌతుంటే, ఆ ప్రక్కనే ఉన్న ఒక ఎత్తు ప్రదేశం మీద ఎర్రని దుస్తులు వేసుకున్న ఒక మహిళ, ఒక జానపద గీతాన్ని ఆలపిస్తూ, దానికి తగ్గట్టు నృత్యం చేస్తూ కనిపించింది. అదిగో దేవత. మేము కూడా దేవతలు అక్కడ ఆడి, పాడటం చూశాము. అది యాత్రీకులను అలరించటానికి ఏర్పరచిన ప్రదర్శన కావచ్చు.కానీ, అక్కడ అలముకున్న అలౌకిక వాతావరణంలో దానికి మేమంతా అనుస్పందించాము.

*(ఇంకా ఉంది)*

మి

**ఆంగ్లం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**
e-mail: jayasreeatluri@hotmail.com

# దేవారం సంస్థానం

– డా. సగిలి సుధారాణి



దేవారం సంస్థానం

వీరు మనవారే! కానీ, తెలుగు మాట్లాడటం తెలియనివారు! తరాల క్రిందటే తెలుగునేలకు దూరమైన తెలుగువారు! వారు ఎవరో తెలుసుకుందాం. ఇది పశ్చిన కనుమల్లోని నేటి కేరళ– తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని తేని జిల్లాలో ఉంది. దేవారం ఒకప్పటి తెలుగు సంస్థానం! మొదటినుంచీ ఈ సంస్థానం బలమైన రాజ కంబళ నాయకర్లలోని ఓ కుటుంబ పాలనలో ఉండేది.

మధురను విశ్వనాథనాయకుడు పాలించే కాలంలో అంటే 16వ శతాబ్ద చివరిలో చుట్టుపక్కల 18 గ్రామాలను ఒక జమీనుగా రూపొందించి, ఆ సంస్థానానికి 'దేవారం' అని నామకరణం చేసి దానికి అధిపతులుగా తుంగభద్ర తీరం నుంచి వచ్చిన రాజ కంబళ నాయకర్లను నియమించారు. ఈ జమీనుకు మొట్టమొదటి జమీందారు 'ముత్తుస్వామి నాయకరు'. దేవార సంస్థాన అధిపతులుగా పాలించిన రాజకుటుంబ వారసులు నేడు విద్య విలువ తెలుసుకొని, విద్యావంతులై కాలానుగుణంగా అభివృద్ధి చెందారు. వీరిలో న్యాయమూర్తులు కూడా ఉన్నారు. అయితే, సంస్థానాధీశుల పూర్వీకులు తెలుగువారైనా, వారి వారసులు నేడు తల్లిభాషకు దూరమైనారు.

దేవారం సంస్థానం వారసుల రాజభవనం ఆవరణలో అడుగిడుతూనే మనకు కన్పించే దృశ్యాలు..... మేలుజాతి వేటకుక్కల సందడి! రంగురంగుల పక్షుల కిలకిలా రావాలు! పావురాల రెక్కల చప్పుళ్ళు! అవిచేసే ధ్వనులు, ఆ ప్రదేశమంతా సందడిగా ఉంటుంది. చూడగానే మనం ఏదన్నా మినీ జూ (చిన్నపాటి జంతు ప్రదర్శన శాల)లోకి వచ్చామా? అనిపిస్తుంది. లోపల అడుగు పెడుతూనే అపురూప కళాఖండాలు స్వాగతం పలుకుతాయి. అయితే సంస్థానాధీశుల వారసులకు తెలుగు అసలు రాదు. తమిళంలోనే మాట్లాడారు.

ఆ ఊరిలో తెలుగు జనాభ వున్నప్పటికీ , కాలగతిలో వారు తెలుగు మరచిపోయారు. మీరు తెలుగువాళ్ళు కదా! తమిళం మాట్లాడుతున్నారే అన్న ప్రశ్నకు 'అళగవల్లి' అనే మహిళ "తెలుగువీడు ఊరుక్కు ఒరే వీడు ఇరుక్కురదునాల తెలుంగు మరంజిపోయి తమిళ్‌దా పేసరోం" (కాలగతిలో ఊరిలో తెలుగు ఇల్లు ఒక్కటే మిగిలిపోయింది! అందువలన తెలుగును మరచిపోయి తమిళమే మాట్లాడుతున్నాం!)

అయితే ఇక్కడి ప్రజలు పాడుకునే పల్లెపదాలలో తెలుగు శబ్దాలు తొణికిసలాడతాయి. వీరి తెలుగు మాటలు, పాటలు కొంత అస్పష్టంగా ఉన్నా, తమ తల్లిభాష అయినట్టి తెలుగుభాషాశబ్దాలను ఇంకా తమ పలుకుబడులలో నిలుపుకోవడం చాలా గొప్ప విశేషం. తమ తల్లిభాషపై వీరికి గల మమకారాన్ని ఇది తెలియజేస్తున్నది. ఇక్కడి వారికి తాము తెలుగువాళ్ళమనే స్పృహ ఉండడమే కాదు, తాము తెలుగువాళ్ళమని గర్వంగా చెప్పుకోవడం విశేషం. ఇక్కడి రాజప్రాసాదంలో 'అళగవల్లి' పాడిన లాలిపాట విందాం.

**"లాలి లాలమ్మలాలి లాలమ్మలాలి**
**లాలమ్మ లాలి లాలోత్సవాలు రండమ్మరండా!**
**ఇసుకనాడేది కుసుమ తిరుపాల**
**అమ్మమ్మ ఈబాల ఎట్లాగంటివి?**
**అన్నతానం(అన్నదానం) చేసి పున్నెతానం చేసి**
**కంటినోయమ్మ ఈ బాలకా!**
**ఆండబిడ్డ పుట్టే అక్కమ్మ పుట్టే!**
**చేరెడు కంబులకు(జొన్నలు) చెలులుగా పుట్టె ॥2॥**
**మగబిడ్డ పుట్టే మగధీరుడె పుట్టె!**
**దొడ్డిన ధనముగా దచ్చుగాడు పుట్టె".....**



ప్రసిద్ధి చెందిన దేవారాట్టం ప్రదర్శిస్తున్న కంబళనాయకర్లు

దిండుగల్ జిల్లాలోని అంబయనాయకర్‌పట్టిలో దేవారం సంస్థానా ధీశుల సంబంధీకుల మరో సంస్థానం ఉంది. ఆ భవనంలో కంబళనాయకర వంశస్థుల వారసులు నివసిస్తున్నారు. అందులో నివసిస్తున్న డి.ఎస్ రాజా గారి వయస్సు 70 సంవత్సరాలు. ఆయనను పలకరించినపుడు వారి కుటుంబ నేపథ్యం గురించి చెబుతూ, నాడునాయగర్ వంశస్థుల మాటే వేదంగా ఉండేదని, వారు చెప్పే న్యాయానికి తిరుగేలేదని చెప్పారు. డి.ఎస్ రాజగారి చిన్నతనంలో ఇంటినుండి బయటకు వస్తే తెలుగుభాషను మాట్లాడేవారు కాదట, అందుకు వీరు చెప్పే వింతైన కారణం వీరి నివాసానికి దగ్గరిలో నివసించే దిగువ సామాజిక వర్గానికి చెందినవారు కూడ తెలువారే కావడం మూలంగా వారితో చేరి చెడుమాటలు అబ్బుతాయనే అపోహతో ఇంట్లోవారు తెలుగు భాషను మాట్లాడేవారు కాదట. వారి భవంతులు నేటికీ అలానే చెక్కు చెదరకుండా ఉన్నాయి. వీరు ఉమ్మడి కుటుంబస్థులు. వీరిలో కొందరు హైకోర్టు జడ్జిలు, లాయర్లుగా స్థిరపడ్డారు. బహుభార్యత్వం అనేది ఆనాడు ఒక సామాజిక హోదాగానే పరిగణించేవారు. కానీ తరువాతి కాలంలో చట్టాలలో అనేక మార్పులు రావడం మూలాన ఒక్కభార్యకే సంస్థానాధీశ వారసులు పరిమితం అయ్యారు.

**రాజుల కాలంనాటి పద్ధతులు ఈనాటికీ ఆచరిస్తున్నారు కంబళ నాయకర్లు!** దేవారంకు సమీపంలోని శూలపురంలో తెలుగు వారయిన రాజకంబళనాయకర్లు ప్రత్యేకమైన జీవనశైలితో జీవిస్తున్నారు. వారి విశిష్టమైన ఆచారాలు, కట్టుబాట్ల గురించి విపులంగా తెలుసుకొందాం. కొండల అంచులలో, అడవి తట్టులో నివసించే ఈ రాజకంబళ నాయకర్ల ప్రధాన వ్యాపకం వ్యవసాయం, పశుపోషణ. వీళ్ళు జొన్నలు, సామలు, ఉలవలు మొదలైన పంటలు పండిస్తారు. వారి కులదేవత జక్కమ్మ. ఆడవాళ్ళు రవికలు వేసుకోరు! మగవాళ్ళు భుజానికి వంకీ, చేతికి కంకణం ధరిస్తారు. నెత్తిన తలపాగ చుట్టుకొని వేష భాషల్లో విభిన్నంగా ఉండే ఈ నాయకర్లు తమ ఆచార వ్యవహారాల్ని ఆచరించడంలో చాలా పట్టుదలగా ఉంటారు.

**అంబరాన్ని అంటే సంబరాలు!** అక్కడికి మేము వెళ్లేసరికి గ్రామంలోని కంబళనాయకర కుటుంబాలలోని పెద్దచిన్నా అంతా సరదాగా జాతర సంబరాలలో మునిగితేలుతూ ఉన్నారు. పెద్దలు దేవ దుందుభులు మోగిస్తూండగా దేవర ఆట్టంతో జాతర ఆరంభం అయింది.

కంబళ నాయకర్ల కుటుంబాలన్నీ వారి కులదైవం 'జక్కమ్మ'ను భక్తిశ్రద్ధలతో కొలిచి, జాతర ఆరంభించారు. ఆడవాళ్ళు గంపల్లో మావు (పిండి), అరిసి మావు (బియ్యపు పిండి), తక్కాలి (టమాటాలు) మొదలైనవి గుట్టగా తీసుకొని పోతారు. దానిని 'పాలక్కడి' అంటారు. ఓ... అని అరచుకొంటూ పిల్లా... పెద్దా...**"ఊరు కాపాడి.. ఒడ్డుమానుకాన.. నీతిమానుకాన.. ఎత్తిపూలుగలు ...కట్టబడి"** అని పాడుకొంటూ వెళ్తున్నారు.

**ఆ ఆచారం భీతి గొలిపేలా సాగింది!** ఎద్దులను గుడికి మొక్కి తీసుకుపోతారు. వాటిని 'సామి ఎద్దులని' పిలుస్తారు. వాటి కొమ్ములు పెద్దగా ఉంటాయి. ఎద్దుల కొమ్ములు పట్టుకుని వాటిని లొంగదీసుకోవడం ఈ ఆట విశేషం. ఇది చిత్తూరుజిల్లాలో మనం చూసే 'జల్లికట్టు' ఆటవంటిదే! ఈ జాతర సందర్భంగా పశువులను ఆరాధిస్తారు. ఆ గ్రామస్థులబిడ్డ దేశానికి రాజైనా కంబళనాయకర్ల బిడ్డే! ఎంతటి విద్యావంతులైనా, ఎక్కడెక్కడో ఉన్నతోద్యోగ్యాలు చేస్తున్నా, గ్రామజాతరకు అందరూ తప్పనిసరిగా అక్కడకు రావాల్సిందే! ఇది అక్కడి లెక్క! ఈ గ్రామానికి చెందిన 'తవ సెల్వన్' అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగుళూరులోని టాటా కంపెనీలో పని చేస్తున్నాడు. "మా కుటుంబాన నలుగురు ఆండబిడ్డలు, ఒక అన్న అడ్వకేట్, మా అవ్వ, చిన్న అన్న, పెద్ద అయ్యగారు, తాతగారు ఒకే ఇంటిలో ఉండేము! మా అమ్మ జాతరకు 'పాలక్కడి'కి మొక్కుకొనేను! ఆ మొక్కు తీర్చేకు ప్రతీ యేడు నాను వచ్చేను!" అని చెప్పాడు.

**అవూరి పెదరాయుళ్ళు కంబళనాయకర్లు!** కంబళ నాయకర్లలో పెద్దల కట్టుబాట్లు చాలా కట్టుదిట్టంగా



చిన్నారి పెండ్లి కూతురు కాబోతున్న రమణి

అమలు చేస్తారు. అక్కడి కులపెద్దలు పెదరాయుళ్ళలా వ్యవహరిస్తూ కుల సమావేశాలలో తీర్పులిస్తూ ఉంటారట! కంబళనాయకర్లలో వందశాతంలో అయిదు శాతం మంది మాత్రమే చదివిన వాళ్ళు. కంబళ నాయకర్లు తమ ఆడబిడ్డల్ని ఐదవ తరగతికి మించి చదివించరట! ఆడవాళ్ళకి అంతకంటే చదువు అక్కర్లేదని వారి అభిప్రాయం. ఆడబిడ్డలను అంతకుమించి చదివించక పోవడానికి గల కారణాన్ని అడిగితే ఆవూరిపెద్దపనన్ పాండియన్ ఆండబిడ్డల్ని చదివించాలని మాకు ఆశే! కానీ, పైచదువులకు వేరే జాగాల్లోకి అంపిస్తే అక్కడ 'లవ్వు! గివ్వు!''అని పొయ్యేరని చెప్పాడు. మగబిడ్డలను బయట చదివిస్తున్నారు! వాళ్ళు వేరే ఆడబిడ్డను చేసుకొంటే? అని ప్రశ్నించగా, "మేము మా జాతి కట్టుబాటు ప్రకారం అత్తకూతురిని, మామ కూతురుని కట్టాల! మగబిడ్డ కలెట్టేరు (కలెక్టర్) పని చేసినా సరి, వెలినాడు (విదేశాలకు) పోయినా సరి, కట్టుబడిగా మేము ఇక్కడి బిడ్డనే పెళ్ళి చేసుకొనేము! మన దేవరాన ఒక మనిషిగా నడిచేమని వాక్కు (మాట)ను ఇచ్చి వారు వెలియ సదువుకోని, పనులు చేసేరమ్మా!'' అని చెప్పినాడు.

ఆడబిడ్డ పుట్టీ పుట్టగానే మేనమామ/ మేనత్త కొడుకుతో వివాహం నిశ్చయం అయిపోతుంది. అక్కడ ఆటలాడుకుంటున్న ఐదో తరగతి చదువుకుంటున్న రమణి అనే అమ్మాయి తనకు కాబోయే భర్త ఆటో నడిపే తన బావ ఆనంద్ అని ఎంతో అమాయకంగా చెప్పింది. బావంటే ఎందుకు ఇష్టమని అడిగితే మాత్రం సిగ్గుపడుతూ, చెప్పలేకపోయింది ఆ చిన్నారి పెళ్ళికూతురు. ఆ సామాజిక వర్గంలో పురుషాధిక్యం ఎక్కువ! "ఒక్క మగవాడు నలుగురైదుగురు ఆళ్ళు (భార్యలు) కట్టచ్చు (కట్టుకోవచ్చు)! ఒకే కుటుంబంగా కాపురం చేయవచ్చుగానీ, ఆడది మాత్రం జీవితంలో ఒక్కరినే పెండ్లి చేసుకోవాలి! ఆడదానికి మా దగ్గర 'మారు మనువు' కూడదు" అని చెప్పారు. అలాగే కంబళనాయకర్లు బయటవారిని పెండ్లాడకూడదు వారి మందలోనే చేసుకోవాలనే నియమం ఉంది. కుల కట్టుబాట్లు వీరిలో ఎక్కువ. ఎవరైనా దానిని అతిక్రమించి బయటవారిని పెండ్లాడితే వారిని కులం నుండి శాశ్వతంగా వెలివేస్తారు. రాజుల కాలంనాటి పద్ధతులు ఈనాటికీ ఆచరిస్తున్నారు.

తెలుగువారయిన తమ పూర్వీకులు ఆకాలాన బళ్ళారి సమీపంలోని కంపిలి (ప్రాంతం) తాము బయలుదేరిన నుంచి అక్కడికి (కరట్టుపట్టి గ్రామం) వచ్చినట్లు వారు చెపుతారు. ఇవ్వాళ బళ్లారి కర్ణాటక రాష్ట్రంలో ఉన్నా, ఒకప్పుడు బళ్ళారి, కంపిలి ప్రాంతమంతా తెలుగువారిదే కదా మరి! తెలుగు రాజకంబళ నాయకర్లు తాము తెలుగువాళ్ళమని గర్వంగా చెపుతారు.

**కంబళిమీద ఒట్టు!** కంబళి వారికి చాలా ముఖ్యమైనది. కంబళి ధరించడం మూలంగా 'రాజ కంబళ నాయకర్లు'గా ప్రసిద్ధి పొందారు. కంబళి ధరించే పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. తీర్మానాలు, తీర్పులు ఇచ్చేవారు ఒంటిపై తప్పనిసరిగా నల్లని కంబళి వేసుకోవాలట! "కంబలిమీద ఒట్టెట్టి తప్పుచేసిన వారికి ఉలగ(లోక) తీర్మానం చేస్తాము! కోర్టులు, పోలీసు స్టేషన్‌లు, సాక్ష్యాలు మాకాన (మా దగ్గర) నిలువవు! కంబళికి కట్టుబడేమ''ని చెప్పేరు. అక్కడి స్వచ్ఛమైన పల్లె వాతావరణంలో గోధూళి వేళ ఆవుల మందల ఆగమనం!చిన్నాపెద్దలు కలిసి ఆడే దేవరాట్టం! పిల్లల బొంగరాల ఆటలు! మనలను ఆహ్లాదింపజేస్తాయి.

**కుట్టాంధ్ర (మినీ ఆంధ్ర)** : దేవారానికి సమీపంలోని కుప్పనాచారిపట్టిఅనే గ్రామంలో దాదాపు జనాభా మొత్తం తెలుగువాళ్ళేకావడం విశేషం. చిన్న బిడ్డలు మొదలుకొని పెద్దవాళ్ళ వరకు తెలుగు మాట్లాడుతారు. అందుకే ఆగ్రామాన్ని కుట్టాంధ్ర (మినీ ఆంధ్ర) అంటారని స్థానికులు చెబుతారు. అక్కడ నివసించే విశ్రాంత ఉపాధ్యాయ దంపతులను స్థానికులు 'తమిళయ్య', 'తమిళమ్మ'

అంటారు. అయితే వారు పదహారణాల తెలుగువారు కావడం విశేషం. వారు తెలుగువారే అయినా తమిళ ఉపాధ్యాయులుగా పనిచేసిన కారణంగా అందరూ వారిని అలా పిలుస్తున్నారట! వారి అసలు పేర్లు ఇంజులూరి చిన్నరాజు, కళావతి. వారింట అడుగు పెడుతూనే ఆప్యాయంగా పలకరించి పాలును గిన్నెలో పోస్తూ తియ్యని తేట తెలుగుపాట

**"కొండనాన కొమ్ము సద్దు**
**ఊరునాన ఉరిమి సద్దు**
**మామాకూతురు నీలి సద్దు**
**లాలి లాలి లాలమ్మ లాలి..."**

తన నోటి వెంట జాలువారగా, కమ్మని కాఫీ పెట్టించింది తమిళమ్మ.

"నేను తమిళటీచర్‌గా ఉండి రిటైర్డ్ అయ్యాను. మా నాయన బోడి జక్కం (జమిందార్ సంస్థానం)లో తెలుగు చదివారు. తెలుగు మాట్లాడుతాడు, రాసేవాడు! అమ్మకు రాసేది తెలవదు! మేము తెలుగు మాట్లాడుతూ ఉంటే విన్న తమిళవాళ్ళు," తమిళ పండితా! తమిళనాట సంబలం (జీతం) తీసుకొంటూ తెలుగు మాట్లాడుతా ఉండారే! మీరు ఆంధ్రకు పోండా! అని తమాషాగా అంటూ ఉంటారు. మా తెలుగు వాళ్ళు కలిసినప్పుడు తెలుగు మాట్లాడుతాం".

**"సీత నువ్వు రావే!**
**కోటినదులు ధనుష్కోటిలోనుండగ**
**ఏంటికి తిరిగేవు ఓ మనసా...**
**గంగను పురమో నన్ను జనించిన**
**ముడిమాడి చూసె యా రాజులకు ॥ కోటి"**

అని ఓ ఆధ్యాత్మిక పాట పాడి ఆత్మీయంగా మమ్మల్ని సాగనంపింది. అయితే బాధాకరమైన విషయం కోవిడ్ సమయంలో ఈ ఇరువురు దంపతులు కాలం చేయడం బాధాకరం.

**ఆ ఊరంతా స్వర్ణ కారులే!** శూలపురంలో ప్రజలు సాధారణంగా వడ్రంగం, బంగారపు పనులు చేస్తారు. ఒక ఆకురాయి తయారీ పరిశ్రమలోని మహిళాకార్మికులను పలకరించి, వారి స్థితిగతులను తెలుసుకునే ప్రయత్నం చేస్తే, అక్కడ తయారయ్యే అరం (ఆకురాళ్ళు) ముక్కెరలు మొదలైన బంగారు, వెండి ఆభరణాల తయారీ పరిశ్రమలోనూ, బొమ్మల తయారీ పరిశ్రమలోనూ పనిముట్లుగా ఉపయోగపడతాయట. ఆ కుటీర పరిశ్రమ ఎందరో మహిళలకు ఉపాధి కల్పిస్తున్నది. పొద్దున నుండి సాయంత్రం వరకు అదే పనిలో ఉంటారు. ఆడవాళ్లు గలగలమని తెలుగు మాట్లాడుకొంటూ తెలుగు పాటలు పాడుకొంటూ చకచక పనులు చేసుకొంటూ ఉంటారు.

**"కొండా కొండా రాయి ఎత్తిలతో గుడి కట్టావాలా..**
**గుడి నుండే దేవుడంతా వరములియ్యవాలా**
**మేకపిల్లా మేకపిల్లా మామాతు సూడు**
**అవరు ఆడితే మగండా ఏమని అడుగు ..............."**

అంటూ ఓ తెలుగు శ్రామికురాలు తెలుగుపాట చక్కగా పాడి వినిపించింది. మరోతల్లి తన ముక్కు పచ్చలారని మూడు నెలల బిడ్డను పక్కలో ఊయలకట్టి పాట పాడుతూ నిద్రపుచ్చుతూ లాలిపాట పాడి నిద్రపుస్తోంది.

**"జోజోపాపా జొన్నకూడు పాపా**
**కల్లవాడు (దొంగోదు) వచ్చేదు కనుతు (కనులు) మూసి నిద్దురపో**
**ఆరారో ఆరియరో ఆరారో ఆరియరో...."**

ఆ పల్లెలోని ప్రజలను పలకరించినపుడు కానూరు సుబ్బరాజ్ ఇక్కడ అంతా తెలుగువాళ్ళుదా! మా పెద్దవాళ్ళు ఆచారి పని చేసేవారు. మేము ఇప్పుడు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఆ గ్రామంలో పనిచేసే చాకలి, మంగలి వారు కూడా తెలుగువారేన"ని చెప్పారు. వారి పాటలను వింటే ఆ విషయం తేటతెల్లం అవుతుంది. బంగారం పని, వడ్రంగిపని చేసే జీవనం కొనసాగించే ఈ పల్లెవాసులు ప్రస్తుతం పనులు దొరకక కొందరు జీవనోపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళి కూలీలుగా పని చేస్తున్నారు.

దేవారం, కుప్పనాయకపట్టి ప్రాంతాలలో తెలుగు వారి ప్రాధాన్యం గురించి మాకు చెప్పి, స్వయంగా మాతో పాటు ఆ ప్రదేశాలకు వచ్చి ఎంతో సహకరించిన బోడినాయకనూర్ వాసి 'నోబుల్ చెల్లాదొరై' మాతృభాష తమిళమైనా, పట్టుదలతో తెలుగు నేర్చుకొని, దక్షిణ తెలుగు సంస్థానాల గురించి నేను **మిసిమి**లో రాస్తున్న వ్యాసాలను చదువుతూ ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలు తెలియ జెయ్యడం ఒక అరుదైన విషయం.

**డా. సగిలి సుధారాణి**
చరిత్ర పరిశోధకులు, రచయిత్రి
హైదరాబాద్, సెల్:94904 28825

# గుహుడి వృత్తాంతం



*డా. ఎ.బి. సాయిప్రసాద్*

**రా**మాయణంలోని అన్ని పాత్రలకు తమదైన ఒక ప్రత్యేకత ఉంది. కొన్ని పాత్రలు-శబరి, జటాయువు, ఉడుత, గుహుడు మొదలైన- కేవలం కొన్ని సందర్భాలలో మాత్రం మన ముందుకొస్తాయి. నిడివి కారణంగా అవి కనుమరుగు కాకుండా తమ ముద్రను పాఠకుల మనసుపై వదులుతాయి. సీతారామ లక్ష్మణులను తన నావ ద్వారా అవతలి తీరంకు తీసుకువెళ్ళిన సందర్భంగా గుహుడి చర్చను అన్ని భాషల రామాయణకారులు రసవత్తరంగా సాగించారు. వాల్మీకి రామాయణంలో రామ లక్ష్మణులు గుహుడిని 'స్థపతి' అని సంబోధిస్తారు. కృత్తివాసుడి బెంగాలీ రామాయణంలో గుహుడి పేరు గుహకుడు. గోస్వామీ తులసీదాసు తమ రామచరిత్ మానస్‌లో సీతారామ లక్ష్మణులను గంగ అవతలి తీరంకు తీసుకుపోయిన నావికుడు గుహుడు కాదు కేవటుడు అని పేర్కొన్నారు. హిందిలో ఇంత వరకు వచ్చిన రామాయణం సీరియల్స్‌లో కూడా గుహుడు వేరు కేవటుడు వేరు అని తెలియ జేసేందుకు యిద్దరు వ్యక్తులను చూపించారు. రాముడి జన్మస్థలం అయోధ్యయే అని సుప్రీం కోర్టులో నిరూపించిన పరమ పూజ్య ఆచార్య రామ భద్రాచార్యులు కూడా తమ రామాయణం ప్రసంగాలలో గుహుడు కేవటుడు వేరు వేరు వ్యక్తులని చెప్పడం జరిగింది. తులసీ రామాయణంను శ్రద్ధగా పరిశీలిస్తే గుహుడే కేవటుడు. కేవటుడే గుహుడు అని పాఠకులకు స్పష్టంగా తెలుస్తుంది. గుహుడు కేవటుడు వేరు వేరు వ్యక్తులని తొలుత తులసీ తమ రామాయణం అయోధ్యాకాండలో యిలా రాసారు:

**ఉతరి ఠాఢభయే సురసరిరేతా**
**సీయ రాము గుహలఖన సమేతా**
**కేవటు ఉతరి దండవత కీన్హ....** (101వ దోహ తరువాత వచ్చే చౌపాయి)

నావ నుండి దిగి ఇసుకపై సీతా రామ గుహ లక్ష్మణులు నిలబడ్డారు. కేవటుడు నావదిగి దండం పెట్టాడు. ఇక్కడ తులసీదాసు గుహుడు కేవటుడు ఒకటి కాదు వేరు వేరు వ్యక్తులని చెప్పాడు. అదే తులసీదాసు చిత్రకూటంలో రామ భరతుల కలయిక సందర్భాలలో వశిష్ఠుడికి దూరం నుండీ దండ ప్రణామం చేస్తూ గుహుడు తనను గురించి చెబుతూ:

**ప్రేమ పులకి కేవటు కహినాము**
**కీన్హ దూరి తే దండ ప్రనాము.** (242 దోహ తర్వాత)

భావోద్రేకముతో, అయ్యా నా పేరు కేవటుడు అని తనను తాను పరిచయం చేసుకుంటాడు. రామాయణకారులందరూ -తులసీదాసుతో సహ చిత్రకూటంలో వరకు భరతుడిని అనుసరించినది గుహుడే అని పేర్కొన్నారు. ఇది నిర్వివాదాంశం. భక్తి పారవశ్యముతో తులసీ యిలా రాసి ఉంటాడని మన మనుకోవాలి.

కృత్తి వాసుడి బెంగాలీ రామాయణం ప్రకారం రాముడు, గుహుడిని వనవాసానికి ముందే చూచాడు. ఒకసారి సూర్యగ్రహణం సందర్భంగా దశరథుడు తన నలుగురు పుత్రులతో కలసి గంగాస్నానానికి బయలుదేరాడు. స్నానానంతరం రాముడి మేలు కోరుతూ బంగారు దానం చేయాలని సంకల్పించుకుంటాడు. మంది మార్బలంతో దశరథుడు బయలుదేరుతాడు. ఆకాశం మార్గంలో

వెడుతున్న నారదుడు దశరథుడిని చూచి, మంది మార్బలం, పుత్రులతో దశరథా నీవు ఎక్కడికి బయలుదేరావని ప్రశ్నిస్తాడు. దానికి దశరథుడు నేను నా కుమారులతో గ్రహణ సమయ పుణ్యస్నానానికి బయలుదేరానని చెప్పగా నారదుడు, దశరథుడితో రాజా నీవెంత అజ్ఞానివి. ఎవరైనా రాముడి ముఖం చూసిన తరువాత గంగలో స్నానం చేస్తారా? ఆ రాముడి పాదాల నుండే కదా గంగ ఉద్భవించిందని చెప్పడం జరుగుతుంది. నారదుడి మాటలు విని దశరథుడు రాముడితో గంగలో స్నానం చేయవలసిన అవసరం లేదు. మనం అయోధ్యకు తిరిగి వెళ్ళిపోదామంటాడు. రాముడు దశరథుడితో నారదుడి మాటలను పట్టించుకోవలసిన అవసరం మనకు లేదు. మనం గంగాస్నానం చేద్దామని సర్ది చెప్పుతాడు. ఆ ప్రాంతానికి రాజైన గుహుడనే చండాలుడు తన సైన్యంతో ప్రత్యక్షమై మీరాక వలన ఈ వన ప్రాంతం విధ్వంసం అవుతోంది. మీరు వేరే మార్గం వెతుక్కోండి. ఈ మార్గంలోనే మీరు వెళ్ళాలనుకుంటే రాముడి దర్శనం మాకు కలిగించండి అని విన్నవించుకుంటాడు. దశరథుడు రాముడిని రథంలో దాచి పెట్టి ఆలోచించసాగాడు. ఈ చండాలుడితో యుద్ధం చేయడం వల్ల, లేదా ఓడి పోవడం వల్ల అపకీర్తే కాని కీర్తిలభించదు. అయినా తప్పదని యుద్ధం చేస్తాడు. ఇద్దరి మధ్య భీకర యుద్ధం జరుగుతుంది. చివరకు పాశుపత బాణంతో గుహుడి చేతులను కట్టిపడవేస్తాడు. ఆస్థితిలో కూడా తన కాలుతో బాణాలు సంధించి వదలసాగాడు. ఈ దృశ్యాన్ని చూచిన భరతుడు రాముడితో ఈ విషయం ముచ్చటిస్తాడు. వేడుక చూడడానికి రాముడక్కడి కొచ్చి ఈ విలువిద్య నీవు ఏ గురవు వద్ద నేర్చుకున్నావని అడగ్గా ఆ విషయం నేను తరువాత చెబుతాను. ముందు నా విషయం నీకు తెలియజేయాలి. నేను నా ముందు జన్మలో వశిష్ఠుడి కొడుకు వామ దేవుడను. (రామాయణం–వాల్యూమ్ 1 రచయిత శ్రీ దుష్యంత శ్రీధర్ శతానందుడు, వామ దేవుడు ఇద్దరూ గౌతమ ముని పుత్రులని రాసారు. పుట: 126) వశిష్ఠుడి శాపం వల్ల ఇలా చండాలుడిగా మారాను. ఆ వృత్తాంతం చెబుతాను వినమని రాముడిని కోరుతాడు.

రామయ్యా! ఇది నీవు పుట్టక ముందు జరిగిన సంఘటన విను. ఒకసారి మీ నాన్న దశరథుడు వేట సందర్భంగా పొరబాటున అంధకుడనే ముని పుత్రుడిని చంపాడు. అసలు విషయం తెలుసుకొని చాలా బాధపడుతాడు. బ్రహ్మహత్యాపాతకం నుండి విముక్తిని పొందడానికి దగ్గరలో ఉన్న వశిష్ఠుడి ఆశ్రమంకు వెడతాడు. అప్పుడు అక్కడ వశిష్ఠుదు ఉండదు. అతడి కొడుకు వామదేవుడుంటాడు. తాను చేసిన హత్యను గురించి చెబుతూ బ్రహ్మహత్యా పాతకం నుండి విముక్తిని ఎలా పొందాలో తెలియజేయ మంటాడు. వశిష్ఠుడి కొడుకు ధ్యానం చేస్తూ ఆలోచించి ఒక మార్గాన్ని సూచించాడు. రాజా నీవు మూడుసార్లు రామనామాన్ని జపించు. ఆ రామనామ ఉచ్చారణ వల్ల నీకు తప్పక విముక్తి కలుగుతుందని ఆదేశిస్తాడు. దశరథుడు ఆ ప్రకారం మూడుసార్లు రామనామాన్ని ఉచ్చరించి హత్యా పాతకం నుండి విముక్తి పొందుతాడు. ఆ విషయం తిరిగి వచ్చిన వశిష్ఠుడితో వామ దేవుడు చెప్పగా విని వశిష్ఠుడు కోపోద్రిక్తుడవుతాడు. రాముడి పేరు ఒకసారి ఉచ్చరిస్తే చాలు అన్ని పాపాలు దూరం అవుతాయి. అటువంటిది నీవు దశరథుడితో మూడుసార్లు ఉచ్చరించేలా చేసావు. నీవు చండాలుడిగా జన్మించు అని శాపం యిచ్చాడు. మునుల కోపం పాల పొంగులాంటిది. వామ దేవుడు ప్రార్థించగా దశరథుడి ఇంట రాముడు జన్మించ గలడు. పితృవాక్య పరిపాలన కోసం భార్యా తమ్ముడితో కలసి గంగా తీరాన్ని చేరుతాడు. అతడిని దర్శించి పాదాలను ముట్టుకో నీకు శాప విముక్తి కలుగుతుందంటాడు. రాముడు గుహుడి కథవిని అగ్నిసాక్షిగా గుహుడిని తన మిత్రుడిగా స్వీకరించాడు.

పైన పేర్కొన్న గుహుడి వృత్తాంతాన్ని కృత్తివాసుడు అసామి భాషలో మాధవ కందలి ద్వారా రచింపబడిన రామాయణం నుండి గ్రహించి వుంటాడని భావించ వచ్చును కృత్తివాసుడి బెంగాలీ రామాయణం 15వ శతాబ్దపు రచన. అసామి రామాయణం రచన 14వ శతాబ్దంలో జరిగిందని చరిత్ర కారులు ఘంటాపథంగా చెబుతున్నారు. మాధవ కందలి రామాయణంలో గుహుడు పూర్వ జన్మలో ఒక బ్రాహ్మణుడు. ఒకసారి దశరథుడు రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులతో కలసి గంగా స్నానానికి బయలుదేరాడు అక్కడే గుహుడనే చండాలుడు స్నానం చేయడానికి సంసిద్ధుడయ్యాడు. రాజు సైనికులు ఆ చండాలుడిని బంధించి దశరథుడి ముందు హాజరు

పరిచారు. అక్కడ తన తమ్ములతో ఉన్న రాముడిని గుహుడు చూడడం జరుగుతుంది. వెంటనే గుహుడికి పూర్వజన్మ గుర్తుకొస్తుంది. గంగను ఉపేక్షించడం వల్ల గంగ నన్ను చండాలుడుగా మారి పొమ్మని శాపమిచ్చింది. నేను నా తప్పును తెలుసుకుని క్షమించమని గంగను ప్రార్థించాను. అందుకు గంగ త్రేతాయుగంలో రాముడు దశరథుడి యింట జన్మిస్తాడు. స్నాన ఘట్టం వద్ద అతనిని దర్శించిన వెంటనే నీకు శాప విముక్తి కలుగుతుంది, అని నన్ను దీవించిందని గుహుడు చెప్పగా విని రాముడు ఆనందిస్తాడు.

కేవట్ (రామాయణం) – ప్రకారం కేవటుడు హరివంశ కీర్ జాతికి చెందిన వ్యక్తి. ఇతడు గొప్ప రామ భక్తుడు. సృష్టి ఆదిలో మొత్తం సృష్టి జలమయింది. అప్పుడు ఒక తాబేలు యోని ద్వారా అతడు జన్మించడం జరుగుతుంది. తాబేలు గర్భంలో ఉన్నప్పుడు కూడా అతడు రాముడి పట్ల ప్రగాఢమైన భక్తి కలిగి ఉండేవాడు. తన ముక్తికోసం పాలకడలిలో శేషతల్పంపై పడుకొని ఉన్న విష్ణువు బొటన వేలును ముట్టుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆది శేషుడు బుస కొట్టడం వల్ల భయపడి తన ప్రయత్నాన్ని మానుకుంటాడు. విషయం తెలుసుకొన్న విష్ణువు ప్రసన్న చిత్తుడై త్రేతాయుగంలో నేను రఘువంశంలో దశరథుడి పుత్రుడు రాముడుగా జన్మిస్తాను. అప్పుడు నీకు నా కాళ్ళు కడగడానికి అవకాశం యిస్తానని చెప్పి కేవటుడికి అభయం యిస్తాడు. అప్పటి నుండి కేవటుడు ఒక యుగం అంతా తపస్సు చేసి కేవటుడిగా జన్మిస్తాడు. రాముడి పాదాలను కడిగి కేవటుడు కృతార్థుడవుతాడు. hi. Wikipedia.org. కథను ఇచ్చింది కాని ఎక్కడ నుండీ లేదా ఏ పురాణం నుండి గ్రహించిందో చెప్పలేదు. 'యీదునియా' డాట్ కామ్‌లో కూడా మూలం ఏదో చెప్పబడలేదు.

కృత్తివాసుడు తన రామాయణంలో గుహుడు శాపగ్రస్తుడైన వశిష్ఠుని కొడుకు వామ దేవుడని రాసాడు. బహుశ ఈకథ ఆధారంగా భక్త దాసి బ్లాగ్ (%https :// bhaktadasi. blog spot.com who was Guha in his previous janma) లో కృత్తివాసుడి కథకు తమ కల్పనను జోడించారు. ఇందులో కథ ఒకటే. కాని పాత్రల పేరు సంఘటనలు వేరు. ఈ కథప్రకారం ఒక మునిశ్రేష్ఠుడి ఆశ్రమంలో అనేక మంది శిష్యులు విద్యను అభ్యసిస్తుంటారు. గురువుకు అందరూ ప్రియశిష్యులే. కాని ఒక శిష్యుడు మాత్రం అతనికి ప్రియాతి ప్రియమైన శిష్యుడు. గురువు ప్రతి రోజు రామనామం గొప్ప తనాన్ని పదేపదే తెలియజేస్తుంటాడు. తన ఉపదేశంలో అతడు శివుడు పార్వతికి యిచ్చిన సమధానాన్ని మరి మరి వివరిస్తుంటాడు. పార్వతి శివుడితో, నాథా అందరూ విష్ణు సహస్ర నామాన్ని దినము చదవలేరు లేదా పనుల వొత్తిడి వల్ల పారాయణం చేయలేరు. దీనికి మీరు ఒక ఉపాయాన్ని సూచించండి అని కోరుతుంది. అందుకు శివుడు ఇలా జవాబిస్తాడు.

**శ్రీరామ రామరామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే**

ఒకసారి రామనామాన్ని జపిస్తే చాలు, మొత్తం విష్ణు సహస్రనామంను పారాయణం చేసిన ఫలం అబ్బుతుందని సమాధానం యిచ్చాడు. ఒక రోజు రాజును చూడడానికి ఆ ముని శ్రేష్ఠుడు బయలుదేరుతాడు. అప్పుడు ఒక బ్రహ్మణుడు అతి దీన వదనంతో ముని శ్రేష్ఠుడుని కలవడానికి వచ్చాడు. మునిశ్రేష్ఠుడి ప్రియశిష్యుడు ఆ బ్రాహ్మణుడితో అయ్యా, మునిగారు ఆశ్రమంలో లేరు. మీకు ఏమీ కావలో ఎందుకు విచ్చేసారో తెలపండి. నేను నాకు చేతనయినంత సహాయం చేయగలనంటాడు. అందుకు ఆ బ్రహ్మణుడు ముని బాలకా నేను విసిరిన రాయి కారణంగా ఒక గోవు చనిపోయింది. ఇది గొప్ప పాతకం. ఈపాతకం నుండీ విముక్తి నాకు ఎలా కలుగుతుందో సెలవియ్యండని ప్రార్థిస్తాడు. మునిశ్రేష్ఠుడి ద్వారా రామనామం గొప్ప తనాన్ని తెలుసుకున్న ప్రియ శిష్యుడు అయ్యా మీరు మూడు సార్లు రామ నామాన్ని భక్తిశ్రద్ధలతో ఉచ్చరించండి ఆ నామ మహిమ వల్ల మీరు పాపవిముక్తులవుతారని తెలియజేసాడు. ఆ బ్రాహ్మణుడు అలానే చేసి పాప విముక్తుడయ్యాడు. ఆశ్రమానికి తిరిగి వచ్చిన మునిశ్రేష్ఠునికి ఆ ప్రియశిష్యుడు జరిగిన విషయం పూస గుచ్చినట్లు తెలిపాడు. మునిశ్రేష్ఠుడికి విపరీతమైన కోపం వచ్చింది. రామనామము ఒకసారి జపిస్తే చాలు అన్ని పాపాలు పటా పంచలవుతాయి. అటువంటిది నీవు మూడు సార్లు ఉచ్చరించమని ఆ బ్రహ్మణుడికి తెలియజేసావు. రామనామం గొప్పతనం పట్ల నీకు సందేహం ఉన్నట్లుంది.

ఇది క్షమించరానిది. నీవు చండాలుడిగా జన్మించు అని శాపం యిచ్చాడు. గురువు పాదాలు పట్టుకొని ప్రియ శిష్యుడు క్షమించమని ప్రార్థిస్తూ శాపవిముక్తి ఎప్పుడు కలుగుతుందో సెలవియ్యండని అర్థించాడు. అందుకు ఆ మునిశ్రేష్ఠుడు త్రేతాయుగంలో రాముడు దశరథుడి ఇంట అవతరిస్తాడు. వనవాసం కారణంగా గంగా తీరానికి వస్తాడు. అతడిని నీ నావ ద్వారా గంగను దాటించు. అప్పుడు నీకు శాప విముక్తి కలుగుతుందంటాడు. శాప గ్రస్తుడైన ఆప్రియ శిష్యుడే గుహుడు.

కేవటుడు అన్న పేరును ఒక తులసీదాసు మాత్రమే పేర్కొన్నాడు. వాల్మీకి రామాయణంలో గుహుడు స్వయంగా సీతారామ లక్ష్మణులను గంగ అవతలి తీరంకు చేర్చలేదు. అతని సహాయకుడు ఆపని చేసాడు. ఆ సహాయకుడి పేరును వాల్మీకి ఎందుకో రాయలేదు. తులసి మాత్రం కేవటుడిని గురించి విపులంగా రాస్తూ ఆపాత్రకు గుహుడి కన్నా ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. ఆ ఘట్టం తరువాత కేవటుడు, గుహుడు ఒకరే అని రాసాడు. మన వరకు గుహుడే సీతారామ లక్ష్మణులను తన నావ ద్వారా గంగ అవతలి వొడ్డుకు తరిలించాడు.

వాల్మీకి, ఆనంద రామాయణాలలో ఒక నావికుడు సీతారామ లక్ష్మణులను గంగ అవతలి ఒడ్డుకు చేర్చాడన్న విషయం ఉంది. అధ్యాత్మ రామాయణం (బాలకాండ, 6-3) మాత్రం గుహుడు, సీతాస్వయం వరంకు వెళుతున్నప్పుడు రామ లక్ష్మణులను అవతలి తీరానికి తీసుక వెళ్ళాడని వుంది. ఆ సమయంలోనే ఒక నావికుడు

**క్షాలయామి తవ పాద పంకజం-నాథ దారుదృషదోః కిమంతరం**
**మానుషీకరణ చూర్ణమస్తితే- పాదయో రితి కథా ప్రథీయసీ**
**పాదాంబుజం తే విమలం హికృత్యా-పశ్చాత్పరం తీర మహంనయామి**
**నోచే త్తరీ సద్యవతీ మలేన-స్యాచ్చే ద్విభోవిద్ధి కుటుంబ హానిః,**

(అధ్యాత్మరామా, బాల. 6-3,4)

**అర్థం :** స్వామీ! మీ పాదముల యందు (వస్తువులను) మనుష్యులుగా మార్చు చూర్ణము (మందు) ఉన్నదని ప్రసిద్ధమైనది. శిలకును చెక్కకును భేదమేమీ? కావున మిమ్ము నావను ఎక్కించుకొనుటకు ముందు మీ పాదములను కడిగెదను. (అ. రా. (తెలుగు సేత) గోరఖ్‌పూర్ ప్రెస్. పుట: 49) ఆ తరువాత అయోధ్యాకాండలో గుహుడు సీతా రామ లక్ష్మణులను తన నావలో కూర్చుండ బెట్టుకొని వారిని గంగా అవతలి వొడ్డుకుతీసుక వెళ్ళాడని వుంది.

తెలుగు కవయిత్రి ఆతుకూరి కేసన వరపుత్రిక మొల్ల-ఈమె తులసీ దాసుకు, తెలుగు కవి అయ్యాల రామభద్రుడికి సమకాలికురాలు-ఆనంద, ఆధ్యాత్మ రామాయాణాలలో సూచన ప్రాయంగా ఉన్న విషయాన్ని చేయి తిరిగిన చిత్ర లేఖకుడి భంగి అతి అద్భుతంగా చిత్రించింది. గుహుడి పాత్రకు ప్రాణం పోసి చిరంజీవిగా తీర్చిదిద్దింది. ఈ సంఘటన సందర్భంగా ఆమె చెప్పిన తీరు-గుహుడి ఆందోళనను గమనించండి;

**సుడిగొని రామపాదములు సోకిన ధూళి వహించి రాయి యే ర్పడ ఒక కాంత యయ్యెనట, పన్నుగ నీతని పాదరేణు వి య్యెడ వడి నోడ సోక నిది యేమగునో యని సంశయాత్ముడై కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయమ్ము పెంపునన్ (అయోధ్య. 22)**

''అయ్యల రాజు రామ భద్రుడు తన రామాభ్యుదయంలో గుహుడు కాళ్ళు కడగడం చెప్పలేదు గాని మీ పాద ధూళి సోకితే రాళ్ళు జవ రాళ్ళుగా మారుతాయి అని భయపడి, కాళ్ళుకందుతాయి. రాళ్ళ మీద నడవకండి అని సీతమ్మ అన్నట్టూ, ఆమె ఉద్దేశ్యం తెలిసి రాముడు నవ్వినట్టూ అని ఆరుద్ర తమ సమగ్ర ఆంధ్ర సాహిత్యం-8, పుట 116లో తెలియజేసారు. అంతటితో ఆగకుండా నదిని దాటించే ముందు గుహుడు శ్రీరాముని కాళ్ళుకడిగేడన్న విషయం తెలుగు రామాయణాలలో మరెక్కడా లేదని కూడా రాసారు. గుహుడిని, అమరుడిగా తీర్చి దిద్దిన మొల్ల ఆంధ్రులకు ప్రాతః స్మరణీయురాలు.

**డా. ఎ.బి. సాయిప్రసాద్**
విశ్రాంత హిందీ ఆచార్యులు ,
బెంగళూరు, ఫోన్ : 9980567541

# ఆనాటి
# బెజవాడ జ్ఞాపకాలు

– రాయవరపు సత్యనారాయణ



**అవతారిక :** మా అమ్మగారు 1913లో పుట్టిన ఇల్లు, పుట్టిల్లు బెజవాడలోనే ఉండటంతో ఈ నగరం నా ఎదుగుదలలో ప్రాధాన్యత సంతరించుకొంది. సిరివెన్నెల వారు సూచించినట్లు–ఆ గాలి, ఆ నేల, ఆ ఊరు, నను గన్నవాళ్ళు, నా కళ్ళ లోగిళ్ల–నా మదిలో ఎప్పుడు మెదలాడుతూనే ఉంటాయి. ముఖ్యంగా నా 10–15 సంవత్సరాల పిన్న వయస్సులో బెజవాడలో గడిపిన సుదీర్ఘ జ్ఞావకాలను ఇప్పటి 80వ దశకంలో నెమరు వేసుకున్నప్పుడల్లా కలిగే మధురానుభూతులు మరువలేని పులకరింతలు. ఆనాటి అంటే 1950–60 దశకం నాటి బెజవాడను మనస్సులో పునఃదర్శనం చేసుకొని నాటి నగర జీవనశైలి విశేషాలను, నగర రూపురేఖల ప్రత్యేకతలను క్లుప్తంగా, ఒక వాక్చిత్రంగా ఆవిష్కరించాలన్నది ఈ వ్యాస చిన్ని ప్రయత్నం, ఉద్దేశ్యం. **మిసిమి** చదువరులు సహృదయంతో స్పందిస్తారని ఆశాభావం.

ఇంద్రకీలాద్రి కొండ ఒక హద్దుగా, రైల్వేలైనుకు పశ్చిమంగా ఉన్న బెజవాడ పాత టౌన్ గురించిన విశేషాలపై దృష్టి ఇందులో కేంద్రీకరిస్తాను. ఎన్నో శతాబ్దాల క్రితం లభించిన శిలాశాసనాలలో ఈ నగరం బెజవాడ పేరుతో ప్రసిద్ధి పొందింది. విజయవాడ నామాంతరంగా నేడు వాడుకలో ఉంది. సౌలభ్యం దృష్ట్యా ఈ వ్యాసంలో పాత నగరాన్ని బెజవాడ గాను, నవీన నగరాన్ని విజయవాడ గాను ప్రస్తావించ తలచాను. ఆనాటి నగరానికి సుస్వాగతం.

**బెజవాడ నగర నామాంతరాలు–విశిష్టత :** బెజవాడ పేరు పరిణామం గురించి స్పష్టతతో వివరించడం అంత సులభ కాదు. కృష్ణ వేణీ నది తన సాగర సంగమానికి అవరోధంగా ఉన్న కొండ సమస్యను పరిష్కరించమని కోరగా అర్జునుడు దానిలో పెద్ద బెజ్జం (టన్నెల్) చేశాడని ఐతిహ్యం. అందువలన ఆ ప్రాంతానికి బెజ్జంవాడగా పేరు వచ్చిందన్నది ప్రాచుర్యంలో ఉన్న కథనం. ఈ కథన ప్రామాణికతను పండితులే నిర్ధారించాలి.! బెజవాడ పుర ప్రస్తావన శాతవాహనుల కాలం నుంచి వస్తున్నది. పండరంగడు వేయించిన అద్దంకి శాసనంలో " కందుకూరున్బెజవాడ గావించెమెచ్చి " అనిఉంది. ఆ తరువాత యుద్ధ మల్లుడు వేయించిన శాసనంలో కూడా బెజవాడ అని వ్యవహరించారు : 'పరగ బెజవాడ గొమరస్వామికి భక్తుడై. ఆయా కాలాలలో పాలకులు, మాండలికులు వేయించిన శాసనాలలో బెజవాడ పేరును పలురకాలుగా పేర్కొన్నారు: విజయవాటీపురం, బీజపురి, బెజ్జంవాడ, అర్జునస్యపురం, బెజవాడ కంద్రవాడ వగైరా. చివరగా మద్రాసు ప్రెసిడెన్సీ ప్రభుత్వం బెజవాడ పేరును "విజయవాడ"గా, మార్చి 12, 1948 నుంచి మార్పుచేస్తూ ఆదేశాలు జారీ చేసింది. చరిత్రలో బెజవాడ ఎప్పుడు రాజధానిగా పరిగణింప బడలేదన్నది నన్ను ఆశ్చర్య పరచిన విషయం

**ఇంద్రకీలాద్రి కొండపైన శ్రీ కనకదుర్గమ్మ గుడి :** బెజవాడ అధిదేవత, అధిష్ఠాన దేవత శ్రీ కనకదుర్గా దేవి. నగరానికి రత్నఖచిత మకుటం శ్రీ కనకదుర్గమ్మ గుడి. గుడికి చేరు కోవాలంటే రెండు మెట్ల మార్గాలు ఉన్నాయి–సుమారు వందమెట్లు కృష్ణానది వైపు ఉన్న మెట్లు ఊరివైపు ఉన్న మెట్ల కంటే వాలు ఎక్కువ. దేవి గర్భగుడి ఇటుకలతో గానుగ సున్నంతో తెల్లని వెల్లతో, ప్రస్తుత స్థానంలో నిర్మితము అయ్యింది. అమ్మ గుడికి కుడివైపున కొండ తొలవగా ఏర్పడిన చిన్న కొలను ఉండేది. కొలను మధ్యలో రాధ–కృష్ణుల విగ్రహం, చుట్టూ గోపికలు పిచికారి

చేస్తున్నట్లు విగ్రహాలను అందంగా రూప కల్పన చేశారు. పెద్దవాళ్ల చేయి పట్టుకొని కాళ్ళు కడుగుకొని దుర్గమ్మ దర్శనానికి గుడిలోకి ప్రవేశించే వాళ్ళం. నమ్మిన వారికి ఎప్పుడూ కళకళలాడుతున్న దుర్గమ్మ దివ్యదర్శనం అపురూప అనుభూతి. శ్రీ దుర్గమ్మను దర్శించుకొని దీవెనలకు ప్రార్థించి తరించేవాళ్ళం.

కొండ తొలిచి నిర్మించిన 200 గజాల నడకమార్గం ద్వారా శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవాలయం చేరేవాళ్ళం. అలా వెళ్తున్నప్పుడు మనకు ఎడమ వైపు కొండ, కుడి వైపు 4 అడుగుల ఎత్తుప్రహరీగోడ గ్రిల్‌తో కట్టారు. ఆ దారిలో రవివర్మ చిత్ర ఆధారంగా గంగావతరణం దృశ్యాని శిల్పంరూపంలో మలచారు. కాలగతిలో కొలను కనుమరుగు అయిన కారణంగా, అక్కడి శ్రీ కృష్ణ రాసలీలా విగ్రహాలను ఇక్కడికి తరలించారు. ప్రహరీ గోడ దగ్గర నుంచి బెజవాడ విహంగ వీక్షణం అద్భుతం. గర్భగుడిలో శ్రీ మల్లేశ్వర స్వామి, పెద్ద శివలింగరూపంలో దర్శనం ఇస్తారు. ప్రత్యేక రోజులలో అలంకరణగా వెండితో చేసిన మీసాల చంద్రశేఖర స్వామి ముఖరూపం అయిదు పడగల నాగేంద్రునితో శివలింగాన్ని అలంకరిస్తారు. ఈ శ్రీ మల్లిఖార్జున స్వామి దర్శనం ప్రత్యేక ఆకర్షణ. ఆ గుడిలోని ప్రశాంతత నిరాడంబరత ఆకట్టుకొంటాయి.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిర్వహించే దసరా ఉత్సవాలు, వేడుకలు చూసి తీరాలి. ఆ తొమ్మిది రోజులలో శ్రీ కనక దుర్గమ్మను నవదుర్గల రూపాలతో అలంకరణ చేస్తారు. భక్తులు తండోప తండాలుగా వచ్చి అమ్మను దర్శించుకొని తరిస్తారు. అమ్మవారి గర్భగుడి గోపురాన్ని, మల్లేశ్వరస్వామి వారి గర్భగుడి గోపురాన్ని రంగు రంగుల ఎలక్ట్రిక్ బల్బులతో అలంకరణ చేసేవారు. అమ్మ గుడి నుంచి అయ్యవారి గుడికి వెళ్ళే దారిలో ప్రహరీ గోడ మీద రెండేసి గజాల దూరంలో బంగారం రంగు గోళాకారం లైటు బల్బులు చిన్న స్తంభాలపై అమర్చే వారు. చీకటి పడ్డాక వెలిగించిన రంగు రంగుల విద్యుత్ దీపాల కాంతులతో మెరుస్తున్న అమ్మ వారి గుడిని, ప్రహరీగోడ స్తంభాల బంగారు రంగు లైట్లు ఒక మాలగా అయ్యవారి గుడిని సంధానిస్తున్నట్లు కనుపించే ఆ రాత్రి దృశ్యం వర్ణనాతీతం.. ఇప్పుడు అమ్మ గుడి గుర్తు పట్టలేనంతగా రూపాంతరం పొందింది. గర్భ గుడి పునః నిర్మితమయి సువర్ణ లేపనంతో శోభిల్లుతున్నది. గాలి గోపురం నిర్మితమయింది. కొండపైకి రహదారి వంటి అనేక సౌకర్యాలను భక్తులకు శ్రీ దుర్గామల్లేశ్వర దేవస్థానం సమకూరుస్తోంది. ఈ పరిణామం స్వాగతించతగినది.

**నాటి నిజ బెజవాడ :** వ్యవసాయం ప్రధాన వృత్తిగా మారిన తరువాత నదీ తీరాలపై మానవుడు స్థావరాలను ఏర్పరచుకొనినట్లు మానవ జీవన పరిణామ చరిత్ర చెపుతోంది. తదనుగుణంగా స్థావరాలు కృష్ణానది ఒడ్డున మొట్టమొదట ఏర్పడి తరువాతి కాలంలో పెరిగి నేటి సామారంగం చౌక్ వరకు వ్యాపించి ఉండవచ్చు. అదే పాత పేట అయి ఉంటుందని నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ నగర ప్రాంతంలో రోడ్లు ఇరుకుగా వంకరలతో ఉన్నాయి. ఒక సైకిల్ రిక్షా, గోళీ సోడా బండి పక్క పక్కన వెళ్ళడం కష్టం. ఇంటికి కావలసిన పచారి వగైరా సామాన్లు దొరికే దుకాణాలు ఏర్పడ్డాయి. ఇదే ప్రాంతంలో ఇంద్రకీలాద్రి కొండ కింద చారిత్రికంగా పేరు పొందిన పాత శివాలయం ఉంది. మరికొన్ని దేవాలయాలు కొత్త గుళ్లుగా నిర్మాణం అయ్యాయి. ఇది అసలు సిసలు బెజవాడ.

**కొత్త పేట-పాత బెజవాడ :** కొత్తపేట బెజవాడలో ఎంతో ముఖ్యమయిన వాడ. ఇక్కడి ప్రధాన వీధిలో రాజకీయ సంస్థలు, సంపన్న మధ్య తరగతి కుటుంబాల ఇళ్లు ఉన్నాయి. బెజవాడ ప్రథమ ప్రధాన బడి శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వెంకట రత్నం (SKPVV) హిందూ హైస్కూల్ అక్కడే ఉంది. విశాలమయిన నలుచదరపు రెండు అంతస్తుల (1+1) ఉన్న కట్టడం. హెడ్ మాస్టర్ శ్రీ కొత్తూరి ఉమామహేశ్వర రావు గారి ఆధ్వర్యంలో క్రమ శిక్షణకు, చక్కని విద్య బోధనకు పేరు పొందింది. ఇంకో ప్రత్యేకత, స్కూల్ అంతస్తు పైన నాలుగడుగుల చదరపు గూడులో బడి ఘంట ఉంది. ఉదయం 10 గంటలకు ఆ ఘంటానాదంతో బడి ప్రారంభం అయ్యి నాలుగు గంటలకు అదే నాదంతో ముగిసేది. కొంత దగ్గరలో ఉన్న మా తాత గారి ఇంటి మెట్లమీద కూర్చొని ఆ ఘంటారావం వింటూ పులకించి పోయేవాణ్ణి. అటువంటి ఘంటానాదం మరెప్పుడు ఎక్కడా వినలేదు.

అదే వీధిలో కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల ఆఫీసులు కూతవేటు దూరంలో ఉండేవి. ఆనాటి కొత్తపేట నుంచి గెలిచిన కాంగ్రెస్ శాసన అభ్యర్థి సర్దార్ మరుపిళ్ల చిట్టి.

అభిమానులు ఆయన విగ్రహాన్ని అదే రోడ్డులో స్థాపన చేశారు. కొత్తపేటకు దక్షిణంగా చిట్టినగర్ వెలసింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు కాడి-జోడు ఎద్దులు అయితే కమ్యూనిస్ట్ పార్టీ గుర్తు కంకి-కొడవలి. కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థి శ్రీ తమ్మిన పోతరాజు.

దసరా రోజులలో ఒనమాలు దిద్దుకునే చిన్నారులు, ఒకటి రెండు తరగతుల విద్యార్థులతో ప్రైవేట్ టీచర్లు బాండు మేళాలతో ఊరేగింపుగా ఉదయం పిల్లల ఇళ్లకు వెళ్ళే వాళ్ళు. దసరా బాణాలు తగిలించుకొని పిల్లలు ముక్త కంఠముతో "అయ్యా వారికి చాలు ఐదు వరహాలు- పిల్ల వాళ్ళకు చాలు పప్పు బెల్లాలు" పాడుతుంటే చూడముచ్చటగా ఉండేది. పిల్లల తల్లిదండ్రులు గౌరవంగా అయ్య వారులకు కండువా, పంచలు, 5/10 విచ్చు రూపాయిలు ఇవ్వగా, పిల్లవాళ్ళు దోసిట ఇచ్చిన పప్పు బెల్లాలను కొంత తిని మిగిలినవి లాగు జేబుల్లో నింపుకునే వారు. అదొక అందమయిన వేడుక.

దసరా నవరాత్రులలో ఆ వీధిలో జరిగే సంబరాలు అంబారాన్ని అంటేవి . పగలు కోలాటాలు, పులివేషాలుతో ఎంతో సందడిగా ఉంటే రాత్రి జరిగే కన్నుల పండుగ లాంటి ఉత్సవాలు నగరానికే తలమానికం. రాత్రి పూట 09.00 గంటలకు ఆరంభం అయ్యే దసరా ఊరేగింపులు చూడటానికి ఇంటిల్లిపాది త్వరగా భోజనాలు ముగించుకొని వీధి అరగులపై, మెట్లపై గుమిగూడే వాళ్ళు. దసరా చివరి మూడు రోజులు ఎద్దుబళ్ల మీద తాత్కాలిక వేదికలు ఏర్పాటు చేయగా, అందులో మన ఇళ్లల్లోని దేవుడి ఫోటోలకు ప్రతి రూపంగా దేవతామూర్తుల మేకప్ వేసుకొని కళాకారులు ఊరేగింపుగా వచ్చేవారు. డైనమో లైట్ల కాంతులలో వెలిగి పోతున్న ఆ దేవుళ్ళు స్వర్గం నుంచి దిగివచ్చారా అన్న భ్రమ కలిగేది. విజయదశమి నాడు ఎక్కువ సంఖ్యలో ఊరేగింపులు నెమ్మదిగా సాగేవి. ముందుగా శ్రీ గణపతి వాహనం, వెనువెంటనే శ్రీ నరసింహ స్వామి బండి ఉండేవి. ఒకసారి లక్ష్మీసమేతంగా నరసింహస్వామి ఉంటే, మరొకసారి స్వామి రూపం సింబాలిక్‌గా, పెద్ద సింహం తలలో సాధారణ మనిషి తన తలను దూర్చి నిలబడేవాడు. చాలా గంభీర రూపం. తరచూ కర్పూర హారతి ఉగ్రనరసింహ స్వామికి శాంతి కోసం ఇచ్చేవారు. శ్రీశంకరమహాదేవ కుటుంబం,



1852లో కృష్ణానదిమీద ఆనకట్ట

శ్రీరామపట్టాభిషేకం, రుద్రునితో మహాకాళి వంటి పౌరాణిక సంఘటనలు కళ్లకు కట్టినట్లు నిశ్చల రూప కల్పన చేసి ప్రదర్శించే వారు. ఎంత చూసినా తనివి తీరేది కాదు.

**ఒక అప్రస్తుత ప్రసంగం :** అదే ప్రధాన వీధిలో ఒక చైనాదంత వైద్యుని క్లినిక్ ఉండేది. ఆ రోజుల్లో పిప్పి పళ్లను తియ్యడానికి, పంటి నొప్పుల నివారణలకు, బంగారు పళ్ళు కట్టించు కోవడానికి చైనీస్ దంత వైద్యులు పేరు పొందారు. స్వచ్ఛమయిన తెలుగులో మాట్లాడుతూ నొప్పి తెలియనీయకుండ పంటి వైద్యం చేసిన "హూ యిన్ పావ్" అప్పట్లో మంచి పేరు సంపాదించుకున్నాడు.

**బెజవాడ మణిమాల కృష్ణవేణీ నది :** గోదావరి నది గంభీరంగా ప్రవహిస్తుంది అని ప్రసిద్ధి . కృష్ణా నది దానికి భిన్నంగా పరవళ్ళు తొక్కుతూ వయ్యారంగా ప్రవహిస్తుంది. మా అమ్మగారు తన స్నేహితులతో తెల్లవారు ఝామున షుమారు 300 గజాల దూరంగా ఉన్న కృష్ణలో స్నానం చేసి తాగడానికి రెండు బిందెల మంచి నీళ్ళు తెచ్చు కొనేదట. నాటి రోజుల్లో కృష్ణానది రూపం కొంత భిన్నంగా ఉండేది. ఇంద్రకీలాద్రిని, సీతానగరం కొండను అనుసంధానం చేస్తున్నట్లుగా సర్ ఆర్థర్ కాటన్ డిజైన్ చేసిన ఆనకట్ట 1852లో ఇంజనీర్లు కెప్టెన్ చార్లెస్ ఓర్, జోసెఫ్ గోర్ రైవస్ ఆధ్వర్యంలో నిర్మించబడింది. లక్షల ఎకరాలకు నీరందించిన కృష్ణానది కృష్ణా జిల్లాకు అన్నపూర్ణ అయ్యింది. ఎండాకాలంలో నదిలో ఇంచుమించు నీళ్ళు లేకపోవడంతో బెజవాడ నుంచి మంగళగిరి-గుంటూరు వైపు వెళ్ళే బళ్ళు, లారీల వంటి వాహనాల రవాణాలు ఆనకట్టకు కొంత దూరంగా జరిగేవి ఆనకట్టకు ఎదురుగా ఇటుక రంగులో ఇనపగర్డర్లతో ఒక కిలోమీటర్‌కు మించిన పొడవుతో రైల్వే బ్రిడ్జ్ బ్రిటిష్ వారి కాలంలో నిర్మాణం జరిగింది. బెజవాడలో ఇది మరొక ధృడమైన కట్టడం.

కలకత్తా-మద్రాసు మధ్య రైలు రాకపోకలలో ముఖ్య పాత్ర వహించింది, వహిస్తోంది. ఈ రైల్వే వంతెనపై ట్రైన్ వేగంగా పరుగెడుతుంటే ఆ లయబద్ధ ధ్వనికి గుండె ఆనందంతో ఝల్లుమనేది. బహుశా నిజమయిన ఆ తాళ బద్ధ The Metal Music అదేనేమో. శుక్రవారం రోజున రైలు బ్రిడ్జ్ నుంచి కనుపించే రంగు విద్యుత్ దీపాలతో వెలిగి పోతున్న దుర్గా మల్లేశ్వర దేవస్థాన దృశ్యం అత్యంత నయనానందకరం. తరువాతి కాలంలో అక్కడ మరో రైల్ బ్రిడ్జ్ నిర్మింపబడింది.

ఆనకట్టకు బదులుగా నదిపై బారెజ్ నిర్మాణం 1953లో అప్పటి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరు ప్రకాశం పంతులుగారు శంఖు స్థాపన చేయగా ప్రారంభం అయ్యింది. డిసెంబర్ 1957 పూర్తి అయిన ఈ బారెజ్ వారి సేవలకు గుర్తింపుగా "ప్రకాశం బారెజ్"గా నామకరణం చేయబడింది. నాటి ముఖ్య మంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి గారు ప్రారంభం చేసి, ఆంధ్ర ప్రజలకు అంకితం చేసినప్పుడు బారెజ్ దరిదాపులో ఉండటం అప్పుడు ఇప్పుడు నా అదృష్టంగా భావిస్తాను. ధృఢంగా నిర్మించబడిన ప్రకాశం బారెజ్‌కు అంతర్జాతీయ గుర్తింపుగా International Commission on Irrigation and Drainage (ICID) సంస్థ ప్రపంచ వారసత్వ నీటిపారుదల కట్టడాల (World Heritage Irrigation Structure-WHIS) అవార్డును 2023లో ప్రదానం చేసింది. ఇది ఆంధ్ర ప్రజలకు గర్వకారణం. కృష్ణా నుంచి మూడు పంట కాలువలు-ఏలూరు, బందరు, రైవస్ కాలువలు-పట్టణంలో పారుతుండటంతో బెజవాడ ఆంధ్రా వెనిస్‌గా పేరుపొందింది. కానీ వాటి నిర్వహణ లోపాలతో చెడ్డ పేరు కూడా తెచ్చుకొంది. ప్రధాన కాలువ రైల్వే వంతెన దాటిన తరువాత చిన్న విద్యుత్ ఉత్పాదక కేంద్రం రాత్రి పూట భారీ లైట్లలో వెలిగిపోతూ ఆకర్షించేది. కాలగతిలో ఈ విద్యుత్ కేంద్రం మూతపడి కనుమరుగు అయిపోయింది.

వ్యవసాయు, వ్యాపార, ఆర్థిక వ్యవహారాలకు ఆంధ్రప్రదేశ్‌లో బెజవాడే ప్రధాన నగరం. పాతటౌన్ వాటికి ప్రముఖ కేంద్రం. ఇక్కడ సంబంధిత ఎన్నో సంస్థలు నెలకొన్నాయి. ఆంధ్ర దేశంలోనే మొట్టమొదటి పర్మనెంట్ సినిమాహాల్ మారుతి టాకీస్ . దీనిని పోతిన శ్రీనివాసుగారు 1921లో నిర్మించారు. మున్ముందు మూకీ సినిమాలు ప్రదర్శించబడినా తదనంతరం రోజులు మారాయి, తోడి కోడళ్ళు, చెంచులక్ష్మి వంటి టాకీ చిత్రాలు శతదినోత్సవాలు , సిల్వర్ జూబ్లీలు జరుపుకొన్నాయి. ఆ తరువాత ఈ హాలుకు దగ్గరగా సరస్వతి, రాజకుమారి, శేష్‌మహల్ (హిందీ సినిమాలకు ప్రత్యేకం) లాంటి సినిమా హాళ్లు వచ్చాయి. ఆ రోజుల్లో ఒక వింత కథనం ఎంతో ప్రచారంలో ఉండేది. రోజులు మారాయి సినిమాని శ్రీ మారుతి హాల్లో శ్రీ దుర్గమ్మ మానవ రూపంలో రాత్రి షో చూసి రిక్షాలో తన గుడి దగ్గర అంతర్ధానం అయినట్లు రిక్షావాడు చెప్పాడు అన్న వదంతి ఆ నోటా ఈ నోటా పాకింది . సాక్ష్యాధారాలు లేకపోయినా ఆనాటి వార్తా పత్రికలలోను ఇప్పటికీ సోషల్ మీడియాలో అప్పుడప్పుడు ఈవార్త ప్రస్తావన కనుపించడం గమనార్హం .. ఆ పరధిలోనే మహాత్మాగాంధీ మునిసిపల్ హైస్కూల్, హెడ్ పోస్టాఫీస్, కాళేశ్వర రావు మార్కెట్ వంటి సంస్థలు వెలిసాయి. కాలగమనంలో మారుతి టాకీస్ మూత బడి వ్యాపార కాంప్లెక్స్‌గా మారింది.

**కాళేశ్వర రావు మార్కెట్టు-వ్యాపార కలాపాల తేనెపట్టు :** దీర్ఘ చతురస్రాకార రాతి ఇటుకల కట్టడం (1+2 అంతస్తులతో) చిల్లర, టోకు వ్యాపారాలకు కేంద్ర బిందువుగా పాతటౌన్‌లో నది ముఖ్య కాలువ ఒడ్డున ఒక మార్కెట్ వెలిసి ప్రాధాన్యత సంతరించుకొంది. నాటి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వర రావు గారి సేవలకు గుర్తింపుగా కాళేశ్వర రావు మార్కెట్ అయింది. రెండు వందల పైచిలుకు చిరు వ్యాపారులకు, వ్యాపార సంబంధించిన సంస్థలకు ఈ మార్కెట్ ఆలంబన అయ్యింది. ఈ మార్కెటుకు ఎదురుగా అర్ధ చంద్రాకార స్థలంలో నగర హెడ్ పోస్టఆఫీస్ కార్యకలాపాలు జరిగేవి. ఈ మార్కెట్ నిత్యం అనేక వ్యాపార లావాదేవీలతో, జనసమ్మర్ధంతో కిటకిటలాడే తేనెపట్టు.

పాత టౌన్ నుంచి తూర్పు వైపున అభివృద్ధి పొందుతున్న గాంధీ నగరం, గవర్నర్ పేట, సత్యనారాయణపురం ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ మార్కెట్ ప్రదక్షిణం తప్పనిసరి. సైకిల్ రిక్షా /గుర్రపు బండిలో ప్రధాన నది కాలువ రైలు వంతెన కిందుగా అర్ధ చంద్రకార రోడ్డు మీద ఆంధ్ర కేసరి కాంస్య విగ్రహం చుట్టూ పరిభ్రమణ చేస్తూ వెళ్ళాలి. ఈ మలుపులో నడుస్తున్న, రాబోతున్న సినిమా తారల

రంగు చిత్రాల బేనర్లు, భారీకట్ ఔట్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ. అంజలీదేవి, సావిత్రి, నాగేశ్వరరావు,రామారావు, రేలంగి వంటి తెరవేల్పులను వివిధ పాత్రల రూపాలలో చూస్తున్నప్పుడు ఆ సినిమాలను చూడాలన్న కోరిక రెట్టింపు అయ్యేది. అది ఒక చెప్పలేని త్రిల్. అలాంటి సుందర దృశ్యమాలిక అక్కడ నాకు మళ్ళీ కనుపించలేదు.

**బెజవాడ రైల్వే స్టేషన్-విశిష్ట జంక్షన్ :** దక్షిణ భారత దేశాన్ని ఉత్తర భారత దేశంతో అనుసంధానం చేయడంలో బెజవాడ రైల్వే స్టేషన్ పాత్ర అత్యంత కీలకం. అటు ఢిల్లీ, కలకత్తా వెళ్లాలన్నా, ఇటు మద్రాసు, బెంగళూరు వెళ్లాలన్నా బెజవాడ నుంచే ప్రయాణం చేయాలి. ఆవిధంగా దేశ రైల్వే వ్యవస్థలో ఈ స్టేషన్ పాత్ర నాడుపోషించింది; ఇప్పుడూ పోషిస్తోంది. అప్పుడు రెండే రెండు ప్లాట్ ఫారములు ఉండేవి. ఒకటి దక్షిణంగా వెళ్ళే రైళ్లకయితే రెండోది ఉత్తరం వేపు ట్రైనులకు పరిమితం అయ్యేది. ఈ స్టేషన్ ప్లాట్ ఫారములు రెండవ అత్యంత పొడవు కలవిగా అప్పుడు గుర్తింపు పొందాయి.

ఢిల్లీ-మద్రాసు గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ( ప్రారంభం 1920లో ), మద్రాసు-హౌరా మెయిల్ (15 ఆగస్టు 1900 నుంచి) బెజవాడ ద్వారా వెళ్లేవి. ఈ పట్టణ ప్రజాజీవన గతిలో ఈ మెయిల్ ట్రైన్ పాత్ర ప్రత్యేకం. పొద్దున్నే 6:30 గంటలకు హౌరా మెయిల్ ఠీవిగా రావడం, ఆ హడావుడి చూడాలి. ఈ ట్రైన్ మద్రాసు నుంచి స్పెన్సర్ వాళ్ళ ఇంగ్లీషు డెయిలీ: ది మెయిల్-THEMAIL- వార్తలతో నింపుకొని ఉదయాన్నే ఆత్రంగా చూసే బెజవాడీయులకు అందచేసేది. మరికొన్ని దినపత్రికలను, ఉత్తరాల సంచులు తెచ్చేది మెయిల్ వచ్చింది. నిద్రలు చాలించి పనులు ప్రారంభించండి అంటూ పెద్దలు అదిలిస్తుంటే ఊరు చేతనావస్థలోకి అడుగు పెట్టేది. బెజవాడ రైల్వే స్టేషన్ విశ్వరూపం రాత్రిపూట చూడాలి. ట్యూబులైట్ల మిలమిలలు, జనసందోహ కోలాహలం, నిత్య చైతన్యానికి ప్రతీకగా కనుపించేవి. మద్రాస్ మెయిల్ రాత్రి 8:00 గం లకు కెనెడియన్ ఇంజన్‌తో తెల్ల స్టీమ్ పొగ చిమ్ముకుంటూ, సింహ గర్జన చేస్తూ ప్లాట్ ఫారము మీద దర్జాగా వస్తుంటే ప్రయాణీకుల ఉత్సుకత రెట్టింపు అయ్యి ఆతృతతో స్వాగతించేవారు. షుమారు 20 నిముషాలు ఆగడం వల్ల రుచికరమయిన డిన్నర్ కోసం IR Roomకు (ఇండియన్ రెస్టారెంట్ రూమ్)



గాంధి హిల్

ప్రయాణికులు పరగు తీసేవాళ్ళు. ఆ సమయంలో రైల్వే సిబ్బంది ఇంజన్ సర్వీసింగ్ చేసేవారు. పెద్ద ఏనుగు తొండం లాంటి పైప్ పెద్ద జలధార పోయగా ఇంజిన్ ట్యాంక్‌లో నీళ్ళు నింపేవారు. అక్కడే తట్టల్లో పేర్చబడిన రాక్షసి బొగ్గును ఏటవాలు చెక్కపై ఎక్కుతూ ఇంజన్ వెనక భాగంలో కూలీలు చకచక పోసేవారు. ఈ ప్రక్రియ 5 నిముషాలలో పూర్తి అయ్యేది. గార్డ్ పచ్చ జెండా ఊపడంతో ఘుప్ ఘుప్ మంటూ కృష్ణనది ముఖ్య రైల్వే బ్రిడ్జ్ వైపు ట్రైన్ నెమ్మదిగా కదిలేది. ఓ 20 నిముషాల ఈ సందడి పూర్తి అయ్యాక స్టేషన్ కొంత వెలవెల పోయేది.

తెలుగు చలన చిత్రాల పంపిణీలు ముఖ్యంగా బెజవాడ ద్వారా జరగడం వలన సినిమా డిస్ట్రిబ్యూటర్లు రైల్ ప్లాట్ ఫారం మీద వాళ్ళ సినిమాల స్టిల్ ఫొటోలను షో కేసులలో ట్యూబు లైట్ వెలుగులతో ప్రదర్శించేవారు. నడుస్తున్న, రాబోతున్న సినిమాల (10-12 అంగుళాల) బ్లాక్ అండ్ వైట్ పెద్దఫోటోలు (జైహింద్ స్టూడియో సత్యం గారి స్టిల్స్ ఏమో?) చూపరులను బాగా ఆకట్టుకొని ఆ సినిమాలను చూస్తున్న భ్రమ కలిగించేవి .

మద్రాసు మెయిల్ నిష్క్రమణంతో, ఆ రోజు పనులను ముగింపు చేసుకునే దిశగా పౌరులు దృష్టి సారించే వారు. ఒక స్తబ్దత ఆవరించేది. నగరం నిద్రావస్థలోకి మెల్లగా జారుకొనేది. నగర వాసుల జీవన గతిలో బెజవాడ రైల్వే స్టేషన్ ఒక విడదీయలేని అనుబంధం. ఇవీ 50వ దశక బెజవాడకు సంబంధించిన నా మధుర స్మృతులు. రైల్వే లైనుకు తూర్పు వైపు ఎదుగుతున్న ఆనాటి నవ్య విజయవాడ జ్ఞాపకాలను తరువాయి భాగంలో పంచు కొంటాను.

**రాయవరపు సత్యనారాయణ**
ముంబయి, ఫోన్ : 9391429717

ప్రథమ కమ్మ మహిళా సభలో

# జాస్తి సీతామహాలక్ష్మీ దేవి అధ్యక్షోపన్యాసం

– డాక్టర్ షేఖ్ మహబూబ్ బాషా

**స్త్రీలు వెనుకపడుట దేశము వెనుకపడుటే :** మానవశ్రేష్ఠు డనదగిన గాంధి మహాత్ముడు చెప్పినటులు "దేశమునందు సగము ప్రజలు అధోగతియందున్నప్పుడు యేదేశమును వృద్ధికి రానేరదు." సగము ప్రజలు అనగా స్త్రీలు అని అర్థము. మన దేశమునందు, అందు ముఖ్యముగా మన సంఘమునందు (కమ్మ సంఘము) స్త్రీలు, ప్రతి విషయమునందును వెనుబడియున్నారు. విద్యయందేమి, నాగరికతయందేమి, తదితర విషయము లందేమి అనేక మడుంగులు వెనుకబడియున్నారు. మన సంఘము ధనముగలదైనప్పటికిని, ముఖ్య విషయములం దిటులు వెనుకబడియుండుట మిగుల శోచనీయము. కనుక మన స్త్రీ సంఘము కూడ పై విషయములందు అభివృద్ధి చెందునటులు చేయుటయే ఈ మహాసభ యొక్క ఉద్దేశ్యమైయున్నది.

**దేశములో స్త్రీ విద్య హెచ్చవలెను :** హిందూ దేశమునందు విద్యాభివృద్ధిని గురించి విచారణ నల్పుటకు యేర్పరుపబడిన 'హార్టాగ్ కమిటీ' వారు స్త్రీవిద్యను గురించి ఆలోచించుచు, స్త్రీవిద్య చాల వెనుకబడియున్నదనియు, దానిని వృద్ధి చేయుటకు గవర్నమెంటువారు తగు చర్య తీసికొనవలెననియు సలహానిచ్చియున్నారు. ప్రతి గ్రామమునందు బాలికలెల్లరు బాలురతో పాఠశాలలకు పంపబడవలయును. కొన్ని గ్రామములందు ప్రత్యేకమగు బాలికా పాఠశాలలు లేకపోయినను, బాలుర పాఠశాలలకే బాలికలను పంపవలయును. ఇందు తప్పేమియులేదు. ముఖ్యముగా ప్రాథమిక పాఠశాలలయందు బాలురును, బాలికలును కలిసియే చదువవలసియున్నది. ప్రతి తల్లియును తన కుమార్తెను పాఠశాలకు పంపుట తన విద్యుక్తధర్మమని యెంచవలెను. వారలట్లు చేయని యెడల, తమ బాలికల భవిష్యత్తును పాడు చేసిన వారగుదురు. కొంత మంది స్త్రీలు తమ బాలికలు ఇంటిలో నున్నయెడల తమకు గృహకృత్యములందు సహాయము చేయుదురను ఉద్దేశముతో బాలికలను పాఠశాలకు పంపక, వారి భవిష్యత్తును పాడు చేయుచున్నారు. బాలికలను ఇంటివద్ద నుంచుట వలన తాత్కాలికముగా తల్లికి కొంచెము సహాయము కలిగినను, బాలికలకు తీరరాని నష్టము కలుగును. బాలికలు పాఠశాలకు వెళ్లుచుండియు, పాఠశాల లేని సమయములయందు ఇంటి దగ్గర తల్లికి సహాయము చేయుచునే యుండవచ్చును. కనుక ప్రతి స్త్రీయును కనీసం ప్రాథమిక విద్యనైనను తమ బాలికలకు చెప్పింప వలయునని నా ప్రార్థన.

**స్త్రీలకు ఉన్నత విద్య కావలయును :** స్త్రీలకు ఉన్నతవిద్య కూడ ముఖ్యావసరమని చెప్పక తప్పదు. ముఖ్యముగా వైద్యవిద్య యందును, ఉపాధ్యాయ పదవులందును ఉన్నత విద్య అత్యవసరమై యున్నది. మన దేశమునందు స్త్రీ డాక్టర్లు చాల కొలదిగనున్నారు. మన సంఘమునందే స్త్రీలకు అనేక విషయములందు వైద్య సహాయమునకు ప్రతి దినము వెళ్ళుచుండుట తెలియచేయుచున్నది. స్త్రీలు స్త్రీ వైద్యుల సహాయము దాపున లేనందున పురుషులకు చెప్ప వెరచియు, పురుష వైద్యుల సహాయము లేనందు వలన కొంతమంది ప్రసవ సమయములందు ప్రాణము లను కూడ కోల్పోవుచున్నారు. కనుక సోదరీమణులారా! వీలైన ప్రతివారును తమ బాలికలను సాధ్యమైనంతవరకు వైద్యవిద్యకు పంపి, స్త్రీ వైద్యులను తయారు చేయవలయును. అదియునుగాక స్త్రీల పాఠశాలలు, కళాశాలలు వృద్ధి అయిన కొలదియు ఉపాధ్యాయినులు చాలమంది కావలసి యుందురు. కనుక స్త్రీలు వీలైనవారు తమ బాలికలను ప్రాథమిక విద్యతోనే మాన్పించక, కళాశాలలకు కూడ పంపి, ఉన్నతవిద్య చెప్పించి, ఉపాధ్యాయినులను తయారు చేయవలయునని నా ప్రార్థన. ఇందుకు కమ్మ మహా సంఘము వారు తోడ్పడి, బీదలైన వారికి విద్యార్థి వేతనము లిచ్చి ప్రోత్సహించవలెనని మనము వారిని కోరవలయును.

స్త్రీ విద్యను వృద్ధి చేయు విషయములో ఒక విషయము మన మందరము గమనింప వలయును. అది యేమనగా వార్తాపత్రికలు చదువుట. ప్రతి దినము వార్తాపత్రికలు చదువుట వలన మనము విద్యను, ప్రపంచ జ్ఞానము వృద్ధి చేసికొనగలము; కనుక, స్త్రీలందరు మధ్యాహ్నము పని లేని సమయములందు ఒకటే గుమిగూడి పనికిమాలిన సంభాషణలచే కాలమును వృథా పుచ్చక ఆంధ్రపత్రిక, ప్రజామిత్ర, భారతి, గృహలక్ష్మి మొదలగు వార్తా పత్రికలను చదివి, లోకజ్ఞానమును వృద్ధి చేసుకొనవలెను. వార్తాపత్రికలను చదువుటయే సగము విద్య నేర్చుటయగును.

**స్త్రీలు : గృహపరిశ్రమలు :** ప్రతి స్త్రీయును గృహపరిశ్రమ లను గురించి బహు శ్రద్ధ వహించవలెను. గృహ పరిశ్రమలనగా కుట్టుపని, రాటము మీద నూలుదీయుట, అల్లిక, పేముపని మొదలుగా గలవి. ఇట్టి పరిశ్రమల వలన కుటుంబము యొక్క ఆర్థికము బాగుపడును. కుటుంబము యొక్క ఖర్చులు తగ్గించుకొనుటయే గాక, గృహ ఆదాయమును గూడ వృద్ధి చేసు కొనవచ్చును. సాధారణముగా మన స్త్రీలకు ఉదయ సాయంకాలములు గృహపనులుండి, మధ్యాహ్న సమయ మందు తీరికగా నుండెదరు. అట్టి తీరిక సమయము లను గృహ పరిశ్రమలకు ఉపయోగ పరచిన కుటుంబ వృద్ధికి తోడ్పడుదురు. చీనా, జపాను యూరపు దేశములలో స్త్రీలు చాల మంది ఇట్టి గృహపరిశ్రమలచే కుటుంబ పోషణ చేసుకొనుచున్నారు. ప్రతి దినము మనము జపాను మొదలగు విదేశ వస్తువులను, వస్త్రములను కొనుచున్నాము. అట్టివి మానివేసి, మన స్వదేశీ వస్త్రములను కొనుటకు దీక్షబట్టి మనదేశములందు గృహపరిశ్రమలను వృద్ధి చేయుటకు తోడ్పడిన యెడల, మన సంఘము కూడా వృద్ధికి రాగలదు.

**ఆరోగ్యము – శిశుపోషణము :** మనమిక గృహకృత్యము లను గురించియు, గృహ ఆరోగ్యమును గురించియు ఆలోచించవలయును. ఎంత భాగ్యవంతమైన కుటుంబ మయినను, గృహము సలక్షణముగా నుండని యెడల, సౌఖ్యముండనేరదు. గృహము యొక్క సౌభాగ్యము, అందము, గృహిణి మీదనే ఆధారపడి యున్నది. గృహమును స్వర్గతుల్యముగ చేసినను, కష్టములపాలు చేసినను, గృహిణిదే బాధ్యత కనుక కుటుంబమునందు ప్రతి స్త్రీయును తన యొక్క విధులను క్రమముగా నెరవేర్చి, గృహమును ఆరోగ్యముగను, సంతోషదాయకముగను ఉంచవలెను. ఎటువంటి భాగ్యవంతురాలైనను సోమరితన ముండగూడదు. సోమరితనము వలన గృహము అల్లరిగా నుండుటయేగాక స్త్రీలకు ఆరోగ్యము కూడ చెడును. స్త్రీలు ఎల్లప్పుడును గృహమునందే ఉండువారు గనుక, వారు గృహకృత్యములను స్వయముగా నెరవేర్చి శరీర కష్టమును చేయని యెడల వారికి వేరే విధముగా శరీరమును ఆరోగ్య ప్రదముగా నుంచుకొనుటకు అవకాశముండనేరదు. శిశువును పోషించు బాధ్యత ముఖ్యముగా తల్లిదై యున్నది. శిశువుల ఆరోగ్యము తల్లి తగు జాగ్రత్తగా కనిపెట్టి యుండవలెను. శిశువులను దాదులకు వదలి, వారిని అనారోగ్యవంతులనుగా చేయక, తల్లులు స్వయముగా బిడ్డలను ఆదరింపవలెను.



జాస్తి సీతామహాలక్ష్మీ దేవి

ఇక మన సంఘమునందలి దురాచారములను గురించి ఆలోచించవలసి యున్నది. పెండ్లిండ్ల యందును, శుభకార్యముల యందును, మనవారలు చేయు దుర్వ్యయమునకు అంతులేదు. ఇట్టి ఖర్చుల వలన అనేక కుటుంబములు పాడయినట్లు మనము కన్నులార గాంచుచున్నాము. ఇట్టి ఖర్చులకు ముఖ్యముగా స్త్రీలే ప్రోత్సాహకులై యున్నారు. స్త్రీలు కష్టసుఖములను గ్రహించి, అట్టి ఖర్చులను తగ్గునట్లు చేయవలెను.

**ఘోషా పద్ధతి :** పూర్వకాలము హిందువులందును ఘోషా ఉన్నట్లు కనిపించదు. మధ్య మహమ్మదీయ కాలములో ఆ కాల పరిస్థితులను బట్టి ఘోషా పద్ధతి యేర్పడినది. అట్టి కాల పరిస్థితులు ఇపుడేమియు లేవు. కనుక ఘోషా పద్ధతి అనవసరము. దీనిని నిర్మూలించవలసిన బాధ్యత మన స్త్రీలలోనే యున్నది. ఘోషాను తీసివేయుట అనగా,

కట్టుబాటు లేక పెద్దలనతిక్రమించి సంచరించుట కాదని గ్రహింపగోరెదను. ఇది వరకు ఘోషా ఎక్కువగానున్న గొప్ప మహమ్మదీయ రాజ కుటుంబములగు 'నిజాము' గారి కుటుంబమునందును, తురుష్క దేశమగు టర్కీ దేశమందు కెమల్ పాషా గారి పరిపాలనమునందును, ఘోషా తీసివేయబడినది. ఘోషా ఎక్కువగానున్న ఉత్తర హిందూస్థానమందును ఇపుడు ఘోషా తీసివేయ బడుచున్నది. ఈ విషయమును ప్రత్యక్షముగ నేను కాశీ విశ్వవిద్యాలయమునందు (బనారస్ హిందూ యూనివర్సిటీ) చదువుచున్నప్పుడు తెలిసికొనగలిగితిని. అదియునుగాక, మన తెలుగుదేశమునందు జమీందారీ కుటుంబములందు కూడ ఘోషా పద్ధతి రానురాను తగ్గిపోవుచున్నది. అట్టితరి మన సంఘములో మాత్రము ఘోషా ఎందుకుండవలయును? మన సంఘమున గూడ, దక్షిణ జిల్లాల యందును; నెల్లూరు, చిత్తూరు జిల్లాల యందును, ఘోషా లేదు. నాగరికత గల మన మాగాణి ప్రదేశములందు మాత్రము ఇది కాన్పించుచున్నది. మనలను పాలించు బ్రిటిషు ప్రజలయందు యెట్టి కుటుంబములందును గూడ ఘోషా లేదు. బ్రిటిషు ప్రజలందే గాదు, ప్రపంచమునందు ఖ్యాతిగాంచిన యే యూరోపియను జాతియందును ఘోషా లేదు. ఇది యది యననేల? మన హిందువులందు కొన్ని కుటుంబము లందును, మహ్మదీయులయందు కొన్ని కుటుంబము లందును దక్క ప్రపంచమున మరెక్కడును ఘోషా లేదు. ఘోషా లేని ప్రజల కన్నను మనము యెవ్విధమునను ఉన్నతస్థితి యందులేము. ఘోషా పద్ధతి అనాగరక పద్ధతియై యున్నది.

**అంటరానితనము :** మన హిందూ సంఘమునందు "అంటరానితనము" మిక్కిలి అవమానకరమగు మచ్చగా నున్నది. ఇట్టి అంటరానితనము హిందూ సంఘమునందు దక్క, ప్రపంచమునందేమతమునందును, ఎచ్చటను గాన్పించదు. "అంటరానితనము" మన కమ్మ సంఘమునకు మిక్కిలి హానికరమును, నష్టదాయకమునై యున్నది. ఎందుచేతనన మన సంఘము ముఖ్యముగా వ్యవసాయ వృత్తి నవలంబించియున్నది గనుక వ్యవసాయపు పనులందు హరిజనులతో మనకెక్కువ సంబంధము గలదు. అంటరానివారగు "మాలలు", "మాదిగలు" ముఖ్యముగ మన సంఘము యొక్క అభివృద్ధికి మూలాధారమై యున్నారు. వారలు లేనిదే మన వృత్తి పనులలో నొకటైనను, ఒక దినమైనను కొనసాగదు. అట్లు మనకు సహాయభూతులుగ నున్న నిమ్నజాతులను ఆదరించి, అభివృద్ధికి దీసికొని వచ్చు బాధ్యత మనమీద నున్నది. నిమ్నజాతుల శ్రేయము, అభివృద్ధి, మన యొక్క అభివృద్ధికి సహాయపడును. అదియును గాక, వారిని మన హిందూ సంఘము నుండి విడదీసి వేరుగ బెట్టిన యెడల, హిందూ మతమునకు ప్రబలమగు హాని కలుగును. నిమ్నజాతుల వారు అనేకమంది ఇప్పటికే అన్య మతములగు క్రిష్టియను మతమును, మహమ్మదీయ మతమును స్వీకరించి యున్నారు. మన మతములోని వారిని మన అనాదరణ వలన బోగొట్టుకొనుటకంటె వారిని ఆదరించి, బాగుచేసి, మన మతములో నైక్యము జేసికొనుట మన మతమునకు ముఖ్యావసరమై యున్నది. అంటరానితనము తీసివేయు విషయములో మనవారలు కొంతమంది కృషి సల్పుచున్నప్పటికిని, సాధారణముగా పూర్వాచార పరాయణులగు స్త్రీలు ఇంకను అందుకు తోడ్పడుటలేదు. మనము ఏనాది, ఎరుకు, లంబాడి మొదలగు అనాగరక జాతులను మన యిండ్ల యందు తిరిగి, మనతో కలిసిమెలిసి పనిపాటలు చేయనిచ్చుచున్నాము. కాని మాల మాదిగ జాతులను మాత్రము అంటరానివారలుగా చూచుచున్నాము. ఇది యెంతయు అన్యాయము. మాల, మాదిగలు పైజెప్పబడిన జాతులకన్నను పరిశుభ్రత యందును, నడత యందును యెంతయో బాగుగనున్నారు. అయినను వారలను అంటరానివారలుగ చూచుచున్నాము. వారిని దేవాలయములకును, ఉత్సవములకును, పాఠశాలలకును రానిచ్చి, ఆదరించి, మన సంఘము నందు జేరునట్లు జేయవలయును. మన గ్రామములందు చెరువులకు నీళ్ల కొరకు అనాగరిక జాతులను ఎరుకు, ఏనాది, లంబాడి మొదలగు వారిని రానిచ్చెదరు గాని, హరిజనులను చెరువు చెంతకైనను నడువనివ్వరు. కనీసము కుక్కలను, జంతువులను, పందులను, చెరువులందు నీళ్లు ముట్ట నిచ్చెదరు గాని, సోదరమానవులగు హరిజనులను ముట్టనివ్వరు. కుక్కలు మొదలగు జంతువులను తాకెదరు గాని, హరిజనులను పొరపాటున తాకిన, ఆ పాపము పోవునందుకు స్నానములను, ప్రాయశ్చిత్తములను చేయుదురు. మానవులలో కొందరిని ఇట్లు చూచుట వలన మనము మన మానవత్వమును నిందించుకొనుట కాదా? గాంధిమహాత్ముడు బీహారు భూకంపమునకు కారణము మన సనాతనులు హరిజనులకు తరతరములనుండియు చేయుచున్న పాపమునకు, అక్రమమునకు ఫలితమని

చెప్పుచున్నారు. బీహారు భూకంపమునకు కారణము మనము హరిజనులకు జేసిన పాపము అయినను కాకపోయినను, మన సవర్ణ హిందువులు వారికి అనేక శతాబ్దముల నుండియు చేయుచున్న అక్రమమును మహాపాపమని ఒప్పుకొనక తప్పదు. పాపభూయిష్టమగు నాయాచారము ఎంత త్వరలో తొలగించిన అంత మంచిది.

**ఇతర సంఘములతో మైత్రి :** సోదరీమణులారా! ఇంక మన సంఘము ఇతర సంఘములతో ఎట్లు కలిసిమెలసి యుండి, సమరసభావముతో మెలంగవలసినది రెండు మాటలు చెప్పి ముగించెదను. మన సంఘమును మనము శక్తి కొలది వృద్ధి చేసికొనవచ్చును. కాని యితర సంఘముల యెడ ఈర్ష్యభావముతోను, ద్వేషముతోను ఉండగూడదు. ఇతర సంఘములతో చిన్నవారైనను, పెద్దవారైనను ఎల్లప్పుడును కలసిమెలసి యుండి, వారి కష్టసుఖములను మనవిగ నెంచుకొనవలయును. వీలైన యెడల, మన సంఘమువారు ఇతర సంఘములకు గూడ సహాయము చేయుచుండవలయును. ఏ సంఘమైనను, ఎంత గొప్పదియైనను, ఇతర సోదర సంఘములతో నేమాత్రమును సహకారము లేక వేరుగానుండుట దుర్లభము. అన్ని సంఘములును గలసి దేశ క్షేమమును, దేశాభివృద్ధిని తమ లక్ష్యముగా నుంచుకొనవలయును.

- - - -

(ఈ పునర్ముద్రిత వ్యాసం 1934 ఏప్రిల్ 27న కృష్ణా జిల్లా తెన్నేరులో జరిగిన 'ప్రథమ కమ్మ మహిళా సభ'కు అధ్యక్షత వహించిన శ్రీమతి జాస్తి సీతామహాలక్ష్మీదేవి చేసిన ప్రసంగ పాఠం. ఇది ప్రముఖ స్త్రీల పత్రిక అయిన గృహలక్ష్మి లో 'సభలు' శీర్షికన 1934 అక్టోబరు సంచికలో ప్రచురించబడింది (పు. 303-308).

20వ శతాబ్ది తొలి దశకాల్లో ఆంధ్ర ప్రాంతంలోని బ్రాహ్మణేతరుల్లో వెల్లివిరిసిన సామాజిక చైతన్యం వల్ల అనేక బ్రాహ్మణేతర కుల సంఘాలు యేర్పడ్డాయి. 'విశ్వకర్మ కులోద్ధరణ సంఘం' (1903), 'ఆర్య వైశ్య మహాసభ' (1907), 'గౌడ సంఘం' (1907), 'కమ్మ మహాజన సభ' (1910), 'నాయుడు సంఘం' (1910), 'రెడ్డి మహాజన సంఘం' (1913) మొదలైనవి వీటిలో కొన్ని. తమ-తమ కులాలకు చెందిన ప్రజల్ని సంఘటిత పరచడం, తమ సంఘాల్ని సంస్కరించి మెరుగు పరచుకోవడం ద్వారా సామాజిక జీవితాన్ని మరింత ప్రజాస్వామీకరించే లక్ష్యంతో యేర్పడ్డ ఈ సంఘాలు, స్త్రీల అభివృద్ధిపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి. 19వ శతాబ్ది సంఘ సంస్కరణోద్యమ అంశాలైన స్త్రీ విద్యను ప్రోత్సహించడం, బాల్య వివాహాలనూ, వృద్ధ వివాహాలనూ నిరసించడం, వరకట్న దురాచారాన్ని ఖండించడం మొదలైన మహిళాభివృద్ధి కార్యక్రమాల్ని చేపట్టాయి. ఒక ఉదాహరణ ద్వారా ఈ విషయాన్ని మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. ఆ ఉదాహరణను కమ్మ సంఘం నుండే తీసుకుందాం.

ఐదవ 'కమ్మ మహాజన సభ' 1916లో కోవెలమూడి గోపాలకృష్ణయ్య అధ్యక్షతన గుడివాడలో జరిగింది. దీని ఆహ్వాన సంఘాధ్యక్షులైన లింగం నాగభూషణం తన 'స్వాగతోపన్యాసము'లో కమ్మకుల ప్రజల అభివృద్ధికి చెందిన అనేక అంశాలను ప్రస్తావించారు. కమ్మవారి పరిస్థితి "అంగటి యందన్ని యున్నవి, అల్లుని నోట శని యున్నది" అన్నట్లుగా వుందని బాధపడ్డారు. ఈ బాధ వంద సంవత్సరాల క్రితం నాటి కమ్మ ప్రజల స్థితిని స్పష్టంగా వివరించేదిగా వుంది కాబట్టి, ఆయన మాటల్లోనే చూద్దాం మనమురి ఎంత శ్రమపడిననేమి! ఎంత ధనార్జన జేసిన నేమి! "చీమలు పెట్టిన పుట్టలు" అను పద్యము మనవారికే చెప్పబడినట్లు కనపడుచున్నది. మన శ్రమ పొలములందును, మన ధనము దుర్వ్యాజ్యము లందును (ఎడతెగని కోర్టు కేసులు) దాగుచున్నది. మన కష్టార్జితమును న్యాయవాదులు, ప్రత్యేక న్యాయవాదులు, న్యాయస్థానములు హరించుచున్నవి. ఇందుకు విద్యావిహీనత్వమే ప్రధాన కారణమై యున్నది. మన వారిలో నూటికిర్వులు వ్రాయను చదువను నేర్చినవారు కలరు. దీనిని బట్టి విద్యాభివృద్ధి యందు మనమెంత వెనుకబడియున్నామో వ్యక్తపడుచున్నది. కాని నానాటికి అభివృద్ధి జెందుచున్నట్లగపడుచున్నదని హర్షింపవలసి యున్నది. కాని యితర సంఘములతో పోల్చి చూచిన దివ్విటీ క్రింద దీపము మాడ్కినున్నాము. ఈ గతి మనకేల పట్టవలెను? ద్రవ్యము లేకనా? కాదు. పాఠశాలలు లేకనా? కాదు. ఉదార స్వభావులు లేకనా? కాదు. పురుషకార్యము లేక, యుద్బోధకులు లేక, మార్గదర్శకులు లేక, సత్కార్యోత్సాహము లేకయై యున్నది." (*అయిదవ కమ్మ మహాజన సభ, గుడివాడ: ఆహ్వాన సంఘాధ్యక్షులగు లింగం నాగభూషణం గారి స్వాగతోపన్యాసము*, వాణీ ముద్రాక్షరశాల, బెజవాడ, 1916, పు. 4-5).

నాగభూషణం కన్యాశుల్క దురాచారం "మనలో లేనే లేదని" ప్రస్తావిస్తూ, వరకట్న దురాచారాన్ని తీవ్రంగా నిందించారు. అది "మన సంఘ శరీర రక్తమును పీల్చి పిప్పి జేయుచున్నది" అని తీవ్ర ఆవేదనతో ప్రకటించారు. వేదికలెక్కి వరకట్నాలకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు దంచి, వ్యక్తిగత జీవితాల్లో దానికి పూర్తి విరుద్ధంగా ప్రవర్తించే స్వయం ప్రకటిత 'సంస్కర్తల' ప్రవర్తన "శోచనీయము"గా, "లజ్జాకరము"ముగా వుందని ఈసడించారు (పైదే., పు. 7). బాల్య వివాహాలకూ, వరకట్నానికీ ఉన్న సంబంధాన్ని పట్టుకోగలగడం నాగభూషణం గారి విశిష్టత. బాల్య వివాహములు నానాట ప్రబలుచున్నవి. వివాహ విపణి వీధులకు బోయి చూచెదమేని పెండ్లి కుమారుల ధరలు చిన్నతనములోనే పెచ్చు పెరుగుచున్నవి. అందుచే కన్యలకు యుక్త వయస్సు ప్రాప్తించువరకుండినచో ద్వితీయ వివాహవరులకు కట్టిపెట్టవలసి వచ్చుచున్నది. అందుచే పోటాపోటీని బాల్యమునందే వివాహములను జరుపుటకు హేతువగుచున్నది. కాన దీనికి మూల సూత్రమగు వరశుల్క నాశనమైన గాని బాల్య వివాహములు తగ్గనేరవు" అని ఆయన విశ్లేషించారు (పు. పైదే., పు. 7). కాబట్టి కమ్మ సంఘ ప్రముఖులు పూనుకొని యువకులకు ఈ విషయంలో చైతన్యం కలిగించాలని కోరారు. "ధనమునే ప్రధానముగ భావించి" పసిపిల్లల్ని ముసలి దయ్యములకిచ్చి పెళ్ళిచేసి, వాళ్ళ గొంతులు కోసేస్తున్నారనీ, ఈ దుష్టపద్ధతిని మాన్పించడానికి సంఘ ప్రముఖులు "గొప్ప ప్రయత్నము" చేయాలన్నారు (పైదే., పు. 7).

అలాగే, సభకు అధ్యక్షత వహించిన కోవెలమూడి గోపాలకృష్ణయ్య కూడా మహిళాభివృద్ధి సహా కమ్మవారి అభివృద్ధికి సంబంధించిన అనేక విషయాల్ని చర్చించారు. విద్యావిహీతను "వేరు పురుగు"తో పోల్చిన గోపాల కృష్ణయ్య, కమ్మ సంఘానికి ఆధునిక విద్య ఎంత అవసరమో వివరిస్తూ "మన సంఘమునందలి విద్యా లోపము జగద్వితము. ఏ సంఘమైనను, యితర నాగరికత జెందిన సంఘములతో పోటీకి నిలబడవలెనన్న ప్రప్రథమమున విద్యనభ్యసించవలెను. విద్యవలన మనో వికాసము హెచ్చై బుద్ధి ప్రజ్వరిల్లి సాంఘికార్థికభివృద్ధులకు అవకాశమిచ్చును" అని ఉద్బోధించారు (*అయిదవ కమ్మ మహాజన సభ, అగ్రాసనాధిపతిగారగు శ్రీయుత కోవెలమూడి గోపాలకృష్ణయ్య గారి ప్రారంభోపన్యాసము, గుడివాడ, 25.4.1916*, వాణీ ముద్రాక్షరశాల, బెజవాడ పు. 5). స్త్రీ విద్యావశ్యకతను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "విద్య పురుషునికంటె స్త్రీకి యెక్కువ అవసరమని నా యభిప్రాయము'' అని స్త్రీ విద్య వల్ల కలిగే అనేక ప్రయోజనాల్ని వివరించారు (పైదే., పు. 7). కమ్మవారి ఘన చరిత్రను గుర్తు చేసిన గోపాలకృష్ణయ్య, ఒకప్పుడు కమ్మ సంఘం "శూరత్వమునకును, పౌరుషమునకును, దేహదార్ఢ్యమునకును" ప్రసిద్ధిగాంచి వుండిందనీ; కానీ, అందులో ప్రవేశించిన అతిబాల్య, అతి వృద్ధ వివాహాలూ; "అతి బాల్య పునస్సంధానము"; "మన సంఘమునందు నూతనముగ వ్యాపించి వేరు పారుచున్న కన్యావర శుల్కములు" మొదలైన సాంఘిక దురాచారాలు నిర్వీర్యం చేస్తున్నాయనీ; కాబట్టి, వాటిని త్వరగా వదిలించుకోవాలనీ ప్రార్థించారు (పైదే., పు. 14). మరీ ముఖ్యంగా, పేదరికం కారణంగా చదువుకోలేకపోతున్న కమ్మ బాలబాలికలకు సహాయం చేయడానికి యేర్పడిన నిధికి సహాయపడమని పిలుపునిస్తూ, ఇలా అన్నారు : "మన సంఘమునకు శాశ్వతనిధి నొకదాని నేర్పరచుటయు, యకరమునకు యేటేట 3 పైసలు మొదలు అణా వరకు చందాయును, నింక నితరాదాయముల మీదను, వివాహాది శుభ కార్యములప్పుడు కట్నముల రూపముగను సొమ్ము వసూలు చేయునట్లు తీర్మానములు జరిగియుండుట మీకెల్లరకు దెలిసిన విషయమే. ఇప్పుడు ముఖ్యముగ మనమాలోచించు విషయములలో ప్రధానమయినదిదియే. తక్కిన హంశములను గూర్చిన మాటలు పొడిమాటలు; దీనిని గూర్చినవి తడి మాటలు. ధనము లేని దెన్నిమాటలు మాట్లాడినను నవియెల్ల వృధాయగును అనవసరమగు వెయ్యి మాటల కంటె నొక రూప్యము సంఘ నిధికి చేర్చుట మెరుగు. సోదరులారా! మన కార్యనిర్వాహక సంఘపు వారికి మనలో పేద బాలుర వద్ద నుండి విద్య నిమిత్తము ద్రవ్యసహాయము చేయుమని యన్ని అర్జీలు వచ్చి నిల్వయుండినవో చూడుడు!" (పైదే., పు. 15). చిత్తూరు జిల్లాలోని రెడ్ల సంఘ నిధికి "వేలకొలది సొమ్ము'' సమకూరిందని తెలియజేస్తూ, మిగిలిన దానాల్ని మానుకోనైనా సరే విద్యాదానం కోసం కమ్మసంఘనిధికి చందాలివ్వండని కోరారు. "తన్నుమాలిన ధర్మమును మొదలు చెడ్డ బేరమును" లేవను సూక్తిని గుర్తు చేసి, కమ్మ సంఘ నిధికి తొలి ప్రాధాన్యం యివ్వమని ప్రార్థించారు (పైదే., పు. 16).

ఈ విధంగా, కమ్మ మహాసభల ద్వారా స్త్రీ విద్యాభివృద్ధికీ, తద్వారా సంఘ సంస్కరణకూ పురుషుల నాయకత్వంలో తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న సందర్భంలో–దాదాపు యిదే కాలంలో, అంటే 1916 గుడివాడ మహాసభల కాలంలో–స్త్రీల పత్రిక అయిన *హిందూసుందరి*లో, 1914 డిసెంబరు సంచికలో (పు. 4–8), ఒక అత్యంత ఆసక్తికరమైన వ్యాసం ప్రచురించ బడింది. హిందూసుందరి ప్రారంభమై నప్పటినుంచీ (ఏప్రిల్ 1902) దానికి చందాదారురాలుగా వున్న ఒక స్త్రీ, 'ఒక కమ్మ యువతి' అనే మారుపేరుతో "కమ్మ సోదరులకొక విన్నపము'' శీర్షికన చిన్నఅక్షరాల్లో ఐదు పుటలకు విస్తరించిన ఒక వ్యాసం ప్రచురించారు. కృష్ణా జిల్లాలోని భట్ల పెనుమర్రు, అంగలూరు, గురజ మొదలైన ప్రాంతాల్లో బాలికల విద్యాభివృద్ధి కోసం "మా కమ్మ సోదరులు కొందరు'' పని చేస్తుండడం చూసి తనకు ఆశ్చర్యం కలుగుతోందనీ; కానీ, తానలా ఆశ్చర్యపోవడంలో వింతేమీ లేదనీ అన్నారు. ఎందుకంటే: "పురుష విద్యలేని మా కమ్మ వర్ణమున స్త్రీ విద్య యెంత రాణించునో చదువరులే గ్రహించగలరు. పెక్కు గ్రామములలో బాలురు పఠించుటకే పాఠశాలలు లేక ధనికుల బాలురు సహితము సోమరులై తిరుగుచుండగా అట్టి లోపములను మా సోదరులు గమనించక బాలికల విద్యకై పాటు పడుచుండుట చూడ కడు శోచనీయము'' అన్నారు. ''సోదరులారా! మీ పుత్రులకు, మీ సోదరులకు లేని విద్య మీ పుత్రికలకు, మీ సోదరీమణులకు కలిగిన లాభమేమి?'' అని ప్రశ్నించారు. ఇలా ప్రశ్నించారంటే, ఆమె స్త్రీ విద్యను వ్యతిరేకించారని కాదు (ఆమె మాటల్లో: "స్త్రీ విద్య కూడదని నాయభిప్రాయం కాదు."). పురుషుల్లో విద్య, విజ్ఞానం బాగా పెరిగితేనేకాని స్త్రీ విద్యకు ప్రత్యేకంగా ప్రయోజనం చేకూరదని ఆమె వాదించిన తీరు చాలా ప్రశంసనీయంగా వుంది. "మీరు విద్యావంతులు కాని యీ స్థితిలో మీ బాలికల విద్య మాత్రం యెంత వరకు వృద్ధిశాయగలరు?"; "విద్యావతియైన స్త్రీకి ...(విద్యా విహీనుడై) మూర్ఖశిరోమణియైన భర్త వలన యెంత ఖేదము కలుగునో చదువరులు వూహించవలెనె కాని వ్రాయ శక్యము కాదు" మొదలైన సూటి వాక్యాలతో పూర్తిగా అనుభవం, సూక్ష్మ పరిశీలనలతో రాసిన ఈ శక్తివంతమైన వ్యాసంలోని విషయాలు ప్రత్యేకంగా చర్చించాల్సినవి కాబట్టి యిక్కడ విస్తారంగా చెప్పడం లేదు. స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ సంఘ సంస్కరణోద్యమ సాహిత్యాన్ని సృష్టించిన పురుషులంతా తమకు "చదువుకున్న భార్యలు కావాలి" అని వాదిస్తున్న చారిత్రక సందర్భంలో, ఒక స్త్రీ "మాకు చదువుకున్న, సంస్కారవంతులైన భర్తలు కావాలి" అని నిర్భయంగా వాదించడం ఎంతో విశిష్టమైన ఆలోచన కాబట్టి ఈ వ్యాసాన్ని "ప్రత్యేకంగా" చర్చించాలంటున్నాను. ఈ వ్యాసం ఆమె మొట్టమొదటి రచన అని తెలిస్తే తప్పకుండా ఆశ్చర్యం కలుగుతుంది (కొంత పక్కకి: దీన్ని 'కమ్మ యువతి' పేరుతో ఒక పురుషుడు రాసి వుండొచ్చు కదా అని కొందరికి అనుమానం కలగవచ్చు. అలా కొంత మంది మగవాళ్ళు స్త్రీల పేర్లతో రాసేవారు కూడా! కానీ, ఈ వ్యాసం ప్రచురితమయ్యే నాటికి చాలా మంది చదువుకున్న కమ్మ స్త్రీలు రచయితలుగా ఎదిగి వచ్చారు. ప్రారంభంలో కొంత మంది తమ సొంత పేర్లతో పత్రికల్లో రాయడానికి జంకేవారు. అంతేకాని, మారు పేర్లతో రాసినవన్నీ పురుషపుంగవుల రచనలు ఎంత మాత్రం కాదు)

ఏది ఏమైనప్పటికీ, జాస్తి సీతామహాలక్ష్మీ దేవి తన అధ్యక్షోపన్యాసంలో వ్యక్తపరచిన భావాల్ని సంఘ సంస్కరణోద్యమం, మహిళోద్యమం, జాతీయోద్యమం కలుగజేసిన ప్రభావాలతో పాటు 20వ శతాబ్ది తొలి దశకాల్లో కమ్మ సంఘంలో ప్రారంభమైన సామాజిక చైతన్యాభివృద్ధి క్రమంలో కూడా అర్థం చేసుకోవాలి. సీతామహాక్ష్మీ దేవి జీవిత విశేషాలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించడానికి నేను చేస్తున్న ప్రయత్నాలు యింకా సఫలీకృతం కాకపోవడం వల్ల, కేవలం రెండు ఆధారాల్లో దొరికిన కొంత సమాచారాన్ని మాత్రమే యిక్కడ యివ్వగలుగుతున్నాను. ఆమె అధ్యక్షోపన్యాసాన్ని ప్రచురించిన *గృహలక్ష్మి*లో ఆమెకు సంబంధించి కొంత సమాచారం వుంది. 1929 అక్టోబరు సంచికలో ఆమె ఛాయాచిత్రాన్ని ప్రచురించడంతో పాటు, ఆమె గూర్చి ఇలా రాశారు: "ఈమె చెన్నపురిలో న్యాయవాదవృత్తి నవలంబించి యున్న శ్రీయుత జాస్తి సాంబశివరావు గారి (బి.యే. బి.యల్.) పత్ని. శ్రీయుత సూరపనేని వెంకయ్య చౌదరి గారి జ్యేష్ఠ పుత్రిక. ఈమె చెన్నపురిలో మేరీ రాణి కళాశాలలో ఇంటరుమీడియేటు తరగతిలో చదువుచున్నది. చెన్నపురి కమ్మ విద్యార్థి సంఘమునకు సంయుక్త కార్యదర్శినిగ ఇటీవల ఎన్నుకొన బడినది. కమ్మ కులములో కళాశాల యందు విద్య నభ్యసించుచున్న వనితామణి ఈమె యొక్కతియే" (పు. 681). (మీరు చూస్తున్న ఆమె ఫోటో *గృహలక్ష్మి* లోనిదే). తన ఉపన్యాసంలో ('ఘోషా పద్ధతి' గూర్చి మాట్లాడినప్పుడు) ప్రస్తావించినట్లు, ఆమె బనారస్

హిందూ యూనివర్సిటీలో కూడా చదువుకున్నారు. కొత్త భావయ్య చౌదరి రాసిన కమ్మవారి చరిత్రలో (కిరణ్ పబ్లికేషన్స్, గుంటూరు, 1989) 'వనితా రత్నాలు' శీర్షికన ఆమె స్థూల సమాచారం యిలా యిచ్చారు: "శ్రీమతి జాస్తి సీతామహాలక్ష్మమ్మ, B.A., L.L.B:` మద్రాసులో లాయరుగా, అఖిల భారత మహిళా సంఘ సభ్యురాలిగా [All India Women's Conference], ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్‌లో తొలి సభ్యుల బృందంలో ఒకర్తెగా విధి నిర్వహణ చేశారు" (పు. 288). అలాగే, 'శాసన సభ్యులు' శీర్షికన కూడా ఆమె పేరు ప్రస్తావించ బడింది (పు. 242).

ఇక సీతామహాలక్ష్మమ్మ ఉపన్యాసాన్ని ప్రచురించిన *గృహలక్ష్మి* గూర్చి కొంత తెలుసుకుందాం. మాస పత్రిక అయిన *గృహలక్ష్మి* 1928 మార్చిలో ప్రారంభమై, 1960ల దాకా కొనసాగింది (1942-47 మధ్య కొంతకాలం ఆగిపోయింది). డాక్టర్ కే. ఎన్. కేసరి సంపాదకుడు. 1940 నాటికే 2000 మంది చందాదారులతో చిన్న-చిన్న పట్టణాలకు కూడా చేరేది. స్త్రీల రచనలను విశేష ప్రాధాన్యంతో ప్రచురించిన *గృహలక్ష్మి*లో స్త్రీల సమస్యల్ని వివిధ కోణాల్లో విశ్లేషించిన రచనలు ప్రచురితమయ్యేవి. ఒక ప్రత్యేక సమస్యను తీసుకొని దానిమీద స్త్రీలలో చర్చను ప్రోత్సహించడం *గృహలక్ష్మి* విశిష్టత. ఉదాహరణకు 'విడాకుల చట్టం' అవసరమా? లేదా? అనే విషయంపై జరిపిన చర్చ. అలాగే భారత స్త్రీకి 'సంపూర్ణ స్వేచ్ఛ' ఎప్పుడు వస్తుంది? అనే విషయంపై జరిగిన చర్చ చాలా ఆసక్తికరంగా వుంది. పందొమ్మిదవ శతాబ్దం నాటి సంఘ సంస్కరణోద్యమ అంశాలైన బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహోద్యమం, స్త్రీ విద్య మొదలైన వాటితోపాటు వరకట్న దురాచారం, స్త్రీ-పురుష సమానత్వం, స్త్రీలకు ఆస్తి హక్కు, రాజకీయ హక్కులు మొదలైన అనేక అంశాలపై లోతైన ఆలోచనలు కలిగిన రచనల్ని ప్రచురించడం *గృహలక్ష్మి* యింకో విశిష్టత. ఉదారవాద పితృస్వామి అయిన సంపాదకుడి ఆలోచనలతో ఎంతమాత్రమూ ఏకీభవించని రచనల్ని సయితం ప్రచురించి చర్చనూ, భిన్నాభిప్రాయాల్నీ ప్రోత్సహించేది. గుండె రగిలిన వారు తమ బాధల్ని వెల్లగక్కడానికీ *గృహలక్ష్మి* వేదిక అయ్యింది. ఉదాహరణకు, కమ్మ కులానికి చెందిన 'ఒక అభాగిని' తన విఫల ప్రేమను గురించి దీనంగా రాసింది. కమ్యూనిస్టులై అభ్యుదయం గురించి మాట్లాడే తన అన్నా, బాబాయిలు తన ప్రేమ విషయం దగ్గరికొచ్చేసరికి తమ అభ్యుదయాన్ని భద్రంగా పెట్టెలో దాచిపెట్టి తాళం వేసుకోవడాన్ని ప్రశ్నిస్తూ, 'ఇదా నవయుగము!' అని సమాజాన్ని ఈసడించుకుంది. స్వకులస్థుడే అయినప్పటికీ, వర్గ వ్యత్యాసం కారణంగా తన పెళ్ళికి అడ్డుపడుతున్నారని వాపోయింది. దీనిపై సంపాదకుడైన కే.ఎన్. కేసరి స్పందించిన తీరు మాత్రం చాలా ప్రశంసనీయం. ఒక వేళ ఆమె చెప్పింది వాస్తవమైతే, ఆమెకు అన్ని విధాలుగా సహాయం చెయ్యడానికి సిద్ధంగా వున్నానని పత్రికా ముఖంగా ప్రకటించారు (ఫిబ్రవరి 1939, పు. 862-865). జాస్తి సీతామహాలక్ష్మమ్మ ఉపన్యాసాన్ని అత్యంత శ్రద్ధతో ప్రచురించినట్లే, ఎంతో మంది మహిళా మేధావుల ఉపన్యాసాల్నీ ప్రచురించేది *గృహలక్ష్మి*. బ్రిటీష్ కాలం నాటి ఆంధ్రలో వందల కొలదీ మహిళా సంఘాలు చిన్న-చిన్న పట్టణాల్లో సయితం పని చేసేవి. వాటి కార్యకలాపాలకు సంబంధించిన సమాచార గని *గృహలక్ష్మి*. మహిళల దృష్టికోణంతో స్త్రీల చరిత్ర రాయడానికి ముఖ్యమైన ఆధారం. స్త్రీలలో తమ ఆరోగ్యానికి సంబంధించిన చైతన్యాన్ని కలిగించడంలో *గృహలక్ష్మి* చేసిన కృషి అంతా యింతా కాదు. సంపాదకుడు స్వయానా ఆయుర్వేద వైద్యుడు కావడం ఒక కారణం కావచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే జాస్తి సీతామహాలక్ష్మమ్మ లాంటి వలసాంధ్ర స్త్రీల మేధో వికసన క్రమమనే కొండను *గృహలక్ష్మి* అనే అద్దంలో స్పష్టంగా చూడవచ్చు.

**ముగింపునకు మారుగా :** అంగీకరించడానికి కష్టంగా వున్నప్పటికీ, ఇప్పటిదాకా రాసిన ఆంధ్రదేశ చరిత్రంతా పురుషభూయిష్టం. అక్కడక్కడా స్త్రీలు కన్పించినప్పటికీ, పురుషులు సాధించిన అభివృద్ధికి సూచికలుగా మాత్రమే వాళ్ళు కన్పిస్తారు. (అంతే కాకుండా, ఈ చరిత్రంతా కొన్ని ప్రత్యేక కులాల చరిత్రగా కూడా వుంటోంది). ఆధునికాంధ్రదేశ నిర్మాణంలో పాలుపంచుకున్న ఎంతో మంది స్త్రీలు మన గొప్ప నిర్లక్ష్యం వల్ల 'ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి' కన్పించకుండా పోయారు. అలాంటి మహాతల్లుల్ని వెలికితీయడమే కాకుండా, వాళ్ళ దృష్టి నుంచి కూడా చరిత్ర గమనాన్ని అర్థం చేసుకున్నప్పుడే అది కొంత సమగ్రతను సంతరించుకుంటుంది. ఈ పని సంతృప్తికరంగా జరగాలంటే చరిత్ర రచనారంగంలో కూడా స్త్రీల సమ భాగస్వామ్యం అత్యవసరం.

**డా॥ షేక్ మహబూబ్ బాషా**
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ,
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ,
హైదరాబాద్, ఫోన్ : 916 057 9705.

# నేను చూసిన నక్షత్రం

**- డా. కె. వివేకానందమూర్తి**

1964 ప్రాంతంలో డా. కె. వివేకానందమూర్తి కథని ప్రచురిస్తూ, ప్రఖ్యాత సంపాదకులు నండూరి రామమోహనరావు తెలుగు కథకి యుక్తవయసు రాలేదని ఎవరు అనగలరు అని పొగిడారు. అంతటి ఖ్యాతి గడించిన వివేకానందమూర్తి రాసిన కథల్లో మణిపూసలాంటి కథ నేను చూసిన నక్షత్రం.

సినిమాల్లో హీరోలని, హీరోయిన్లని, విలన్లని, దర్శకులని, సంగీత దర్శకులని, కొన్నిసార్లు రచయితలని, పాత్రధారుల్ని గుర్తించి, గుర్తుపెట్టుకుంటాము. కానీ సినిమా అధిక భాగాన్ని నడిపే ఎక్స్ట్రాలని గుర్తించం, గుర్తుపెట్టుకోం. ముప్పై, నలభై ఏళ్ళు సినిమా రంగాన్నే అంటిపెట్టుకుని, వందల సినిమాల్లో నటించి, గుర్తింపుకి నోచుకోక పోవటమే కాక, ఎన్నో రకాల కష్టాలు, అవమానాలు భరించిన ఎక్స్ట్రాలు వందలు, వేలు. వాళ్ళందరికీ ఓ చిన్న కోరిక వుంటుంది. తెరమీద తమ పేరు చూసుకోవాలని. కానీ ఆ కోరిక తీరదు. అలాంటి అభాగ్యజీవులని, వారి చిన్న కోరికని ఎవరూ గుర్తించరు. కానీ డా. వివేకానందమూర్తి ప్రత్యేకత అదే. అలాంటి జీవి వేలుమణిని గుర్తించి అద్భుతమైన కథ నేను చూసిన నక్షత్రం రాశాడు. రచయిత స్వానుభవంలా వుంటుందీ కథ.

కథలు రాయటం ఆపేసిన ఓ రచయిత నటుడు అవ్వాలని మద్రాసు చేరాడు. చలనచిత్ర రంగానికి నకలులాంటి పాండీ బజారులో అతనికి వేలుమణి తారసపడ్డాడు. వేలుమణి అసలు పేరు వెంకట నరసయ్య. పరిచయం, పేరు దగ్గర్చించే అతని తెరచాటు జీవితం సూచనగా తెలుస్తూంటుంది. ఇద్దరూ కలిసి తిరిగిన తిరుగుడు, తాగిన కాఫీ, తిన్న తిండీ అన్నింటి బిల్లు ఇవ్వటం ఇతని వంతు. చొరవగా అనుభవించటం వేలుమణి వంతు. పాతికేళ్ళగా ఎన్నో వేషాలు వేశానని, సుదీర్ఘ నట జీవితమని చెప్పాడు వేలుమణి. వేలుమణి వేసిన ఒక్క సినిమా వేషం కూడా గుర్తు రావటం లేదని, అతనంటే, నేను పాత్రల్లో జీవించాను. అందుకే నా పాత్రలు జనానికెంత దగ్గరో, నేనంత దూరమై పోయాను అన్నాడు వేలుమణి. ఆ రాత్రి విడిపోయి ఎవరి దారిన వాళ్ళు వెళుతుండగా వేషాల విషయంలో హెల్ప్ చేస్తానని, మర్నాడు షూటింగ్ దగ్గరికి తీసికెడతానని చెప్పాడు వేలుమణి. అనుకున్నట్టే వేలుమణితో కలిసి సెట్‌లోకి అడుగు పెట్టాడు అతను. గాడి పొయ్యిలో ప్రవేశించినట్టనిపించింది నాకు అని ఒక్క వాక్యంలో డా. మూర్తి సినిమా రంగపు తొలి అనుభవానికి దర్పణం పట్టారు. ఆ సినిమా నిర్మాతల్లో ఒకడైన యాదవరెడ్డి ఇతని చిన్ననాటి స్నేహితుడు. పరస్పరం ఒకరినొకరు గుర్తించటంతో అతనికి ప్రత్యేక గౌరవం దక్కింది.

అన్ని కబుర్లు చెప్పిన వేలుమణి పాతికేళ్ళగా వేస్తున్నవి ఎక్స్ట్రా వేషాలే. ఈ సినిమాలో మనిషి వేషం కూడా కాదు, గొరిల్లా ముసుగు తొడుక్కుని నటించే జంతువు వేషం. జంతువుక్కూడా భరించటం కష్టమైన ఆ ఉక్కలో వేలుమణి పరిస్థితి దుర్భరం. అంత కష్టం భరించిన వేలుమణి ఆ సినిమాకైనా గొరిల్లాగా తనపేరు వేస్తారనుకుంటాడు. ఆ ఆశా తీరదు. ఆ సినిమాలో వేలుమణి కనీసం మనిషిలాయేనా కాకుండా, హీరో చేతిలో జంతువులా మరణించాడు. నాకుమాత్రం వేలుమణే మరణించినట్టుంది అంటాడు రచయిత.

ఎందరో ఎక్స్ట్రాల జీవశ్చవ స్థితిని సూచించే ముగింపు. సినీరంగం మీద చాలా కథలు వున్నా, ఈ కోణంలో రాసింది మాత్రం డా॥ కె. వివేకానందమూర్తే. కథ చెప్పిన తీరులో గొప్పతనం కథ చదివితే తెలుస్తుంది.

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్, ఫోన్ : 9394738805



రావు బాలసరస్వతి

**గా**న విశారద రావు బాలసరస్వతి గారు పరమపదం చేరారన్న వార్త, కేవలం ఒక సమాచారం మాత్రమే. ఎందుకంటే, ఆమె సుస్వర మాధుర్యం ముందు కాలాల్లో, మన కర్ణ సీమలలో సజీవమై రవళిస్తుంది...


తెలుగువారి పాటల ప్రపంచంలో ఆమె ఒక గంధర్వాంశ... ఆమె గొంతులో పాట పుప్పొళ్ళు పరిచిన దారుల్లో పయనిస్తుంది. అటు లలిత సంగీత శాఖలోనూ, ఇటు సినిమా సంగీత ప్రపంచంలోనూ ఆమె పాట జీవనది సదృశ్యమై ప్రవహించింది. స్వర జగతిలో గాయనిగా ఆమె ధన్య. ఆమె పాట తెలుగువారికి మూర్ధన్య.

తొంభై ఏడు వసంతాల మృదుల గాయని ప్రస్థానం నిరూపమానం. అనంతకాలం ఆమె పాట వినదిస్తూ ఉండాలని, కాంక్షిస్తూ, ఆత్మ స్వరూపిణికి భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరుకుందాం.

**- డా. వోలేటి పార్వతీశం**

# కథాకావ్య సమాలోచనం

విమర్శ గ్రంథాలు రాసేవారిలో అధిక శాతం ప్రవేశిక లేదా ఉపోద్ఘాతం,వివరణ, ముగింపు అన్న టెంప్లేట్‌ను అనుసరిస్తూ ఉంటారు.ఈ పద్ధతి కి భిన్నంగా ఉన్న విమర్శ గ్రంథాన్ని ఇటీవల చదివే అవకాశం కలిగింది.ఆ విమర్శ గ్రంథం రచించిన వారు ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు.ఆ పుస్తకం పేరు సి.నారాయణరెడ్డి కథాకావ్య సమాలోచనం. ఈ గ్రంథంలో డా.సి.నారాయణరెడ్డి గారి నాలుగు కథాగేయకావ్యాలనెంచుకున్నారు రచయిత. అవి నాగార్జున సాగరం (1955), కర్పూర వసంత రాయలు (1957), విశ్వనాథ నాయకుడు (1959), ఋతుచక్రం (1964). వీటిలో మొదటి మూడు చారిత్రక కావ్యాలు, నాల్గవది సి.నారాయణరెడ్డిగారు తన దాంపత్య జీవితాన్ని పొందుపరుస్తూ ఆరు ఋతువులు గురించి వ్రాసిన వర్ణనాత్మక కావ్యం.తెలంగాణ,సమాజాన్ని, సంస్కృతి ని చిత్రించిన కావ్యమిది.ఇంతే కాకుండా సినారె వైభవము గేయ కావ్యం కూడా గ్రంథ ఉత్తర భాగంగా చేర్చారు




భూమయ్యగారు విమర్శ ప్రక్రియలో తాను అనుసరించిన పద్ధతిని భౌమమార్గం అని నామకరణం చేశారు చేకూరి రామారావు.ఇందులో రచయిత సంభాషణాత్మకంగా చెప్పదలచుకున్న అంశాన్ని వివరిస్తారు.ఈ పద్ధతి క్లాస్ రూంలో విద్యార్థి, మాస్టారు ప్రశ్నోత్తరాలు విన్నట్టు మనం అనుభూతి చెందుతాం.ఇప్పటివరకు తొమ్మిది పుస్తకాలు ఈ పద్ధతిలో వెలువరించారు వారు.ఒక గ్రంథం విశ్లేషణలో ఉండే అంశాలను అధ్యాయాలుగా విభజించటం వలన, మనకు చదువుకునేందుకు వీలుగా ఉంటాయి ఈ గ్రంథంలోని వ్యాసాలన్నీ.. ఈ పద్ధతి ఒక కావ్యాన్ని అర్థం చేసుకోవటానికి సులవనిపించింది. అదెలా అంటే మొదటి కావ్యం నాగార్జునసాగరం విశ్లేషిస్తూ కావ్యంలోని పాత్రల పరిచయం, నేపథ్యం వివరించటానికి ఒక ఎమ్.ఎ విద్యార్థి పరిశోధనకు అవసరమయ్యే భూమికను సిద్ధం చేసేందుకు రచయిత ఆచార్యుల వారి పాత్ర పోషిస్తారు.సి.నారాయణరెడ్డి గేయ కావ్యం ఎందుకెంచుకున్నారో వివరిస్తూ ఆ విద్యార్థి లో ఆసక్తి కలిగిస్తారు.దీనిని ఆయన మిగిలిన నాలుగు కావ్యాల విశ్లేషణకు వినియోగించుకుంటారు.వాస్తవానికి పాఠకులే విద్యార్థులయిపోతారు అనుమాండ్ల భూమయ్యగారి ముందు.

నాగార్జున సాగరం కావ్యంలోని పాత్రలను పరిచయం చేసే విధానంతో పాటు పాత్ర లక్షణాలు, ఏ పాత్ర ఎలా ప్రవర్తించాలని కావ్య రచయిత సి.నారాయణరెడ్డి భావించారో వివరిస్తారు. నాగార్జునసాగరం కావ్యం రచించే నాటికి నాగార్జున సాగర్ ఆనకట్ట కడుతున్న సమయం.ఇక్ష్వాకుల కాలంలో శ్రీపర్వతం గా పేరుగాంచి,ఆ పక్కనే పారాడుతున్న కృష్ణవేణీ తరంగాల సాక్షిగా బౌద్ధమతం విలసిల్లిన ఆకాలంలో శిల్పి పద్మదేవుడు,బౌద్ధ మతాభిమాని శాంతిశ్రీ ల మధ్య విరిసిన ప్రణయకావ్యంలో మతమొక అడ్డుగోడగా నిలవటం..మతాచార్యుడు పద్మనందుని బౌద్ధ సంఘం నుంచి బహిష్కరణ చేయటం, శాంతిశ్రీ దీక్ష తీసుకున్నా మానవత్వమంటని మతమేల అన్న పద్మదేవుడి మాటలు ఆమెనో డోలాయమానస్థితిలోకి నెట్టగా ఆమెకన్న కల గురించి చెబుతాడు రచయిత

**పరిగెత్తెడు తన ఆత్మను / బంధించెను కృష్ణానది**
**ఆమెయే ఆ మహాసాగ / రాకృతి దాల్చి నిలిచినది .**

గతంతో వర్తమానం అనుసంధానమైన వైనాన్ని వివరిస్తూ చేసిన కావ్య పరిశీలనాక్రమం ఆ విద్యార్థి తోపాటు మనలను కూడా ఆకట్టుకుంటుంది. అదే విద్యార్థికి సి.నారాయణరెడ్డిగారి మరో కథాకావ్యం కర్పూర వసంతరాయలు పరిచయం చేస్తారు ఆచార్య అనుమాండ్ల భూమయ్య.ఆయన ఆ పరిశోధక విద్యార్థికి సూచనలు చేసినట్టనిపించినా అందరికీ వర్తించే వాక్యాలవి.ఒక కావ్యాన్ని ఏ దృష్టితో చదవాలో ఎలా చెప్పారనటానికి ఈ వాక్యాలే ప్రమాణం "నీ కంటికి,

బుద్ధికి, ముఖ్యంగా హృదయానికి ఏమేం కనిపిస్తాయో చూడు.కావ్యప్రయోజనాలు రెండని చెబుతారు.ఆనందం, ఉపదేశం.ఆనందం హృదయసంబంధి. ఉపదేశం బుద్ధి సంబంధి. మనిషికి హృదయం ఉండాలి.మేధస్సు ఉండాలి.ఈరెంటినీ తృప్తి పరచే లక్షణాలు ఈ కావ్యంలో చూడు". కావ్యం ఎలా ఉండాలో ఇలా అరటిపండు వలిచి చేతిలో పెట్టినంత హాయిగా చెబుతారు భూమయ్య గారు.

1386-1402 సంవత్సరాల మధ్య కొండవీడు రాజధానిగా పరిపాలించిన కుమారగిరి రెడ్డి కర్పూర వసంతరాయలు బిరుదాంకితుడు.చైత్రశుద్ధి త్రయోదశి నుంచి తొమ్మిది రోజుల పాటు వసంతోత్సవాలు నిర్వహించడంతో ఆ పేరు సార్థకం చేసుకున్నాడు. ఆ వెన్నెల రాత్రుల్లో కర్పూరం కుమ్మరించేవారుట.అలా కర్పూర వసంతరాయలయ్యాడా రాజు. ఆ రాజు ఆస్థానంలోని నర్తకి లకుమను ఆరాధించి వసంత రాజీయం అనే నాట్య గ్రంథాన్ని రచించాడు. చివరికి ఆమె లాలనలో రాజ్యపాలన మరువగా, రాణి రంగంలోకి దిగి భర్తలో పరివర్తన తెచ్చేందుకు, లకుమను దేశం విడిచి వెళ్ళ మనటం, ఆమె ప్రాణ త్యాగం చేయటం కథ.ఇది ఐదు ఆశ్వాసాలలో సి.నారాయణరెడ్డి రచించారు.నిజానికి చరిత్రలో రాణి పాత్ర లేదు.నాటకీయ గాంభీర్యాన్ని పొదిగేందుకు ఆ పాత్రను ప్రవేశపెట్టారు నారాయణరెడ్డి.ఈ కావ్యంలోని ప్రౌఢత్వాన్ని, మోహపరవశాన్ని ఎలా వ్యక్తీకరించారో చెప్పేందుకు గేయ ఖండికలను ఉదహరిస్తారు భూమయ్య గారు.

**"భరతుడు చూపించనట్టి / భావమ్ములు చూపె లకుమ**
**భరతుడు రచియించనట్టి / భంగులు రచియించె రాజు**
**ఆమె కాలు మోపగానే / అదియె నాట్యమైనట్టుల**
**అతడు గంటమాడించిన / అదియె శాస్త్రమైపోయెను"**

నారాయణరెడ్డి గారి గేయ కావ్యాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన గ్రంథం కర్పూర వసంతరాయలు. ఐదు ముద్రణలకు నోచుకుంది. ఆచంట జానకిరాం గారు పరిచయము పేరిట ముప్పై పేజీల ప్రత్యేక వ్యాసం రాసి ముద్రించి సాహితీ ప్రముఖులెందరికో పంపారు.ఆచార్య దివాకర్ల వెంకటావధాని కర్పూర సౌరభం పేరిట నాలుగవ ముద్రణకు పీఠిక వెలయించారు.కర్పూర వసంతరాయలు గానం చేసి నారాయణ రెడ్డి గారు ఎల్.పి.రికార్డ్ వెలువరించటమో విశేషం పఠితలను మోహపరిచే కావ్య సౌందర్యము కర్పూర వసంతరాయలు గేయ కావ్యం ఎలా స్వంతం చేసుకుందో రచయిత విశ్లేషణతో మనకు అర్థమవుతుంది.

ఈ గ్రంథంలో తరువాతి కావ్యం విశ్వనాథ నాయడు. తండ్రిపై యుద్ధం చేసి ప్రభు భక్తిని చాటుకున్న విశ్వనాథ నాయడు నారాయణరెడ్డి గారిని ఆకర్షించింది.

**ధర్మవీరమునకు జయ ప / తాకమైన విశ్వనాథ**
**మూర్తిని గాని కవుల డెంద / ములు కావ్యములై యెగిసెను**

అని కావ్యాంత ఖండములో స్పష్టం చేస్తారు కవి అని విశదపరుస్తారు భూమయ్య గారు ఈ కావ్యాన్ని ఆరు ఖండాలుగా విభజిస్తారు. ఈ కావ్యంలో విశ్వనాథ నాయడు తల్లి పాత్ర కవి కల్పన.మల్లికాంబ అన్న పేరు కూడా ఇచ్చారు ఆ పాత్రకు.కథను వివరించే క్రమంలో ఈ రచనకు కవికి ప్రేరణ భారతమే అని విద్యార్థికి తెలియచెబుతారు.

**రాయలతో విశ్వనాథ / నాయడు నడయాడచుండ**
**సురసభలో ఇంద్రునితో / నరుగు పార్థుడనిపించెను**

చరిత్ర ఆధారంగా సి.నారాయణరెడ్డిగారు రచించిన ఈ మూడు గ్రంథాలు మాత్రాఛందస్సులో ఉంటాయి.మాత్రాఛందస్సులో ప్రధానమైన త్రిశ్ర,చతురస్ర,మిశ్ర,ఖండగతుల్లో ఇవి సాగటం విశేషమంటారు రచయిత ఈ గ్రంథంలో వారు ఎంచుకున్న మరో పుస్తకం దాంపత్య జీవిత చిత్రణం ప్రతిబింబించే ఋతుచక్రం.వసంత, గ్రీష్మ,వర్ష,శరత్, హేమంత,శిశిర ఋతువులను వర్ణిస్తూ కవి తన జీవితాన్ని పొందుపరచటం విశేషం.ఋతువులపై ఎంతోమంది కవులు కావ్యరచన చేశారు.వాటికి భిన్నంగా తన కావ్యముండాలని ఆశించాడు కవి. అందుకే గ్రామీణ జీవితాన్ని ఈ కావ్యంలో జత చేశాడు. సి.నారాయణరెడ్డిగారు పుట్టి పెరిగిన హనుమాజీపేటలో ఆయా ఋతువుల్లో జరుపుకున్న పండుగలకు జీవితంలో జరిగిన సంఘటనలను జోడించి కావ్య రచన చేశారు.తెలంగాణ మాండలిక పదాలను తన కావ్యానికి అద్దారంటారు రచయిత కావ్యం ముగింపు పద్యం అందరినీ అలరిస్తుంది.

**షడృతు చక్ర భ్రమణ సంచాలితమ్మైన / నా బ్రతుకు లోని ఘటనము లేరి ఈ కృతిగ**
**నిలిపితిని: దీని లోతులలోన ఒక రసా / త్మకుడైన తన బ్రతుకు దర్శించినం జాలు**

ఈ గ్రంథంలోని ఉత్తర భాగంగా అనుమాండ్ల భూమయ్య గారు 2017లో రచించిన సినారె వైభవము గేయకావ్యం చేర్చారు.అందులో సి.నారాయణరెడ్డి బాల్యం నుంచి సాగిన వారి ప్రస్థానం,వారి సాహితీ వైభవం గేయరూపంలో మాత్రాఛందస్సుగా పలితలను అలరిస్తాయి.జానుతెలుగు ఈ గేయకావ్యము లో ప్రవహిస్తుంది. మెత్తని తారు రోడ్డుపై సుఖవంతంగా సాగే ప్రయాణంలా తోచక మానదు.. ఇది అనుమాండ్ల భూమయ్య గారి ప్రజ్ఞకు ఉపగ్న అని అనిపించక మానదు.


శ్రీ భూమయ్య

**శబ్దమై ఈ కవి దేహము / శబ్దమై ఈ కవి హృదయము**
**శబ్దమునకు హృదయమిచ్చె / శబ్దలయకు ప్రాణమిచ్చె**
**శబ్ద తరంగము తానై / శబ్దపు సవ్వడి తానై**
**పద్దెనిమిది సంపుటాల / బ్రతుకై పారెను సినారె**


అన్న కమ్మని మాత్రా ఛందస్సు, చదువరులకు షడ్రుచుల పంక్తి భోజనాన్ని పంచిపెడుతుంది. సంభాషణాత్మక శైలిలో సాగిన సి.నారాయణరెడ్డి గారి నాలుగు గేయ కావ్యాలపై అనుమాండ్ల భూమయ్య గారి విమర్శ గ్రంథం "సి.నారాయణరెడ్డి కథా కావ్య సమాలోచనం" చివరి పుట వరకూ ఆసాంతం ఆసక్తిని రేపుతూ సహృదయ పాఠక లోకానికి వారిచ్చిన అపురూప కానుకగా మిగిలిపోతుందంటే అతిశయోక్తి కాదేమో. ఇదెందుకు చెబుతున్నానంటే నాలుగు వందల పేజీలు పైబడి ఉన్న ఈ పుస్తకం ఆసాంతం విడవకుండా చదివించింది కాబట్టి.. **ఆచార్య అనుమాండ్ల భూమయ్య** గారు పద్యకవి - వారి వచనాశైలి నిర్మల సెలయేటి ప్రవాహం.

*పుటలు 423, వెల 400రు. ప్రతులకు : మనస్విని ప్రచురణలు, ఫోన్ : 889 707 3999*

***- సి.యస్.రాంబాబు, (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

---

'**జ్ఞా**నాన్వేషణలో చైనా వరకూ వెళ్ళటం మంచిదే అని చెప్పిన మహమ్మద్ ప్రవక్త సూక్తిని ఆదర్శంగా తీసుకుని, ఇద్రీసి తయారు చేసిన ప్రపంచపటాన్ని తోడుగా ఉంచుకొని, తన ఇరవై ఒకటవ సంవత్సరంలో మొరాకో దేశంలోని టాంజీర్ పట్నం నుండి ఒంటరిగా ప్రపంచ యాత్రకు బయలుదేరిన ఇబన్ బతూతా (1304-1369) లక్షా పదివేల కిలోమీటర్లు ప్రయాణం చేశాడు.




ముస్లిందేశాల మార్కోపోలోగా కీర్తించబడ్డ ఇబన్ బతూతా సుదీర్ఘమైన ప్రయాణ అనుభవాలని 'రిహ్లా' అనే పేరు మీద అరబ్బు ప్రపంచానికి అందించిన మొరాకో సుల్తాన్ అబూ ఇనాన్ ఫారిస్ (1329-1358) చిరస్మరణీయుడు.

అలెగ్జాండ్రియా రేవులో దీపస్తంభాన్ని, ఈజిప్టులో పిరమిడ్లనీ, మక్కాలో కాబా మందిరాన్ని, ఇరాన్‌లో కవి సాదీ సమాధిని దర్శించుకొని ఢిల్లీలో ఏడు సంవత్సరాల పాటు మహమ్మద్ బిన్ తుగ్లక్ (1290-1351) పాలనలో కాజీగా బీపనిచేసి, మాల్దీవుల్లో వివాహాలు చేసుకొని, చైనాలో పెకింగ్ నగరాన్ని దర్శనం చేసుకొని ఒంటరిగా ఇంటికి చేరుకొన్న ఒక మహాయాత్రికుడి స్వీయచరిత్ర. ఇబన్ బతూతా ప్రయాణాలు చేసిన 14వ శతాబ్దంలోనే ప్రపంచవ్యాప్తంగా పునరుజ్జీవనం మొదలైంది. ఆ సమయంలో ఆంధ్రదేశంలో తెలుగులో ఎర్రాప్రగడ మహాభారత అనువాదంలో ఉన్నాడు. ఢిల్లీలో అమీర్‌ఖుస్రో (1253-1325) పేరు మారుమోగింది. పర్షియాలో హాఫెజ్ (1325-1390) కవితలు రాస్తున్నాడు. ఇంగ్లండులో ఛాసర్ 'కాన్‌టర్‌బరీ టేల్స్ రాశాడు. అమెరికా-ఆస్ట్రేలియా అప్పటికి కనుగొనబడలేదు. ఇలాంటి పరిస్థితిలో ఇబన్ బతూత ఆఫ్రికా, ఆసియా, ఐరోపా ఖండాల్లోని-నలభై దేశాల్లో ప్రయాణించాడు.

ఈ విశేషాలన్నీ 'భ్రమణకాంక్ష ఆదినారాయణ' ఆయన స్వయంగా వేసిన చిత్రాలతో సహా మనచేతిలో పెడుతున్నారు. అదే ఈ ఇబన్ బతూత ప్రపంచయాత్ర పుస్తకం. 'తిరిగే తుమ్మెదకే తేనె దొరుకుతుంది' అంటాడాయన.

*ప్రచురణ : సాహితీ ప్రచురణలు-విజయవాడ, పేజీలు : 275, వెల : 300/-*
*ప్రతులకు : ఫోన్ : 812 109 8500*


# హసితబాష్పాలు

**ఇ**ప్పటి కవిత్వమంతా గందరగోళంగానో,నినాదప్రాయంగానో ఉండి , చికాకుపెడుతున్నవేళ కన్నీటికి, చిరునవ్వుకు ఉండే అనుబంధాన్ని చాలా తాత్వికంగా వివరిస్తారు కవి శ్రీరాం. భగవంతుడు పరంగా చెప్పినట్టున్నా ఈ ఖండికలన్నీ ప్రకృతిని మనిషిని కలిపి ముడేసే ప్రయత్నం చేస్తాయి.. మొత్తం పద్దెనిమిది ఖండికలున్నాయి ఈ కవితా సంపుటిలో..

ప్రతి ఖండికలోను కవి ఒక పారవశ్యంతో భగవంతుడిని ప్రశ్నిస్తుంటాడు.సమాధానపడుతుంటాడు. ప్రకృతి వైరుధ్యం అతన్ని ఆశ్చర్యపరుస్తుంది.తన ఆశ్చర్యం భగవంతుడికి నివేదిస్తుంటాడు. ఇవన్నీ నువు సృష్టించినవే సుమా, వాటిని వ్యాఖ్యానించే దృష్టి మాకెక్కడ అని వినమ్రంగా పలుకుతుంటాడు చిరునవ్వుని ఆహ్వానించినట్లు, కన్నీటిని ఆహ్వానించమనేది కవి నిశ్చితాభిప్రాయం.అయితే అన్నీ ఇచ్చిన భగవంతుడు కన్నీటిని ప్రసాదించాడంటే,ఎంత అనివార్యం కాకపోతే ఇస్తాడంటారు కవి.ఒక్కమాటలో చెప్పాలంటే కన్నీరు మారువేషం ధరించిన చిరునవ్వు.అది భగవంతుడి ప్రేమ నుంచి జనియించిందన్న సత్యాన్ని గ్రహిస్తామో, అప్పుడు కన్నీటిని ద్వేషించటం మానేస్తాం.. చీకటి వెనుకే ఉషోదయమున్నట్లు కన్నీటి వెనకే చిరునవ్వుల వెలుగు తోరణముంటుందని గ్రహించాలి.

నిజానికి ఈ పద్దెనిమిది ఖండికలు భగవంతునికి నివేదనగా సమర్పిస్తారు కవి. జీవితం ద్వంద్వమయమన్న సత్యాన్ని పునరుద్ఘాటిస్తారు.ఏ కవైనా మనం నిత్యం గమనించే అంశాల అంతరార్థాన్ని ఎరుకపరిచే ప్రయత్నం చేస్తారు.అందులో ఇమిడి ఉన్న నిఘూఢతను తేటతెల్లం చేస్తారు.అలాంటి పరిశీలనల ఉటంకింపు ఈ కవిత్వ సంపుటి మనకందచేస్తుంది. కవి గొంతుకలోని తాజాదనాన్ని, వెచ్చదనాన్ని సౌందర్యాన్ని నింపుకున్న పదబంధాలతో ఈ కవితలు మనల్ని పలకరిస్తాయి. కాఠిన్యంలోని లాలిత్యాన్ని పట్టిచూపుతాయి. ఈ పంక్తులు చూడండి

**"ప్రభూ!**
**ముద్దాడే నీ అమృతాధరాలకన్నా**
**మందలించే నీ కఠిన హస్తాలే**
**ఎక్కువ దయారస తేనె ధారల్ని**
**నా జీవన మృణ్మయ పాత్రలోకి ప్రసరిస్తాయి"**
**అంటారొకచోట.. కొనసాగిస్తూ ఆ కవితని ఇలా ముగిస్తారు.**
**"సుఖదుఃఖాలు రెండూ,**
**నీ పూదోట నుండి వీచే**
**ఆహ్లాద వసంత సమీరాలే"**




నిజానికి జీవితంలోని వైరుధ్యాలను ప్రకృతిలో కానవచ్చే వైరుధ్యాలకు సమన్వయం ఆ భగవంతుడు ఎలా కుదుర్చుతాడో కవితాత్మకంగా చెప్పటం కవి ఎంచుకున్న బాట.ఆ బాట ఎందరో బాటసారులకు దాహం తీర్చే ఊటబావిలా తోచక మానదు. ప్రభూ అంటూ ఆర్తితో పిలిచిన రవీంద్రుని గీతాంజలి గుర్తుకు రాక మానదు.

నిజానికి ఈ కవితలకు అదనంగా కవి శ్రీరాం గారు దేవుడు కన్నీటిని, చిరునవ్వును రెండు కళ్ళు చేసి మానవుడికి ఎందుకిచ్చాడో తెలియచెప్పే కంటికి ఆభరణం కన్నీరు మున్నుడి మనలను ఆలోచనలో పడేస్తుంది.ప్రేమ,ఆమోదాల మధ్య నలిగిన కన్నీరే చిరునవ్వుగా రూపాంతరం చెందుతుంది అన్న వాక్యం మనసును తాకుతుంది.

అరుదుగా కవిత్వం ఆ పరమేశ్వరుని కనులకు హత్తుకోవడం గమనిస్తాం..పరమాత్మునికి, జీవుడితో బంధాన్ని సౌకుమార్యంతో వివరిస్తుంది *హసితభాష్పాలు.* **వాక్కులమ్మ ప్రచురణలు** ప్రత్యేక శ్రద్ధతో రంగులలో ప్రచురించటం విశేషం.. జి.కె.శ్రవణ్ కుమార్ రంగుల చిత్రాలు అలరిస్తాయి. *పుటలు 78, వెల 300రు.* కాపీలకు ఫోన్ : *9848560986*


***- సి.యస్.రాంబాబు, (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్), ఫోన్ : 8374818961***

*వాక్కులమ్మ గురించి మీకు చెప్పాలి! వాక్కులమ్మ ప్రచురణలు ఆచార్య పప్పు వేణుగోపాలరావు గారి చరణకింకిణిలు. ఎలాగంటే నేను, పప్పు వారు, అందెశ్రీ ఓ బ్రాహ్మీ ముహూర్తంలో సౌందర్యలహరి వ్యాఖ్యాన సందర్భంగా కలిశాం. అప్పుడు అందెశ్రీ 'అగ్రజా! సౌందర్యలహరితో పురుడు పోసుకుంటున్న ఈ వాక్కులమ్మ ప్రచురణలు శతాధికంగా వెలుగు చూస్తాయి. ఇది నా ఆన' అని అందెశ్రీ ఆ ముహూర్తంలో వాగ్దానం చేశారు. అందులో* ***మొదటిది సౌందర్యలహరి, రెండవది నిప్పులవాగు, మూడవది శ్రీశూద్రగంగ, నాలుగవది సృష్టిగర్భ, ఐదవది హసితబాష్పాలు.***

# చదవండి...


**- మిసిమి**

📖 **బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములు - బి. రామరాజు :** తెలుగు శాస్త్రీయ పరిశోధనా రంగంలో మార్గదర్శకుడైన ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి సంవత్సరం సందర్భంగా వీరి గ్రంథాలను పునర్ముద్రించింది శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా సంఘం. అందులో 'సాహిత్య వ్యాసాలు' గ్రంథం ఒకటి. ఆచార్య బిరుదరాజు రామరాజు గారి ప్రతిభ, కృషి జానపద రంగంలో మనకు కానవస్తుంది. మొత్తం పది వ్యాసాలున్నాయి. ఇవన్నీ 1952-60 సంవత్సరాల మధ్య కొన్ని అప్పటి అంతర్జాతీయ సంస్థలో చేసిన ప్రసంగ పాఠాలు. ఈ వ్యాసాలన్నీ వారి పరిశోధన దృష్టికి, భాషా చతురతకి అద్దం పడతాయి.




*పేజీలు : 208, వెల :200/-, ప్రతులకు : శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, ఫోన్ : 988568641.*

📖 **నీరాజనం - బిరుదురాజు రామరాజు శతజయంత్యుత్సవ స్మారక సంచిక :** ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం వారి రచనలను మళ్లీ పాఠకుల వద్దకు తెస్తోంది. అలా తెచ్చిన పుస్తకం నీరాజనం. ఇందులో అనేకమంది ప్రముఖ సాహితీవేత్తలు వారిని తలచుకున్న వ్యాసాలను పొందు పరిచారు. తిరుమల రామచంద్ర, జి. కృష్ణ, ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు, ఆచార్య రవ్వా శ్రీహరి వంటి నిన్నటితరం ప్రముఖులతోపాటు మృణాళిని, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా. సూర్య ధనంజయ్ వంటి ఇప్పటి ప్రముఖులెందరో రాసిన వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలన్నీ ఆచార్య బిరుదురాజు రామరాజు గారి వ్యక్తిత్వాన్ని, పట్టుదలను, వారి కఠోరశ్రమ, అకుంఠిత దీక్షను ఆవిష్కరిస్తాయి.




*పేజీలు : 408, వెల :400/-, ప్రతులకు : శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, ఫోన్ : 9885686415*

📖 **డా. కపిలవాయి లింగమూర్తి - సాహిత్యవ్యాసాలు - రెండవ భాగం :** డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యంలో భాగంగా వెలువడిన సాహిత్యవ్యాసాలు రెండవ భాగానికి డా. కపిలవాయి లింగమూర్తి సంపాదకత్వం వహించారు. డా. కె. కృష్ణమూర్తి, కపిలవాయి అశోక్‌బాబు ఆయన ఓ విజ్ఞాన సర్వస్వం అంటారు. ఈ పుస్తకంలో ప్రధానంగా పాలమూరు జిల్లా ప్రముఖ సంస్థానం ప్రస్తావన, గ్రామ చరిత్రలు, శాసన పరిచయాలు తాళపత్ర గ్రంథాల పరిచయం అంశాలకు సంబంధించిన వ్యాసాలున్నాయి. లింగమూర్తిగారు స్వయంగా గ్రామాలు తిరిగి వాటి చరిత్రను సేకరించి గ్రంథస్థం చేశారు. వారి లోతైన పరిశోధనాత్మక దృష్టి ఈ వ్యాసాలను పరిపుష్టి చేసింది.



*పేజీలు : 284, వెల :200/-, ప్రతులకు : కపిలవాయి అశోక్‌బాబు, ఫోన్ : ఫోన్ : 8500167845*

📖 **డా. కపిలవాయి లింగమూర్తి - సాహిత్యానుశీలనం - ప్రథమభాగం-ద్వితీయ భాగం :** ఈ వ్యాసాలన్నీ ఎమ్.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అక్టోబర్ 2024వ సంవత్సరంలో డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలం శీర్షికలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పకులు సమర్పించిన వ్యాసాల సంకలనం. రెండు భాగాలుగా ఈ పుస్తకాన్ని వెలువరించారు. ఈ వ్యాసాలన్నీ కపిలవాయి లింగమూర్తి గారి బహుముఖీనత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ముఖ్యంగా కవిగ, లాక్షిణికుడిగా, చారిత్రక పరిశోధకుడిగా, సంపాదకుడిగ, రచయితగ వారి విశిష్ట వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తాయి. వ్యాసకర్తలందరూ ఆయన ప్రతిభా ఉత్పత్తుల్ని మనకు పరిచయం చేసి వారి కొండంత ప్రతిభను పత్రసమర్పణ అనే అద్దంలో చూపే ప్రయత్నం చేస్తాయి. ఒక గొప్ప సాహితీవేత్తకు నివాళి ఈ వ్యాసాలు. తెలుగు శాఖ అధ్యక్షులు కె. కృష్ణమూర్తి సంపాదకత్వం వహించారు.



*ప్రథమ భాగం పేజీలు : 328, వెల :400/-, ద్వితీయ భాగం పేజీలు : 315, వెల :400/-, ప్రతులకు : డా. కె. కృష్ణమూర్తి, ఫోన్ : 8500167845*

# మిసిమి

మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపేతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.
మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.


**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi


## మిసిమి ప్రచురణలు



నొబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.**, Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**